ఈనాడు

విజయవాడ 20-10-2024 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 70

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 20+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు



విజయవాడ 20-10-2024 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 70 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 8-00 పేజీలు 20+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమరావతి 2.0

రాజధాని పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు

మూడేళ్లలోగా పూర్తి చేయాలని ఆదేశం

సీఆర్‌డీఏ కార్యాలయ భవన పనులతో పునఃప్రారంభం

విధ్వంసం ముగిసింది.. నిర్మాణం మొదలైందని వ్యాఖ్య

వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో రూ.7 వేల కోట్ల అదనపు భారం పడిందని ధ్వజం

ఈనాడు - అమరావతి

ప్రజా రాజధానికి ఐదేళ్ల గ్రహణం వీడింది.. అమరావతి 2.0 మొదలైంది! రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే రాజధాని పునర్నిర్మాణం ఘనంగా ప్రారంభమైంది. 2014-19 మధ్య జరిగిన నిర్మాణం అమరావతి 1.0 అనుకుంటే.. ఇప్పుడు మొదలైంది 2.0 వెర్షన్. అప్పట్లో జరిగింది ఒకెత్తు... ఇప్పుడు జరగబోయేది ఒకెత్తు! అప్పట్లో భూసమీకరణ, ప్రణాళికల రూపకల్పన, నిధుల కొరతతో రాజధాని నిర్మాణం ఆశించినంత వేగంగా జరగలేదు. కానీ ఇప్పుడు అన్నీ అమరే ఉన్నాయి. భూమి ఉంది. ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే కొంత మేర నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులు, రహదారులు, వంతెనలున్నాయి. కేంద్రం ఆర్థికంగా చేయూతనివ్వడంతో పుష్కలంగా నిధులున్నాయి. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న బలమైన సంకల్పం కలిగిన ప్రభుత్వమూ ఉంది. ఇంకేం కావాలి! ఇక పరుగులు పెట్టడమే! అమరావతి పునర్నిర్మాణాన్ని (మిగతా 2లో)


సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, అధికారులు


రాజధాని అమరావతి పనులను కొబ్బరికాయ కొట్టి పునః ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజా రాజధాని మళ్లీ పురుడు పోసుకుంది

ఐదేళ్ల నిర్లక్ష్యం, అణచివేతలకు తెరదించుతూ.. ప్రజా రాజధాని అమరావతి మళ్లీ పురుడు పోసుకుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రుల రాజధాని అమరావతేనని, అది మళ్లీ ఊపిరి పోసుకుంటుందని.. రైతుల మహా పాదయాత్రపై వైకాపా కుతంత్రాలు సాగవంటూ 2022 అక్టోబరు 22న తాను 'ఎక్స్'లో పోస్టు చేశానని గుర్తుచేశారు. 'ఎట్టకేలకు విధి తన పంథాను మార్చుకుంది. ఇటుకతో ఇటుక.. హృదయంతో హృదయం ద్వారా అమరావతి పునర్నిర్మాణం ప్రారంభమైంది. వైకాపా పాలకుల క్రూరత్వానికి వ్యతిరేకంగా బలంగా నిలిచిన రైతులు, మహిళలు తమ కలను సాకారం చేసుకున్నారు. వారిని అభినందిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'నిజం, న్యాయం, త్యాగం, సంకల్పం ఉన్న అమరావతి నిలుస్తుంది.. అమరావతే గెలుస్తుంది. ఇదే ఫైనల్' అంటూ గత పోస్టును రీట్వీట్ చేశారు.

కేంద్రానికి కృతజ్ఞతలు

'2019కి ముందు రాజధాని పనుల్ని రూ. 42,519 కోట్లతో చేపట్టాం. గత ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో అంచనా వ్యయం పెరిగింది. ఇప్పుడు మరో రూ. 7 వేల కోట్ల అదనపు భారం పడుతోంది. రాజధానికి జీవం పోయడానికి, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చిన కేంద్రానికి కృతజ్ఞతలు' అని చంద్రబాబు అన్నారు. కేంద్రం చొరవతో రూ. 15 వేల కోట్ల సాయం అందించేందుకు ప్రపంచబ్యాంకు, ఏడీబీ ముందుకొచ్చాయన్నారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశకూ కేంద్రం రూ. 12,510 కోట్లు ఇస్తోందని, ఆ పనులు 10-15 రోజుల్లో మొదలవుతాయని తెలిపారు.



విత్తనాలు నాటు.. విపత్తులు దాటు

- పైరు రక్షణలో డ్రోన్లది కీలక పాత్ర
- జాతీయ రహదారుల ప్రాజెక్టులు, అడవుల పరిరక్షణలో సహకారం
- ఎక్కడ, ఎలా వాడగలమనే దానిపై 31 ప్రభుత్వ శాఖల ప్రతిపాదనలు

ఈనాడు - అమరావతి

వ్యవసాయ, పట్టణ, పంచాయతీ కార్యాలయాలు, విపత్తులు, అటవీ, దేశ సరిహద్దు రక్షణ, జాతీయ రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ.. ఇలా అన్ని రంగాల్లోనూ డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. తమ కార్యకలాపాలకు డ్రోన్ సేవలు, కృత్రిమ మేధను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు సిద్ధమవుతున్నాయి. ఈ సాంకేతికతను ఎక్కడెక్కడ ఎలా వాడేందుకు తమకు అవకాశముందని ప్రభుత్వ శాఖలు గుర్తించి ప్రభుత్వానికి వివరాలు సమర్పించాయి. మరింత సమర్థమైన, సుస్థిర వ్యవసాయ పద్ధతులకు డ్రోన్లు వీలు కల్పిస్తున్నాయి. డ్రోన్ వినియోగానికి తోడ్పడే సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పథకం, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, సంస్థలు, రైతు ఉత్పత్తుల సంస్థల మధ్య భాగస్వామ్యాల వంటివి ఇందుకు తోడ్పడుతున్నాయి. పొలంలో ఎక్కడ, ఎలాంటి తెగులు మొదలైందనేది గుర్తించేందుకు ఈ డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. దెబ్బతిన్న నిర్ణీత ప్రాంతంలో క్రిమిసంహారక మందులను డ్రోన్లతో పిచికారీ చేయవచ్చు. దీనివల్ల వ్యయప్రయాసలు తప్పడంతోపాటు పర్యావరణంపైనా కాస్త ప్రభావం తప్పుతుంది. సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం వల్ల సస్యరక్షణ సులువవుతుంది. అడ్వాన్స్‌డ్ (మిగతా 2లో)

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టడం, ఆహార సామగ్రిని చేరవేయడం, ప్రకృతి వైపరీత్యాల తర్వాత నష్టాన్ని అంచనా వేయడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల విహంగ వీక్షణ చిత్రాలనూ అవి అందించడం వల్ల సహాయ చర్యలు వేగవంతమవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి

- నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి నిప్పు పెట్టిన స్నేహితుడు
- చావుబతుకుల మధ్య బాలిక
- పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడు విఘ్నేష్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, బద్వేలు, గోపవరం: జీవితంపై ఎన్నో ఆశలతో కష్టపడి చదువుకుంటున్న ఇంటర్ బాలికపై స్నేహితుడి ముసుగులో ఉన్న వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కలవడానికి రమ్మని చెప్పి... పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వైఎస్సార్ జిల్లా బద్వేలు సమీపంలో శనివారం ఈ దారుణం చోటు చేసుకుంది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపిన మేరకు.. బాధిత బాలిక (16) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కడపలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్న విఘ్నేష్‌తో చిన్నప్పటి నుంచీ స్నేహం ఉంది. అతడికి వివాహం కాగా భార్య గర్భిణి. శుక్రవారం ఉదయం అతడు విద్యార్థినికి ఫోన్ చేసి శనివారం తనను కలవాలని కోరాడు. లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దాంతో ఆ బాలిక శనివారం కళాశాల నుంచి ఆటోలో బయలుదేరగా విఘ్నేష్ మధ్యలో ఆ ఆటో ఎక్కాడు. ఇద్దరూ బద్వేలుకు పది కి.మీ. దూరంలో ఉన్న పీపీకుంట చెక్‌పోస్టు వద్ద దిగి సమీపంలోని ముళ్లపొదల్లోకి వెళ్లారు. కొంతసేపటికి విఘ్నేష్.. బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. కొందరు మహిళలు ఆమెను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అమ్మాయిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

సీఎం ఆదేశాలతో ముమ్మర గాలింపు

నిందితుణ్ని వెంటనే అరెస్టు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో పోలీసులు నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. వారు తీవ్రంగా గాలిస్తుండగా రాత్రి వేళ ఓ బృందానికి నిందితుడు కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. బాలిక ప్రస్తుతం 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతోంది. ఆమె నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే సుధ పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

శారదా పీఠానికి భూ కేటాయింపులు రద్దు

- వచ్చే కేబినెట్‌లో ఆమోదం
- అప్పట్లో అప్పనంగా 15 ఎకరాలు కట్టబెట్టిన వైకాపా ప్రభుత్వం
- రూ.225 కోట్ల విలువైన భూమి రూ.15 లక్షలకే సంతర్పణ
- గురువుపై భక్తితో అడ్డగోలుగా మినహాయింపులు ఇచ్చిన జగన్


శారదాపీఠానికి కేటాయించిన భూములు

ఈనాడు - అమరావతి

విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. భూకేటాయింపు రద్దు ప్రతిపాదనకు వచ్చే మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేయనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

అడ్డగోలు కేటాయింపు.. ఆపై అనేక వెసులుబాట్లు!

వైకాపా హయాంలో జగన్‌కు రాజగురువుగా ఒక వెలుగు వెలిగిన స్వరూపానందేంద్ర ఎంతో విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేశారు. సంస్కృత పాఠశాల (మిగతా 2లో)

పేదల ముసుగులో వైకాపా నేతల దోపిడీ

ఆ పార్టీ వారికే నివాస, సాగు భూములు ధారాదత్తం

భూ సమీకరణలో రూ.వందల కోట్లు కొట్టేశారు

సిద్ధమవుతున్న నాటి అక్రమాల చిట్టాలు

ఈనాడు, అమరావతి: గత వైకాపా పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూముల పట్టాల పంపిణీ వ్యవహారాల్లో భారీఎత్తున అక్రమాలు జరిగాయి. భూముల కొనుగోలు నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకు వైకాపా నేతలు కుట్రపూరితంగా వ్యవహరించారు. వారి కనుసన్నల్లోనే లబ్ధిదారులను ఆనాటి రెవెన్యూ సిబ్బంది ఎంపిక చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నాటి కుంభకోణాలపై నివేదికలు కోరడంతో అక్రమాల చిట్టాలు తయారవుతున్నాయి. (మిగతా 6లో)

నవంబరు 13న విశాఖలో ఏపీ ప్రొక్యూర్‌మెంట్ సదస్సు

నూతన పారిశ్రామిక విధానం భేష్

సీఐఐ ఏపీ ఛైర్మన్ మురళీకృష్ణ

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానం కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏపీ అధ్యక్షుడు వి.మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడేలా ప్రకటించిన ఆరు పాలసీలు పారిశ్రామికవేత్తలకు ఉత్సాహం కలిగిస్తాయన్నారు. దీంతో పోటీ వాతావరణం ఏర్పడి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం సీఐఐ ఆధ్వర్యంలో విశాఖలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం (మిగతా 2లో)

భద్రమైన కారే కొంటున్నారా?

- ఆధునిక ప్రమాణాలతో వాహనాల తయారీ
- ప్రమాదాల నివారణకు బహుళ వ్యవస్థలు
- ఎన్‌క్యాప్ రేటింగ్, అడాస్‌లను తెలుసుకోండి
- కారు కొనే సమయంలో అడగాల్సినవి ఇవే



ఈనాడు - అమరావతి

కారు కొనడానికి ముందు ధర, మైలేజీ, అలాయ్ వీల్స్ వాటిలోని ఫీచర్లను చూస్తుంటాం. కానీ, ప్రమాదాలు జరిగితే, అందులోని ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ ఎంత అన్నదే అన్నింటి కంటే కీలకం. అందుకే కారు కొనేందుకు షోరూంకు వెళ్తే, ఎన్‌క్యాప్ (న్యూ కార్ ఎసెస్‌మెంట్ ప్రోగ్రామ్) రేటింగ్‌పై ఆరా తీయాలని సూచిస్తున్నారు వాహనరంగ నిపుణులు. అత్యాధునిక బ్రేకింగ్, ప్రమాదాల్ని పసిగట్టి స్వయంగా అప్రమత్తమయ్యే అడాస్ వ్యవస్థలున్న కార్ల ధర కాస్త ఎక్కువైనా, వాటినే ఎంచుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ బడ్జెట్‌లోనూ సురక్షిత వ్యవస్థ లున్న కార్లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా బాడీ పటిష్ఠతను దృష్టిలో పెట్టుకోవాలన్నది నిపుణుల మాట.

క్రాష్‌టెస్ట్ రేటింగ్స్ చూడాలి

కొన్నాళ్ల కిందట హైదరాబాద్‌లో ఓ పోలో కార్ బ్రిడ్జిపై నుంచి పల్టీ కొట్టి కింద పడింది. అయినా, అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మరో ప్రమాదంలో కారు వేగంగా ఢీకొట్టడంతో వంతెన బద్దలైంది. అయినా ప్రయాణికులు సురక్షితమే. గట్టిదనం గల కారు బాడీ, సురక్షితమైన భద్రతా వ్యవస్థలే దీనికి కారణం. కారు ప్రమాదానికి గురైతే, డ్రైవర్, ప్రయాణికుల భద్రత ఎంతన్నది క్రాష్ టెస్ట్ ద్వారా అంచనా వేయడానికి గ్లోబల్ ఎన్‌క్యాప్ రూపొందించారు. ఇందులో కారు వేగం, వివిధ కోణాల్లోంచి ఢీకొడితే పడే ప్రభావం, లోపలున్న పిల్లలకు, పెద్దలకు కలిగే నష్టం తదితర పరీక్షల ఆధారంగా పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా 1 నుంచి 5 స్టార్ రేటింగ్ ఇస్తారు. కొన్ని కంపెనీలు తమ కార్లను క్రాష్ టెస్ట్‌కు పంపవు. కొనుగోలు వేళ ఆరా తీయాలి.

క్రాష్ టెస్ట్ ఎలా చేస్తారంటే..?

ప్రమాదంలో గాయాల తీవ్రతను అంచనా వేసేందుకు పిల్లలు, పెద్దల డమ్మీ బొమ్మల తల, ఛాతీ, పొత్తికడుపు, కాళ్లు, చేతుల్లో బహుళ యాక్సిలోమీటర్లు, లోడ్ సెన్సర్లు అమర్చుతారు. ముఖ్యమైన అవయవాలకు జరిగే నష్టాన్ని గ్రాఫ్ ద్వారా విశ్లేషిస్తారు. తదనుగుణంగా పాయింట్లు ఇస్తారు. ఏడాదిన్నర నుంచి మూడేళ్ల లోపు వయసున్న పిల్లల నమూనా బొమ్మలను ఐఎస్‌ఓఎఫ్‌ఐఎక్స్ సీట్లలో ఉంచి 49 పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని పరీక్షిస్తారు. ఇందుకు కెమెరాలు, సెన్సర్లు సహా అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తారు. పరీక్షించాల్సిన కారును ఉక్కు, అల్యూమినియంతో చేసిన ట్రాలీలతో ఢీకొట్టిస్తారు. ఈ పరీక్షలు, వాటి ఫలితాలు.. రోడ్లపై జరిగే వాస్తవ ప్రమాదాలకు భిన్నంగా ఉండొచ్చు. అయినా ఈ ఫలితాలనే ప్రామాణికంగా తీసుకుంటారు.

కారు భద్రతా ప్రమాణాలను విశ్లేషించేందుకు దేశంలోని కార్ల తయారీ సంస్థలు ఇప్పటి వరకు గ్లోబల్ ఎన్‌క్యాప్ రేటింగ్‌పై ఆధారపడ్డాయి. గతేడాది నుంచి కేంద్రం భారత్ ఎన్‌క్యాప్‌ను ప్రారంభించింది. గ్లోబల్ ఎన్‌క్యాప్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, ఆటోమేటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమేటివ్ టెక్నాలజీ సంస్థల నిపుణులు సేఫ్టీ రేటింగ్స్ ఇస్తారు. గ్లోబల్ ఎన్‌క్యాప్‌లో 5 స్టార్ రేటింగ్, కొత్త ప్రొటోకాల్ విధానంలో పిల్లలు, పెద్దల రక్షణకు అధిక పాయింట్లు సాధించిన కార్లను ఎంచుకోవచ్చు.

వివరాలు 6లో

అమరావతి 2.0

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఐదు కోట్ల ప్రజల ఆశల్ని, ఆకాంక్షల్ని మోస్తున్న అమరావతిని అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన రాజధాని రైతుల హర్షాతిరేకాల మధ్య ప్రకటించారు.

రాజధానిలో నిర్మాణ పనుల్ని గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పనులు జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టించాలని, మీనమేషాలు లెక్కిస్తే కుదరదని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌లకు ఆయన స్పష్టం చేశారు. అంతా పారదర్శకంగా జరగాలని, ఒక్క విమర్శ కూడా రావడానికి వీల్లేదని చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కనే జీ+7 విధానంలో నిర్మిస్తున్న సీఆర్‌డీఏ కార్యాలయ భవనం పనుల్ని ప్రారంభించడం ద్వారా రాజధాని పునర్నిర్మాణానికి చంద్రబాబు శనివారం శ్రీకారం చుట్టారు. రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సీఆర్‌డీఏ కార్యాలయ భవనాన్ని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు చెప్పారని, సరిగ్గా 121వ రోజు మళ్లీ భవనం ప్రారంభోత్సవానికి వస్తానని తెలిపారు. 'అనుకున్న లక్ష్యాన్ని అనుకున్నట్లు పూర్తి చేయాలి. మూడేళ్ల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా ఊరుకోను. రాజధానిలో కాలుష్యం లేకుండా గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యమివ్వాలి. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలి. ఈవీ స్టేషన్లు, నడక దారులు, సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రికల్ సైకిళ్లను పెద్ద సంఖ్యలో ప్రోత్సహించి.. 20-30 కి.మీ.ల దూరంలోని ఆఫీసులకూ వాటిపైనే వెళ్లేలా చూడాలి' అని పేర్కొన్నారు. 'విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చేసింది, తూర్పు బైపాస్ నిర్మాణం కూడా త్వరగా పూర్తిచేస్తే చిన్న రింగ్‌రోడ్డు ఏర్పాటవుతుంది. అమరావతికి అవుటర్ రింగ్‌రోడ్డు కూడా వస్తుంది. రాజధానిలో ప్రధాన రహదారుల్ని దానితో అనుసంధానం చేస్తేనే ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుంది. దాని నిర్మాణం వల్ల కేంద్ర ప్రభుత్వానికీ ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి చెప్పి ఒప్పించాను' అని చంద్రబాబు తెలిపారు. అమరావతికి రాజధాని రైతులు భూసమీకరణలో భూములివ్వడం వల్ల అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతోందన్నారు. అదే స్ఫూర్తితో ఓఆర్‌ఆర్‌కి కూడా రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



రాజధానిలో పనులు పునః ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై మంత్రి నారాయణ, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి

అత్యంత సుందర నగరంగా అమరావతి

అమరావతిని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు తెలిపారు. 'జపాన్‌లో ఒక్కో రోడ్డులో ఒక్కో రకం పూల చెట్లు చూశాను. ప్రతి సీజన్‌లోనూ ఏదో ఒక రోడ్డులో కన్నుల పండుగలా అవి పుష్పిస్తూనే ఉంటాయి. అక్కడి కొండల్నీ అలాగే తీర్చిదిద్దారు. వాటిని చూసేందుకే ప్రత్యేకంగా పర్యాటకులు వస్తారు. అమరావతినీ అలాంటి సుందర నగరంగా తీర్చిదిద్దాలన్నది ఆలోచన' అని ఆయన పేర్కొన్నారు. అమరావతికి దేశంలోని 10 అగ్రశ్రేణి యూనివర్సిటీలు, పది టాప్ ఆస్పత్రులు, 10 అత్యుత్తమ పాఠశాలలు, 10 టాప్ హోటల్స్‌ను తీసుకొస్తామని చంద్రబాబు ప్రకటించారు. రాజధానిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ఇతర ఉద్యోగుల నివాసం కోసం చేపట్టిన అపార్ట్‌మెంట్ టవర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల స్థాయి అధికారుల కోసం భవంతుల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు దీటుగా అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్ని కలుపుకొని మహానగరంగా అభివృద్ధి చెందాలని, ఇక్కడి కోటి జనాభా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. 'అమరావతికి ఎండలు తప్ప అన్నీ అనుకూలతలే. ఎండలు పెద్ద విషయం కాదు. దుబాయిలో 55 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. అయినా దాన్ని వారు అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుకున్నారు. అమరావతిని కూడా విశాలమైన రహదారులతో, నీటి సరఫరా, విద్యుత్, ఇంటర్నెట్ కేబుళ్ల వంటివన్నీ భూగర్భంలోనే వెళ్లేలా బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం' అని తెలిపారు.

అమరావతి పేరు సూచించింది రామోజీరావే

రాజధానికి అమరావతి అన్న పేరును రామోజీ గ్రూప్ సంస్థల అధినేత దివంగత రామోజీరావు సూచించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 'ఒకరోజు రామోజీరావు నాకు ఫోన్ చేశారు. ఈ ప్రాంత చారిత్రక నేపథ్యంపై చాలా పరిశోధన చేయించానని, రాజధానికి అమరావతి పేరు సముచితంగా ఉంటుందని ఆయన సూచించారు. ఆ పేరు నాకు బాగా నచ్చింది. నా పక్కన ఉన్నవారికి చెబితే వారూ బాగుందన్నారు. ప్రజల ముందు పెడితే నూటికి నూరు శాతం ఆమోదం లభించింది. ఇది దేవతల రాజధాని' అని ఆయన పేర్కొన్నారు.

అమరావతిని ముంచాలనుకుంటే.. అతని ఇంటికే నీళ్లొచ్చాయి!

అమరావతి విధ్వంసానికి కంకణం కట్టుకున్న వైకాపా ప్రభుత్వం ఎంత నష్టం చేయాలో అంతా చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఒకాయన అమరావతిని శ్మశానం అన్నాడు. మరొకాయన ఎడారి అన్నాడు. అమరావతి మునిగిపోయిందని దుష్ప్రచారం చేశారు. భారీ వర్షాలకు చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలు మునిగినా.. అమరావతికి చుక్క నీరు రాలేదు. అంతెందుకు అమరావతిని ముంచాలనుకున్న జగన్ బెంగళూరులో కట్టుకున్న ఇంటి దగ్గరకే నీళ్లొచ్చాయి. వేరేవాళ్లు చెడిపోవాలని కోరుకుంటే భగవంతుడు కూడా క్షమించడు' అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో దుర్మార్గులు అమరావతిలో రోడ్లు, స్థలాలు కూడా తవ్వేసి కంకర, మట్టి తరలించుకుపోయారని మండిపడ్డారు. విధ్వంసం ముగిసిందని, ఇక నిర్మాణం మొదలైందని తెలిపారు.

మహిళా రైతుల పోరాటం నిరుపమానం

అమరావతి పరిరక్షణకు రైతులు, ఇక్కడి ప్రజలు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, ముఖ్యంగా మహిళా రైతులు వైకాపా ప్రభుత్వ దాష్టీకాలకు ఎదురొడ్డి రాణీ రుద్రమల్లా పోరాడారని చంద్రబాబు కొనియాడారు. ఒక రాజధానిని కాపాడుకోవడానికి 1,631 రోజులపాటు ఉద్యమం చేయడం చరిత్రలో ఎక్కడా లేదన్నారు. 'రైతులు పాదయాత్ర చేస్తుంటే కనీసం భోజనాలు చేసేందుకు, బసకు కూడా వసతి ఇవ్వకుండా స్థల యజమానుల్ని బెదిరించి వైకాపా పాలకులు కర్కోటకంగా వ్యవహరించారు. రాజధాని గ్రామాల్లో బాత్‌రూమ్‌లపై డ్రోన్లు ఎగరవేసి.. మహిళల్ని ఇబ్బంది పెట్టారు. అయినా వెరవకుండా రాజధాని రైతులు నిరుపమాన పోరాటం చేశారు' అని ప్రశంసించారు. ఇది పవిత్రమైన భూమి అని, గత పాలకులు ఎంతగా విధ్వంసం చేయాలనుకున్నా ఆ శక్తే రాజధానిని కాపాడిందని తెలిపారు. 'రాజధానిలో రైతులే ప్రథమ పౌరులు. ఇక్కడ స్థిరపడేందుకు వచ్చేవారిని అతిథుల్లా మీరు స్వాగతించాలి' అని సూచించారు. రైతులకు రూ.175 కోట్ల కౌలు బకాయిలు ఇప్పటికే విడుదల చేశామని, మిగతా రూ.220 కోట్లు త్వరలోనే విడుదల చేస్తామని వెల్లడించారు.

అమరావతి ముమ్మాటికీ సెల్ఫ్‌ఫైనాన్స్ ప్రాజెక్టే

అమరావతిని రాజధానిగా, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు, పారిశ్రామికంగానూ అభివృద్ధి చేస్తామన్నారు. 'అమరావతి సెల్ఫ్‌ఫైనాన్స్ ప్రాజెక్టు. ఉపాధికి కేంద్రంగా, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు అవసరమైన ఆదాయం సృష్టించే గనిగా దాన్ని తీర్చిదిద్దుతాం. ఇక్కడ ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడి చాలా తక్కువ. మొత్తం 54 వేల ఎకరాల్లో రైతులకు స్థలాలు కేటాయించగా 10-12 వేల ఎకరాలు మిగులుతుంది. దానిలో మౌలిక వసతులకు కొంత తీసేసినా, మిగిలిన భూమిని విక్రయించి అమరావతి నిర్మాణం పూర్తి చేస్తాం. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక అమరావతితో పాటు, రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పెరిగాయి. గతంలో నేను హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినప్పుడూ.. మొత్తం డబ్బు అక్కడే పెడుతున్నానని చాలా మంది విమర్శించారు. కానీ నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. అక్కడ కావలసినంత భూమి ఉంది. ప్రభుత్వం విద్యుత్, నీటి సదుపాయం కల్పించింది. దాంతో సంపద సృష్టి జరిగింది' అని చంద్రబాబు వివరించారు. అమరావతి నిర్మాణానికి రూ.లక్ష కోట్లు కావాలంటూ వైకాపా ప్రభుత్వం దుష్ప్రచారం చేసిందని మండిపడ్డారు.

ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుంటేనే పోటీకి అర్హుల్ని చేస్తాను

రాష్ట్రాభివృద్ధికి విజన్-2047 రూపొందిస్తున్నామన్న చంద్రబాబు.. జనాభా నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. 'దక్షిణాది రాష్ట్రాల్లో యువత సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఒకప్పుడు జనాభా నియంత్రణ పాటించాలని చెప్పిన నేనే.. ఇప్పుడు జనాభా పెంచాలన్న నినాదాన్ని ఉద్యమంగా తీసుకున్నాను. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హుల్ని చేస్తూ ఇది వరకు చట్టం చేశాం. దాన్నిప్పుడు తీసేశాం. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటేనే పోటీకి అర్హుల్ని చేయాలన్న నిర్ణయానికి వచ్చాను. పిల్లలు ఎక్కువ ఉంటేనే ప్రభుత్వ సాయం కూడా ఎక్కువగా అందేలా చర్యలు తీసుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

పీయూష్ గోయల్ కార్యాలయం చూసిరండి

సీఆర్‌డీఏ కార్యాలయం రాజధానిలో నిర్మిస్తున్న తొలి ప్రభుత్వ భవనమని.. ఏ కార్పొరేట్ కార్యాలయానికీ తీసిపోని విధంగా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్‌లను చంద్రబాబు ఆదేశించారు. దిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కార్యాలయం చాలా బాగుందని, ఒకసారి వెళ్లి చూసి రావాలని ఆయన సూచించారు.

పశ్చిమ బైపాస్ వంతెన పైనుంచి సీడ్‌యాక్సెస్ రోడ్డుకు కనెక్షన్ ఇవ్వాలి

- ఆ మేరకు డిజైన్‌లో మార్పులు చేయండి
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సీఎం స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి వంతెన మీదినుంచి సీడ్‌యాక్సెస్ రోడ్డుపైకి వాహనాలు దిగేలా కనెక్షన్ ఉండాలని, ఆ మేరకు డిజైన్‌లో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. అమరావతిలో శనివారం సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణ పనుల్ని ప్రారంభించిన అనంతరం... సీడ్‌యాక్సెస్ రోడ్డు మీదుగా తిరిగి వెళుతూ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి సీఎం తన కాన్వాయ్‌ని ఆపించి కిందకు దిగారు. అప్పటికే అక్కడున్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్, గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. కాజ నుంచి చిన అవుటపల్లి వరకు నిర్మిస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారిలో భాగంగా కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తున్నారు. ఆ బ్రిడ్జి సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా వెళుతోంది. ప్రస్తుత డిజైన్ ప్రకారం... నదికి అటుపక్క నుంచి వచ్చే వాహనాలు బ్రిడ్జిపై నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డులోకి దిగే వెసులుబాటు లేదు. సుమారు 2 కిలోమీటర్లు ముందుకెళ్లి రాజధానిలోకి రావాల్సి ఉంటుంది. రాజధానికి ప్రధాన అనుసంధాన రహదారి అయిన సీడ్‌యాక్సెస్ రోడ్డులోకి ఆ బ్రిడ్జిపై నుంచి కనెక్షన్ లేకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉన్నందున ఇప్పుడు కనెక్షన్ ఇవ్వడం కష్టమని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దానికి అంగీకరించని ముఖ్యమంత్రి.. . ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్ని ఉపయోగించి దీనికి పరిష్కారం కనుగొనాలని, బ్రిడ్జి డిజైన్‌లు మార్చాలని స్పష్టంచేశారు.



విజయవాడ బైపాస్ పనులు పరిశీలించి ప్రాజెక్టు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

విత్తనాలు నాటు.. విపత్తులు దాటు

(మొదటి పేజీ తరువాయి)

ఇమేజింగ్, డేటా విశ్లేషణతో రైతులకు రియల్ టైమ్ క్రాప్ ఇంటెలిజెన్స్ సమాచారమూ అందుతుంది. సెన్సర్ల వంటి ఐవోటీ పరికరాలతో డ్రోన్లు పనిచేస్తాయి. పైరు ఎదుగుదలను గమనించేందుకు మల్టీస్పెక్ట్రల్ కెమెరాల వంటి ఇమేజింగ్ సాంకేతికత సహకరిస్తుంది. థర్మల్, ఆప్టికల్ ఇమేజింగ్‌లనూ ఇవి సమన్వయం చేస్తాయి. 'మన దేశ భౌగోళిక స్థితిగతులను బట్టి ప్రత్యేకంగా మారుత్ ఏజీ 365, ఏజీ 365 ఎస్ డ్రోన్లను క్రిమిసంహారక మందుల పిచికారీ, భూసార పర్యవేక్షణకు అందుబాటులోకి తీసుకొచ్చాం' అని మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు వి.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

దేశ సరిహద్దుల్లో..

ప్రాజెక్టు మ్యాపింగ్‌కు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) డ్రోన్లను ఉపయోగిస్తోంది. మైనింగ్, రక్షణలోనూ వీటిని వాడుతున్నారు. రక్షణ రంగంలో నిఘాతోపాటు విపత్తులో సేవలందించే సిబ్బంది ప్రాణరక్షణకు రియల్‌టైం ఇంటెలిజెన్స్‌ను అందించడంలో డ్రోన్లు కీలకమవుతున్నాయి. వీటిని సరిహద్దు గస్తీతోపాటు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలకూ వాడుతున్నారు. సెర్చ్ అండ్ రెస్క్యూ మెషిన్లలో ఉపయోగిస్తున్నారు.

వివిధ రంగాల్లో..

- లాజిస్టిక్స్ రంగంలో పలు స్టార్టప్ సంస్థలు, ఇతరాలు డ్రోన్ డెలివరీతో ప్రయోగాలు చేస్తున్నాయి.
- వన్యప్రాణుల రక్షణ, అడవుల నరికివేతను ట్రాక్ చేయడం, తీర ప్రాంతాలను తనిఖీ చేయడంవంటి పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలకూ సహకరిస్తున్నాయి.
- వాతావరణ అధ్యయనానికి డేటా సేకరణ, పర్యావరణ నిబంధనల అమలుకు ఉపకరిస్తున్నాయి.
- అడవుల్లో విత్తన వ్యాప్తికి డ్రోన్లను వాడుతున్నారు. మనుషులు స్వయంగా నాటడంతో పోలిస్తే తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనాలు అందుతున్నాయి.

మరింతగా సేవలందిస్తాం..

డ్రోన్ సేవల అవసరంపై 31 శాఖలు ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనల్లోని వివరాలివి.

- జలాశయాల పరిశీలన, వరద నష్టం, నీటి కొరత, కరవు పరిస్థితుల అంచనాకు వీలవుతుంది.
- పట్టణ ప్రాంతాల్లో 3డీ మోడల్ ల్యాండ్ మ్యాపింగ్, నిర్మాణాల పర్యవేక్షణ.
- మైనింగ్ ప్రాంతాల్లో రియల్‌టైం తనిఖీలు, గనుల మ్యాపింగ్‌తోపాటు అన్వేషణ, భద్రత పరిశీలన.
- నేరాలు జరిగినప్పుడు క్రైంసీన్ డాక్యుమెంటేషన్, అనుమానితులను ఏఐ ఆధారిత డ్రోన్‌తో ట్రాక్ చేయడం..
- రద్దీగా ఉన్నచోట జనసమూహాల నియంత్రణకు సహకారం.
- మంటలను గుర్తించి అగ్నిమాపక నిరోధ వాయువులను, రసాయనాలను వెదజల్లడంతోపాటు పరిస్థితి పర్యవేక్షణ.
- పర్యాటక కేంద్రాల ఏరియల్‌వ్యూ చిత్రీకరణ. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు దిక్సూచి.
- జాతీయ, ప్రధాన రహదారులపై కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్ల సాయంతో ట్రాఫిక్ నియంత్రణ, రియల్‌టైంలో రహదారుల పరిస్థితులను తెలుసుకోవడం.
- ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల్లో సంప్రదాయ తనిఖీల వ్యయాలను నియంత్రించడం, ఏఐ సాంకేతికతతో మౌలిక సదుపాయాల వైఫల్యాలను ముందస్తుగా గుర్తించడం.
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు కల్పించిన ఆస్తుల ట్రాకింగ్.
- మందులవంటి అత్యవసరాలు, విద్యాసామగ్రిని మారుమూల ప్రాంతాలకు అందించడం.
- అక్రమ చేపలవేట ప్రాంతాల మ్యాపింగ్. ఆక్వా ఆపరేషన్ల పర్యవేక్షణ.
- ఏఐ ఆధారిత డ్రోన్‌లతో వ్యాధుల వ్యాప్తి అంచనా.
- పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా సైట్ సర్వే. పర్యావరణ ప్రభావం అంచనా.
- వాతావరణ అధ్యయనంతో దీర్ఘకాలిక పర్యావరణ సమస్యల గుర్తింపు.
- కార్మికుల రక్షణ కోసం కర్మాగారాల పరిస్థితులను తెలుసుకోవడం.

మీరు కాళ్లు మొక్కితే.. నేనూ మొక్కుతా!

"తల్లిదండ్రులు, గురువుల కాళ్లకు మాత్రమే నమస్కారం చేయాలి. నా కాళ్లకు ఎవరైనా మొక్కితే.. తిరిగి నేనూ అదేవిధంగా చేస్తా'.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పదేపదే చెబుతున్న మాట ఇది. ఆయన చెప్పినట్లే శనివారం ఏకంగా చేసి చూపించారు. రాజధానిలో సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణ పనుల్ని ప్రారంభించేందుకు వచ్చిన చంద్రబాబు కాళ్లకు ఓ వ్యక్తి మొక్కారు. వెంటనే చంద్రబాబు 'నన్ను కూడా మీ కాళ్లకు నమస్కారం చేయమంటారా' అంటూ... కొంచెం ఒంగి ఆ వ్యక్తి కాళ్లు పట్టుకోబోయారు. దాంతో ఆ వ్యక్తి కంగుతిన్నారు.

–ఈనాడు, అమరావతి



పాదాభివందనం చేసిన వ్యక్తికి తిరిగి అదే విధంగా నమస్కారం చేయబోతున్న సీఎం చంద్రబాబు

నవంబరు 13న ఏపీ ప్రొక్యూర్‌మెంట్ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అమలుతో దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో ఏపీ నిలిచే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పించే స్థాయి ఆధారంగా ప్రోత్సాహకాలు నిర్ణయించడం శుభపరిణామం. అది 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఊతమిస్తుంది. వచ్చే నెల 13న విశాఖలో సీఐఐ ఆధ్వర్యంలో ఏపీ ప్రొక్యూర్‌మెంట్ సదస్సు నిర్వహిస్తాం' అని పేర్కొన్నారు.

ప్రైవేటు పార్కుల విధానం అనుకూలం

'ప్రైవేటు పార్కుల విధానం కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకంగా ఉంటుంది. గతంలో ఏపీఐఐసీ భూముల కేటాయింపుల్లో అనేక సమస్యలు ఎదురయ్యేవి. ప్రైవేటులో అటువంటి వాటికి ఆస్కారం ఉండదు' అని సీఐఐ పోర్ట్సు అండ్ లాజిస్టిక్స్ విభాగం ఛైర్మన్ జి.సాంబశివరావు అభిప్రాయపడ్డారు. 'కొత్త పరిశ్రమల గురించే కాకుండా పాత వాటి గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా సమస్యలను పరిష్కరిస్తామనడం బాగుంది' అని సీఐఐ ప్రతినిధి జి.శివకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐఐ ప్రతినిధులు దాట్ల తిరుపతిరాజు, కేవీవీ రాజు, శ్రీనివాసరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఐఐ ఏపీ అధ్యక్షుడు మురళీకృష్ణ



మీ ఇల్లు కూడా ఓ పాఠశాలే

మీ పిల్లలకు ఇల్లు కూడా ఓ పాఠశాల లాంటిదే. వారికి అనుబంధాల విలువ తెలియజెప్పాల్సింది, ఇతరుల పట్ల దయతో మెలుగుతూ ప్రేమను వ్యక్తపరచడమెలాగో నేర్పాల్సింది, శాంతియుత సామాజిక జీవితాన్ని అలవర్చుకొనేలా చేయాల్సిందీ తల్లిదండ్రులే. అయితే వీటన్నింటినీ మీరు స్వయంగా పాటించడం ద్వారానే మీ పిల్లలకు నేర్పగలరు. మీ పిల్లలను మీరు గౌరవిస్తూ, ప్రేమను పంచినప్పుడే వారు సమాజాన్ని ప్రేమించగలరు.

– బ్రాండన్ మూర్, పేరెంటింగ్ కోచ్

గ్రహం అనుగ్రహం

20–10–2024 ఆదివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం
తదియ: ఉ. 10-44 తదుపరి చవితి
కృత్తిక: మ. 1-14 తదుపరి రోహిణి
వర్జ్యం: తె. 4-33 నుంచి
అమృత ఘడియలు: ఉ. 10-58 నుంచి 12-29 వరకు
దుర్ముహూర్తం: సా. 4-01 నుంచి 4-47 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.57; సూర్యాస్తమయం: సా.5.34
సంకటహర చతుర్థి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	23.0
నిజామాబాద్	36.3	24.4
ఆదిలాబాద్	35.3	27.2
రామగుండం	34.8	24.6
ఖమ్మం	34.5	25.0
నరసాపురం	34.1	26.4
విశాఖపట్నం	34.0	26.5
విజయవాడ	33.2	25.9
తాడేపల్లిగూడెం	32.7	25.4
కర్నూలు	32.6	24.8
తిరుపతి	32.6	23.8
శ్రీకాకుళం	32.0	26.0
అనంతపురం	31.4	24.0
నెల్లూరు	30.1	26.5
విజయనగరం	30.0	26.0
ఒంగోలు	29.0	26.9
గుంటూరు	29.0	25.0
కడప	29.0	24.0

శారదా పీఠానికి భూ కేటాయింపులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

నెలకొల్పి, వేద విద్యను వ్యాప్తి చేసేందుకు, పీఠానికి సంబంధించిన ఇతర కార్యకలాపాల నిర్వహణకు భూములు కేటాయించాలంటూ.. ఆ ముసుగులో ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి పడేశారు. అంతటి రాజగురువే అడిగితే కాదనేదేముంది..! చకచకా దస్త్రం కదిలింది. భీమిలిని ఆనుకుని ఉన్న కొండపై 102/2 సర్వే నంబరులో 7.70 ఎకరాలు, 103లో 7.30 ఎకరాల్ని జగన్ ప్రభుత్వం ఆయనకు కేటాయించింది. రూ.225 కోట్లు విలువ చేసే ఆ భూముల్ని శారదా పీఠానికి ఎకరం రూ.లక్ష చొప్పున రూ.15 లక్షలకు కట్టబెడుతూ 2021 నవంబరులో జీఓ ఇచ్చేసింది. ఆ తర్వాతే స్వామీజీ అసలు స్వరూపం బయటపెట్టారు. పీఠానికి ఆదాయం సమకూర్చుకోవడానికి ఆ భూముల్ని వాడుకోవాలన్నది తమ ఉద్దేశమని, దానికి వీలు కల్పిస్తూ జీఓను సవరించాలని తన వారసుడు, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రతో 2023 నవంబరు 20న సీఎంకి లేఖ రాయించారు. 'పీఠం కార్యకలాపాలకు అవసరమైన ఆదాయ సముపార్జన కోసమే. . విశాఖపట్నంలోని సాగర తీరంలో, అది కూడా వాణిజ్య, నివాస ప్రాంతాలకు అత్యంత సమీపంలోని భూములు కేటాయించాల్సిందిగా కోరాం. కానీ జీఓలో మాత్రం వేద విద్య వ్యాప్తికి, పీఠం కార్యకలాపాల విస్తరణకు అని రాశారు. ఆ కార్యకలాపాల్ని పీఠం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు వారణాసి, రుషికేశ్‌లలోని 60 కేంద్రాల్లో చేస్తోంది. ఆ భూముల్ని జీఓలో ప్రస్తావించిన అవసరాల కోసం వాడుకోవాల్సిన పనిలేదు. వేదపాఠశాల, సంస్కృత విద్య వ్యాప్తికి ఆ స్థలం కోరినట్టు జీఓలో పొరపాటున రాసినట్టున్నారు. జీఓలో మార్పులు చేయాల్సిందిగా కోరుతున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు. స్వామీజీ కోరిక మేరకు అడ్డగోలుగా అనేక వెసులుబాట్లు కల్పిస్తూ, ఎన్నికలకు కొన్ని రోజుల ముందు 2024 ఫిబ్రవరిలో జగన్ ప్రభుత్వం సవరించిన జీఓ విడుదల చేసింది.

కేబినెట్‌పైకి తోసేస్తే పోలా!

శారదాపీఠానికి భూకేటాయింపులో కీలకంగా వ్యవహరించిన అధికారులు.. ఇప్పుడు ఆ వ్యవహారం తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న ఉద్దేశంతో, మొత్తం నెపాన్ని అప్పటి కేబినెట్‌పైకి నెట్టేయాలని చూస్తున్నట్టు సమాచారం. తమ ప్రమేయమేమీ లేదని, అంతా అప్పటి కేబినెట్ నిర్ణయమేనన్నట్టు చెప్పాలని చూస్తున్నట్టు తెలిసింది. శారదాపీఠానికి భూ కేటాయింపులు ఏ విధంగా నిబంధనలకు విరుద్ధమో వివరిస్తూ రెవెన్యూశాఖ నోట్ తయారు చేసింది. అప్పట్లో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారుల దృష్టికి ఆ విషయం వెళ్లడంతో..'అబ్బబ్బే అవన్నీ ఇప్పుడెందుకు? కేటాయింపుల్ని రద్దు చేయాలని సింపుల్‌గా రాస్తే సరిపోతుంది కదా' అని ఒత్తిడి తెస్తున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.


బజాజ్ ఎలక్ట్రానిక్స్
భారతదేశపు అతి పెద్ద పండుగ ఆఫర్
1కోటి
నగదు బహుమతి
గెలుచుకోండి 30 ఆల్టో K10 కార్లు
డ్రా తేది: 8 జనవరి, 2025
గెలుచుకోండి ₹50 లక్షలు
డ్రా తేది: 8 జనవరి, 2025
గెలుచుకోండి ₹30 లక్షలు
డ్రా తేది: 6 నవంబర్, 2024
₹21,000* వరకు క్యాష్ బ్యాక్
CASHBACK UPTO ₹10,000/-* BAJAJ FINSERV
CASHBACK UPTO ₹21,000/-* HDB FINANCIAL SERVICES
CASHBACK UPTO ₹2,000/-* YES BANK
7.5% INSTANT DISCOUNT* SBI card
CASHBACK UPTO ₹4,500/-* HDFC BANK FESTIVE TREATS On CC / DC EMI
CASHBACK UPTO ₹3,000/-* RBL BANK
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹4,500 per card. Valid only on EMI Trxns. Validity: 05 Oct - 03 Nov 2024. T&C Apply.
SONY
BRAVIA 7
XR Mini LED
THIS FESTIVE SEASON
GET BRAVIA 2 (43S25) on purchase of BRAVIA 7
Range starts from Rs.1,82,990/-
SPECIAL OFFERS! 3 YEARS WARRANTY | INSTANT CASHBACK ₹12,500 | BUY NOW AT Rs.2,995/- | 1 EMI FREE | SOUNDBAR COMBO OFFER SAVE UPTO Rs.52,490/-
LG
LG OLED DAYS
Enjoy exclusive limited period offers on LG OLED TVs.
New Smart Platform Experience
Life's Good.
26% CASHBACK | 1 EMI FREE | FIXED EMI ₹999 | 30% OFF ON LG SOUNDBAR | OLED CIRCLE | 5-YEAR GUARANTEED
SAMSUNG
BIG TV FESTIVAL
Light up your festivities with AI powered Samsung TV
Exclusive Festive Offers
Free TV worth up to ₹290000 | Free Soundbar HW-Q990D worth ₹100000 | 3 Year warranty | 1 EMI off
Long tenure EMI up to 36 months | Up to 20% cashback + 10% Samsung Axis Bank Credit Cards
LG Life's Good.
Light up this Diwali with exciting offers on the LG Objet Collection with MoodUP Refrigerator Series and let your mood set the vibe.
CELEBRATION OFFERS
INSTANT CASHBACK UP TO ₹45,000* | FIXED EMI Starting from ₹9999
0 DOWN PAYMENT | FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000
SAMSUNG
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
Upgrade to AI - Powered French Door & Side by Side refrigerators and enjoy amazing Offers
20% CASHBACK Up to ₹20,000*
EMI Starting ₹3990/-* | 20 Year Warranty**
Haier
OPEN THE DOOR TO MORE WITH 3-DOOR CONVERTIMAX SIDE BY SIDE REFRIGERATOR
EXCITING OFFERS
20% INSTANT DISCOUNT | 18 MONTHS | 0 DOWN PAYMENT | 2 Years Complete Warranty on Product & 10 Years on Compressor
LG
Light up this Diwali by bringing home the New Form of Laundry with exciting offers on LG WashTower.
CELEBRATION OFFERS
CASHBACK UP TO 20%* Upto ₹12000/-* (Applicable on 10 kg and Above Select Models)
SAMSUNG
NEW ARRIVAL
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
No load too big
Bespoke AI™ Laundry now available in 12kg.
WW12DB8B54GBTL
MRP ₹74990
Special Offer Price ₹59000
20% cashback of up to ₹8,000* | EMI Starting @ ₹2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
ULTIMATE WASHING ASSURANCE WITH 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT | FIXED EMI STARTING ₹994* | 20% CASH BACK | 5 YEARS WARRANTY
iPhone
iPhone 16 128GB MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹36,900/-*
iPhone 13 128GB MRP ₹49,900/- EFFECTIVE PRICE ₹21,900/-*
SAMSUNG
S24 Ultra 12GB + 256GB MRP ₹1,29,999/- EFFECTIVE PRICE ₹1,09,999/-*
S24 8GB + 256GB MRP ₹79,999/- EFFECTIVE PRICE ₹64,999/-*
*Price Including Upgrade / Cashback
vivo
Y300Plus 8GB + 128GB ₹28,999 ₹23,999 ADDITIONAL CASH BACK ₹2,000*
Y28s 4GB + 128GB ₹17,999 ₹13,499 ADDITIONAL CASH BACK ₹1,000*
oppo
F27 5G 8GB + 128GB ₹27,999 ₹20,999 INSTANT CASH BACK 10%*
A3 Pro 5G 8GB + 128GB ₹20,999 ₹17,999 INSTANT CASH BACK 10%, UPTO ₹1500*
mi
Redmi Note 13 5G 8GB + 128GB ₹20,999 ₹14,999* CASH BACK ₹1,000*
Redmi 13 C 5G 6GB + 128GB ₹15,999 ₹10,499* CASH BACK ₹1,000*
*Net Effective Price after Cash Back
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in

ఈనాడు

తోడుగా నిలుద్దాం!

ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త రాజా రామన్నను అడిగారెవరో- 'మీకు జీవితంలో ఎంతో ఆనందాన్నిచ్చే సన్నివేశాలు ఏమిటి?' అని. దానికాయన 'ఏకాంతంగా కూర్చొని పియానో వాయించుకొనే సందర్భాలన్నీ అత్యంత ఆనందాన్నిస్తాయి' అన్నారు. ఖలీల్ జిబ్రాన్ చెప్పినట్లు మనిషి తనలోకి తాను... తనదైన నిర్మల హృదయ జలాశయంలోకి నిదానంగా జారుకొనే అపురూపమైన సమయాలవి. ఏకాంతం మనిషిని ప్రపంచం బారినుంచి రక్షిస్తుంది. మనిషి తనతోనో, తన ఇష్టదైవంతోనో గడిపే అమూల్య ఘట్టాలకు ఆధారభూమిక, నర్తనవేదిక- ఏకాంతం. అంతేకాదు- అది విషయ, ఇంద్రియ సంయోగంతో ప్రమేయం లేనిది. 'ప్రేయసి సోయగమ్మునకు లేదు శరీరము, లేదు మేను- నా తీయని ప్రేమకేని!' అని కృష్ణశాస్త్రి చెప్పిందదే! మనిషి తనను తాను పునర్ నిర్వచించుకోవాలన్నా, నిర్మించుకోవాలన్నా ఏకాంత స్థితి ఎంతో అవసరమైనది. ఆధ్యాత్మిక సాధనలకు సరేసరి. కాబట్టే మునులు, జ్ఞానులు ఏకాంత స్థితిని బాగా ఇష్టపడతారు. దానికోసం పరితపిస్తారు.

ఏకాంతం, ఒంటరితనం ఒకటి కావు. ప్రపంచాన్ని దూరం పెట్టి ఆనందిస్తుంది- ఏకాంతం! ప్రపంచం దూరమైనందుకు చింతిస్తుంది- ఒంటరితనం! శ్రీశ్రీ చెప్పిన 'నా గుహలో కుటీలో చీకటిలో ఒక్కడనై క్రుక్కిన రోజులు' మామూలు మనిషికి దుఃఖపూరితాలు. తన ఒంటరితనానికి కారకులైనవారి గురించి నిరంతరం ఆలోచించడం, కారణాలు అన్వేషించడం, ప్రతీకారానికి దారులు వెదకడం... ఇలా మొత్తానికి వేరేవారి గురించి చింతిస్తూ గడిపే రోజులన్నీ చాలా భారమైనవి. స్వర్గ నరకాల మధ్య తేడా గురించి చెబుతూ 'మనకు ఇష్టమైన జీవితం గడిపినంత కాలం- మనం స్వర్గంలో ఉన్నట్లు లెక్క. మనం కానిదానిగా ఉండటం, అయిన దానిగా ఉండకపోవడం రెండూ నరకమే' అన్నాడు ప్రసిద్ధ ఫ్రెంచి తత్వవేత్త జీన్ పాల్ సార్త్రే. ఈ మాటను ఏకాంతానికి, ఏకాకితనానికి అన్వయిస్తే- మొదటిది స్వర్గం, రెండోది నరకం. ఒంటరితనాన్ని ఏకాంతంగా మలుచుకోవడం ఎలా అనేదే ప్రస్తుతం వృద్ధులను వేధిస్తున్న ప్రధాన సమస్య. వాస్తవానికి ఒంటరిగా బతకడం కన్నా- ఒంటరితనంలో ఉన్నామన్న భావనే కుంగుబాటుకు బలమైన కారణం అవుతోందంటున్నారు శాస్త్రజ్ఞులు. అలాంటివారికి తోడు చాలా అవసరం.

కొబ్బరి విత్తనాలు గుంపుగా ఒక తోపులా ఏపుగా ఎదుగుతాయి. వాటిని తవ్వి తీసి వేరువేరుగా నాటుతారు. అలా విడిగా పెరిగే మొక్కలను 'సూదలు' అని పిలుస్తారు. సూదల్లో కొన్ని ఆ దశలోనే వాడిపోతాయి. అందుకు కారణం 'మనేద' అంటారు రైతులు. మనేద అంటే బెంగ, మనోవ్యథ. ఒంటరిగానే అయినా, బలంగా పెరిగే మొక్కలలో లేని మనేద- ఒంటరితనమనే భావనలో కూరుకుపోయిన మొక్కలను కుంగదీసేస్తోందని లెక్క. వృద్ధుల విషయాలలో దాన్ని ఏకాకితనంగా నిర్వచిస్తున్నారు హార్వర్డ్‌కు చెందిన ఆరోగ్య పరిశోధకులు. ఆధునిక యుగంలో వృద్ధాప్యమనేది ఒంటరితనానికి పర్యాయపదంగా మారుతోంది. 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీకోసమే కన్నీరు నించుటకు నేనున్నానని' సమాజం తోడుగా నిలుస్తే వృద్ధుల్లో కుంగుబాటును నివారించవచ్చన్నది పరిశోధకుల హితవచనం. దాన్ని ఆలకించి వృద్ధులు ఏకాకులు కాకుండా చూడటం- అటు సంతానానికి, ఇటు సమాజానికి ప్రధాన బాధ్యత. 'ఎవరినైనా కలిస్తే మనిషిని కలిసినట్టుండాలి... మానవత్వం అర్థమైనట్లుండాలి... పచ్చని చెట్టుకింద సేదదీరినట్టుండాలి...' అని ఆశించారు ఎన్.గోపి. అయినవారు ఆ తరహా భరోసాను, ఆసరాను అందిస్తే- వృద్ధులు ఏనాటికీ ఏకాకులు కారు!



న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సెక్యులరిజం... ఈ నాలుగు ముఖ్యమైన విషయాల గురించి పిల్లలకు ఏడెనిమిదేళ్లలోపే అర్థమయ్యేలా నేర్పించాలి. అప్పుడే ఈ విలువలు జీవితాంతం వారితో పాటు ఉంటాయి.

– జస్టిస్ లీలాసేథ్

అయిదు వేళ్ల వెనకా...

ఆవురావురుమంటూ కంచం ముందు కూర్చుంటాం. అన్నం, కూరలు వడ్డించగానే అయిదువేళ్లతో అన్నం కలుపుతాం, తొలిముద్దనోసారి కళ్లకద్దుకుని తరవాతే నోటికి అందిస్తాం. ఇస్తున్నది చేయి అందుకోబోతున్నది నోరు! మరి కళ్లకద్దుకోవటంలో అర్థం ఏంటీ అంటే- ఆ ముద్ద మన నోటికి చేరటానికి ఎన్ని చేతులో సహాయం చేస్తున్నాయి. ఆ సహాయం అందించే మూలపురుషుడు పరమాత్మ. ఆ పరమాత్మ మన కళ్లలో ఉన్నాడు మరి.



అంతర్యామి

మన నోటికందే షడ్రసోపేతమైన భోజనంలో ఎంత మంచి ఉందో, అంత చెడ్డా ఉంది. ఈ షడ్రుచుల మీదే మనిషి తత్వం ఆధారపడి ఉంది. అవే మన గుణాలను బయట పెడతాయి. అవే సత్య, రజస్తమో గుణాలు. నాభి వరకూ ఉన్న భాగం తమోగుణ ఆవాసం. నాభి నుంచి ఉదరం వరకూ రజోగుణం. ఉదరం నుంచి కంఠం వరకూ సత్య గుణం. కంఠ భాగంపైన ముఖ మండలం... మనసు నుంచి బుద్ధి, బుద్ధి నుంచి జ్ఞానం వికసించే కేంద్రం. జ్ఞానం భగవత్ సంకేతం. అదే బ్రహ్మం. అంటే- పరమాత్మను చేరుకోవడానికి దారి. అందుకే మనం నోటికందించే అన్నం పరబ్రహ్మ స్వరూపం. అది మనకు భగవంతుడి ప్రసాదం. దాన్ని ఆయనకు నైవేద్యంగా సమర్పించి మన నోటికందిస్తే మనకి క్షేమం. మనకింత క్షేమాన్ని కలిగించే ఆహారాన్ని భగవంతుడు ఎందరి సాయంతో మన వరకూ చేరుస్తున్నాడో కూడా తెలుసుకోవాలి!

ఆకలితో నకనకలాడుతూ కూర్చోగానే విస్తట్లో ప్రేమగా అన్నం వడ్డించేది తల్లి కావచ్చు, చెల్లి కావచ్చు, భార్య కావచ్చు. మొత్తం మీద ఆవిడో అన్నపూర్ణ. ఆకలితో ఉన్నవారికి సుష్టుగా, కొసరి కొసరి వడ్డించిన వారెవ్వరైనా అన్నపూర్ణలే. ముందుగా ఆమెకు కృతజ్ఞతలు చెప్పాలి. ఆమెకు కావాల్సినవన్నీ తెచ్చిస్తున్నవారు మరొకరు. అతడు తండ్రో, భర్తో, కుమారుడో ఎవ్వరైతేనేం? ఒక దాత, ఒక దేవుడు. మరి ఆ పదార్థాలు ఆయన సృష్టిస్తున్నాడా? మళ్లీ ఎన్నో చేతులు, ఎంతో శ్రమ. ఎండావానా అనక కాయకష్టం చేసి పండించిన పంటంతా తానొక్కడే అనుభవించాలనుకోకుండా సమస్త మానవాళి ఆకలి బాధలు తీరుస్తున్న రైతన్నలో... కనిపించని ఆ పరమాత్మ చేయి కనిపించడం లేదా? అందరి సహకారంతో అందే కమ్మనైన ఆహారాన్ని ముద్దగా చేసి కడుపులోకి పంపిస్తున్నాం. లోపలి యంత్రం అవసరమనుకున్నవి రక్తంగా మార్చి శరీరానికి శక్తినిస్తుంది, జ్ఞానాన్నిస్తుంది, ఆలోచననిస్తుంది, వివేచననిస్తుంది. మలినాల్ని, వ్యర్థాల్ని బయటకు తోసేస్తుంది.

మూడుపూటలా ఆ అయిదువేళ్లు ఐక్యతతో పనిచేసి నోటికింత అందిస్తున్నాయంటే- వాటి వెనకాల మనకి కనిపించని ఆ పరమాత్మ సహస్ర బాహువులతో, సహస్రాక్షులతో, సహస్ర శీర్షాలతో చేస్తున్న నిర్విరామ కృషి ఉంది. అది ఎంత అచంచలమైనదో తెలుసుకోవాలి. తెలుసుకుని మన చుట్టూ ఉన్నవారితో చేయీ చేయీ కలపాలి. అయిదు వేళ్లూ నోట్లోకెళ్తున్న మనిషి జీవించే స్వల్పకాలంలో ఈ రహస్యం తెలుసుకొని, జీవించడమే ఒక నైవేద్యం!

– పి.వి.బి.శ్రీరామమూర్తి

కర్బన ఉద్గారాలకు 'సమాధి'!

భూతాపం మూలంగా అన్ని సీజన్లలో ఎండలు మండిపోతున్నాయి. భూమి ఉష్ణోగ్రతను పెంచేస్తున్న కర్బన ఉద్గారాలను కట్టడి చేయనిదే వాతావరణ సమతుల్యతను పునరుద్ధరించలేం. వరదలు, తుపానుల వంటి ప్రకృతి విపత్తులను నిలువరించలేం. గాలి నుంచి నేరుగా కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, దాన్ని భూగర్భంలో నిక్షిప్తం చేయడం ద్వారా ఉద్గారాలను తగ్గించవచ్చు. ఈ సాంకేతికతను కార్బన్ క్యాప్చర్, స్టోరేజీ (సీసీఎస్)గా వ్యవహరిస్తున్నారు.




పలు దేశాలు బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ పునర్వినియోగ సౌర, పవన ఇంధనాలకు మళ్లుతున్నాయి. దీనితోపాటు వాతావరణంలో పేరుకుపోయిన కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించడానికి కార్బన్ క్యాప్చర్, స్టోరేజీ (సీసీఎస్) సాంకేతికతను వినియోగించాలి. తద్వారా పారిస్ వాతావరణ సభ తీర్మానించిన ప్రకారం భూఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ లేదా 2 డిగ్రీల సెల్సియస్ దగ్గర కట్టడి చేయవచ్చు. ఈ లక్ష్య సాధనకు సీసీఎస్ అమోఘంగా తోడ్పడుతుందని స్వీడన్‌లోని చామర్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, నార్వేలోని బెర్గెన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జరిపిన అధ్యయనం తేల్చింది. ప్రపంచ దేశాలన్నీ సీసీఎస్‌ను వేగంగా అమలు చేస్తే కర్బన ఉద్గారాలను అరికట్టగలుగుతామని సూచించింది.

ఎంత వరకు లాభం?

ఉక్కు, సిమెంటు కర్మాగారాలు, థర్మల్ విద్యుత్కేంద్రాలు వాతావరణంలోకి పెద్దయెత్తున సీవో2ను విడుదల చేస్తున్నాయి. ఈ ఉద్గారాల నిరోధానికి సీసీఎస్ తోడ్పడుతుంది. నార్వే తీరంలో స్లేప్నెర్ ప్రాజెక్టు కింద వాతావరణం నుంచి ఒడిసిపట్టిన సీవో2ను 1996 నుంచి నార్త్‌సీ సముద్ర గర్భంలో నిక్షిప్తం చేస్తున్నారు. నేడు సీసీఎస్ కన్నా అధునాతనమైన సాంకేతికతలు రంగప్రవేశం చేస్తున్నాయి. శిలాజ ఇంధనాల వల్ల పెరిగిపోతున్న కర్బన ఉద్గారాల పరిహరణకు ఈ సాంకేతికతలను విరివిగా ఉపయోగించాలి. ఉక్కు, సిమెంటు కర్మాగారాలు సౌర, పవన ఇంధన వనరులకు మారడం కష్టం కాబట్టి అవి తప్పనిసరిగా సీసీఎస్‌ను చేపట్టాలని చామర్స్ విశ్వవిద్యాలయ నిపుణులు జెసికా జుయెల్ సూచించారు. ప్రస్తుత శతాబ్దంలో సీసీఎస్ సాయంతో 600 గిగా టన్నుల కర్బనాన్ని మాత్రమే గ్రహించి భూగర్భంలో నిల్వచేయగలుగుతామని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కానీ, భూతాపాన్ని నిరోధించడానికి ఇది చాలదు. ఈ శతాబ్దాంతానికి 1000-1500 గిగాటన్నుల కర్బన ఉద్గారాలను ఒడిసిపట్టి నిక్షిప్తం చేస్తేనే భూతాపాన్ని నిలువరించగలుగుతాం. ఈ లక్ష్యాన్ని వేగంగా సాధించడానికి సీసీఎస్ సాంకేతికత సరిపోకపోవచ్చని చామర్స్-బెర్గెన్ సంయుక్త అధ్యయన సారథి కాజ్లు చెబుతున్నారు. సీసీఎస్ తరచూ వైఫల్యానికి లోనవుతోంది. గడచిన 15 ఏళ్లలో 90 శాతం సీసీఎస్ ప్రాజెక్టులు ఆశించిన స్థాయిని అందుకోలేకపోయాయి. అందువల్ల భూతాపాన్ని వేగంగా నిరోధించడానికి సీసీఎస్ సాంకేతికత ఎంత వరకు ఉపకరిస్తుందనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. అదీ కాకుండా సీసీఎస్ చాలా ఖరీదైన పరిజ్ఞానం. సీవో2ను ఒడిసిపట్టి భూగర్భంలో నిక్షిప్తం చేయడానికి మౌలిక వసతుల నిర్మాణం ఎంతో వ్యయప్రయాసలతో కూడినది. అందుకే ప్రైవేటు కంపెనీలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సంకోచిస్తున్నాయి. ప్రభుత్వ సహాయం, ఆర్థిక ప్రోత్సాహకాలు ఉంటే అవి ముందుకువస్తాయి. ఈ వాస్తవాన్ని సంపన్న దేశాలు గుర్తించాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ) తీసుకొచ్చిన కర్బన ఉద్గారాల తటస్థ పరిశ్రమల (నెట్ జీరో ఇండస్ట్రీ) చట్టం, అమెరికా ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం కింద సీసీఎస్ సాంకేతికతను అవలంబించే పరిశ్రమలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం లభిస్తోంది. ప్రస్తుతం తలపెట్టిన పథకాలు కార్యరూపం ధరిస్తే 2030కల్లా ప్రపంచ సీసీఎస్ సామర్థ్యం ఎనిమిదిరెట్లు పెరుగుతుందని చామర్స్ విశ్వవిద్యాలయ అధ్యయనం అంచనా వేసింది. అయితే, సీసీఎస్ పరిజ్ఞానాన్ని మరింత ఆధునికీకరించాలి.

మనుగడ కష్టం

వాతావరణ మార్పులకు దారితీస్తున్న కర్బన ఉద్గారాలను అరికట్టకపోతే భూమి మీద జీవజాలం మనుగడ కష్టమైపోతుంది. ఇందుకు సీసీఎస్‌తోపాటు మరిన్ని నవీన, సమర్థ మార్గాలను చేపట్టాలి. అడవుల పెంపకం, చిత్తడి నేలల పునరుద్ధరణ, వాతావరణం నుంచి కర్బనాన్ని సంగ్రహించి నేల మీద పంటల సాగుకు ఎరువుగా ఉపయోగించడం వంటి పద్ధతులనూ అన్వేషించాలి. మోటారు వాహనాల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాల పరిహరణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు, శాస్త్రజ్ఞులు, కంపెనీలు చేయీచేయీ కలిపి భూతాపాన్ని అరికట్టడానికి శ్రమించాలి. సీసీఎస్ వంటి సాంకేతికతలు చవకగా లభించేలా కృషిచేయాలి. ఇప్పటికే సమయం మించిపోయిందని గ్రహించి పట్టుదలతో కార్యాచరణకు దిగాలి.



పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, పెరుగుతున్న వాహన వినియోగం తదితరాల వల్ల వాతావరణంలోకి భారీగా కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. మన దేశంలో మొత్తం ఉద్గారాల్లో ఆయా రంగాల వాటా ఎంతంటే.. (శాతాల్లో)

వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, పవర్, భవనాలు


(ఆధారం: క్లైమేట్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్ట్)




హరికృష్ణ నిబానుపూడి
పర్యావరణ విధాన నిపుణులు

ఊపిరికీ గాలికీ మధ్య...

ఆ మంచంమీద ఎందరికో వైద్య పరీక్షలు చేసిన డాక్టరు అతడు. సంక్లిష్టమైన సర్జరీలు చేశాడు. నయమైపోతుందని ధైర్యం చెప్పాడు. అలాంటిది ఉన్నట్లుండి ఓ రోజు తనే ఆ మంచంమీద పడుకోవాల్సి వస్తే... ఏ మందులు వాడినా లాభం ఉండదనీ, తనకి నయమైపోతుందని చెప్పగలవారెవరూ లేరని తెలిస్తే... ఆ వ్యక్తి మనఃస్థితి ఎలా ఉంటుంది? కెరీర్‌లో స్థిరపడి ఇక జీవితానుభవాలన్నింటినీ ఆస్వాదించాల్సిన వయసు... ముప్ఫయ్యారేళ్లకే 'నీకీ భూమ్మీద నూకలు చెల్లాయ'ని మృత్యుదేవత క్యాన్సర్ మహమ్మారి రూపంలో కళ్ల ముందుకు వచ్చి నిలబడింది. మరొకరెవరన్నా అయితే అప్పుడేం చేసేవారో కానీ పాల్ సుధీర్ కళానిధి మాత్రం 'వెన్ బ్రెత్ బికమ్స్ ఎయిర్' అంటూ స్ఫూర్తినిచ్చే పుస్తకం రాశాడు.



'జీవితంలో నెగ్గాలంటే డ్రైవ్ ఉండాలం'టారు బుచ్చిబాబు 'ఆత్మవంచన'లో. ఆ డ్రైవ్ పుష్కలంగా ఉన్న వ్యక్తి డాక్టర్ పాల్ సుధీర్ కళానిధి. తమిళ, తెలుగు మూలాలున్న సుధీర్ పుట్టింది అమెరికాలో. ఆంగ్ల సాహిత్యం, మానవ శరీరశాస్త్రాల్లో పట్టా పుచ్చుకున్నాడు. హిస్టరీ, ఫిలాసఫీల్లో ఎంఫిల్ చేశాడు.



ఇలా విభిన్న సబ్జెక్టుల్ని అధ్యయనం చేశాక జీవితానికి అర్థమేమిటీ అన్న ఆలోచన అతణ్ని మెడిసిన్ వైపు మళ్లించింది. తండ్రిలాగా డాక్టరై కొంతకాలం సమాజానికి సేవచేసి ఆ తర్వాత రచనలు చేస్తూ ప్రశాంతజీవితం గడపాలనుకుని మెడిసిన్‌లో చేరాడు. చదువులో అసాధారణ ప్రతిభ చూపిన అతడికి ఎన్నో అవార్డులూ స్కాలర్‌షిప్పులూ వచ్చాయి. సహవిద్యార్థిని లూసీని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. మనిషి జీవితమంతా మెదడు చెప్పుచేతల్లోనే ఉంటుంది కాబట్టి దాన్ని శోధించాలని న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేశాడు. న్యూరాలజిస్టుగా ఎన్నోరకాల చికిత్సలు చేసి మంచి పేరు తెచ్చుకుంటున్నప్పుడు అనారోగ్యం మొదలైంది. ఎంతకీ అది తగ్గకపోయేసరికి పరీక్షలు చేయించుకుంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ నాలుగో దశ అని తెలిసింది. చికిత్స తీసుకుంటూనే సర్జరీలు కొనసాగించాడు ఆ యువవైద్యుడు. కానీ, రోగం తగ్గినట్లే తగ్గి మళ్లీ విజృంభించడంతో పూర్తిగా పేషెంట్ స్థానానికే పరిమితమవ్వాల్సి వచ్చింది. తన ప్రయాణం ఎక్కడ మొదలై ఎక్కడ ముగియబోతోందీ అన్న ఆలోచన అతణ్ని రచయితను చేసింది. లూసీ సహకారంతో చికిత్స పొందుతూ మరణం దిశగా తన ప్రయాణాన్నీ అనుభవాల్నీ ఆలోచనల్నీ అక్షరబద్ధం చేశాడు. ఇద్దరూ ఇష్టపడి బిడ్డను కన్నారు. ఎనిమిది నెలలు పాపను చూసుకుంటూ పుస్తకం రాస్తూ తన బాధలనుంచి ఉపశమనం పొందేవాడు. 'వెన్ బ్రెత్ బికమ్స్ ఎయిర్' పుస్తకంతోపాటు 'సర్జన్‌గా నా చివరి రోజులు', 'ఇంకా ఎంతకాలం బతుకుతాను' లాంటి వ్యాసాలు రాసి క్యాన్సర్ బయటపడిన రెండేళ్లలోపే తుదిశ్వాస విడిచాడు పాల్.

అతడి మరణానంతరం లూసీ పూర్తిచేసి ప్రచురించిన ఈ పుస్తకం ఎన్నో అవార్డులు అందుకుంది. పులిట్జర్ ప్రైజ్ ఫైనల్ లిస్టులోకి వెళ్లింది. పలుభాషల్లోకి అనువాదమైంది. సాహిత్యమూ వైద్యమూ రెండింటిలోనూ ప్రావీణ్యంగల పాల్ మరణంతో తన ప్రయాణాన్ని వర్ణించిన విధానం పాఠకుల హృదయాల్ని కదిలిస్తుంది. జీవితం పట్ల ప్రేమను పెంచుతుంది.

– మిహిర



ఆగని అఘాయిత్యాలు


ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెబుతున్నా, కఠిన చట్టాలు తెస్తున్నా ఇండియాలో స్త్రీలపై అకృత్యాలు ఆగడం లేదు. ఇంటా బయటా వారిపై దాష్టీకాలు పెరుగుతున్నాయి. 2014-2022 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి నమోదైన కేసులు...

2014	3,39,457
2015	3,29,243
2016	3,38,954
2017	3,59,849
2018	3,78,236
2019	4,05,326
2020	3,71,503
2021	4,28,278
2022	4,45,256

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

సమాచారానికి సంకెళ్లు

రాజ్యాంగం అంటే గౌరవం లేదు... చట్టాలంటే భయం లేదు... జనమంటే లెక్కే లేదు... ఇక రాజకీయ నాయకులు దేనికి దడుస్తారు? పైకి నీతులు చెబుతూ వెనక గోతులు తీయడంలో ఆరితేరిపోయిన ప్రబుద్ధ నేతాగణాలను భయపెట్టగలిగినవి ప్రశ్నలు మాత్రమే! అధికారిక రహస్యాల ముసుగులో తమ అవినీతి అక్రమాలను కప్పెట్టి ఉంచుతారు కాబట్టి నిజాలు చెప్పడానికి నాయకులు వణికిపోతారు. వాస్తవాలేంటో తెలుసుకోవడానికి ప్రశ్నించేవారిని చూసి కంపరమెత్తిపోతారు. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును ప్రజల చేతుల్లో పెట్టిన సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని చూసి చిందులు తొక్కుతుంటారు. సర్కారీ దస్త్రాల్లోని కీలక సమాచారమేదీ బయటికి రాకుండా పన్నాగాలెన్నో పన్నుతుంటారు. 2005లో ఆర్టీఐ చట్టం ప్రాణం పోసుకున్నప్పటి నుంచి దాని జవజీవాలను హరించడానికి పాలకులు, అధికారులు చేయని ప్రయత్నాల్లేవు. ఆర్టీఐ అమలుకు మొండికేసే సర్కారీ సిబ్బందిని దారిలో పెట్టాల్సిన సమాచార కమిషన్లను ఉత్సవ విగ్రహాలుగా మిగల్చడం ద్వారా ప్రభుత్వాలు ఇప్పటికే తామనుకున్నది సాధించాయి!



పుణ్యభూమి

ప్రభుత్వాలేం చేస్తున్నాయో తెలుసుకోవడం, వాటి విధాన నిర్ణయాల వెనక కారణాలను కనుక్కోవడం, సర్కారీ ఖజానా జమాఖర్చులపై అవగాహన కలిగిఉండటం- ప్రజల హక్కు. దాన్ని పరిరక్షించడం- ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక లక్షణం. "పాలనాపగ్గాలు చేతులు మారినంత మాత్రాన మనకు స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదు. అధికార దుర్వినియోగాన్ని ఎదిరించగలిగిన శక్తిసామర్థ్యాలను ప్రజలందరూ సంపాదించుకోగలిగిన నాడే మనకు నిజమైన స్వరాజ్యం సిద్ధిస్తుంది" అన్న గాంధీజీ మాటల్లోని అంతరార్థమేంటి? పాలకులను ధైర్యంగా ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి... ప్రశ్నలకు వెన్నుచూపకుండా, ప్రశ్నించేవారిపై కత్తిదూయకుండా నిజానిజాలను ప్రభుత్వాలు ప్రజానీకంతో పంచుకోవాలి. స్వతంత్ర భారతంలో ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణం పాదుకొనాలన్నది బాపూజీ ఆకాంక్ష! అందుకు అవకాశం కల్పించేది సమాచార హక్కు. 19(1)(ఏ), 21వ రాజ్యాంగ అధికరణలు హామీఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ, జీవించే హక్కులలో ఆర్టీఐ అంతర్భాగమన్నది సుప్రీంకోర్టు గత నిర్దేశం. మొన్న ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని కొట్టేస్తూ 'సుప్రీం' ఇదే మాటను పునరుద్ఘాటించింది. పాలనలో ప్రజాభాగస్వామ్యాన్ని పెంచే సమాచారాన్ని పౌరులకు అందించాల్సిందేనని ఆదేశించింది. కానీ, ప్రభుత్వాలేమో సమాచార కమిషనర్లను సకాలంలో నియమించకుండా, ఒకవేళ నియామకాలు జరిపినా సమర్థులకు అవకాశాలివ్వకుండా ఆర్టీఐనే మొత్తంగా చాపచుట్టేస్తున్నాయి!

స.హ.చట్టం కింద కోరిన వివరాలను 30 రోజుల్లోగా అందించాలన్నది నిబంధన. పీఐవోలు (ప్రజా సమాచార అధికారులు) కనుక ఆ గడువులోగా స్పందించకపోతే దరఖాస్తుదారులు మొదటి అప్పీలు చేయవచ్చు. అక్కడా ఫలితం లేకపోతే- దరఖాస్తుదారులకు ఇక ఇన్ఫర్మేషన్ కమిషన్లే దిక్కు. తమకు వచ్చే రెండో అప్పీళ్లు, ఫిర్యాదులను విచారించి దరఖాస్తుదారులకు సమాచారం ఇప్పించడం... చట్టాన్ని అతిక్రమించిన అధికారులకు జరిమానాలు విధించడం కమిషన్ల విధి. ఆ బాధ్యతలను అవి ఎంత చక్కగా నిర్వర్తిస్తున్నాయో చెప్పాలంటే- కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది. తెలంగాణ, ఝార్ఖండ్, త్రిపుర, గోవాలలో సమాచార కమిషన్లు అసలు పనిచేయడమే లేదు. కమిషనర్ల పోస్టులు ఖాళీ అయ్యి నెలలూ సంవత్సరాలు గడిచిపోతున్నా అక్కడి ప్రభుత్వాలు నియామకాలు జరపట్లేదు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్, ఒడిశాలలో ప్రధాన సమాచార కమిషనర్లు లేరు. పది మంది వరకు కమిషనర్లను నియమించే వీలున్నా సరే, ప్రభుత్వాలు ఆ మేరకు పోస్టులను భర్తీ చేయడం లేదు. కేంద్ర సమాచార కమిషన్‌లో ముగ్గురు పనిచేస్తుంటే- పశ్చిమ్‌బెంగాల్‌లో ఇద్దరంటే ఇద్దరే విధులు నిర్వర్తిస్తున్నారు. తమిళనాడు, బిహార్... ఇంకా అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి! కమిషనర్లు తగినంత మంది లేకపోవడం, ఉన్నవారు కూడా వేగంగా విచారణలు చేయకపోవడంతో కేసుల పెండింగ్ పెరిగిపోతోంది. సతర్క్ నాగరిక్ సంఘటన్ సంస్థ తాజా అధ్యయనం ప్రకారం- దేశవ్యాప్తంగా 29 సమాచార కమిషన్లలో మొన్న జూన్ 30వ తేదీ నాటికి 4.05 లక్షల రెండో అప్పీళ్లు, ఫిర్యాదులు అపరిష్కృతంగా మూలుగుతున్నాయి. ఒక్క మహారాష్ట్రలోనే అటువంటి వాటి సంఖ్య లక్ష దాటింది. కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా రాష్ట్ర కమిషన్లతో పాటు సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్‌లో 20-50వేల మధ్యలో అప్పీళ్లు, ఫిర్యాదులు మోక్షంకోసం ఎదురుచూస్తున్నాయి. ఏపీలో 10,809 కేసులు పెండింగ్‌లో ఉంటే- తెలంగాణలో అటువంటివి 14,162గా లెక్కతేలుతున్నాయి. వీటిపై విచారణ పూర్తయ్యేలోగా పుణ్యకాలం గడచిపోతోంది. ఈలోపు కొత్తగా దాఖలయ్యే అప్పీళ్లూ ఫిర్యాదుల సంగతేంటో ఏలినవారికే తెలియాలి!

స.హ.చట్టాన్ని ఖాతరుచేయని అధికారులపై కమిషన్లు జరిమానాల కొరడా ఝళిపించట్లేదు. మూడుశాతం కేసుల్లోనే అవి జరిమానాలకు ఆదేశిస్తున్నాయంటే- అధికార యంత్రాంగం పట్ల వాటి అవ్యాజ ప్రేమానురాగాల గాఢతను అర్థం చేసుకోవచ్చు. కంచే చేను మేసినట్లు కమిషన్లే చట్టాన్నెందుకు నాశనం చేస్తున్నాయి అంటే... అక్కడే ఉంది సర్కారీ కుట్ర! విశ్రాంత అధికారులు, సొంత పార్టీ అభిమానులనే ప్రభుత్వాలు ఎక్కువగా కమిషనర్లుగా కొలువుతీరుస్తున్నాయి. అలాంటి వాళ్లందరూ కలిసి స.హ.చట్టానికి సమాధి కడుతున్నారు. సర్కారీ సమాచారం బయటికి రాకూడదన్న నేతల అభిమతాలను అలా నెరవేర్చుతున్నారు. భిన్న రంగాలకు చెందిన సమర్థులు, సచ్ఛీలురు, రాజకీయంగా తటస్థులైన వారిని సమాచార కమిషనర్లుగా నియమిస్తేనే ఆర్టీఐ మనగలుగుతుంది. అందుకు ప్రభుత్వాలు సిద్ధం కాకపోతే- మనది మేడిపండు ప్రజాస్వామ్యమన్న దుష్కీర్తి అలాగే మిగిలిపోతుంది!

– శైలేష్ నిమ్మగడ్డ

మ్యాజిక్‌తో దోస్తీ!

హాయ్! బుజ్జీ!!

హాయ్ నేస్తాలూ! ఒక్క సెలవు వస్తే.. చాలు అమ్మానాన్నలను బయటికి తీసుకెళ్లమని మారాం చేసేస్తాం. నచ్చిన ఆటలు ఆడుకుంటూ సరదాగా గడిపేస్తాం. కొన్నిసార్లు అబ్బురపరిచే మ్యాజిక్ షోలు చూడటానికి కూడా ఇష్టపడతాం. కానీ అవే కార్యక్రమాలు మన లాంటి పిల్లలు చేస్తే? అందులో రికార్డులు సాధిస్తే ఎలా ఉంటుంది. ఇప్పుడు ఆ విషయాలే తెలుసుకుందాం!



ఐర్లాండ్‌కు చెందిన సిల్లియన్ ఓ కొనోర్‌కు ప్రస్తుతం పదిహేను సంవత్సరాలు. తన వయసు పిల్లలంతా.. ర్యాంకులంటూ పుస్తకాలతో కుస్తీ పడుతుంటే తను మాత్రం.. మ్యాజిక్‌తో దోస్తీ చేస్తూ చదువునూ కొనసాగిస్తున్నాడు. మన సిల్లియన్ తన మ్యాజిక్‌లతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. తనకు ఏడేళ్ల వయసున్నప్పుడు వాళ్ల మావయ్య దగ్గర.. మ్యాజిక్ నేర్చుకోవడం ప్రారంభించాడట. ఒక నిమిషంలో 28 రకాల మ్యాజిక్ ట్రిక్స్ చేసి.. ఔరా అనిపించాడు. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోనూ స్థానం సంపాదించాడు. ఈ మధ్య ఇలా చాలామంది రికార్డులు సాధిస్తున్నారు. అందులో పెద్ద విశేషం ఏముంది అనుకుంటే పొరపాటే! సిల్లియన్ ఆటిజంతో బాధపడుతున్నాడు. అయినా కూడా ఎక్కడా తగ్గకుండా అటు చదువు.. ఇటు మ్యాజిక్ రెండింటిలోనూ ఉన్నత ప్రతిభ చూపిస్తున్నాడు. నిజంగానే మనలో కష్టపడాలనే ఆలోచన ఉంటే.. ఏదీ అడ్డుకాదని నిరూపిస్తున్నాడు.

'నేను యూట్యూబ్ స్టార్ ఇస్సీని ఎక్కువగా ఫాలో అవుతాను. తన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. భవిష్యత్తులో నేను కూడా మిగతా పిల్లలకు ఆదర్శంగా నిలవాలనేదే నా లక్ష్యం' అంటున్నాడు సిల్లియన్. ★

రాయగలరా?

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. ఖాళీ గడుల్లో సరైన పదాలను నింపగలరా?

1. కుక్కతోక పట్టుకొని ☐☐☐ ఈదినట్లు.
2. మూలిగే ☐☐ మీద తాటికాయ పడినట్లు.
3. నవ్వు ☐☐☐ విధాల చేటు.
4. కూర్చున్న ☐☐ నరుక్కున్నట్లు.
5. అప్పు చేసి.. ☐☐ కూడు.

భద్రమైన కారే కొంటున్నారా?



డ్రైవర్‌కు మార్గదర్శి.. అడాస్



డ్రైవర్లు సురక్షితంగా వాహనాన్ని నడపడానికి, మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాల్ని నిరోధించడానికి.. రాడార్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, సెన్సర్లు, కెమెరాలతో కూడిన అడాస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్) దోహదపడుతుంది. ఇది ప్రమాదాన్ని ముందే గుర్తించి, స్వయంచాలితంగా బ్రేక్‌లు వేస్తుంది. డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. ఇందులోని కెమెరా, సెన్సర్, రాడార్, లేజర్, జీపీఎస్ వ్యవస్థలు ముందున్న రహదారిలో అడ్డంకుల్ని గుర్తించి, తక్షణమే అప్రమత్తమై వాహన వేగాన్ని తగ్గిస్తాయి. అంటే ప్రమాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రమాదాలను గుర్తించడం, హెచ్చరికలు జారీ చేయడం, స్వయంచాలక బ్రేకింగ్ వ్యవస్థల నిర్వహణకు కావాల్సిన సెన్సర్లు, కెమెరాలు ఇందులో ఉంటాయి. పాదచారుల్ని గుర్తించి బ్రేక్ ఉపయోగిస్తుంది. లైన్ నుంచి పక్కకు వెళ్తే హెచ్చరిస్తుంది. కన్పించని వైపు నుంచి వచ్చే ప్రమాదాల్ని (బ్లైండ్ స్పాట్) గుర్తించి అప్రమత్తమవుతుంది. పార్కింగ్‌లోనూ సహాయ పడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా విక్రయించే వాహనాల్లో 90% వరకు అడాస్ కలిగి ఉంటాయని అంచనా.

అప్రమత్తం చేసే బ్రేకింగ్ వ్యవస్థ



- బ్రేక్ అసిస్ట్ సిస్టమ్ (బీఏఎస్) అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని నిలపడానికి, దూరాన్ని తగ్గించడానికి ఉపకరిస్తుంది. డ్రైవర్ బ్రేక్ వేయగానే పెడల్‌పై పడే ఒత్తిడిని బట్టి ఎమర్జెన్సీని గుర్తిస్తుంది. ఏబీఎస్‌కు ముందే ఇది అప్రమత్తమవుతుంది. ఇందులో మెకానికల్, ఎలక్ట్రానిక్ అనే రెండు రకాలుంటాయి.
- యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్): బ్రేక్ వేసినప్పుడు టైర్ లాక్ కాకుండా నియంత్రించేందుకు, ఆపే దూరాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది.
- ఈబీడీ (ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్): ఒత్తిడిని ప్రతి చక్రానికీ వర్తింపజేస్తూ బ్రేకింగ్ ఫోర్స్‌ను నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది. ఏబీఎస్‌తో కలిసి పని చేస్తుంది.
- ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ): వేగంలో స్థిరత్వం కల్పిస్తుంది. హఠాత్తుగా బ్రేక్ వేసినప్పుడు కారు పల్టీ కొట్టకుండా, పక్కనున్న వాహనాలను ఢీకొట్టకుండా (సైడ్ క్రాష్) దోహదపడుతుంది.

ఎక్కువ ఎయిర్ బ్యాగ్స్.. ఎంతో రక్షణ



ముందు, పక్క, వెనక వైపు నుంచి వాహనాలు ఢీకొన్నప్పుడు మిల్లీ సెకన్లలోనే ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకొని ప్రయాణికుల తల, ఛాతీ, మెడ భాగాలపై ఒత్తిడి పడకుండా, తీవ్ర గాయాల నుంచి రక్షణనిస్తాయి. కొన్ని కార్ల తయారీ సంస్థలు ముందు, వెనక కూర్చున్న వారికి రక్షణ కల్పించేలా సైడ్, కర్టెన్ ఎయిర్‌బ్యాగ్స్‌ను 2, 4, 6 చొప్పున అమర్చుతున్నాయి. ఢీకొట్టే వేగం, దిశను బట్టి అధునాతన సెన్సర్లు, ఇన్‌ఫ్లేషన్ మెకానిజం (గ్యాస్ విడుదల), క్రాష్ సెన్సర్లు, ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ), వైరింగ్, కనెక్టర్లు ప్రభావవంతంగా పనిచేసి ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకునేలా చేస్తాయి. ఎయిర్‌బ్యాగ్ విచ్చుకోవాలంటే, ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించాలి. సరైన పొజిషన్‌లో కూర్చోవాలి. నిర్దిష్ట బరువు కలిగి ఉండాలి. 50 కిలోల బరువున్న వ్యక్తి కూర్చునే సీట్లో 5 కిలోల బరువున్న చిన్నారిని కూర్చోబెడితే తెరుచుకోకపోవచ్చు. ఎయిర్‌బ్యాగ్ ఒకసారి తెరుచుకుంటే, మళ్లీ కొత్తవి అమర్చుకోవాల్సిందే. మోడళ్లకు అనుగుణంగా ఇవి రూ.లక్షల్లో ఉంటాయి. కొన్ని బీమా సంస్థలు రీప్లేస్‌మెంట్ ఛార్జీలు భరిస్తుంటాయి. ఐఎస్ఓఎఫ్ఐఎక్స్ చైల్డ్ సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని గమనించాలి.

టైర్లలో గాలి ఒత్తిడి ఎంతుంది?



కారు టైర్లలో గాలి పీడనంతో పాటు ప్రయాణించే ప్రదేశాల్లోని పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలి. భద్రతా కారణాల దృష్ట్యా టైర్ ట్రెడ్ లోతు కనీసం 3 మి.మీ ఉండాలి. కొత్త టైర్లు సాధారణంగా 8-9 మి.మీ. లోతు ఉంటాయి. నాణేన్ని ట్రెడ్‌లో ఉంచి లోతు తెలుసుకోవచ్చు. ట్రెడ్ గేజ్ తెలుసుకునే పరికరాలూ అందుబాటులో ఉన్నాయి.

టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టీపీఎంఎస్): ఎప్పటికప్పుడు టైర్లపై ఒత్తిడిని గమనిస్తూ డ్రైవర్‌ను అప్రమత్తం చేసే విధానమిది. కొన్ని కార్లలో డ్యాష్ బోర్డులోనే టైర్లలోని పీడన స్థితి కన్పిస్తుంది.


ట్రాక్షన్ కంట్రోల్: తడి, మంచుతో నిండిన రహదారులు టైర్ల పట్టును తగ్గిస్తాయి. ప్రతి చక్రం వేగాన్ని పర్యవేక్షించడానికి, చక్రాలు జారకుండా నిరోధించడానికి ఇది సహాయపడుతుంది.

హిల్ హోల్డ్ అసిస్ట్: ఏటవాలు ప్రాంతాల్లో వాహనం వెనక్కి జారకుండా, నియంత్రణకు ఉపయోగపడుతుంది.

ఫాటీగ్యూ మానిటరింగ్: డ్రైవర్ అలసటకు గురైనా, పరధ్యానంలో నడుపుతున్నా అప్రమత్తం చేస్తుంది.

క్రూయిజ్ కంట్రోల్ సిస్టమ్: యాక్సిలరేటర్ నొక్కకుండా స్థిరమైన వేగాన్ని నిర్వహించే విధానం.

చెదిరిన జీవితాలకు చేయూతనిస్తున్నారు..



జాస్తి సరోజినీదేవి (కీ.శే.జాస్తి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం), హైదరాబాద్
విరాళం: రూ.1,00,000

దర్జాగా జీవించిన కుటుంబాలను భారీ వరద భయపెట్టింది. నిలువ నీడ లేకుండా చేసింది. అడుగు తీసి అడుగు వేయలేని దిక్కుతోచని స్థితిలో బాధితులు చిక్కుకుపోయారు. వారు చెమటోడ్చి కూడబెట్టిన ఆహార గింజలు, నిత్యావసరాలు కొట్టుకుపోయాయి. పొట్టచేత పట్టుకుని బయటపడ్డ నిర్వాసితులను ఆదుకునేందుకు మానవతామూర్తులు ముందుకొస్తున్నారు. విరివిగా విరాళాలు అందజేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయ నిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
లంకిపల్లి భాస్కరనాయుడు, శాఖంవారిపల్లె, అన్నమయ్య జిల్లా	10,116
చలసాని రామబ్రహ్మం, శ్రీదేవి, హైదరాబాద్	10,000
డి.సరస్వతి, డి.గంగాధర్, సికింద్రాబాద్	6,000
అక్కినేని కృష్ణప్రసాద్, అక్కినేని అన్నపూర్ణాదేవి, సికింద్రాబాద్	5,225
కొడాలి పద్మజ, హైదరాబాద్	5,021
యానాపు రవికుమార్ (కీ.శే.యానాపు పాండురంగాచారి, కీ.శే.అనసూయమ్మ గార్ల జ్ఞాపకార్థం), హైదరాబాద్	5,001
మంగెన రాధాకృష్ణమూర్తి, లక్కవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	5,000
బచ్చిన రాజేశ్వరి, హిందూపురం	5,000

ఆపద సమయం.. అండగా నిలుద్దాం

గమనిక: వరద విపత్తులో చిక్కుకుని.. సర్వం కోల్పోయి విలవిల్లాడుతున్న అభాగ్యులను ఆదుకునేందుకు ఈనాడు వరద సహాయ నిధి ఇచ్చిన పిలుపునకు ఎంతోమంది మానవత్వంతో ఉదారంగా స్పందించారు, స్పందిస్తున్నారు. విరాళాలు అందించిన వారి పేర్లను నిత్యం పత్రికలో ప్రచురిస్తున్నాం. అయితే కొందరు విరాళాలను బ్యాంకు ఖాతాకు జమ చేసి కూడా తమ పాన్ నంబరు, చిరునామా వివరాలను మాకు పంపలేదు. ఇటువంటి వారందరూ సత్వరమే తమ 1. పేరు, 2. పాన్ నంబరు. 3. చిరునామా వివరాలను మా 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపిస్తే వారి పేర్లను ప్రచురించగలము.

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

తప్పుడు ఆరోపణలు చేస్తే మీపైనా చర్యలుంటాయి

జగన్‌ను హెచ్చరించిన మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: వరద బాధితులకు ప్రభుత్వం అందించిన సహాయ చర్యలపై తప్పుడు ఆరోపణలు చేస్తే మాజీ సీఎం జగన్‌పైనా చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. వరద బాధితుల భోజనాలకు రూ.57.22 కోట్లు ఖర్చయినట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే.. జగన్ దాన్ని రూ.368 కోట్లుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'ఫేక్ ఆరోపణలు చేస్తే సాక్షి పత్రిక పైనే కాదు.. మీ మీదా చర్యలుంటాయి. ప్రజల సొమ్ముతో తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ఇనుప కంచె వేసుకొని నిద్ర పోయే మీకు.. వరద బాధితులకు ఏ భోజనం, ఎక్కడ పెట్టాం.. సహాయ శిబిరాలు ఎక్కడ ఏర్పాటు చేశామనేది ఎలా తెలుస్తుంది' అని మండిపడ్డారు.

రాష్ట్ర వృద్ధి పథంలో డ్రోన్ సమిట్ కొత్త అధ్యాయం

కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: ఏపీ వృద్ధి పథంలో డ్రోన్ సమిట్ కొత్త అధ్యాయంగా మారనుందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న డ్రోన్‌సమిట్‌లో పాలుపంచుకోవడానికి తాను ఉత్సుకతతో ఎదురు చూస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'సీఎం చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం కొత్త అధ్యాయం లిఖిస్తోంది. నవకల్పనల రంగంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండాలని, భవిష్యత్తుకు కొత్త కొలమానాలను నిర్దేశించాలని ఆశిస్తున్నా' అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

ఉన్నతాధికారి వేధింపులపై రైల్వే ఉద్యోగిని ఫిర్యాదు

జీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ పురందేశ్వరి

ఈనాడు, విజయవాడ: విజయవాడ డీఆర్ఎం కార్యాలయంలో పని చేస్తున్న ఓ సీనియర్ పర్సనల్ అధికారి తనను వేధిస్తున్నారంటూ అదే కార్యాలయంలోని ఓ మహిళా ఉద్యోగి నేరుగా రైల్వే మంత్రికి, జీఎంకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కార్యాలయ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బాధిత ఉద్యోగిని ఫిర్యాదును కార్మిక సంఘ నాయకులు శనివారం మీడియాకు విడుదల చేశారు. 'విజయవాడ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి (సీనియర్ డీపీవో) కట్టా ఆనంద్ నన్ను పలు రకాలుగా వేధిస్తున్నారు. ఈ నెల 14న విధుల్లో భాగంగా మరో కార్యాలయంలో ఉండగా సహాయ పర్సనల్ అధికారి పి.శ్రీనాథ్‌తో నా ఫొటోలు తీయించారు. తర్వాత అకారణంగా నన్ను బాపట్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇదే అధికారి నన్ను లైంగికంగా వేధించారు. అప్పట్లో ఫిర్యాదు చేయడంతో ఆయన్ను బదిలీ చేశారు. ఆ అధికారి ప్రజాప్రతినిధి అయిన తన బంధువు సాయంతో బదిలీని రద్దు చేసుకొని ఇక్కడే కొనసాగుతూ నాపై కక్ష సాధిస్తున్నారు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు శనివారం కార్మిక సంఘ నాయకులతో కలిసి భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే రైల్వే జీఎంతో మాట్లాడి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.



ప్రేరణ కన్నా క్రమశిక్షణే ముఖ్యం

ఇతరుల నుంచి గానీ లేదా దక్కబోయే ప్రతిఫలం నుంచి గానీ ప్రేరణ పొంది ఓ పని చేస్తున్నారంటే దాన్ని ఎప్పటికీ పూర్తి చేయలేరు. ఎందుకంటే ప్రేరణ తాత్కాలికంగానే ప్రభావం చూపుతుంది. ఓ పనిని క్రమశిక్షణతో చేసినప్పుడు మాత్రమే దాన్ని పూర్తి చేయగలం. ఎన్ని అవాంతరాలెదురైనా, పని చేయాలన్న ఉత్సాహం ఉన్నా, లేకపోయినా, గడువులోపు పూర్తి చేయాలన్న మొండి పట్టుదల ఉంటేనే మనం లక్ష్యానికి చేరుకోగలం.

– జ్యూన్ లీ, బ్రాండ్ స్ట్రాటజిస్ట్

ప్రాంతీయ గ్రంథాలయాల వ్యవస్థ బలోపేతం

- విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్
- విశాఖలోని నెహ్రూబజార్ ప్రాంతీయ గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

విశాఖపట్నం (అక్కయ్యపాలెం), న్యూస్‌టుడే: విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి దేశంలోనే బెస్ట్ మోడల్‌ను అధ్యయనం చేసి, రాష్ట్రంలో ప్రాంతీయ గ్రంథాలయాల వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరగ్రంథాలయాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని నిర్ణయించారు. విశాఖ నగరంలోని దొండపర్తి సమీప నెహ్రూబజార్ వద్దనున్న ప్రాంతీయ గ్రంథాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను లోకేశ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఉదయం గ్రంథాలయానికి వెళ్లేసరికి అప్పటికీ తెరుచుకోకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 8.45 గంటలకు తెరవాల్సిన గ్రంథాలయం 9.45 గంటలు కావస్తున్నా ఇంకా తెరుచుకోలేదని మండిపడ్డారు. గ్రంథాలయం భవనం కిందనున్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం గదిని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. ఏబీసీడీలు, రైమ్స్ వచ్చా అని అడగ్గా వారు ఆడుతూ పాడుతూ సమాధానాలు చెప్పారు. చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టి, వారితో కలిసి ఫొటోలు దిగారు. గుడ్లు, పోషకాహారం సరఫరాపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. లోకేశ్ వెంట ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ విద్యార్థులతో మంత్రి నారా లోకేశ్

పేదల ముసుగులో వైకాపా నేతల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా అధికారులు ఎసైన్డ్ భూముల లబ్ధిదారులను ర్యాండమ్‌గా పరిశీలన చేయగా.. సుమారు 10 వేల మంది అనర్హులున్నట్లు గుర్తించారు. వారికి కేటాయించిన 13,081 ఎకరాల భూముల విలువ సుమారు రూ. 1,000 కోట్లు ఉంటుంది. ప్రధానంగా రాయలసీమలో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆరు దశల వడపోత ద్వారా కాకుండా.. వైకాపా నేతలు సిఫార్సు చేసిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. జాబితాలను సైతం ఇష్టారాజ్యంగా మార్చేశారు. వైఎస్సార్ జిల్లాలో 3,357 మంది లబ్ధిదారులకు 5,796 ఎకరాలు, కర్నూలులో 856 మందికి 1145, అనంతపురం జిల్లాలో 3,471 మందికి 5,554, అన్నమయ్య జిల్లాలో 85 మందికి 103.15, నంద్యాల జిల్లాలో 318 మందికి 483 ఎకరాలు, ఇతరచోట్ల కలిపి సుమారు 10 వేల మంది అనర్హులకు ఎసైన్డ్ భూములను కట్టబెట్టారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో ఈ దందా ఎక్కువగా సాగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని రాగినిపల్లెలో అక్రమంగా 973 మంది వైకాపా సానుభూతిపరులకు నిబంధనలకు విరుద్ధంగా రైత్వారీ పట్టాలు మంజూరు చేశారు.

పేదల పేరుతో వయవంచన

వైకాపా పాలనలో పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో వినియోగానికి వీల్లేని.. గ్రామాలకు దూరంగా ఉన్న భూములను అధిక ధరలు పెట్టి కొనుగోలు చేశారు. ఆ పట్టాలను స్వీకరించేందుకు చాలాచోట్ల లబ్ధిదారులు నిరాకరించారు. అప్పట్లో ప్రభుత్వం భూములను కొనుగోలు చేస్తుందన్న విషయాన్ని ముందుగానే పసిగట్టిన వైకాపా నేతలు తమ బినామీల ద్వారా తక్కువ ధరకు స్థలాలను కొనుగోలు చేయించారు. తరువాత వాటిని ఎక్కువ ధరకు సర్కారుకు అమ్మారు. ఈ క్రమంలో ఎవరైనా భూ యజమానులు తాము చెప్పిన దానికన్నా.. తక్కువ ధరకు విక్రయించేందుకు అధికారులకు సమ్మతిని తెలియచేస్తే ఊరుకునేది లేదని బెదిరించారు. మరోవైపు నివాస స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో సుమారు 20% మంది ఇప్పటికే అనధికారికంగా వాటిని అమ్ముకున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలో అప్పటి ఎమ్మెల్యే స్థానికంగా అర్హులైన వారికి నివాస స్థలాలు అందకుండా చేశారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో ప్రాథమికంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లు తొలగించి, వారి స్థానంలో వైకాపా సానుభూతిపరులను చేర్చారు.

అనువు కానిచోట్ల కొనిపించారు..

- తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడి, కాపవరం గ్రామాల్లో 361.105 ఎకరాలను వైకాపా ప్రభుత్వం రూ.162.49 కోట్లకు కొనుగోలు చేసింది. వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసేలా వైకాపా నేతలు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. తీరా ఆ భూమి నివాసానికి అనువుగా లేకపోవడంతో ఇక్కడ పట్టాలు పొందిన సుమారు 15,109 మంది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.
- నెల్లూరు జిల్లా అనుమసముద్రం పేట, నందవరం, గురివిందపూడి, కోడూరు, టీపీ గూడూరు, నెమళ్లదిన్నె ఇతరచోట్ల అందజేసిన ఇళ్ల స్థలాల్లో చదును పనులకు రూ.34.73 కోట్లు విడుదల చేశారు. తీరా అవి శ్మశానాలు, అడవులకు దగ్గరగా ఉన్నాయంటూ లబ్ధిదారులు వాటిలో ఇళ్లు కట్టుకోవడానికి విముఖత చూపుతున్నారు.
- కాకినాడ జిల్లా సూర్యారావుపేటలో 101.16 ఎకరాల పోర్టు భూమిని ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఆయా భూములను కాకినాడ కార్పొరేషన్‌కు అప్పగించేలా అప్పటి ఎమ్మెల్యే క్రియాశీలకంగా వ్యవహరించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం హైకోర్టు, ఎన్జీటీలో ఉంది.

రూ.5 లక్షలకు కొని.. రూ.13.5 లక్షలకు విక్రయం

గత ప్రభుత్వం చేపట్టిన భూముల సమీకరణలో వైకాపా నేతలు రెండు చేతులా సంపాదించారు. తాము చెప్పినచోట మాత్రమే కొనుగోలు చేయాలని రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. ఇలా భూ యజమానుల కంటే వైకాపా నాయకులే ఎక్కువ లబ్ధి పొందారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోనిలో అప్పటి మాజీ ఎమ్మెల్యే బినామీ స్థలాల యజమానుల నుంచి రూ.5 లక్షలకు ఎకరా చొప్పున కొనుగోలు చేశారు. వాటిని తిరిగి ఎకరా రూ.13.5 లక్షలకు విక్రయించారు. ఏపీఐఐసీ ద్వారా నష్టపరిహారం చెల్లింపుల్లో తమవారి పేర్లను చేర్చాలని ఒత్తిడి తేగా, అందుకు ఒప్పుకోని ఉమ్మడి కృష్ణా జిల్లా బాపులపాడు మండల తహసీల్దారును బదిలీ చేయించారు.

అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా జిల్లాలతోపాటు ఇతరచోట్ల రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండింతలు అధికంగా ధరలు పెట్టి భూములను కొనుగోలు చేయించడం గమనార్హం.

వైకాపా నేత చిత్రహింసలు పెట్టారు

- పోలీసులు ఆలౌట్ తాగించి నరకం చూపించారు
- నూజివీడుకు చెందిన ఓ మహిళ ఆరోపణ


ఈనాడు, ఏలూరు: పోలీసుల సాయంతో తనను ఏలూరు జిల్లా నూజివీడు మండల వైకాపా నేత యోగేశ్వరరావు చిత్రహింసలు పెట్టారని, తప్పుడు కేసులు బనాయించి నరకం చూపించారని ప్రభావతి అనే మహిళ వాపోయారు. తాను బ్యాంకు మేనేజర్‌గా సమాజంలో గౌరవప్రదంగా కొనసాగిందీ గమనించకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఈ కేసుల నేపథ్యంలో తాను ఉద్యోగం నుంచి సస్పెండ్ కూడా అయ్యానని తెలిపారు. ఆమె ఆవేదన చెందిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వీడియోలో ఆమె తెలిపిన వివరాల ప్రకారం. . నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన ప్రభావతి ఒంటరి మహిళ. సమీప గ్రామమైన సీతారామపురానికి చెందిన యోగేశ్వరరావుతో చిన్నతనం నుంచి స్నేహంగా ఉండేవారు. ఆమె ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని లొంగదీసుకోవాలని యోగేశ్వరరావు ప్రయత్నించారు. ఆమె ఒప్పుకోకపోవడంతో రాజకీయ అండను అడ్డుపెట్టుకుని పైశాచికంగా వ్యవహరించారు. ఆమె సేవలందించే బ్యాంకు వద్దకు వెళ్లి మాట్లాడకపోతే విషం తాగి చస్తానని బెదిరించారు. అప్పటికీ వినకపోవడంతో అడ్డగోలుగా ఆమెపై ఫిర్యాదుచేసి ఆరు తప్పుడు కేసులు బనాయించేలా చూశారు. రౌడీషీట్ తెరిపించారు. గత ఎన్నికలకు ముందు ఆమెను అరెస్టు చేయించి ఒకటిన్నర రోజులపాటు పెనమలూరులో పోలీసులతో చిత్రహింసలు పెట్టించారు. 'యోగేశ్వరరావు అడిగిన దానికి ఒప్పుకోవాలని పోలీసులు ఆలౌట్ తాగించి హింసించారు. వైకాపా అధికారంలో ఉండటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నా వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ప్రభుత్వం మారిందన్న ధైర్యంతో ముందుకు వచ్చా..' అని ఆమె వివరించారు. న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్‌కు విన్నపాలనిచ్చినట్లు తెలిపారు.

కర్ణాటకలో నరబలి?

మైసూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం నంజనగూడుకు సమీపంలోని హుల్లహళ్లి గ్రామంలో సదాశివ (54) అనే భవన నిర్మాణ కార్మికుడు దారుణహత్యకు గురయ్యాడు. అతణ్ని అపహరించుకుని వెళ్లిన దుండగులు ఒక పొలం గట్టున గొంతు కోసి- నరబలి ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహం వద్ద తమలపాకులు, పసుపు-కుంకుమ, కొబ్బరికాయలు, క్షుద్రపూజల్లో ఉపయోగించే వస్తువులతో పూజలు చేశారు. సదాశివ మృతదేహాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని నంజనగూడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానిక డీఎస్పీ రఘు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ పేలి ఇద్దరు జవాన్ల మృతి

మృతుల్లో ఒకరు వైఎస్సార్ జిల్లా వాసి



కె.రాజేష్

దుమ్ముగూడెం, బ్రహ్మంగారి మఠం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి ఇద్దరు జవాన్లు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ ప్రాంతంలోని కొడ్లియార్ గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఓర్చా, మొహండీ, ఇరాక్‌భట్టీ అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించాయి. అర్ధరాత్రి సమయంలో బలగాలు బేస్ క్యాంపునకు వస్తుండగా ఐఈడీ బాంబులపై ప్రమాదవశాత్తు జవాన్లు కాలు వేయడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. మృతి చెందిన వారిని ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాకు చెందిన కె.రాజేశ్(37), మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన ఐటీబీపీ 53వ బెటాలియన్ జవాన్ అమర్ పన్వర్(36)గా గుర్తించారు.

జవాను గ్రామంలో విషాదఛాయలు : విధి నిర్వహణలో రాజేష్ మృతి చెందడంతో వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లె గ్రామ పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలముకున్నాయి. రాజేష్ 2007లో ఐటీబీపీలో చేరారు. ఆయనకు భార్య స్వాతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అమరావతికిచ్చే రూ.15 వేల కోట్లు గ్రాంటే!

రుణం తీసుకుంటోంది కేంద్రమే

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వమే సమకూర్చనుంది. ఆ మొత్తంలో సుమారు రూ.13,440 కోట్లు (160 కోట్ల డాలర్లు) ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి కేంద్ర ఆర్థికశాఖ రుణంగా తీసుకుని, సీఆర్‌డీఏకు ఇస్తుంది. ఆ రెండు బ్యాంకులు చెరో 80 కోట్ల డాలర్ల చొప్పున రుణం ఇస్తున్నాయి. రూ.15 వేల కోట్లలో బ్యాంకులు ఇచ్చేది పోగా.. మిగతా మొత్తాన్ని కేంద్రం సమకూరుస్తుంది. బ్యాంకులకు రుణాన్ని కేంద్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. అమరావతి కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పేరుతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ఆ రుణం ఇస్తున్నాయి. దానికి సంబంధించిన వివరాలతో కూడిన పత్రాల్ని ప్రపంచ బ్యాంకు వెబ్‌సైట్‌లో ఉంచింది. కేంద్ర ఆర్థికశాఖను రుణ గ్రహీతగా, సీఆర్‌డీఏను ప్రాజెక్టు అమలు ఏజెన్సీగా ప్రపంచ బ్యాంకు పేర్కొంది. 'ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్ ఫైనాన్సింగ్ (పీ ఫర్ ఆర్)' విధానంలో రుణం సమకూరుస్తున్నట్లు తెలిపింది. అంటే రూ.15 వేల కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. దీన్ని బట్టి రూ.15 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి గ్రాంట్‌గానే వస్తోందని అర్థమవుతోంది.

జూదం పేచీ పోలీసులను పట్టించింది!

సీఐ, ఎస్సై సహా నలుగురి సస్పెన్షన్

రాజమహేంద్రవరం నేరవార్తలు, నిడదవోలు, న్యూస్‌టుడే: జూదంలో పట్టుబడిన వ్యక్తికి, కానిస్టేబుల్‌కు మధ్య నగదు విషయంలో తలెత్తిన వివాదం పోలీసుల చేతివాటాన్ని బయట పెట్టించి.. సీఐ, ఎస్సై సహా నలుగురిని సస్పెన్షన్ చేయించింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీసుస్టేషన్ సర్కిల్ పెరవలి స్టేషన్ పరిధిలో ఇది చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గత సెప్టెంబరు 8న పెరవలి మండలం ముక్కామలలో ఓ జూద శిబిరంపై పెరవలి ఎస్సై అప్పారావు ఇద్దరు సిబ్బందితో దాడి చేశారు. ఈ ఘటనలో ఏడుగురు నిందితులు, రూ.6.45 లక్షలు పట్టుబడ్డాయి. తర్వాత నిందితులు ఎస్సైతో బేరసారాలు మొదలుపెట్టారు. దాంతో రూ.55 వేలే స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేసిన ఎస్సై. వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. స్వాధీనం చేసుకున్న రూ.లక్షల నగదు నిడదవోలు సీఐతో పాటు పెరవలి ఎస్సై, కొందరు సిబ్బంది మధ్య పంపకం జరిగింది. అయితే జూద శిబిరంపై దాడిచేసే సమయంలో నిందితుల్లో ఒకరు అక్కడికి వెళ్లిన కానిస్టేబుల్‌కు తెలిసిన వ్యక్తి. దాడి నేపథ్యంలో అతడు రూ.లక్షను కానిస్టేబుల్‌కు ఇచ్చి భద్రపరచమన్నాడు. ఈ విషయం మిగతా సిబ్బందికి తెలియకుండా కానిస్టేబుల్ జాగ్రత్త పడ్డారు. మరోవైపు శిబిరంలో మిగతా నగదు స్వాధీనం, కేసు నమోదు, నిందితులకు స్టేషన్ బెయిల్ చకచకా జరిగిపోయాయి. నిందితుడు కానిస్టేబుల్ వద్దకు మర్నాడు వెళ్లి తాను ఇచ్చిన రూ.లక్ష ఇవ్వాలని అడిగాడు. ఆ మొత్తం పట్టుబడిన రూ.6.45 లక్షల్లో కలిసిపోయిందని కానిస్టేబుల్ చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రూ.లక్ష ఇచ్చిన దృశ్యాల సీసీ కెమెరా ఫుటేజీని నిందితుడు బయట పెట్టాడు. ఈ విషయం ఎస్పీకి చేరడంతో విచారణ జరిపి, నిడదవోలు సీఐ శ్రీనివాసరావు, పెరవలి ఎస్సై అప్పారావు, స్టేషన్ రైటర్ బుద్ధేశ్వరరావు, కానిస్టేబుల్ ఆర్.ఎల్లారావులను బాధ్యులుగా గుర్తించారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ సదరు సిబ్బందిని శనివారం సస్పెండ్ చేశారు.


57 ఏళ్ళ నమ్మకం | 147 షోరూమ్స్ | 20 నగరాలలో
బెస్ట్ ప్రైస్ | బెస్ట్ సర్వీస్
విజయ్ సేల్స్
Shop On www.vijaysales.com
ఉచిత డెలివరీ
₹1* డౌన్ పేమెంట్
ఈ రోజు మాత్రమే
20 అక్టోబర్
SANSUI
FOUNDED IN JAPAN | MADE FOR INDIA
100 (254 cm)
4K QLED
Google TV
PRICE ₹4,99,900 | OFFER PRICE ₹2,85,000
CASHBACK UPTO ₹10,000
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹2,75,000
DOWN PAYMENT ₹57,000 | EMI ₹28,500 x 8 months
VISE 32 (80 cm) QLED powered by webOS Hub
PRICE ₹44,000 OFFER PRICE ₹12,990
ZERO DOWN PAYMENT | EMI ₹1,624 x 8 months
VISE 43 (108 cm) FULL HD Google TV
PRICE ₹50,000 OFFER PRICE ₹19,990
ZERO DOWN PAYMENT | EMI ₹2,499 x 8 months
VISE 43 (108 cm) 4K QLED powered by webOS Hub
PRICE ₹70,000 | OFFER PRICE ₹25,000
CASHBACK UPTO ₹1,500 EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹23,500
ZERO DOWN PAYMENT | EMI ₹3,125 x 8 months
VISE 65 (164 cm) 4K QLED Google TV
PRICE ₹1,20,000 | OFFER PRICE ₹44,990
CASHBACK UPTO ₹2,000 EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹42,990
ZERO DOWN PAYMENT | EMI ₹5,624 x 8 months
* CASHBACK ON SELECT BANK AND NBFC
SANSUI
FOUNDED IN JAPAN | MADE FOR INDIA
85 (216 cm)
4K UHD
Google TV
PRICE ₹2,34,900 | OFFER PRICE ₹1,19,000
CASHBACK UPTO ₹5,000
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹1,14,000
DOWN PAYMENT ₹23,800 | EMI ₹11,900 x 8 months
SANSUI 32 (80 cm)
COMBO AMAZON FIRETV STICK LITE (INCLUDES APP CONTROLS)
COMBO PRICE ₹21,989
COMBO OFFER PRICE ₹8,990
SANSUI 32 (80 cm) Google TV
PRICE ₹21,490 OFFER PRICE ₹10,990
DOWN PAYMENT ₹2,198 | EMI ₹1,099 x 8 months
SANSUI 50 (127 cm) 4K UHD Google TV
PRICE ₹51,990 | OFFER PRICE ₹27,990
CASHBACK ₹1,500 EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹26,490
DOWN PAYMENT ₹5,598 | EMI ₹2,799 x 8 months
SANSUI 55 (139 cm) 4K UHD Google TV
PRICE ₹59,990 | OFFER PRICE ₹33,990
CASHBACK ₹1,500 EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹32,490
DOWN PAYMENT ₹6,798 | EMI ₹3,399 x 8 months
55 (139 cm) 4K QLED webOS
LLOYD FESTIVAL OF FORTUNE
PRICE ₹66,990 | OFFER PRICE ₹42,990
CASHBACK ₹4,000 EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹38,990
ZERO DOWN PAYMENT | EMI ₹5,374 x 8 months
mi
Experience The MagiQLED
On The All-New
XIAOMI X PRO QLED Series
43 55 65
Starting at ₹2778/Month*
Haier LG Panasonic SAMSUNG SANSUI VISE mi LLOYD SONY
HDFC BANK INSTANT DISCOUNT UPTO ₹4,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
Upto ₹22,500/- Instant Discount & Cashback on Credit Card / Debit Card & Paper Finance
RBL BANK HSBC YES BANK IDFC FIRST Bank BOBCARD DBS pnb BAJAJ FINSERV AU SMALL FINANCE BANK
IndusInd Bank HDFC BANK FEDERAL BANK kotak IDFC FIRST Bank CONSUMER DURABLE LOAN AMERICAN EXPRESS HDB FINANCIAL SERVICES
WE ACCEPT EMI CARDS
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 ప్రసన్న - 70362 15153
విజయవాడ - ఎన్‌టిఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 అనంత్ - 73373 76206
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి కిరణ్ - 99482 28111 లోకేష్ - 91543 16624
తిరుపతి - లీలా మహల్ రాము - 99480 30111 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. No Cibil means new to credit. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com.



సర్ఫరాజ్ 150

64

64: టెస్టుల్లో పంత్ సిక్సర్లు. అతడికిది 36వ టెస్టే. ఈ ఫార్మాట్లో భారత్ తరఫున అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్లలో కపిల్ దేవ్ (131 మ్యాచ్‌ల్లో 61)ను దాటి ఆరో స్థానానికి చేరుకున్నాడు. సెహ్వాగ్ (103 మ్యాచ్‌ల్లో 90), రోహిత్ (62 మ్యాచ్‌ల్లో 88), ధోని (90 మ్యాచ్‌ల్లో 78) సచిన్ (220 మ్యాచ్‌ల్లో 69), రవీంద్ర జడేజా (75 మ్యాచ్‌ల్లో 66) టాప్-5లో ఉన్నారు.

ఛాంపియన్

కొత్త బంతి కొంపముంచింది

భారత్ 408/3 నుంచి 462 ఆలౌట్

- చేజారిన సువర్ణావకాశం
- సర్ఫరాజ్, పంత్ అద్భుత పోరాటం
- కివీస్ లక్ష్యం 107 పరుగులే

107

కివీస్ లక్ష్యం. 2004-05 సీజన్లో ఆస్ట్రేలియాకు ముంబయిలో ఇంతే లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్.. ప్రత్యర్థిని 93 పరుగులకే ఆలౌట్ చేసి గెలిచింది.



ఒరోర్క్ 3/92

231/3.. మూడో రోజు చివరికి భారత్ స్కోరిది. నాలుగో రోజు తొలి సెషన్లో 22 ఓవర్లు పడ్డాయి. వికెట్ ఇవ్వలేదు. పైగా 113 పరుగులు చేశారు. రెండో సెషన్లో సగం గడిచింది. వికెట్ పడలేదు. స్కోరు 400 దాటిపోయింది. ఆధిక్యం 50 దాటింది.

ఉదయం నుంచి ఆడుతున్న బ్యాటర్లే క్రీజులో ఉన్నారు. ఒక బ్యాటర్ సెంచరీ పూర్తయింది. ఇంకో ఆటగాడు సెంచరీ దిశగా సాగుతున్నాడు. పరుగులు ధారాళంగా వస్తున్నాయి. చేతిలో 7 వికెట్లున్నాయి. ఇంకేం.. టీమ్ఇండియా సునాయాసంగా ప్రత్యర్థికి 200 పైచిలుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుందని, ఆపై బౌలర్లు విజృంభించి జట్టును గెలిపిస్తారని ఊహల్లోకి వెళ్లిపోయారు అభిమానులు.

కానీ అప్పుడొచ్చింది ప్రత్యర్థి బౌలర్ల చేతికి కొత్త బంతి. అంతే.. వికెట్లు టపటపా పడిపోయాయి. ఆశలు, అంచనాలు కిందికి వచ్చేశాయి. ప్రత్యర్థి ముందు కేవలం 107 పరుగుల లక్ష్యం నిలిచింది.

ఇక చివరి రోజు బౌలర్లు అద్భుతమైనా చేయాలి. లేదా వరుణుడైనా ఆదుకోవాలి. లేదంటే చిన్నస్వామిలో టీమ్ఇండియాకు ఓటమి తప్పదు!

ఇదీ సర్ఫరాజ్ సత్తా!

ఈనాడు క్రీడావిభాగం

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్‌కు ఇన్నింగ్స్ పరాభవం తప్పిందంటే.. జట్టు ఇంకా ఆశలతో ఉందంటే.. అందుకు ప్రధాన కారణం సర్ఫరాజ్ ఖాన్. దేశవాళీల్లో టన్నుల కొద్దీ పరుగులతో సత్తాచాటిన 26 ఏళ్ల ఈ ముంబయి కుర్రాడు.. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్లో తొలి శతకాన్ని అందుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. అతను ఈ పరుగులు చేసిన విధానం ప్రత్యేకం. శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో ఆడే అవకాశం దక్కించుకున్న సర్ఫరాజ్.. ఈ ఇన్నింగ్స్‌తో తన నైపుణ్యాలను ప్రపంచానికి చాటాడు. మ్యాచ్ పరిస్థితుల్లో సర్ఫరాజ్ సెంచరీ ఎంతో విలువైంది. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగో స్థానంలో వచ్చి డకౌటవడంతో అతని సామర్థ్యంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అతను బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి జట్టు 261 పరుగులు వెనుకబడే ఉంది. ఇన్నింగ్స్ ఓటమి ముప్పు పొంచే ఉంది. ఆ దశలో వికెట్ పడి ఉంటే పరిస్థితి దారుణంగా మారేది. కానీ ఈ సారి సర్ఫరాజ్ గొప్ప పట్టుదల ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుతో షాట్‌కు ప్రయత్నించి వికెట్ పారేసుకోవడంతో విమర్శలు వచ్చినా.. రెండో ఇన్నింగ్స్‌లో ఎదురు దాడికే దిగాడు. కానీ ఈ సారి పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుని బౌండరీలతో బౌలర్ల లయ దెబ్బతీశాడు. మొదట కోహ్లీతో, ఆ తర్వాత పంత్‌తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. భారత్‌కు 64 పరుగుల ఆధిక్యం అందించిన తర్వాత ఔటయ్యాడు. గాయాలతో ప్రధాన ఆటగాళ్లు దూరమైతే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో సర్ఫరాజ్ అరంగేట్రం చేశాడు. ఆ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలతో నిరూపించుకున్నాడు. కానీ కీలక ఆటగాళ్లు తిరిగి రావడంతో ఆ సిరీస్ తర్వాత తుది జట్టులో చోటు దక్కలేదు. ఇప్పుడు అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని 295 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. టెస్టులో ఒక ఇన్నింగ్స్‌లో డకౌటై, మరో ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసిన భారత మూడో బ్యాటర్ అతను.

ఆటతీరుకు ఫిదా

టెస్టుల్లో సంప్రదాయ శైలికి భిన్నంగా సర్ఫరాజ్ ఆటతీరు క్రికెట్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. వేగంగా దూసుకొచ్చినా.. గింగిరాలు తిరిగేదైనా.. బంతిని చూడటానికి, ఆడటానికి మిగతా బ్యాటర్ల కంటే అతనికి ఎక్కువ సమయం ఉందేమో అనిపిస్తోంది. బంతి స్టంప్స్‌ను ఎగరగొడుతుందేమో.. ప్యాడ్లను తాకుతుందేమో అనేలోపే సర్ఫరాజ్ బ్యాట్ అడ్డుగా వచ్చి ఆ బంతిని ఆడేస్తోంది. ఆలస్యంగా ఆడుతూ కట్, ర్యాంప్, స్వీప్ షాట్లతో బౌలర్ల ప్రణాళికలను దెబ్బతీస్తున్నాడు. బౌలర్ల వ్యూహాలకు చిక్కకుండా ఆడాడు. తన ఇన్నింగ్స్‌లో 114వ పరుగు వరకూ అతను లాంగాఫ్, లాంగాన్‌లో ఒక్క పరుగూ రాబట్టలేదు. అతను శతకం పూర్తయ్యే సరికి వచ్చిన పరుగుల్లో 30 శాతం థర్డ్‌మన్, 20 శాతం స్క్వేర్‌లెగ్, 19 శాతం పాయింట్, 15 శాతం మిడ్ వికెట్, 13 శాతం కవర్స్ నుంచి వచ్చాయి. స్లిప్‌లో, గల్లీలో ఫీల్డర్లున్నా బంతిని ఆలస్యంగా కట్ చేసి, ఖాళీల్లో నుంచి ఫోర్లు రాబట్టాడు. బ్యాట్‌పై నియంత్రణతో, కచ్చితత్వంతో బ్యాక్‌ఫుట్‌పై బలంగా నిలబడి, మణికట్టును తిప్పుతూ పరుగులు సాధించాడు. శరీరాన్ని ఎలా కావాలంటే అలా వంచుతున్నాడు. 6.4 అడుగుల ఎత్తున్న విలియమ్ బౌలింగ్‌లో ఇలాగే అప్పర్‌కట్‌తో కొట్టిన సిక్సర్, ఫోర్ చూడాల్సిందే. ఇలాంటి చిరస్మరణీయ ఇన్నింగ్స్ తర్వాత సర్ఫరాజ్‌ను జట్టు నుంచి పక్కనపెట్టడమంటే సాహసమే. అతను జట్టులో కొనసాగించక తప్పని పరిస్థితి కల్పించాడు. మరి గిల్ కోలుకుని వస్తే తర్వాతి టెస్టుకు ఎలాంటి మార్పులు చేస్తారో చూడాలి.

నాన్న ఎప్పుడూ నాలో ప్రేరణ కలిగిస్తూనే ఉంటాడు. భారత్‌కు ఆడుతూ తొలి సెంచరీ చేయడం సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి ఇది నా కల. భవిష్యత్‌లో ఏం అవుతుందో చెప్పలేం. రేపటి గురించి ఆలోచించి గతంలో వర్తమానాన్ని వృథా చేసుకున్నా. అందుకే వర్తమానంలో ఉండేందుకే ప్రయత్నిస్తా. బౌన్స్ అయ్యే బంతులను ఆడటాన్ని ఇష్టపడతా. ఇంటి దగ్గర ఉన్న బౌన్సీ వికెట్‌పై నిరంతరం ఇదే సాధన చేస్తా. అందుకే సులువుగా బౌన్సర్లను కట్ చేయగలిగా. ఈ పిచ్‌పై బ్యాటింగ్ అంత సులువు కాదు. మ్యాచ్ మా చేజారిందని అనుకోవడం లేదు. బంతి తిరుగుతోంది. చివరి రోజు మూడు వికెట్లను త్వరగా పడగొడితే కివీస్ కూడా కుప్పకూలే అవకాశముంది.

– సర్ఫరాజ్

బెంగళూరు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో టీమ్ఇండియా పుంజుకున్నట్లే పుంజుకుని.. మళ్లీ వెనుకబడింది. తొలి ఇన్నింగ్స్ ఘోర వైఫల్యాన్ని పూర్తిగా మరిపిస్తూ రెండో ఇన్నింగ్స్‌లో 408/3తో తిరుగులేని స్థితిలో నిలిచిన భారత్.. కివీస్ పేసర్లు విలియమ్ ఒరోర్క్ (3/92), మ్యాట్ హెన్రీ (3/102)ల ధాటికి 54 పరుగుల తేడాలో 7 వికెట్లు కోల్పోయి 462 పరుగులకే ఆలౌటైంది. శనివారం రెండో సెషన్లో కొత్త బంతిని అందుకున్నాక ఒరోర్క్, హెన్రీ ఒక్కసారిగా విజృంభించారు. వీరి ప్రతాపానికి ముందు సర్ఫరాజ్ ఖాన్ (150; 195 బంతుల్లో 18×4, 3×6), రిషబ్ పంత్ (99; 105 బంతుల్లో 9×4, 5×6) వీరోచిత ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 177 పరుగులు జోడించింది. భారత్ 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించగా.. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 బంతులే పడ్డాయి. పరుగులేమీ రాలేదు. లేథమ్ (0), కాన్వే (0) క్రీజులో ఉన్నారు. వెలుతురు లేమి వల్ల అంపైర్లు ఆటను ముందే ఆపేశారు. చివరి రోజు కూడా వర్షం పడొచ్చని సమాచారం.



పంత్ 99

- 36వ టెస్టు ఆడుతున్న పంత్ 90ల్లో ఔట్ కావడమిది ఏడోసారి. అతను ఆరు శతకాలు సాధించాడు.

కుర్రాళ్ల కేక..: 231/3.. మూడో రోజు ఆట చివరికి భారత్ స్కోరిది. అప్పటికింకా జట్టు 125 పరుగులు వెనుకబడి ఉంది. పంత్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉండగా.. గురువారం మోకాలికి గాయమై ఒకటిన్నర రోజు ఆటకు దూరంగా ఉన్న అతను ఏమాత్రం నిలబడతాడో.. 70 పరుగులతో నాటౌట్‌గా ఉన్న సర్ఫరాజ్ ఉదయం కివీస్ పేసర్లను ఏమాత్రం తట్టుకుంటాడో అన్న అనుమానాలు! కానీ ఈ జోడీ ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. మోకాలికి పట్టీ కట్టుకుని మైదానంలోకి వచ్చిన పంత్ వికెట్ల మధ్య పరుగు తీయడంలో కొంచెం ఇబ్బందిపడ్డాడు తప్ప షాట్లు ఆడడంలో ఏ తడబాటూ లేదు. కివీస్ బౌలర్లపై అతను ఎదురుదాడి చేసిన తీరు అమోఘం. అతను మోకాళ్లపై కూర్చుని ఆడిన లాఫ్టెడ్ షాట్లు చూసి తీరాల్సిందే. మరోవైపు సర్ఫరాజ్ ముందు రోజు దూకుడు కొనసాగిస్తూ కనువిందు చేశాడు. సర్ఫరాజ్ లేట్ కట్ షాట్లలో అందమే వేరు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 46 పరుగులకు ఆలౌట్ అయిన పిచ్ ఇదేనా.. మన బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన బౌలర్లు వీళ్లేనా అనిపించేలా.. ఈ ఇద్దరూ చిన్నస్వామిలో అద్భుత బ్యాటింగ్ విన్యాసాలతో అభిమానులను ఆశ్చర్యపరిచారు. సర్ఫరాజ్ తొలి గంటలోనే సెంచరీ పూర్తి చేశాడు. వర్షం అంతరాయంతో లంచ్ విరామం కాస్త ముందే వచ్చింది. అప్పటికే పంత్ అర్ధ శతకం పూర్తి చేసేశాడు. 22 ఓవర్ల తొలి సెషన్లోనే ఈ జోడీ 113 పరుగులు రాబట్టింది. రెండో సెషన్లోనూ ఈ జోడీ దూకుడు కొనసాగించింది. వికెట్ కోసం కివీస్ కెప్టెన్ లేథమ్ బౌలర్లందరినీ ప్రయోగించినా ఫలితం లేకపోయింది. స్పిన్నర్ అజాజ్‌ను పంత్, సర్ఫరాజ్ అస్సలు లెక్కచేయలేదు. పేసర్లనూ సమర్థంగా ఎదుర్కొన్నారు. సర్ఫరాజ్ 150 పరుగుల మైలురాయిని చేరుకోగా.. పంత్ సెంచరీ వైపు అడుగులు వేశాడు.

అనూహ్య పతనం: 150 మార్కును అందుకోగానే సర్ఫరాజ్.. సౌథీ బౌలింగ్‌లో షాట్ ఆడబోయి వెనుదిరిగాడు. ఆ తర్వాత పంత్ దూకుడు కొనసాగించగా.. రాహుల్ అతడికి సహకరించాడు. 90ల్లోకి అడుగు పెట్టిన పంత్.. సౌథీ బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. అతడి బాదుడుకు 107 మీటర్లు దూసుకెళ్లిన బంతి స్టేడియం పైకప్పుపై పడింది. పంత్ 99పై నిలవడంతో సెంచరీ లాంఛనమే అనిపించింది. కానీ అతణ్ని అదే స్కోరు వద్ద ఒరోర్క్ బౌల్డ్ చేయడంతో స్టేడియాన్ని నిశ్శబ్దం ఆవహించింది. కొత్త బంతి అందుకున్నాక ఒరోర్క్ 3 ఓవర్లలో 3 మెయిడెన్లతో 3 వికెట్లు తీయడం విశేషం. అతడితో పాటు హెన్రీ కూడా విజృంభించాడు. బంతిపై మెరుపును సద్వినియోగం చేసుకుంటూ బౌన్స్, స్వింగ్ రాబట్టిన ఈ జోడీ భారత ఇన్నింగ్స్ స్వరూపాన్ని మార్చేసింది. పంత్ ఔటైన కాసేపటికే రాహుల్ (12) పెవిలియన్ చేరాడు. జడేజా (5) సైతం ఒరోర్క్‌కే వికెట్ సమర్పించుకున్నాడు. చివరి మూడు వికెట్లను హెన్రీ ఊడ్చేశాడు. అశ్విన్ (15) కాస్త పోరాడి వెనుదిరగ్గా.. బుమ్రా (0), సిరాజ్ (0) ఒకే ఓవర్లో ఔటవడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 46; **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** 402; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (స్టంప్డ్) బ్లండెల్ (బి) అజాజ్ 35; రోహిత్ (బి) అజాజ్ 52; కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (సి) అజాజ్ (బి) సౌథీ 150; పంత్ (బి) ఒరోర్క్ 99; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఒరోర్క్ 12; జడేజా (సి) యంగ్ (బి) ఒరోర్క్ 5; అశ్విన్ ఎల్బీ (బి) హెన్రీ 15; కుల్దీప్ నాటౌట్ 6; బుమ్రా (సి) బ్లండెల్ (బి) హెన్రీ 0; సిరాజ్ (సి) సౌథీ (బి) హెన్రీ 0; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (99.3 ఓవర్లలో ఆలౌట్) **462; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462; **బౌలింగ్:** సౌథీ 15-2-53-1; హెన్రీ 24.3-3-102-3; ఒరోర్క్ 21-4-92-3; అజాజ్ పటేల్ 18-3-100-2; ఫిలిప్స్ 15-2-69-1; రచిన్ 6-0-30-0

రాహుల్.. ఎన్నాళ్లిలా?



రాహుల్

కేఎల్ రాహుల్.. ఎంతో ప్రతిభ ఉన్న బ్యాటర్. కోహ్లి, రోహిత్‌ల స్థాయికి ఎదగగల సామర్థ్యం ఉన్నా సరే.. నిలకడ లేక విమర్శలు కొని తెచ్చుకుంటూ ఉంటాడు. జట్టు యాజమాన్యం ఎన్నో సందర్భాల్లో అతడికి మద్దతుగా నిలిచింది. అవకాశాలు ఇస్తూనే ఉంది. ఎప్పుడో ఒకసారి ఓ మంచి ఇన్నింగ్స్ ఆడతాడు. కానీ తర్వాత నిరాశపరుస్తాడు. జట్టు తనపై ఆశలు పెట్టుకున్నపుడు నిరాశపరిచిన సందర్భాలే ఎక్కువ. శనివారం కూడా అదే చేశాడు. సర్ఫరాజ్, పంత్ జట్టు విజయానికి బలమైన పునాది వేసినా.. రాహుల్ సహా తర్వాతి బ్యాటర్లు చేతులెత్తేయడంతో భారత్ ఇప్పుడు ఓటమి ఉచ్చులో చిక్కుకుంది. కొత్త బంతి వచ్చాక కివీస్ బౌలర్లు ఒక్కసారిగా విజృంభించారు. భారీ భాగస్వామ్యం తర్వాత సర్ఫరాజ్, పంత్ ఒకరి తర్వాత ఒకరు వెనుదిరిగారు. ఈ స్థితిలో మిగిలిన స్పెషలిస్టు బ్యాటర్ రాహుల్ ఒక్కడే. ఓపికతో ఆడి భాగస్వామ్యం నెలకొల్పాల్సిన బాధ్యత అతడిపై పడింది. కానీ రాహుల్ 16 బంతులే ఆడి 12 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఒరోర్క్ బంతిని ఆడాలా వద్దా అన్న సంశయంలోనే ఆడిన రాహుల్.. వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో భారత్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. మరోసారి అభిమానుల ఆశలను నీరుగార్చడంతో సామాజిక మాధ్యమాల్లో రాహుల్‌పై తీవ్ర విమర్శలు తప్పట్లేదు.

పొట్టి కప్పు పట్టేదెవరో?

రాత్రి 7.30 నుంచి

- నేడు మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్
- న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా ఢీ



వోల్వార్ట్, సోఫీ డివైన్

దుబాయ్: హోరాహోరీ మ్యాచ్‌లు.. నాటకీయ మలుపులతో అలరించిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆఖరి అంకానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం ఫైనల్లో న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా తలపడుతోంది. ఈ రెండు జట్లలో ఏది గెలిచినా తొలిసారి టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తుంది. కివీస్ దిగ్గజ క్రికెటర్లు సోఫీ డివైన్, సుజీ బేట్స్, లియా తహుహు ప్రపంచకప్ కలను నిజం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్లో 7 వేలకు పైగా పరుగులు చేసిన 35 ఏళ్ల డివైన్, 10 వేల మైలురాయిని దాటిన 37 ఏళ్ల బేట్స్, 205 వికెట్లు పడగొట్టిన 34 ఏళ్ల తహుహుకు ఇదే చివరి ప్రపంచకప్ కావచ్చు. సెమీస్‌లో విండీస్‌పై కష్టపడి గెలిచిన న్యూజిలాండ్‌కు బౌలింగే బలం. అమేలియా కెర్ (12 వికెట్లు) టోర్నీలో అత్యధిక వికెట్ల బౌలర్‌గా కొనసాగుతోంది. కార్సన్, రోజ్‌మేరీ కూడా రాణిస్తున్నారు. మరోవైపు వరుసగా రెండో ఫైనల్ ఆడుతున్న దక్షిణాఫ్రికా ఈ సారి మాత్రం కప్పును వదలొద్దనే లక్ష్యంతో ఉంది. ఆ జట్టు సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను కంగుతినిపించింది. లారా వోల్వార్ట్ (190 పరుగులు), తజ్మిన్ బ్రిట్స్ (170) బ్యాటింగ్‌లో.. ఎంలాబా (10 వికెట్లు) బౌలింగ్‌లో కీలకం.

పాక్‌ను కొట్టేశారు

భారత్-ఎ శుభారంభం



తిలక్ వర్మ

అల్ అమెరత్: అది ఏ టోర్నమెంట్ అయితేనేం పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే భారత్‌దే పైచేయి. ఏసీసీ పురుషుల టీ20 వర్ధమాన జట్ల ఆసియాకప్‌లోనూ అదే జరిగింది. శనివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని భారత్-ఎ 7 పరుగుల తేడాతో పాకిస్థాన్ షహీన్స్‌పై విజయం సాధించింది. తిలక్ వర్మ (44; 35 బంతుల్లో 2×4, 2×6), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (36; 19 బంతుల్లో 3×4, 3×6), అభిషేక్ శర్మ (35; 22 బంతుల్లో 5×4, 2×6) మెరవడంతో మొదట భారత్ 8 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 7 వికెట్లకు 176 పరుగులే చేయగలిగింది. అన్షుల్ కాంబోజ్ (3/33), నిశాంత్ సంధు (2/15), రసిఖ్ సలామ్ (2/30) ఆ జట్టును కట్టడి చేశారు. అరాఫత్ మిన్హాస్ (41) టాప్ స్కోరర్. యాసిర్ ఖాన్ (33), అక్రమ్ (27), అబ్దుల్ సమద్ (25) రాణించారు. 23 బంతుల్లో 36 పరుగులు చేయాల్సిన స్థితిలో చేతిలో అయిదు వికెట్లున్న పాకిస్థాన్ గెలుపుపై కన్నేసింది. ఊపు మీదున్న మిన్హాస్, సమద్ క్రీజులో ఉన్నారు. కానీ రసిఖ్, వైభవ్ అరోరా, అన్షుల్ కాంబోజ్ ఆఖర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి భారత్‌ను గెలిపించారు. ఆఖరి ఓవర్లో పాక్‌కు 17 పరుగులు అవసరం కాగా.. తొలి బంతికే సమద్‌ను ఔట్ చేసిన అన్షుల్ 9 పరుగులే ఇచ్చాడు. అతడికే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

భారత్-ఎ: 183/8 (తిలక్ వర్మ 44, ప్రభ్‌సిమ్రన్ 36, అభిషేక్ 35, నేహాల్ 25, రమణ్‌దీప్ 17; సుఫియాన్ 2/28)

పాకిస్థాన్ షహీన్స్: 176/7 (మిన్హాస్ 41, యాసిర్ ఖాన్ 33, అక్రమ్ 27, సమద్ 25; అన్షుల్ కాంబోజ్ 3/33, రసిఖ్ సలామ్ 2/30, నిశాంత్ 2/15)



టైటాన్స్, తలైవాస్ మ్యాచ్‌లో

పీకేఎల్-11

టైటాన్స్ ఓటమి

ఈనాడు, హైదరాబాద్: ఘన విజయంతో కొత్త సీజన్‌కు ఆరంభం. ఇంకేముంది ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ చెలరేగిపోతుందనుకున్న అభిమానులకు రెండో మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44 తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో చిత్తయింది. రైడింగ్‌లో నరేందర్ ఖండోలా (10), సచిన్ (10).. ట్యాక్లింగ్‌లో సాహిల్ (5) రాణించి తలైవాస్‌కు విజయాన్ని అందించారు. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్ (10), విజయ్ మలిక్ (9) పోరాటం సరిపోలేదు. ట్యాక్లింగ్‌లో జట్టు విఫలమైంది. పవన్ జోరుతో మ్యాచ్‌ను దూకుడుగా ఆరంభించిన టైటాన్స్ 5-1తో దూసుకెళ్లింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడింది. ఆరో నిమిషంలోనే ఆలౌటై 7-11తో వెనుకబడింది. 17-20తో తొలి అర్ధభాగాన్ని ముగించిన టైటాన్స్ విరామం తర్వాత మరింత డీలాపడి ఓటమిని మూటగట్టుకుంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 35-25తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది.

పీకేఎల్‌లో ఈనాడు

బెంగాల్ వారియర్స్ × జైపుర్ పింక్‌పాంథర్స్ (రాత్రి 8 నుంచి)

గుజరాత్ జెయింట్స్ × బెంగళూరు బుల్స్ (రాత్రి 9 నుంచి)

రాణించిన రాహుల్, హిమతేజ

హైదరాబాద్ 244/5

డెహ్రాడూన్: రాహుల్ రాదేశ్ (82 బ్యాటింగ్; 174 బంతుల్లో 9×4), హిమతేజ (78; 147 బంతుల్లో 8×4, 1×6) రాణించడంతో ఉత్తరాఖండ్‌తో రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ మెరుగైన స్థితిలో నిలిచింది. రెండో రోజు ఆట చివరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 244 పరుగులు సాధించింది. రాహుల్‌తో పాటు తనయ్ త్యాగరాజన్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హైదరాబాద్ ఒక దశలో 64/4తో కష్టాల్లో చిక్కుకోగా.. హిమతేజతో కలిసి రాహుల్ జట్టును ఆదుకున్నాడు. ఈ జోడీ అయిదో వికెట్‌కు 142 పరుగులు జత చేసింది. తన్మయ్ అగర్వాల్ (30), కెప్టెన్ రాహుల్ సింగ్ (21) కూడా కాసేపు నిలిచారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 325 పరుగులకు ఆలౌటైంది. అభయ్ నేగి (37 నాటౌట్) అజేయంగా నిలిచాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (4/85), మిలింద్ (2/64), రోహిత్ రాయుడు (2/16) రాణించారు.

ఆదుకున్న భరత్; ఆంధ్ర 137/5: శ్రీకర్ భరత్ (78 బ్యాటింగ్) ఆదుకోవడంతో గుజరాత్‌తో రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర కుప్పకూలే ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఒక దశలో గుజరాత్ బౌలర్ల ధాటికి 29 పరుగులకే ఆంధ్ర 5 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో నితీశ్‌కుమార్ రెడ్డి (34 బ్యాటింగ్)తో కలిసి భరత్ ప్రత్యర్థి బౌలర్లను అడ్డుకున్నాడు. ఈ జోడీ అభేద్యమైన ఆరో వికెట్‌కు 108 పరుగులు జత చేసింది. ఆంధ్ర ఇంకా 230 పరుగులు వెనుకబడి ఉంది. చింతన్ గజా (3/40) ఆంధ్రను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 289/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 367 పరుగులకు ఆలౌటైంది. చింతన్ గజా (92), అర్జాన్ (82 నాటౌట్) సత్తాచాటారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ (3/107), సత్యనారాయణ (3/53), విజయ్ (2/98) రాణించారు.

భారత్ శుభారంభం

జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్‌లో భారత జూనియర్ హాకీ జట్టు శుభారంభం చేసింది. శనివారం 4-2తో జపాన్‌ను ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన భారత్... 12వ నిమిషంలో అమీర్ అలీ చేసిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే సుబసా (26వ) సఫలం కావడంతో జపాన్ స్కోరు సమం చేసింది. అక్కడ నుంచి భారత్ జోరు పెంచింది. గుర్‌జ్యోత్ సింగ్ (36వ), ఆనంద్ సౌరభ్ (44వ), అంకిత్ పాల్ (47వ) స్వల్ప వ్యవధిలో మూడు గోల్స్ సాధించడంతో 4-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఆఖర్లో జపాన్ ఆటగాడు యమనకా (57వ) గోల్ చేసినా అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఈ జట్టుకు దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్యం గెలిచిన తర్వాత శ్రీజేశ్ ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

మెరిసిన హైదరాబాద్ రేసర్లు



అకీల్ అలీభాయ్

కోయంబత్తూర్: ఇండియన్ రేసింగ్ లీగ్ నాలుగో రౌండ్ పోటీల్లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్లు మెరిశారు. శనివారం జరిగిన ఫార్ములా-4 ఇండియన్ ఓపెన్ తొలి రేసులో అకీల్ అలీభాయ్ (దక్షిణాఫ్రికా) విజేతగా నిలిచాడు. ఈ హైదరాబాద్ రేసర్ 26 నిమిషాల 34.669 సెకన్లలో రేసు ముగించాడు. రుహాన్ అల్వా (శ్రాచి రార్ రాయల్ బెంగాల్ టైగర్స్- 26ని 35.335సె), జేడెన్ (బెంగళూరు స్పీడ్‌స్టర్స్- 26ని 35.887సె) వరుసగా రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. మరోవైపు ఇండియన్ రేసింగ్ లీగ్ తొలి రేసులో బ్లాక్‌బర్డ్స్ తరఫున బరిలో దిగిన నీల్ జాని (26ని 54.587సె) రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. జాన్ లాంకాస్టర్ (చెన్నై టర్బో రైడర్స్- 26ని 54.251సె) ఛాంపియన్‌గా నిలిచాడు. సోహిల్ (గోవా ఏసెస్ జేఏ రేసింగ్- 26ని 54.965సె) మూడో స్థానం కైవసం చేసుకున్నాడు.

కోర్టు విచారణకు నకిలీ నిందితుడు హాజరు

పోలీసులకు అప్పగించిన న్యాయమూర్తి

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: క్రిమినల్ కేసులో అసలు నిందితుడి బదులు హాజరవుతున్న మరొకరిని న్యాయస్థానంలో న్యాయమూర్తి గుర్తించి.. పోలీసులకు అప్పగించారు. అతనిపై కేసు నమోదు చేయమని గుంటూరు ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్. శరత్‌బాబు శనివారం పోలీసులను ఆదేశించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడు వెంకట్ ఇంటిపై 2020 డిసెంబరు 6న అదే గ్రామానికి చెందిన కొంత మంది దాడి చేశారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన 21 మంది నిందితులపై కేసు నమోదు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు ఇతర నేరాల కింద అప్పటి డీఎస్పీ పోతురాజు ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు గుంటూరు ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. కేసు వాయిదాలకు నిందితుల్లో ఒకరైన జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు హాజరు కాకుండా.. ఆయన స్థానంలో అదే గ్రామానికి చెందిన కోడె సునీల్ వస్తున్నాడు. ఇది గమనించిన కొందరు హైకోర్టుతోపాటు స్థానిక న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. శనివారం కేసు విచారణకు రావడంతో నిందితులతోపాటు కోడె సునీల్ కూడా హాజరయ్యాడు. రిమాండ్ సమయంలో ఉన్న కాగితాలలో సునీల్ పేరు లేకపోవడంపై న్యాయమూర్తి ప్రశ్నించారు. నిందితుడు వెంకటేశ్వరరావు అమెరికా వెళ్లారని, ఆయన వచ్చే వరకు వాయిదాలకు తనను హాజరవ్వమన్నట్లు సునీల్ న్యాయమూర్తికి తెలిపారు. దీంతో అతనిపై చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి శరత్‌బాబు కోర్టు పరిపాలనాధికారిని ఆదేశించారు. సునీల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

నేను ఎస్టీ మహిళనే

● మాజీ మంత్రి పుష్పశ్రీవాణి

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి గిరిజన తెగకు చెందిన మహిళ కాదని.. 2019లో ఆమె ఎన్నిక చెల్లదని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, నిమ్మక సింహాచలం గతంలో హైకోర్టులో వ్యాజ్యం సమర్పించారు. దీనిపై ఇటీవల తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పుష్పశ్రీవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా విచారించి ఎస్టీ కొండదొర కులంగా తనకు ఇచ్చిన ధ్రువపత్రాల ఆధారంగా తాను ఎస్టీ తెగకు చెందిన మహిళనేనని న్యాయస్థానం నిర్ధారించిందని పేర్కొన్నారు. తమ న్యాయవాదులు పరిశీలిస్తున్నారని.. ఆదివారం వివరాలు వెల్లడిస్తానని వ్యాజ్యం సమర్పించిన జయరాజు చెప్పారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

● కాంట్రాక్టు లెక్చరర్ల ఐకాస విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు లెక్చరర్ల ఐకాస రాష్ట్ర ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-ఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్ కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చట్టం చేసి ఏడాది పూర్తయిందన్నారు. గత ప్రభుత్వం అన్ని శాఖల్లో కలిపి 10,117 మందిని అర్హులుగా తేల్చిందని, వీరిలో 5 వేల మంది జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టాలని విన్నవించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒప్పంద లెక్చరర్లకు న్యాయం చేస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారని, న్యాయ సలహా కోసం పంపిన దస్త్రం అడ్వొకేట్ జనరల్ పేషీలో ఉందని వెల్లడించారు.

మద్యం గొలుసు దుకాణాలను అరికట్టాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: మద్యం గొలుసు (బెల్టు) దుకాణాలను అరికట్టాలని, స్థానికులు వ్యతిరేకించిన చోట వాటిని పెట్టవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ‘మద్యం దుకాణాలను జనావాసాల మధ్య, పాఠశాలలు, దేవాలయాలకు దగ్గరలో పెడుతున్నారు. మహిళలు వ్యతిరేకించిన చోట పెట్టకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి. వారానికి ఒక రోజు డ్రై డేగా ప్రకటించాలి. కొందరు లాభార్జన కోసం అనధికారికంగా వేలం పాటలు నిర్వహించి, బెల్టు దుకాణాలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వాటిని కట్టడి చేయాలి” అని పేర్కొన్నారు.

డాక్టర్ రఘురాంకు ప్రధాని పరామర్శ

● మాతృమూర్తి మరణంపై సానుభూతి

ఈనాడు, హైదరాబాద్: కిమ్స్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘురాంకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల రఘురాం మాతృమూర్తి, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఉషాలక్ష్మి మృతి నేపథ్యంలో సంతాపం తెలుపుతూ.. శనివారం ఆయనకు ప్రధానమంత్రి లేఖ రాశారు.

తల్లిని కోల్పోవడం కోలుకోలేనిది

“మీ తల్లి, డాక్టర్ ఉషాలక్ష్మి మరణించారనే వార్త నన్ను కలచివేసింది. తల్లిని కోల్పోవడం కోలుకోలేనిది. ఒక గైనకాలజిస్టుగా అంకితభావం, మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఎంతో నిబద్ధతతో ఆమె పనిచేశారు. ఎంతోమంది మహిళల జీవితాలను తన చికిత్సలతో కాపాడారు. ప్రతి ఒక్కరి హృదయంలో ఆమె ఎల్లప్పుడూ నిలిచి ఉంటారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా’ అని లేఖలో ప్రధాని పేర్కొన్నారు.

సంతాపం ప్రకటించిన వెంకయ్యనాయుడు

డాక్టర్ ఉషాలక్ష్మి మరణం బాధాకరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. రొమ్ము క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొని స్ఫూర్తిగా నిలిచిన ఆమె.. 2007లో డాక్టర్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ స్థాపించి.. తన కుమారుడు, ప్రముఖ బ్రెస్ట్ క్యాన్సర్ నిపుణులు రఘురాం ఆధ్వర్యంలో ఎంతోమందికి సేవలు అందించారన్నారు.

నాటి టెండర్ల దాహం..

రూ.586 కోట్ల భారం

● తుంగభద్ర కాలువల ఆధునికీకరణ పనుల పెండింగ్ బకాయిల చెల్లింపులెలా?

● బడ్జెట్ కేటాయింపులు లేకుండానే బోర్డు టెండర్ల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: తుంగభద్ర కాలువల ఆధునికీకరణ పనుల్లో ప్రణాళికా వైఫల్యం అటు గుత్తేదారులకు, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి పెనుభారాన్ని మిగిల్చింది. జగన్ ప్రభుత్వంలో అధికారులు చేసిన తప్పిదం ఇప్పుడు వెంటాడుతోంది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌కు ఎన్నో రెట్లు ఎక్కువ విలువ పనులు చేపట్టడం, టెండర్లు పిలవడం సమస్యాత్మకమైంది. ఈ విషయంలో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలనూ విస్మరించారు. కాలువల ఆధునికీకరణ పనుల్లో రూ.586 కోట్ల మేర పెండింగ్ బిల్లులున్నాయి. ఈ బిల్లుల చెల్లింపు ఇప్పటికిప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పెనుభారమే. మరోవైపు పనులు చేసిన చిన్న గుత్తేదారులు తమ బిల్లులు చెల్లించాలంటూ తుంగభద్ర బోర్డుకు లేఖలు రాస్తున్నారు. గతంలోనే తెదేపా హయాంలో తుంగభద్ర ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. 2022-23 మధ్య ఈ పనులు చేపట్టిన క్రమంలో అనేక ఉల్లంఘనలు కనిపించాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.730.81 కోట్ల బడ్జెట్ అవసరమని తుంగభద్ర బోర్డు ప్రతిపాదించింది. అందులో రూ.301.21 కోట్లు పెండింగ్ బిల్లులుగా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పనులకు రూ.429.60 కోట్లు అవసరమని పేర్కొంది. మొత్తంలో ఏపీ రూ.426.88 కోట్లు, కర్ణాటక ప్రభుత్వం రూ.303.93 కోట్లు భరించాల్సి ఉంటుంది. తాజాగా తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ అధికారులకు రాసిన లేఖ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ బిల్లులు రూ.686 కోట్లున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో రూ.113 కోట్లు కేటాయించింది. బోర్డు అనుమతితో ఇందులో రమారమి రూ.100 కోట్ల పెండింగ్ బిల్లులు తాజాగా కిందటి నెలలో చెల్లించారు. ఇప్పటికీ తుంగభద్ర పనులకు సంబంధించి రూ.586 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

బడ్జెట్ లేకుండా టెండర్లు ఎలా పిలుస్తారు?

2017లో ప్రారంభించిన కుడిగట్టు ఎగువ కాలువ, పవర్ కెనాల్ పనులు పూర్తయ్యాయి. కుడిగట్టు దిగువ కాలువ పనులు 270 కి.మీ.మేర 2019లో ప్రారంభించారు. ఈ కాలువ పనులు 115వ కి.మీ. నుంచి 205వ కి.మీ. వరకు మూడేళ్లుగా సాగుతున్నాయి. ఎగువ కాలువ పనుల్లో ఏపీ 71 శాతం, కర్ణాటక 29 శాతం, దిగువ కాలువ పనుల్లో ఏపీ 55.56 శాతం, కర్ణాటక 44.44 శాతం ఖర్చు భరించాలి. తొలుత బడ్జెట్‌ను ఏపీ కేటాయిస్తుంది. తుంగభద్ర బోర్డు కార్యదర్శి అనుమతి లేఖ ఆధారంగా మన ఖజానా నుంచి చెల్లిస్తారు. ఆనక కర్ణాటక రాష్ట్ర వాటా నిధులను ఏజీ కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌కు సర్దుబాటు చేస్తుంది.

● 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆధునికీకరణకు రూ.301.21 కోట్ల అదనపు నిధులను బోర్డు కోరింది. ఆ నిధులు ఏపీ ప్రభుత్వం ఇవ్వలేదు. 2023-24లో పనులకు సంబంధించి అదనపు బడ్జెట్ కేటాయింపులు లేకుండానే తుంగభద్ర బోర్డు సెక్రటేరియట్ టెండర్లను ఆహ్వానించేందుకు పాలనామోదం ఇచ్చి టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. అదనపు బడ్జెట్ కేటాయింపులు ఆర్థిక సంవత్సరం చివర్లో లభిస్తాయనే ఉద్దేశంతో టెండర్లు పిలిచామని బోర్డు పేర్కొంటోంది.

నాటి జలవనరులశాఖ ఈఎన్‌సీ హామీ

2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.301.21 కోట్ల బకాయిలు తక్షణమే విడుదలయ్యేలా బాధ్యత తీసుకుంటానని ఏపీ తరఫున అప్పటి ఇంజినీర్ ఇన్‌చీఫ్ సి.నారాయణరెడ్డి హామీనిచ్చారు. అంతేకాదు.. 2023-24, 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఏడాదికి రూ.150 కోట్ల చొప్పున నిధులిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆ మేరకు పనులు చేయాలని భరోసానిచ్చారు. ఆయన తుంగభద్ర బోర్డులో ఏపీ తరఫున సభ్యుడు. అసలు ఒక జలవనరులశాఖ అధికారి బడ్జెట్ కేటాయింపుల్లో, అందులోనూ భవిష్యత్తు అంచనాలతో కేటాయింపులకు ఎలా హామీనిస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. ఈ అధికారి భరోసా మేరకే అదనపు పనులు చేపడుతున్నట్లు బోర్డు సమావేశం తీర్మానాల్లోనూ ప్రస్తావించారు. బడ్జెట్‌లో మాత్రం కిందటి ఆర్థిక సంవత్సరంలోనూ నిధులివ్వలేదు.

పాడేరు కొండల్లో పాలసముద్రం!

పాల సముద్రంలా కనువిందు చేస్తున్న ఈ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని వంజంగి మేఘాలకొండ. శనివారం ఉదయం కొండపై దట్టంగా కమ్మిన పొగమంచు పర్యాటకుల మదిని దోచుకుంది. సూర్యుడి రాకను స్వాగతిస్తూ దూదిపింజల్లాంటి మేఘాలు పక్కకు తొలగుతూ ఉంటే.. ఆ తొలి వెలుగుకు పచ్చని కొండలు కనువిందు చేశాయి. పాడేరు పట్టణంలో ఉదయం 9 గంటల వరకు పొగమంచు తెరలు వీడటం లేదు. మినుములూరు కాఫీ బోర్డులో శనివారం ఉదయం 15 డిగ్రీలు, పాడేరులో 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు.

– పాడేరు, న్యూస్‌టుడే



ప్రభుత్వం మారినా చర్యలేవీ?

● ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీల్లో రూ.50 కోట్లు మింగేశారు

● అక్రమాలకు పాల్పడిన ప్రతాప్‌రెడ్డి ఇంకా అదే పదవిలో..

● ఉన్నత విద్యామండలిలో గోల్‌మాల్‌పై చర్యలు శూన్యం

ఈనాడు, అమరావతి: మాజీమంత్రి బొత్స సత్యనారాయణ నుంచి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి వరకు ఎంతోమందిపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు లేవు. ప్రతాప్‌రెడ్డిపై విచారణను తూతూమంత్రంగా మార్చేశారు. ఇప్పటికీ ఆయనను ఆ పదవి నుంచి తప్పించలేదు. ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీల్లో బొత్స పేషీ పైనే ఆరోపణలు వచ్చినా విచారణ లేదు. ఇసుక, మద్యం వంటి అంశాల్లో జరిగిన అక్రమాల విషయంలో చర్యలు చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యాశాఖ విషయంలో చర్యలు తీసుకోకపోవడం విశేషం. వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీల్లో రూ.50 కోట్ల వరకు అక్రమాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి వైకాపాతో అంటకాగడంతోపాటు అనేక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఉన్నత విద్యామండలిలో రూ.కోట్లు దారి మళ్లించారు. ఒక యాప్‌కు రూ.90 లక్షల బిల్లు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారిపై చర్యలు లేకపోగా.. కొందరు ఇప్పటికీ పెత్తనం చెలాయిస్తుండడం విశేషం.

సిఫార్సు బదిలీల్లో రూ.50 కోట్ల అవినీతి

ఎన్నికల ముందు ఉపాధ్యాయుల రాజకీయ పైరవీ బదిలీల్లో మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాష్, కమిషనరేట్‌లోని కొందరు అధికారులపై ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,400 ఉపాధ్యాయ సిఫార్సు బదిలీలు చేయగా.. రూ.50 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 917 బదిలీలను నిలిపివేసింది. మూడు విడతలుగా చేసిన ఈ సిఫార్సు బదిలీల్లో ఒక్కోసారి ఒక్కో విధానాన్ని అమలు చేశారు. సిఫార్సు బదిలీలకు 3 - 4 లక్షల రూపాయల వరకు చెల్లించారు ఉపాధ్యాయులు. అప్పట్లో బొత్స పేషీలో పని చేసిన పీఏ కమలాకర్ వసూళ్లు చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై తెదేపా నేత వర్ల రామయ్య ఏసీబీకి ఫిర్యాదు చేశారు. కానీ, దీని విచారణ ముందుకు కదలడం లేదు.

ప్రతాప్‌రెడ్డిపై విచారణ తూతూమంత్రమేనా?

ప్రతాప్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పాఠ్యపుస్తకాల్లోని ఒక్కో పేజీ డీటీపీకి రూ. 700 చొప్పున బిల్లులు పెట్టి, భారీగా నిధులు దారి మళ్లించినట్లు ఫిర్యాదులున్నాయి. జగన్ అనే వ్యక్తికి చెందిన డీటీపీ సెంటర్‌కు ఈ వర్క్ మొత్తాన్ని ఇచ్చారు. కరోనా సమయంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూ.30 లక్షల వ్యయంతో వీడియో రూపొందించినట్లు బిల్లు పెట్టారు. కానీ, ఈ వీడియోను మాత్రం బడులకు పంపించలేదు. సైన్సు మ్యూజియం కోసం రూ. 60 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లు పెట్టారు. ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కడప ఆర్జేడీగా పని చేసి, వైకాపా అభ్యర్థుల గెలుపునకు పనిచేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ప్రతాప్‌రెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేయగా.. డైరెక్టర్ విజయరామరాజు డైరెక్టర్ మస్తానయ్యను విచారణ అధికారిగా నియమించారు. ప్రతాప్‌రెడ్డిని పదవి నుంచి తప్పించకుండా విచారణ చేపట్టడంతో సిబ్బంది ఎవ్వరూ సహకరించడం లేదు. దీంతో మస్తానయ్య తన విచారణను మూల పడేశారు.

మండలిలో ప్రాజెక్టుల పేరుతో మళ్లింపు..

ఉన్నత విద్యామండలిలో గత ఐదేళ్లల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇవి బయట పడకుండా అప్పటి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి ఓట్ల లెక్కింపు రోజునే రాజీనామా చేసేశారు. ఆ తర్వాత రిలీవ్ అయి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం కొత్త వారిని నియమించకపోవడంతో గతంలో నియమితులైన వైస్ ఛైర్మన్లు, సిబ్బందే కొనసాగుతున్నారు. విజయనగరంలో జగన్ సభ కోసం ఉన్నత విద్యామండలి నిధులు రూ.50 లక్షలు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కొత్త ప్రభుత్వానికి పలువురు ఫిర్యాదులు సైతం చేశారు. విచారణ జరపాలని న్యాయస్థానంలో పిల్ వేశారు.

■ విద్యార్థులకు సమాచారం ఇచ్చేందుకంటూ చాట్‌బోట్ సర్వీసు పేరుతో రూ. 45 లక్షలు, లింక్‌డిన్ కోర్సుల లైసెన్సుల కోసమంటూ రూ. 2.5 కోట్లకు కౌన్సిల్ సమావేశంలో అనుమతులు తీసుకున్నారు. వీటిని అమలు చేసిన దాఖలాలు లేవు. ఒక్క యాప్ కోసం రూ. 90 లక్షలు వ్యయం చేశారు. దీని రూపకల్పన బాధ్యతలను అనంతపురానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చేశారు. ఉన్నత విద్యామండలిలో పని చేయకుండానే ఇద్దరు ఉద్యోగులకు రెండేళ్లపాటు జీతాలు చెల్లించారు.

■ గత ప్రభుత్వంలో హేమచంద్రారెడ్డి అడ్డగోలుగా కన్సల్టెంట్లను నియమించారు. ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ బృంద నాయకుడు జి.కార్తీక్‌కు నెలకు రూ. 4 లక్షలు, సీనియర్ కన్సల్టెంట్ వైష్ణవికి రూ. 3.50 లక్షలు, కె.శ్వేతక్‌కు రూ. 2.96 లక్షలు, చిన్మయికి రూ. 2.96 లక్షలు చెల్లిస్తున్నారు. లా కన్సల్టెంట్ సుధేష్ ఆనంద్ మూడుచోట్ల నుంచి రూ.లక్షల చొప్పున నెలకు రూ. 3 లక్షల చొప్పున ఇప్పటికీ ఇస్తున్నారు.

ఆ జీఓ రద్దుతో విద్యారంగానికి పట్టిన పీడ వీడనుంది

● మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు, అమరావతి: విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసేలా గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యా రంగానికి పట్టిన పీడ వీడనుందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. “ప్రాథమిక విద్యను పటిష్ఠం చేసేందుకు ఒకటి నుంచి అయిదు తరగతులు ఒకే దగ్గర ఉండేలా ముందుచూపుతో ఆలోచించి గతంలో చంద్రబాబు ఈ విధానాన్ని తెచ్చారు. జగన్ తన అనాలోచిత నిర్ణయాలతో దాన్ని రద్దు చేసి, 3, 4, 5వ తరగతుల్ని హైస్కూల్‌లో విలీనం చేశారు. ఇప్పుడు విద్యా వ్యవస్థను లోకేశ్ గాడిన పెడుతున్నారు. ముమ్ముందు మరిన్ని సంస్కరణలు అమలు చేయనున్నారు” అని సుజాత పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేదల కోటాపై ప్రభుత్వం స్పందించాలి

● ఏపీ తల్లిదండ్రుల సంఘం

ఈనాడు, అమరావతి: ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు విద్యా హక్కు చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వులు-24 రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని తల్లిదండ్రుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరహరి, ఈశ్వరయ్య కోరారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్య అందించే చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలని విన్నవించారు. తల్లిదండ్రులు ఫీజులు చెల్లించాలని హైకోర్టు ఎక్కడా ఆదేశించలేదని, ఏ ప్రైవేట్ విద్యా సంస్థ అయినా ఫీజుల కోసం బలవంతం చేస్తే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

సాహసయాత్రకు రండి..!

● మహారాష్ట్ర పర్యాటక శాఖ ఆహ్వానం



సింధు దుర్గ్ ఫోర్ట్

ఈనాడు, హైదరాబాద్: చరిత్ర గురించి తెలుసుకోవాలన్న కుతూహలం ఉండి, సాహసోపేత యాత్ర చేయాలని ఉవ్విళ్లూరే వారికి మహారాష్ట్ర పర్యాటక శాఖ ఆహ్వానం పలుకుతోంది. ఛత్రపతి శివాజీ మహారాజ్, మరాఠా రాజ్యంలోని నిర్మాణాలు సహా 350కి పైగా కోటలను సందర్శించాలనుకునే వారికి ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది. ఇందులో చరిత్రను తెలుసుకునేందుకు సింధు దుర్గ్ ఫోర్ట్, మురుద్‌జంజీరా, ప్రతాప్‌గఢ్ ఫోర్టులు, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు శివ్‌నేరి, సింహగఢ్, ప్రతాప్‌గఢ్‌లను సందర్శించొచ్చని తెలిపింది. సాహసాలను ఇష్టపడేవారు లోహగఢ్ ఫోర్ట్‌కు వెళ్లొచ్చు. ప్యాకేజీలకు సంబంధించిన పూర్తి వివరాలకు మహారాష్ట్ర టూరిజం వెబ్‌సైట్ www.maharashtratourism.gov.in ను సంప్రదించాలని సూచించింది.



ఆలయంపై హరివిల్లు!

యాదగిరిగుట్టలో శనివారం వర్షం కురిసింది. తర్వాత కొద్దిసేపటికి ఆకాశంలో ఆలయం మీదుగా విరిసిన హరివిల్లు కనువిందు చేసింది. భక్తులు, స్థానికులు దాన్ని సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించడానికి పోటీపడ్డారు.

– న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

శ్రీశైలంలో 4 గేట్ల నుంచి నీటి విడుదల



సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో శనివారం శ్రీశైలం జలాశయం 4 గేట్లను ఎత్తి 1,11,932 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ మరో 68,039 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువనున్న జూరాల జలాశయం నుంచి 1,18,464, సుంకేసుల ప్రాజెక్టు నుంచి 72,114, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం జలాశయ నీటిమట్టం 884.70 అడుగులు, నీటినిల్వ 213.88 టీఎంసీలుగా నమోదైంది.



చెరువును తలపిస్తున్న కలెక్టరేట్ ఎదుటనున్న ప్రధాన రహదారి

భారీ వర్షం.. రోడ్లు జలమయం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో శనివారం మధ్యాహ్నం గంటన్నర పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కలెక్టరేట్ రోడ్డు, హిందూ కళాశాల కూడలి, ప్రభుత్వ మహిళా కళాశాల, నగరపాలక సంస్థ సమీపంలో, లక్ష్మీపురం, అమరావతి, గుజ్జనగుండ్ల ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అడుగడుగునా గుంతలున్న అరండల్‌పేట వంతెనపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ఆర్‌యూబీల వద్ద వర్షం కురిసినంత సేపు మోకాళ్ల లోతులో నీరు ఉద్ధృతంగా ప్రవహించింది.

బొల్లా బ్రహ్మనాయుడి అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారు

● జేసీబీతో ఇల్లు కూల్చేశారని బాధితుల ఆవేదన

● ‘ప్రజావేదిక’కు వెల్లువెత్తిన ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: “స్థలం విషయంలో న్యాయస్థానం ఆదేశాలు మాకు అనుకూలంగా ఉన్నా.. వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారు. వందల మంది మా ఇంటిపైకి వచ్చి జేసీబీతో ఇల్లు, దుకాణం ధ్వంసం చేశారు” అని వినుకొండకు చెందిన కామా వెంకటేశ్వర్లు వాపోయారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన ‘ప్రజావేదిక’లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పలువురి నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెంలోని హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో దివ్యాంగుల కోటా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్ని వైకాపాకు అనుకూలంగా ఉన్నవాళ్లకు ఇచ్చుకున్నారని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన నరేష్ అనే బాధితుడు ఫిర్యాదు చేశారు. 2019 ఎన్నికల్లో తెదేపా ఏజెంట్‌గా కూర్చొన్నాననే అక్కసుతో వైకాపా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి.. తన పొలాన్ని ధ్వంసం చేశారని, రావాల్సిన బిల్లుల్ని అడ్డుకున్నారని వైఎస్సార్ జిల్లా చాపాడు మండలానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు చేశారు.

పంట దోచుకెళ్లిన వల్లభనేని వంశీ అనుచరులు

తన పంట పొలంలోని వరిని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు రాత్రికి రాత్రే కోసుకుపోయారని కృష్ణా జిల్లా గన్నవరం మండలం గోపవరపుగూడేనికి చెందిన వేమూరి రామారావు, నాగేశ్వరరావు కోరారు. ఏపీ ప్రభుత్వ విధాన పరిషత్తు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రుల్లో పొరుగు సేవల ద్వారా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు సెక్యూరిటీ గార్డులు విజ్ఞప్తి చేశారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై తమను మోసం చేశారని పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు.

వైద్య, ఆరోగ్య శాఖలో సర్దుబాటుతో ఇబ్బందులు

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీర్మానం

ఈనాడు, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సర్దుబాటుతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించాలని ఉద్యోగుల సంఘం తీర్మానించింది. విజయవాడలో శనివారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు చేసిన సర్దుబాటు కారణంగా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ‘వైకాపా ప్రభుత్వం జనాభా నిష్పత్తి దామాషాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పునర్వ్యవస్థీకరించలేదు. కేవలం సదరు కేంద్రాల్లో పని చేసే వివిధ కేటగిరి ఉద్యోగుల సంఖ్యను నిర్ధారిస్తూ ఉత్తర్వులిచ్చింది. లక్ష జనాభాకు సేవలందించే ఆరోగ్య కేంద్రానికి, 20 వేల మందికి సేవలందించే పీహెచ్‌సీకి ఒకే విధానంలో ఉద్యోగులను కేటాయించింది. దీంతో ప్రజలకు ఆరోగ్య సేవలపై ప్రభావం పడింది. ఉద్యోగులను రీడిప్లాయిమెంట్ పేరుతో వేర్వేరు ప్రాంతాలకు కేటాయించారు. వారి జీతభత్యాలు, పదోన్నతుల విషయంలో స్పష్టత లేక ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది’ అని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు వాపోయారు. ఈ సమస్యపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించేందుకు తొమ్మిది మంది సభ్యులతో వారు కమిటీ ఏర్పాటుచేసుకున్నారు.

కార్పొరేషన్ల సమన్వయంతో ఉపాధి, నైపుణ్య శిక్షణ: సీడాప్

ఈనాడు, అమరావతి: యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ కల్పించే అన్ని కార్పొరేషన్లు, విభాగాల కార్యకలాపాలను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ(సీడాప్) ఛైర్మన్ దీపక్‌రెడ్డి అన్నారు. నైపుణ్య శిక్షణకు సంబంధించిన ఏపీఐఐసీ, పర్యాటకాభివృద్ధి సంస్థ, మారిటైమ్‌బోర్డు, లిడ్‌క్యాప్ ఛైర్మన్లు మంతెన రామరాజు, నూకసాని బాలాజీ, దామచర్ల సత్య, పిల్లి మాణిక్యరావు, ఎన్ఆర్ఐ తెదేపా విభాగం అధ్యక్షుడు వేమూరి రవిలతో ఆయన సీడాప్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రతి కార్పొరేషన్ కార్యకలాపాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ప్రణాళికలు రూపొందించడం, నిర్వహించడంపై చర్చించారు. డీడీయూజీకేవై ద్వారా పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యం కలిగిన యువతను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపైన సమీక్షించారు. లెదర్ కార్పొరేషన్ ద్వారా ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసి, ఆ రంగంలో ఉన్న అవకాశాలను యువతకు అందించాలని నిర్ణయించారు.

సెకన్లలోనే వ్యాధుల గుర్తింపు!

● సరికొత్త స్కానర్ అభివృద్ధి



క్యాన్సర్, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి రుగ్మతలను అత్యంత ప్రాథమిక దశలోనే గుర్తించడానికి వీలు కల్పించే ఒక చిన్నపాటి స్కానర్‌ను బ్రిటిష్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కొన్ని సెకన్లలోనే విస్పష్టమైన త్రీడీ ఫొటో ఆకౌస్టిక్ టోమోగ్రఫీ (పీఏటీ) చిత్రాలను ఇది అందిస్తుంది. ఫలితంగా వైద్యులే స్వయంగా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించొచ్చు. దీనిసాయంతో రక్తనాళాలను సుస్పష్టంగా వీక్షించొచ్చు. రోగి సంరక్షణ ఈ పరిజ్ఞానం మెరుగుపరుస్తుంది. అన్ని పరీక్షలూ పూర్తయితే 3-5 ఏళ్లలో ఇది అందుబాటులోకి రావొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఏమిటీ పరిజ్ఞానం?

● పీఏటీ పరిజ్ఞానాన్ని 2000 సంవత్సరంలో అభివృద్ధి చేశారు. పదార్థాలు.. కాంతిని శోషించుకొని ప్రతిగా ధ్వని తరంగాలను వెలువరించడాన్ని ఫొటోఅకౌస్టిక్ ప్రభావం అంటారు. పీఏటీ స్కానర్లు ఇదే సూత్రం ఆధారంగా పని చేస్తాయి. ఇవి స్వల్పస్థాయి లేజర్ తరంగాలను కణజాలంలోకి పంపుతాయి. లక్షిత ప్రాంత రంగు ఆధారంగా.. ఆ తరంగాల్లోని కొంత శక్తిని కణజాలం శోషించుకుంటుంది. దీనివల్ల అక్కడ వేడి, పీడనం స్వల్పంగా పెరుగుతాయి. అంతిమంగా దీని నుంచి బలహీన అల్ట్రాసౌండ్ తరంగాలు వెలువడతాయి. అందులో కణజాలానికి సంబంధించిన సమస్త సమాచారం ఉంటుంది.

● పీఏటీ ఇమేజింగ్ విధానంలో మానవ కణజాలంలో 15 మిల్లీమీటర్ల లోతులోకి చొచ్చుకెళ్లి మరీ రక్తనాళాలను పరిశీలించొచ్చు.

ప్రస్తుత పీఏటీతో ఇబ్బందులు..

● ప్రస్తుత పీఏటీ పరిజ్ఞానంతో ఇమేజింగ్ నెమ్మదిగా ఉంటోంది. అందువల్ల నాణ్యమైన త్రీడీ చిత్రాలను అది వేగంగా అందించలేకపోతోంది. ఈ స్కానింగ్ సమయంలో రోగి నిశ్చలంగా ఉండాలి. చిన్నపాటి కదలిక చోటుచేసుకున్నా.. చిత్రాలు మసకబారుతాయి. అలాంటివాటితో వ్యాధి నిర్ధారణ కష్టం.

● పాత పీఏటీ స్కానర్లు.. ఒక చిత్రాన్ని సేకరించడానికి ఐదు నిమిషాల కన్నా ఎక్కువ సమయాన్ని తీసుకుంటాయి. వృద్ధులు, బలహీనులు అంతసేపు నిశ్చలంగా ఉండటం కష్టం.

● ఈ ఇబ్బందుల కారణంగా వైద్యులు అప్పటికప్పుడు రోగులను పరిశీలించడం కోసం పీఏటీలను వాడలేకపోతున్నారు.

పరిష్కారం ఇలా..

పీఏటీ ఇమేజింగ్‌లో వేగాన్ని పెంచడానికి యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్) శాస్త్రవేత్తలు నడుం బిగించారు. స్కానర్ డిజైన్‌లో నవ్యతను జోడించారు. చిత్రాలను వెలువరించే గణితశాస్త్ర అంశాలను మెరుగుపరిచారు.

● మునుపటి పీఏటీ స్కానర్లు.. కణజాల ఉపరితలంలోని 16వేలకుపైగా ప్రదేశాల్లో అల్ట్రాసౌండ్ తరంగాలను కొలిచేవి. అయితే ఒకసారి ఒక బిందువుకు సంబంధించి మాత్రమే అవి కొలతలు సేకరించగలవు. కొత్త స్కానర్ మాత్రం ఒకేసారి బహుళ బిందువుల వద్ద ఈ కసరత్తును చేపట్టగలదు. దీంతో చిత్రీకరణ సమయం బాగా తగ్గిపోయింది.

● డిజిటల్ ఇమేజ్ కంప్రెషన్‌కు ఉండే గణిత సూత్రాలను శాస్త్రవేత్తలు కొత్త స్కానర్‌లో ఉపయోగించారు. ఫలితంగా.. అల్ట్రాసౌండ్ తరంగానికి సంబంధించిన కొన్ని వేల కొలతలతో (లక్షల సంఖ్యలో అవసరం లేకుండానే) అత్యంత నాణ్యమైన చిత్రాలను సేకరించడానికి వీలైంది.

ఈ విధానాల వల్ల.. పాత స్కానర్లతో పోలిస్తే 100 నుంచి వెయ్యి రెట్లు వేగంగా కొత్త స్కానర్లు పనిచేస్తాయి.

శరవేగంగా వ్యాధి నిర్ధారణ

పీఏటీ ఇమేజింగ్‌లో వేగాన్ని పెంచడం వల్ల వృద్ధులకు ప్రయోజనం కలుగుతుంది. శరీర కదలికలతో చిత్రాలు మసకబారే సమస్య ఉండదు.

● అప్పటికప్పుడు చిత్రాలను పొందొచ్చు. దీనివల్ల వైద్యులు నేరుగా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు తొలిసారిగా వీలు కలగనుంది.

● ఈ కొత్త స్కానర్‌తో క్యాన్సర్, గుండె జబ్బులను సులువుగా గుర్తించొచ్చు. శరీర అంతర్భాగాలు, వ్యాధుల వ్యాప్తి తీరు గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవొచ్చు.

● ఇన్‌ప్లమేటరీ ఆర్థరైటిస్‌ను పరిశీలించడం రెండు చేతుల వేళ్లలోని 20 జాయింట్లను స్కాన్ చేయాల్సి ఉంటుంది. కొత్త స్కానర్‌తో ఈ ప్రక్రియను కొద్ది నిమిషాల్లో పూర్తి చేయవచ్చు. పాత పీఏటీ స్కానర్లు ఇందుకు గంట వరకూ సమయాన్ని తీసుకుంటాయి.

● టైప్-2 మధుమేహం ఉన్నవారి కాళ్ల దిగువ భాగం, పాదాలకు రక్తప్రవాహం తక్కువగా ఉంటుంది. దీన్ని పెరిఫెరల్ వాస్క్యులర్ డిసీజ్ (పీవీడీ)గా పేర్కొంటారు. ఈ ప్రక్రియను విస్పష్టంగా వీక్షించే వెసులుబాటు ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలకు లేదు. కొత్త స్కానర్‌తో కాళ్లలోని సూక్ష్మ రక్తనాళ వ్యవస్థకు సంబంధించిన సవివర త్రీడీ చిత్రాలను పొందొచ్చు. ఆ నాళాల్లోని మార్పుల ఆధారంగా పీవీడీ ఆరంభ సంకేతాలను పట్టుకోవచ్చు.

● క్యాన్సర్లు, కణితుల్లో రక్తనాళాలు దట్టంగా ఉంటాయి. ఇతర ఇమేజింగ్ విధానాలతో వీటిని వీక్షించడం కష్టం. కణితిలోని రక్తనాళాలను పరిశీలించడం ద్వారా కణితి కణజాలాన్ని నిపుణులు సులువుగా గుర్తించేందుకు పీఏటీ పరిజ్ఞానం వీలు కల్పిస్తుంది. తద్వారా శస్త్రచికిత్స సమయంలో కణితిని సమూలంగా తొలగించి, అది మళ్లీ ఉత్పన్నం కాకుండా చూడొచ్చు.

● రొమ్ము క్యాన్సర్‌తో ముడిపడిన చర్మ ఇన్ఫెక్షన్లనూ కొత్త స్కానర్ సాయంతో గుర్తించొచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగము

నెతన్యాహు నివాసమే లక్ష్యంగా..

- డ్రోన్లను ప్రయోగించిన హెజ్‌బొల్లా
- ప్రధాని సురక్షితమన్న ఇజ్రాయెల్
- కొనసాగుతున్న ఐడీఎఫ్ దాడులు
- గాజాలో 50 మంది మృతి

జెరూసలెం, బీరుట్: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ హత్యకు ప్రతీకారంగా హెజ్‌బొల్లా శనివారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై డ్రోన్ల దాడి చేసింది. మొత్తం మూడు డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో ఒకటి ఉత్తర ఇజ్రాయెల్‌లోని సెసెరియా నగరంలో ప్రధాని నివాసం ఉన్న భవనాన్ని తాకింది. ఆ సమయంలో ఇంటిలో నెతన్యాహు, ఆయన భార్య లేరని ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన మూడు డ్రోన్లల్లో రెండింటిని మధ్యలోనే కూల్చివేశామని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఒక డ్రోన్ మాత్రం ఓ భవనాన్ని తాకిందని తెలిపింది. ఏ మేరకు నష్టం వాటిల్లిందన్న వివరాలను వెల్లడించలేదు. ఇజ్రాయెల్ మాత్రం ఈ దాడులు ఇరాన్ పనేనని ఆరోపిస్తోంది. ఈ ఘటనపై నెతన్యాహు స్పందిస్తూ.. ఏ దాడులూ తమను అడ్డుకోలేవని అన్నారు. విజయాన్ని సాధించేవరకు యుద్ధాన్ని ఆపేదే లేదని తెలిపారు. మరోవైపు గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఉత్తర గాజాలో 50 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని బెకా లోయలో ఐదుగురు చనిపోయినట్లు ఆ దేశ ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. లెబనాన్ రాజధాని బీరుట్‌పైనా శనివారం ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది.

హమాస్ ఉనికికి ఢోకా లేదు: ఖమేనీ

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు హతమార్చడంపై ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. సిన్వర్ మృతి బాధ కలిగిస్తోందని, అయినప్పటికీ అతడు అమరుడు కావడంతో అంతా అయిపోయినట్లు కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ దాడిలో అతడు చనిపోయినా హమాస్ ఇంకా ఉనికిలోనే ఉందని.. ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు.

హమాస్ నూతన అధిపతిగా ఖాలెద్ మషాల్



హమాస్ నూతన అధిపతిగా ఖాలెద్ మషాల్ ఎంపికయ్యారు. విదేశాల్లో హమాస్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న మషాల్.. సిన్వర్ స్థానాన్ని భర్తీ చేయనున్నట్లు లెబనాన్‌కు చెందిన ఎల్‌బీసీఐ న్యూస్ వెబ్‌సైట్ తెలిపింది. యూఏఈ, ఈజిప్టు, అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న గాజా కాల్పుల విరమణ చర్చల్లో ఇక నుంచి మషాల్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని ఆ దేశాలకు హమాస్ నాయకత్వం తెలిపినట్లు వెబ్‌సైట్ పేర్కొంది.

70 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ పోటీ

ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ వెల్లడి



రాంచీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి పక్షాలు ఉమ్మడిగానే పోటీ చేస్తాయని జేఎంఎం నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. మొత్తం 81 స్థానాలకుగాను 70 సీట్లలో జేఎంఎం, కాంగ్రెస్ బరిలో ఉంటాయన్నారు. మిగిలిన 11 స్థానాల్లో సీట్ల సర్దుబాటుపై ఆర్జేడీ, లెఫ్ట్ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని శనివారం వెల్లడించారు. మిత్ర పక్షాలతో సంప్రదింపులు కొలిక్కి వచ్చిన తర్వాత అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

ఆర్జేడీ అసంతృప్తి

సీట్ల సర్దుబాటుపై హేమంత్ సోరెన్ చేసిన ప్రకటన పట్ల మిత్రపక్షమైన ఆర్జేడీ అసంతృప్తి వ్యక్తం చేసింది. జేఎంఎం, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీ చేస్తాయనడం ఏకపక్ష నిర్ణయంగా ఉందని ఆర్జేడీ అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ తెలిపారు.

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు 66 మంది అభ్యర్థులతో

భాజపా తొలి జాబితా

దిల్లీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు తమ అభ్యర్థుల తొలి జాబితాను భాజపా శనివారం విడుదల చేసింది. ఒకే విడతలో 66 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ధన్వార్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ, సరాయ్‌కెలా నుంచి మాజీ సీఎం చంపయీ సోరెన్ పోటీ చేయనున్నారు. ఇదే జాబితాలో రాష్ట్ర సీఎం, జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్, కేంద్ర మాజీ మంత్రి సుదర్శన్ భగత్, గీతా కోడా పేర్లున్నాయి. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకుగాను భాజపా 68 సీట్లలో పోటీ చేస్తుండగా మిగిలినవాటిని మిత్రపక్షాలకు కేటాయించింది.

తాజా సాంకేతిక పరిణామాలను
సివిల్ సర్వెంట్లు గుర్తెరగాలి: ప్రధాని



దిల్లీ: పెరుగుతున్న జీవన ప్రమాణాల నేపథ్యంలో పౌరుల అవసరాలకు తగినట్లుగా పనిచేయాలంటే సివిల్ సర్వెంట్లు తాజా సాంకేతిక పరిణామాలను గుర్తెరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో శనివారం 'కర్మయోగి శపథ్' పేరిట జాతీయ అభ్యసన వారం ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. కొత్త ఆలోచనల కోసం స్టార్టప్ కంపెనీలు, పరిశోధన సంస్థలు, యువత సాయం తీసుకోవాలన్నారు. కృత్రిమమేధతో సమాచార ప్రక్రియ చాలా సులువుగా మారిందని, పౌరులకు సమాచారం అందించడంతోపాటు ప్రభుత్వ కార్యకలాపాలు అన్నింటిపై నిఘా పెట్టడానికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. ఇందులో మిషన్ కర్మయోగి ఉపయోగపడుతుందన్నారు. "కృత్రిమ మేధను యావత్ ప్రపంచం ఓ అవకాశంగా చూస్తోంది. భారత్‌కు మాత్రం ఇది ఓ సవాలు.. అవకాశం కూడా. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), యాస్పిరేషనల్ ఇండియా (ఏఐ /ఆకాంక్షలతో కూడిన భారత్)ల నడుమ మనం సమతుల్యత పాటించాలి. ఇందులో విజయం సాధించి కృత్రిమమేధను చక్కగా వాడుకోగలిగితే సానుకూల మార్పులను చూడవచ్చు. 2047 నాటికి మన లక్ష్యమైన వికసిత్ భారత్‌ను సాధించవచ్చు" అని ప్రధాని అన్నారు.

ఒకేరోజు 30కి పైగా విమానాలకు
బాంబు బెదిరింపులు

- వాటిలో హైదరాబాద్-చండీగఢ్ విమానం కూడా..

దిల్లీ: దేశంలో విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. శనివారం ఒక్కరోజే విస్తారా, ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, స్టార్‌ఎయిర్, అలయన్స్ ఎయిర్ సహా వివిధ భారతీయ విమానయాన సంస్థలకు చెందిన 30కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. వీటిలో హైదరాబాద్-చండీగఢ్ ఇండిగో విమానం కూడా ఉంది. అది గమ్యస్థానానికి చేరిన తర్వాత ప్రయాణికుల్ని సురక్షితంగా దింపి, తనిఖీలు నిర్వహించారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు 70 విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయనీ, ఇవన్నీ ఉత్తుత్తివేనని అధికారులు తేల్చారు. తాజాగా.. బెంగళూరు నుంచి ముంబయికి వెళ్లేందుకు టేకాఫ్‌కు సిద్ధమైన ఆకాశ ఎయిర్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విస్తారా విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు దారిమళ్లించారు. దిల్లీ-పారిస్ విస్తారా విమానాన్ని కూడా అత్యవసరంగా దించేశారు. ఇవన్నీ నకిలీ బెదిరింపులేనని అధికారులు తేల్చారు. బెదిరింపుల కలకలం నేపథ్యంలో 'పౌర విమానయాన భద్రత మండలి' (బీసీఏఎస్) అప్రమత్తమైంది. వివిధ విమానయాన సంస్థల సీఈఓలతో దిల్లీలో సమావేశం నిర్వహించింది. ప్రయాణికులకు అసౌకర్యం, సంస్థలకు నష్టం కలగకుండా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అనుసరించాలని కోరింది.



కష్టాలు.. మన పాలిట ఆశీర్వాదాలు

మీరు విజయాలు సాధించినప్పుడు,
ఆనందంగా ఉన్నప్పుడు మాత్రమే
దేవుడికి కృతజ్ఞతలు చెప్పడం కాదు..
పరాజయాలు పలకరించినప్పుడూ,
బాధల్లో ఉన్నప్పుడు కూడా
ధన్యవాదాలు తెలపండి. ప్రతికూలతలు
ఎదురైనప్పుడే జీవితాన్ని మార్చు
కోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతారు.
అంటే కష్టాలన్నవి మన మంచి కోరి
దేవుడిచ్చిన ఆశీర్వాదాలన్నమాట.
– టైలర్ టాడ్, ఫిట్‌నెస్ కోచ్

ఎన్‌సీడబ్ల్యూ కొత్త ఛైర్‌పర్సన్‌గా
విజయా కిశోర్ రహాట్కర్



ఈనాడు, దిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) 9వ ఛైర్‌పర్సన్‌గా విజయా కిశోర్ రహాట్కర్ నియమితులయ్యారు. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్లపాటు లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు (ఏదీ ముందు అయితే అది) ఆమె ఈ పదవిలో ఉంటారు. ఆమె నియామకం వెంటనే అమలులోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. విజయ 2016-21 మధ్య మహారాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2007-10 మధ్యకాలంలో ఛత్రపతి శంభాజీనగర్ మేయర్‌గానూ సేవలందించారు. ఈమె మహిళల న్యాయపరమైన సమస్యలపై 'విధిలిఖిత్' అనే పుస్తకం రాశారు. మహిళల సాధికారతకు చేసిన కృషికి గానూ జాతీయ న్యాయ పురస్కారంతో పాటు, జాతీయ సాహిత్య మండలి నుంచి సావిత్రిబాయి పులే పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. మహారాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నప్పుడు యాసిడ్‌దాడి బాధితులను ఆదుకొనేందుకు 'సక్షమ', మహిళా స్వయం సహాయక సంఘాలను కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానించేందుకు 'ప్రజ్వల', మహిళలకు 24 గంటలు సహాయం అందించేందుకు వీలుగా 'సుహిత' హెల్ప్‌లైన్ అనే పథకాలను అమలుచేశారు. కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ అర్చనా మజుందార్ నియమితులయ్యారు.

మిగిలిన దౌత్యవేత్తలపైనా నిఘా: కెనడా



మెలానీ జోలీ

ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌తో దౌత్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరి మారడం లేదు. ప్రధాని జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని ప్రభుత్వం మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ట్రూడో మాటల్నే తాజాగా కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. "అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై అణచివేతకు పాల్పడటాన్ని సహించబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, బ్రిటన్‌లలో రష్యా ఆ పని చేసింది" అని జోలీ చెప్పారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా? అని అడగ్గా- వారిపై నిఘా ఉంచామని, వారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారని చెప్పారు.

డిసెంబరులోనే అరెస్టైన వికాస్ యాదవ్

దిల్లీ: సిక్కు వేర్పాటువాది పన్నూను అమెరికాలో హత్య చేసేందుకు కుట్రపన్నారనే అభియోగాలు ఎదుర్కొంటున్న భారతీయుడు వికాస్ యాదవ్‌ను దిల్లీ పోలీసులు గత డిసెంబరులో వేరే కేసులో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరుతో ఓ వ్యాపారి నుంచి డబ్బు డిమాండ్ చేసిన కేసులో అరెస్టయిన యాదవ్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్ లభించింది. యాదవ్ ఎంతమాత్రం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే అమెరికాకు స్పష్టంచేసింది.

నేటి శారీరక శ్రమ.. భావి మానసిక చురుకుదనానికి బాట!



లండన్: నిద్ర, వ్యాయామం, గుండె కొట్టుకునే రేటు, భావోద్వేగాల ప్రభావాలు మన మెదడుపై రెండు వారాలకుపైగా కొనసాగుతాయని తాజా అధ్యయనం తేల్చింది. కొందరు పరీక్షార్థుల మెదడు, వ్యవహారశైలిని స్కాన్‌లు, వేరబుల్ సాధనాలు, స్మార్ట్‌ఫోన్ల సాయంతో ఐదు నెలల పాటు పర్యవేక్షించిన ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ మేరకు నిర్ధారించారు. మన వ్యవహారశైలి, మానసిక స్థితిని పరిసరాలు, అనుభవాలు నిరంతరం తీర్చిదిద్దుతుంటాయి. అయితే, ఇవి మెదడుపై ఎంతకాలంపాటు ప్రభావం చూపుతాయన్నదానిపై శాస్త్రవేత్తలకు ఇప్పటివరకూ పెద్దగా అవగాహన లేదని పరిశోధనకు నాయకత్వం వహించిన అన్నా ట్రియానా పేర్కొన్నారు. రోజువారీ జీవితానికి సంబంధించిన అంశాలపై మెదడు అప్పటికప్పుడు, ప్రత్యేకించి స్పందించదని తమ పరిశోధనలో తేలినట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా నిద్ర పోకడ, శారీరక శ్రమ, భావోద్వేగాలు, శ్వాసరేటు సాగుతున్న తీరుకు స్పందనగా మెదడు చర్యలు రూపాంతరం చెందుతాయని గుర్తించామన్నారు. అంటే.. గత వారం చేసిన శారీరక వ్యాయామాలు లేదా అనుభవించిన నిద్రలేమి వంటివి వచ్చేవారం కూడా మన మెదడుపై ప్రభావం చూపుతాయని వెల్లడైందన్నారు. ఈ క్రమంలో మన శ్రద్ధ, విషయగ్రహణ సామర్థ్యం, జ్ఞాపకశక్తి ప్రభావితమవుతాయని తెలిపారు. గుండె కొట్టుకునే రేటులో మార్పులు.. మెదడు పనితీరుపై ప్రభావం చూపుతాయని కూడా తాజా పరిశోధనలో తేలింది. శారీరక శ్రమ.. మెదడులోని భిన్న ప్రాంతాల మధ్య పరస్పరం చర్యలు జరిగే తీరుపైనా సానుకూల ప్రభావం చూపగలదని వెల్లడైంది. భావోద్వేగాలు, గుండె స్పందన రేటులో స్వల్ప మార్పులు వచ్చినా.. దాని ప్రభావం తదుపరి 15 రోజుల వరకూ మెదడుపై కొనసాగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

మరియమ్మ హత్య.. మీడియాలో చూశాకే తెలిసింది

పోలీసుల విచారణలో మాజీ ఎంపీ నందిగం సురేష్

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలగపూడిలో 2020 డిసెంబరులో రెండు సామాజికవర్గాల మధ్య చోటుచేసుకున్న రాళ్ల దాడిలో మరియమ్మ అనే మహిళ హత్యతో తనకెలాంటి సంబంధం లేదని బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ పోలీసు విచారణలో చెప్పారు. మర్నాడు టీవీలో చూసి తెలుసుకున్నానన్నారు. ఈ కేసులో 78వ నిందితుడైన ఆయన్ను శనివారం తుళ్లూరు పోలీసులు విచారించారు. వైకాపా హయాంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు సామాజికవర్గాలవారు పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారు. ఎం.మరియమ్మ అనే మహిళకు రాయి తగిలి, ప్రాణాలు కోల్పోయింది. అప్పటి బాపట్ల ఎంపీ సురేష్ పోలీసులపై ఒత్తిడి తెచ్చి బాధ్యులైన ఆయన సామాజికవర్గం వారిపై నామమాత్రపు కేసులు పెట్టించారని, తమకు న్యాయం చేయాలంటూ తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక బాధిత కుటుంబ సభ్యులు తుళ్లూరు పోలీసులను ఆశ్రయించారు. హత్య కేసులో సురేష్‌ను మొదటి నిందితుడిగా చేర్చి కేసు దర్యాప్తు తిరిగి చేపట్టాలని ఫిర్యాదు చేశారు. దీంతో తుళ్లూరు పోలీసులు ఇటీవలే సురేష్‌ను పీటీ వారంట్‌పై అరెస్టు చేశారు. మంగళగిరి కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు కస్టడీ పిటిషన్ వేయడంతో రెండు రోజుల విచారణకు అనుమతిచ్చింది. దీంతో గుంటూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సురేష్‌ను శనివారం తుళ్లూరు పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. 'రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ కేసులో నా పేరు చేర్చాలని ఒత్తిడి చేసి ఉండొచ్చు. మా బంధువులెవరూ ఈ కేసులో లేరు. దాడి ఘటనకు ముందు నేను ఎవరికీ ఫోన్ చేయలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు' అని ఆయన విచారణలో చెప్పినట్లు తెలిసింది.

వరద బాధితుల సహాయార్థం విరాళాల అందజేత







సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు ★ చెక్కు అందిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ★ మంత్రి లోకేశ్‌కు చెక్కు ఇస్తున్న వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ కేంద్రం ప్రతినిధులు

విశాఖపట్నం (వన్‌టౌన్), నెహ్రూనగర్, డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ ప్రైవేట్ స్కూల్స్ (అప్సా) ఆధ్వర్యంలో రూ.64 లక్షల విరాళం చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించినట్లు అప్సా ఛైర్మన్ కొమరగిరి చంద్రశేఖర్, కో ఛైర్మన్ మేకల రవీంద్రబాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అప్సా నాయకులను సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

★ వరద బాధితుల కోసం సీఎం చంద్రబాబుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి రూ. 31,11,116 విలువైన చెక్కును శనివారం అందించారు. విజయవాడలోని తెదేపా పార్టీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జయ సూర్యప్రకాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కోట్ల తనయుడు రాఘవేంద్రారెడ్డి, న్యాయవాది శ్రీనివాస భట్టు, పార్టీ సీనియర్ నాయకుడు లక్కసాగరం లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

★ విజయవాడ వరద బాధితుల సహాయార్థం వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ కేంద్రం తరఫున ఆ సంస్థ అధ్యక్షుడు కోయల వెంకటరెడ్డి రూ.25 లక్షల విరాళం చెక్కును శనివారం విశాఖ నగర తెదేపా కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి అందజేశారు.

జనసేనలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి



పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి దంపతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, గుంటూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, జగ్గయ్యపేట పురపాలక కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశలో బాధ్యతగా పని చేయాలని ఈ సందర్భంగా వారికి పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. కలుషిత తాగునీటి సమస్యను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన దృష్టికి తీసుకొచ్చారని, పరిష్కారానికి మొదటి విడతలో రూ.91 లక్షలతో ఫిల్టర్‌బెడ్లు, ఇతర పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

'విద్యుత్తు ఛార్జీలు పెంచితే ఉద్యమం తప్పదు'

ఈనాడు, అమరావతి: విద్యుత్తు ఛార్జీలు పెంచితే ఉద్యమం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు భిన్నంగా కూటమి ప్రభుత్వ కార్యాచరణ ఉందని విమర్శించారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. "ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ అమలు కోసం 32 లక్షల మంది లబ్ధిదారులను సమీకరించి నవంబరు 18న రాష్ట్రంలోని అన్ని సచివాలయాల వద్ద సామూహికంగా దరఖాస్తులు ఇస్తాం" అని తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఏపీ బార్ కౌన్సిల్ బృందం

- వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల అందజేత
- న్యాయవాదుల సమస్యలు సీఎం దృష్టికి



న్యాయవాదుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, సభ్యులు

ఈనాడు, అమరావతి: ఏపీ బార్ కౌన్సిల్ బృందం శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో కలిసింది. వరద బాధితులను ఆదుకునే నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల డీడీని అందజేసింది. ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, వైస్ ఛైర్మన్ ఎస్.కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, బార్ కౌన్సిల్ పూర్వ ఛైర్మన్ గంటా రామారావు తదితరులు.. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. మృతి చెందిన 905 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ వాటాగా మ్యాచింగ్ గ్రాంట్ కింద ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చెల్లించాలని, ఏపీ న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలని, ఏపీ బార్ కౌన్సిల్ కోసం అమరావతిలోని జస్టిస్ సిటీలో 5 ఎకరాలు ఇవ్వాలని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం హైకోర్టులో ప్రస్తుతం ఉన్న 37 మంది న్యాయమూర్తుల సంఖ్యను 62కి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతిలో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చేందుకు అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నందుకు, జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేల స్టైపెండ్‌ను ప్రకటించినందుకు సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నవ లోగిలికి... చంద్ర తోరణం


రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

న్యూస్‌టుడే, తుళ్లూరు

శుభ తరుణమిది... కోట్లాది మనసులు అభిలషించిన శుభ ఘడియలివి.. రాజధాని అమరావతికి పునఃప్రాణ ప్రతిష్ఠ చేసిన అపురూప సన్నివేశమిది..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయ పనులను శనివారం ప్రారంభించడం ద్వారా కొత్త అధ్యాయానికి తెర తీశారు. దృఢమైన సంకల్పంతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించొచ్చని, సంపద సృష్టించడానికి డబ్బు అవసరం లేదని.. మంచి ఆలోచన ఉంటే చాలని పిలుపునిచ్చిన ఆయన అమరావతి నిర్మాణానికి శుభారంభం చేశారు. రాజధాని ప్రాంత మ్యాపులను పరిశీలించిన అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు ఆయనకు రైతులు ఎదురేగి ఉత్సాహంగా అభివాదం చేశారు. చంద్రబాబు చిరునవ్వుతో అన్నదాతలకు నమస్కరించారు. సమావేశంలో అమరావతి అభివృద్ధిపై సీఎం స్పష్టమైన విధానాలు ప్రకటించడంతో రాజధాని రైతులు కరతాళ ధ్వనులు చేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

మేటి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం..
- పొంగూరి నారాయణ, పురపాలక శాఖ మంత్రి

ప్రపంచంలో టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో 34 వేల ఎకరాలను రైతులు ఇచ్చారు. అప్పట్లో రూ.48 వేల కోట్లతో అమరావతి పనులు ప్రారంభిస్తే.. జగన్ ప్రభుత్వం రాజధానిని నాశనం చేయాలని చూసింది. ఆ చిక్కులు, సమస్యలు, సాంకేతిక ఇబ్బందులను అధిగమిస్తాం. పనుల ప్రారంభానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. డిసెంబరు ఆఖరులోపు పనులకు టెండర్లు పిలవడం పూర్తి చేస్తాం. రైతులకు కౌలు ఇస్తాం.


పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణకుమార్, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్ తదితరులు



సీఆర్డీఏ కార్యాలయ పనుల వివరాలను చిత్ర ప్రదర్శన ద్వారా సీఎంకు వివరిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్

ఇక జెట్ స్పీడే: చంద్రబాబు, ముఖ్యమంత్రి

కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి అభివృద్ధి పనులు జెట్ స్పీడ్‌తో చేపడతాం. రాష్ట్ర విభజనతో కట్టుబట్టలతో హైదరాబాద్ నుంచి వచ్చేశాం. నూతన రాష్ట్ర రాజధాని నిర్మాణానికి భూసమీకరణకు పిలుపునిస్తే... కొద్ది రోజుల్లోనే 34,241 ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. రాష్ట్రానికి రాజధాని ఉండాలన్న సంకల్పంతో అమరావతికి భూములిచ్చిన అన్నదాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. గత వైకాపా ప్రభుత్వం పోలీసు పాలనతో రైతులపై అక్రమ కేసులు పెట్టింది. అడుగడుగునా హింసించింది.

ఇది శుభపరిణామం
- భాస్కర్, సీఆర్డీఏ కమిషనర్

అమరావతి పనుల పునఃప్రారంభం శుభపరిణామం. రానున్న మూడేళ్లలో రాజధానిలో రహదారులు, భవనాలు, శాసనసభ, సచివాలయం, హైకోర్టు కట్టడాలను పూర్తి చేస్తాం. అమరావతికి, ఇక్కడ పెట్టుబడి పెట్టినవారికి మంచి రోజులొచ్చాయి. నాలుగు నెలల్లోనే ఇక్కడ సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయ భవనం నిర్మిస్తాం. సీఆర్డీఏ, ఏడీసీ, పురపాలక, పలు శాఖలు వచ్చేస్తాయి.

ప్రపంచ స్థాయి నగరంగా...



రాజధాని నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునఃప్రారంభించడంతో అమరావతికి కొత్త కళ వచ్చింది. అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని భావిస్తున్నాం. చంద్రబాబునాయుడి సారథ్యంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా గుర్తింపు పొందుతుంది.
- పువ్వాడ సుధాకర్, అమరావతి ఐకాస కన్వీనర్, తుళ్లూరు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047తో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, పోలవరం, రహదారుల అభివృద్ధితో రాష్ట్రం ప్రగతి పథాన పయనించడం ఖాయం.
- మైనేని గిరిజ, రాజధాని రైతు, దొండపాడు

ఉపాధి అవకాశాలొస్తాయి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో అమరావతి నిర్మాణం నిరాటంకంగా సాగుతుంది. దీనివల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పనుల్లేక ఇబ్బందిపడ్డ కార్మికులకు ఉపశమనం లభిస్తుంది.
- బండ్ల పట్టాభిరామయ్య, రాజధాని రైతు, తుళ్లూరు.

ఆ కార్యాలయంతో రైతులకు మేలు



రాజధానిలో సువిశాలమైన సీఆర్డీఏ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరగడానికి దోహదపడుతుంది. సమస్యలను తెలియజేయడానికి విజయవాడ వెళ్లే అవసరం లేకుండా ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తుంది.
- కొమ్మినేని వరలక్ష్మి, రైతు, మందడం

డ్రోన్ షోకు పటిష్ఠ ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, సీపీ రాజశేఖరబాబు

కృష్ణలంక, భవానీపురం: రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం ఈ నెల 22, 23న అమరావతి డ్రోన్ సదస్సు నిర్వహిస్తోందని, 22న సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు కృష్ణా నది తీరాన కల్చరల్ ఈవెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నిధిమీనా సూచించారు. డ్రోన్ సదస్సు - షోపై శనివారం కలెక్టరేట్‌లో సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు, ఉన్నతాధికారులతో కలిసి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. మంగళగిరిలో సీకే కన్వెన్షన్‌లో ఈ నెల 22, 23న సదస్సు జరుగుతుందని, 22న సాయంత్రం పున్నమి ఘాట్-బబ్బూరి గ్రౌండ్స్‌లో కల్చరల్ ఈవెనింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 5 వేలకు పైగా డ్రోన్లతో భారీ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు.. వి-అన్‌బీటబుల్, లేజర్ బీమ్ షో, బాణసంచా కాల్చడం, మ్యూజిక్ బ్యాండ్ తదితర ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ, డ్రోన్ సమ్మిట్, షో విజయవంతానికి సమష్టి కృషి అవసరమన్నారు. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, వీవీఐపీ, వీఐపీ, జనరల్ పబ్లిక్ వారీగా పార్కింగ్, బారికేడింగ్‌పైన ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీఆర్వో శ్రీనివాసరావు, డీసీపీ ఉదయరాణి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. * పున్నమి ఘాట్ వద్ద డ్రోన్ షో ఏర్పాట్లను అధికారులు శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు వస్తారనీ.. నిరంతర విద్యుత్తు, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వసతి, తదితరాలపై దృష్టి సారించాలన్నారు. గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉండాలన్నారు.

మరో 82 రేషన్ దుకాణాలు

కృష్ణలంక: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇచ్చేలా నిత్యావసరాల విషయంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించమని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నిధి మీనా హెచ్చరించారు. చౌక దుకాణాల డీలర్ల నియామక ప్రక్రియపై శనివారం ఆమె అధికారులతో సమీక్షించారు. 800 కార్డులు పైబడిన రేషన్ దుకాణాన్ని రెండుగా విభజించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అదనంగా 82 రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసి డీలర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవోలు కొత్త డీలర్ల నియామకానికి ఈనెల 20న నోటిఫికేషన్ ఇచ్చి.. అర్హులను 12న నియమించాలన్నారు. * కార్డుదారులు బియ్యానికి బదులు మూడు కిలోల జొన్నలు ఉచితంగా పొందే వీలు కల్పించినట్లు నిధిమీనా తెలిపారు. జొన్నల పంపిణీకి డీలర్ల నుంచి ఇండెంట్లు సేకరించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో వి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఎస్వో పాపారావు, ఆర్డీవోలు చైతన్య, మాధురి పాల్గొన్నారు.

కృష్ణా ప్రాజెక్టు.. వేగవంతం

- కుదప కొండపై పూర్తయిన ప్రధాన ట్యాంకు
- కోడూరులో 90 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం
- 2025 జూన్ 25కి పూర్తి చేసే లక్ష్యంతో పనులు

ఈనాడు, అమరావతి

ఎ.కొండూరు పరిధిలోని కిడ్నీ బాధిత తండాలకు కృష్ణా జలాలు త్వరితగతిన అందించాలనే లక్ష్యంతో చంద్రబాబు సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. జిల్లాలోని కుదప వద్ద ఉన్న కృష్ణా జలాల సంపు నుంచి ఎ.కొండూరుకు నీటిని అందించేందుకు చేపడుతున్న పైపులైన్, ట్యాంకుల పనులు 60 శాతం పైగా పూర్తయ్యాయి. కీలకమైన 76 కిలోమీటర్ల పైపులైన్ పనుల్లో ఇప్పటివరకూ 40 కిలోమీటర్లు పూర్తయింది. కుదప వద్ద కొండపై కడుతున్న భారీ ట్యాంకు నిర్మాణం పూర్తయింది. కోడూరులో 90 వేల లీటర్ల ట్యాంకు నిర్మాణాన్ని ప్రస్తుతం ఆరంభించారు. జాతీయ రహదారి మీదుగా 25 కిలోమీటర్ల పైప్‌లైన్‌ను ప్రస్తుతం చేపట్టాలి. దీనికి డబ్బుల చెల్లింపులన్నీ పూర్తయ్యాయి. త్వరలోనే జాతీయ రహదారుల సంస్థ నుంచి అనుమతులు రాగానే ఈ పనులు ఆరంభిస్తారు. ఈ 25 కిలోమీటర్ల పైప్‌లైన్‌ను ఇప్పటికే తీసుకొచ్చేశారు. వచ్చే ఏడాది జూన్ 25 నాటికి పనులను పూర్తిచేసి.. గిరిజన తండాలకు కృష్ణా జలాలను అందించాలనేది లక్ష్యం.

భావితరాలకు అండగా...

ఎ.కొండూరు కిడ్నీ బాధిత తండాల్లో మరణాలు ఇప్పటికీ ఆగడం లేదు. కనీసం తమ భవిష్యత్తు తరాలనైనా కాపాడుకోవాలంటే.. తమకు స్వచ్ఛ జలాలు అందించాలని ఏళ్లుగా కోరుతున్నారు. గత జగన్ ప్రభుత్వం ఇదిగో అదిగో అని ఐదేళ్లు కాలయాపన చేసిందే తప్ప.. గిరిజన తండాలకు చేసిందేమీ లేదు. సీఎం హోదాలో నాడు జగన్ స్వయంగా వచ్చి కృష్ణా జలాల ప్రాజెక్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేశారు. గత ఐదేళ్లలో కనీసం 350 మందికి పైగా గిరిజనులు కిడ్నీ వ్యాధితో మరణించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే కృష్ణా జలాల ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు త్వరితగతిన సాగుతున్నాయి. విజయవాడ సర్కిల్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ పర్యవేక్షణలో పనులను లక్ష్యంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రోజువారీ సమీక్ష నిర్వహిస్తూ పనులు చేపడుతున్నారు.


ముమ్మరంగా పైప్‌లైన్ పనులు


కుదప కొండపై నిర్మాణం పూర్తయిన ప్రధాన ట్యాంకు


కోడూరు వద్ద ట్యాంకు నిర్మాణ పనులు ఆరంభం

38 గిరిజన తండాలకు నీళ్లు..

నీటి సరఫరాలో కీలకమైన కుదప ట్యాంకు పూర్తయింది. ఇక్కడి నుంచి 38 కిడ్నీ బాధిత గ్రామాలకు నీటిని సరఫరా చేస్తారు. ఆ గ్రామాల్లో ఉన్న పాత నీటి ట్యాంకులతోపాటు... కొత్తగా మరికొన్ని నిర్మిస్తున్నారు. కొత్త, పాత కలిపి 36 నీటి ట్యాంకులను సిద్ధం చేస్తున్నారు. వీటిలో అతిపెద్దది కోడూరులో నిర్మిస్తున్నారు. దీని సామర్థ్యం 90 వేల లీటర్లు. ప్రస్తుతం దీని పనులు జరుగుతున్నాయి. ఇవికాక.. 20 వేల నుంచి 60 వేల మధ్య సామర్థ్యం ఉన్న మరో 13 ట్యాంకులను కట్టనున్నారు. ఈ పనులన్నీ ఒకే సమయంలో ఆరంభించి.. అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

త్వరగా అందించడమే లక్ష్యంగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు కలిపి రూ. 49.94 కోట్లతో ఎ.కొండూరు గిరిజన తండాల కోసం ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. కుదప వద్ద కొండపై భారీ ట్యాంకు నిర్మాణం ఆరంభించి.. ప్రస్తుతం దానిని పూర్తిచేశారు. తొలుత సంపు నుంచి నీటిని ఈ ట్యాంకుకు ఎక్కించి.. అక్కడి నుంచి దిగువన ఉన్న ఎ.కొండూరు మండల తండాలకు సరఫరా చేయనున్నారు. 2025 జూన్ నాటికి పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. లక్ష్యంలోగా పనులు పూర్తయితే అన్ని గ్రామాలకూ ఒకేసారి నీటిని అందిస్తారు. లేదంటే.. కనీసం 90శాతం పనులైనా అనుకున్న సమయానికి పూర్తిచేసి.. ఒకవైపు గ్రామాలకు నీటిని సరఫరా చేస్తూ.. మరోవైపు మిగతావి చేపట్టనున్నారు. దీనికోసమే ముందుగా ట్యాంకుల నిర్మాణాన్ని పూర్తిచేస్తున్నారు.

రీ సర్వేలో.. ఏమార్చేశారు!

127 మంది ఆక్రమణ చెరలో దుర్గగుడి భూములు



కొన్న వారిలో ఆందోళన.. క్రమబద్ధీకరణ యత్నాలు

ఈనాడు, అమరావతి

'విజయవాడ పరిధిలో పాత సర్వే నెంబరు 118.. కొత్త సర్వే నెంబరు 112లో భూమి ఆర్‌ఎస్‌ఆర్ (రీసర్వే సెటిల్‌మెంటు రిజిస్టర్)లో 'కనకదుర్గం సంవత్సరంలో అయిదు రోజులు' అని వర్గీకరించి ఉంది. 1964లో టౌన్ సర్వే రికార్డు ప్రకారం రెవెన్యూ వార్డు 14 బ్లాక్ నెంబరు 15లో ఎన్‌టీఎస్ నెంబర్లు 1-20 వరకు, బ్లాక్ నెంబరు 16లో ఎన్‌టీఎస్ 1, 2, 3గా నమోదయ్యాయి. ఇవి ప్రైవేటు భూమి ఆంధ్రా సిమెంట్ కర్మాగారంగా వర్గీకరించి ఉంది. ఆర్‌ఎస్‌ఆర్, టీఎస్‌ఆర్, ప్రస్తుతం అక్కడ ఇంటి నెంబర్లు, యజమానులు, అసెస్‌మెంట్ నెంబరు (ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను) వివరాలు పొందుపరిచాం. తదుపరి చర్యలు తీసుకోగలరు.' - విజయవాడ నగరపాలక కమిషనర్ ధ్యానచంద్ర (3.10.24న) కలెక్టర్‌కు రాసిన లేఖ సారమిదీ.

దుర్గగుడికి చెందిన రూ.200 కోట్ల విలువైన 11.54 ఎకరాలు మాయంపై 'ఈనాడు' వరుస కథనాలతో వెలుగులోకి తేగా.. ఆ గుట్టు తేల్చే దస్త్రం కదులుతోంది. ఒకప్పుడు దేవస్థానం భూములు క్రమేపీ పట్టా భూములుగా మారి... ప్రైవేటు లే ఔట్ వెలసి స్థిరాస్తి వ్యాపారం జరిగింది. ప్రస్తుతం ఇది వెలుగు చూడగా స్థలాలు కొన్న వారిలో కలవరం మొదలైంది. భూ యాజమాన్య హక్కులకు ఆర్‌ఎస్‌ఆర్ ప్రామాణికం కావడంతో దేవదాయ శాఖ భూములను పట్టణ రీసర్వే జరిగినప్పుడే ఎన్‌టీఎస్ నెంబర్లుగా మార్చేసి అమ్మేశారు. నగరపాలిక రికార్డులను కలెక్టర్‌కు ఇచ్చినా.. రెవెన్యూ రికార్డులను బయటపెట్టలేదు. ఈభూముల్లో బహుళ అంతస్తులు, విలాస భవనాలు వెలవగా.. చాలామంది వ్యాపారులు, ఐఏఎస్ అధికారులే యజమానులు. మరోవైపు నగదు చెల్లించి ఈ భూములను క్రమబద్ధీకరించుకునే యత్నాలు ప్రారంభించారు.

దేవదాయ శాఖ, దుర్గగుడి అధికారులు పట్టించుకోక భూముల గుర్తింపు ఓ పట్టాన జరగలేదు. ఆర్‌ఎస్‌ఆర్ ప్రామాణికంగా దుర్గగుడి భూములుగా గుర్తించి సామాజిక కార్యకర్త కృష్ణారావు దరఖాస్తు చేసే వరకు ఆలయ అధికారులకే తెలీదు. తర్వాత కూడా వారు పరిరక్షణకు ఆసక్తి చూపలేదు. దీనిపై నిరంతర అనుశీలనతో నగరపాలిక, మండల రెవెన్యూ అధికారులు భూములను గుర్తించి సర్వే చేశారు. వీటిని ముందుగా నిషేధిత జాబితాలో చేర్చాలని అప్పటి కలెక్టర్, జేసీ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించినా ఫలితం లేదు. రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు వస్తేనే రిజిస్ట్రేషన్లు ఆపేస్తామని సబ్‌రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఎట్టకేలకు సర్వే పూర్తవగా పాలిక రికార్డులోనే వర్గీకరణ మారి ప్రైవేటు భూమిగా మార్చారని తేల్చారు.

వాళ్లందరి పేర్లతో..

దుర్గగుడి భూములు 11.54 ఎకరాలు 127 మంది పేర్లతో నగరపాలికలో అసెస్‌మెంటు చేసి ఉన్నాయి. వీటిలో రహదారులూ ఉన్నాయి. మొదట ఆంధ్రా సిమెంట్ కర్మాగారంగా నమోదైంది. తర్వాత 2004లో లేఔట్‌గా మార్చి నివేశన స్థలాలు చేశారు. సర్వేనెంబరు 112లో (పాత సర్వేనెంబరు 118) లెక్క తీయగా లోటస్ ల్యాండ్ మార్క్ ప్రాంతంగా ఉందని తేల్చారు. ఎల్‌పీ నెంబరు 11/2004, రివైజ్డ్ ఎల్‌పీ నెంబరు 4/2006గా గుర్తించారు. రీసర్వే నెంబరు 112లో భూమి ఆర్‌ఎస్‌ఆర్‌లో కనకదుర్గం సంవత్సరంలో అయిదు రోజులు కాపుగా నమోదైంది. 1964లో టౌన్ సర్వే రికార్డు దఖలా రెవెన్యూ వార్డు నెంబరు 14లో బ్లాకు నెంబరు 15గా ఉన్నాయి. ఎన్‌టీఎస్ నెంబర్లు 1-20 వరకు, వార్డు నెంబరు 14 బ్లాకు నెంబరు 16లో ఎన్‌టీఎస్ నెంబర్లు 1, 2, 3గా ఉన్న వాటి ఇంటింటి సర్వే చేశారు. ఆక్రమణదారుల వివరాలను, ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లిస్తున్న వారి వివరాలను జతపరిచి వీఎంసీ కమిషనర్ కలెక్టర్‌కు నివేదించారు. దీంతో ఈ సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో చేర్చి తదుపరి చర్యలు తీసుకునే వీలుంది.

కీలక శాఖలతో సంప్రదిస్తున్నాం

ఈ వ్యవహారం 2023 డిసెంబరులో జి.కృష్ణారావు దరఖాస్తు ద్వారా మా దృష్టికి వచ్చింది. కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో దస్త్రాలు, ఐఎఫ్‌ఆర్ కోసం మా సిబ్బంది వెళ్లగా లభించలేదు. ఈ భూములను దేవదాయశాఖవిగా నిషేధిత జాబితాలో చేర్చాలని మళ్లీ కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. ఈ అర్జీని మరోసారి దేవదాయ శాఖకు కలెక్టర్ పంపారు. దీనిపై న్యాయసలహా తీసుకోగా దేవాలయ ఆస్తుల రిజిస్టర్‌లోనూ, నిషేధిత జాబితాలోనూ చేర్చాలని సూచించారు. మరోసారి కృష్ణారావు దరఖాస్తుపై జేసీకి ఫిర్యాదు చేయగా.. మాకు నోటీసులు అందాయి. దీనిపై విచారణకు హాజరై సర్వే చేయాలని కోరాం. రెవెన్యూ, జిల్లా దేవదాయ, మున్సిపల్ అధికారులతో సంప్రదిస్తున్నాం. – రామారావు, ఈవో

సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వరద హెచ్చరికల కారణంగా కృష్ణా నది తీరంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తగిన సమాచారం ఇవ్వడానికి, సహాయం చేయడానికి ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కృష్ణా నదిలో నీటి మట్టం శనివారం నాటికి పెరగడంతో పాటు, మరింత పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్లోని అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు.

కంట్రోల్ రూం నెంబర్లు ఇవే..
బాధితులకు అవసరమైన సాయం కోసం 81819 60909, 0866 2427485, 0866-2424172 నెంబర్లకు ఫోన్ చేయాలని కమిషనర్ కోరారు.



మహిళా సాధికారతకు జ్యోత్స్న ఎనలేని కృషి



హాజరైన జస్టిస్ టి.రజని

మంగళగిరి, దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుళ్లపల్లి జ్యోత్స్న ఆశయాలను కొనసాగించడమే ఆమెకిచ్చే ఘనమైన నివాళి అని, సమాజానికి ఆమె చేసిన సేవలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న సంతాప సభ శనివారం మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద ఉన్న సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..'తరుణీ తరంగాలు' ప్రధాన కార్యదర్శిగా, 'సేఫ్' వ్యవస్థాపకురాలిగా జ్యోత్స్న చేసిన సేవలను స్మరించుకున్నారు. మహిళల పక్షాన అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి నుంచి వామపక్ష భావాలతో పెరిగిన ఆమె మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని, ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు. జ్యోత్స్న ముందుగానే తీసుకున్న నిర్ణయం మేరకు కుటుంబ సభ్యులు ఆమె శరీరాన్ని మంగళగిరి ఎన్నారై ఆసుపత్రికి దానం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ శేషసాయి, జస్టిస్ టి. రజని, తెలంగాణ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ ఆశాలత, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, మాజీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, అక్కినేని వనజ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కేరళ హైకోర్టు లాయర్ల సంఘం అధ్యక్షుడు థామస్ అబ్రహం, రామోజీ ఫిలిం సిటీ ఎండీ విజయేశ్వరి, సీపీఎం నేత బాబురావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శివరాంప్రసాద్, పలువురు పారిశ్రామికవేత్తలు, విద్యా వేత్తలు, వైద్యులు పాల్గొన్నారు.



జ్యోత్స్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆమె భర్త, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు



హాజరైన ప్రముఖులు

ఉన్నదంతా ఊడ్చి పెట్టారు

- కోర్టుల్లో ఉద్యోగాల పేరుతో మోసం
- రూ.లక్షల్లో వసూళ్లు
- అడిగితే చంపేస్తానని వైకాపా నాయకుడి బెదిరింపులు



మోసం చేసిన వారి చిత్రాలు చూపుతున్న బాధితులు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే : కొందరు న్యాయమూర్తులు, అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తమకు తెలుసని, కోర్టుల్లో ఉద్యోగాలు, చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు ఇప్పిస్తామంటూ రూ. లక్షలు వసూలు చేసిన ముఠా బాగోతం బయటపడింది. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకున్న వైకాపా నాయకుడు రెండేళ్లుగా బాధితులను ఇబ్బంది పెడుతున్నాడు. ఆత్మహత్యే శరణ్యం అనుకున్న సమయంలో తెదేపా నాయకుల చొరవతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మీడియాను ఆశ్రయించి వివరాలు వెల్లడించారు.

పల్నాడు జిల్లా నూజండ్ల మండలంలో లింగం నిర్మలాదేవి కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆమెకు ఏలూరు జిల్లాకు చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు జెల్లూరి రామలక్ష్మితో ఐదేళ్లుగా పరిచయం ఉంది. 2022 సెప్టెంబరులో నిర్మలాదేవికి రామలక్ష్మి ఫోన్ చేసి తనకు విజయవాడకు చెందిన వైకాపా నాయకుడు షేక్ అహ్మద్ ఒక వివాహంలో పరిచయం అయ్యాడని, అతనికి పార్టీలో మంచి పలుకుబడి ఉందని చెప్పారు. అతనికి న్యాయవాది టి.వెంకటరమణారావు తెలుసని చెప్పారు. కృష్ణా జిల్లా కోర్టుల్లో క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిందని, న్యాయవాది వెంకటరమణారావుకు తెలిసిన న్యాయమూర్తులు ఉన్నారని అతని ద్వారా నేరుగా ఆ ఉద్యోగాలు పొందవచ్చని అహ్మద్ చెప్పినట్లు పేర్కొన్నారు. క్లర్క్‌కు రూ. 10లక్షలు, జూనియర్ అసిస్టెంట్‌కు రూ. 12లక్షలు చెల్లిస్తే ఉద్యోగం వస్తుందని చెప్పారు. దీంతో నిర్మలాదేవి క్లర్క్ ఉద్యోగం, రామలక్ష్మి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కావాలని కోరారు. మొదటి విడత చెరో రూ. 5లక్షలు అహ్మద్, వెంకటరమణారావు, న్యాయవాది సహాయకుడు కిషోర్‌లకు విద్యాధరపురంలో ఇచ్చారు. ఉద్యోగం వచ్చిన తర్వాత మిగిలినవి ఇవ్వాలని వారు మహిళలకు సూచించారు. అదే సమయంలో రామలక్ష్మి కుమార్తె డిగ్రీ పూర్తి చేశారు. ఆమెకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం మరో రూ.5లక్షలు సమర్పించారు. 2023 నవంబరులో ముగ్గురికీ ఉద్యోగాలు వచ్చినట్లు అహ్మద్ నకిలీ నియామక పత్రాలను వాట్సప్ ద్వారా వారికి పంపాడు. ఉద్యోగాలు పొందిన వారి పేర్ల స్థానంలో ముగ్గురి పేర్లను ఉంచి పంపాడు. మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరగా నిర్మలాదేవి రూ.5 లక్షలు, రామలక్ష్మి, ఆమె కుమార్తెకు చెందిన డబ్బులు రూ.14 లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత అహ్మద్ పంపిన నియామకపత్రం నకిలీదిగా గుర్తించి ప్రశ్నించగా చంపుతామని బెదిరించారు. తమ వెనుక పెద్దలు ఉన్నారని, హత్య చేసినా మూడు రోజుల్లో బయటకు వచ్చేస్తామంటూ బెదిరింపులకు దిగారు.



మాజీ సీఎం జగన్‌తో నిందితుడు అహ్మద్



న్యాయవాది వెంకటరమణారావు

కోళ్ల వ్యర్థాలు ఇప్పిస్తామంటూ..

చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు ఇప్పిస్తామంటూ అహ్మద్, అతని బృంద సభ్యులు రూ. లక్షల్లో డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారు. రామలక్ష్మి ద్వారా జులూరి విజయకుమారి అనే మహిళను అహ్మద్ పరిచయం చేసుకున్నాడు. విజయకుమారి మేనల్లుడు సత్యనారాయణకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, భర్త శ్రీనివాస్‌కు చేపల చెరువుల్లో వేసేందుకు నగరంలోని చికెన్ వ్యర్థాలు ఇప్పిస్తానంటూ అహ్మద్ రూ. 22.50 లక్షలు తీసుకున్నాడు.

☛ రామలక్ష్మి భర్త జల్లూరి శ్రీనివాసరావుకు విజయవాడ నగరంలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు, జగనన్న కాలనీల్లో స్థలాలు ఇప్పిస్తానంటూ రూ. 16లక్షలు తీసుకున్నాడు. వారంతా అప్పులు చేసి అతనికి డబ్బులు ఇచ్చాడు. అహ్మద్, అతని బృందం చుట్టూ డబ్బుల కోసం తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో స్థానిక తెదేపా నాయకుల ద్వారా భవానీపురం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరే కాకుండా మరికొందరి వద్ద నుంచి ఈ ముఠా సభ్యులు డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

అప్పు చేసి కట్టా..

నాకు భర్త లేడు. అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నా. కోర్టులో ఉద్యోగం ఇప్పిసానని అహ్మద్ చెప్పడంతో నమ్మి అప్పులు చేసి డబ్బులు ఇచ్చాను. ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించలేదు. నకిలీ నియామకపత్రాన్ని ఇచ్చారు. ఈ విషయమై ప్రశ్నించడంతో చంపుతానని బెదిరిస్తున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. ఈ సమయంలో మీడియా ముందుకు వచ్చాను. **- నిర్మలాదేవి**

పొలం అమ్మి ఇచ్చాం

నాకు, కుమార్తెకు ఉద్యోగం, నా భర్తకు వ్యాపార అవకాశం ఇప్పిస్తానంటే నమ్మి అహ్మద్, న్యాయవాది వెంకటరమణారావులకు పొలం అమ్మి అప్పులు చేసి డబ్బులు ఇచ్చాం. అప్పుల వారి వేధింపులు తట్టుకోలేక విజయవాడ వచ్చేశాం. ఏడాది నుంచి ఇక్కడే ఉంటూ డబ్బులు కోసం తిరుగుతున్నాం. అనేక విధాలుగా మమ్మల్ని బెదిరిస్తున్నారు. **- రామలక్ష్మి**

ప్రభుత్వం న్యాయం చేయాలి

చేపల వ్యర్థాలు ఇప్పిస్తానంటూ, నా మేనల్లుడికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ. 22.50 లక్షలు తీసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వడం లేదు. చంపుతామని బెదిరిస్తున్నారు. **- విజయకుమారి**

పేదల ఇళ్లు ఖాళీ చేయిస్తారా?

విద్యాధరపురం, న్యూస్‌టుడే : పాత రాజరాజేశ్వరిపేటలోని రైల్వే స్థలాలను అమ్ముకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదల ఇళ్లను తొలగించానుకుంటోందని, ఇది దుర్మార్గం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. పాతరాజరాజేశ్వరిపేటలో పదిహేను రోజుల్లో ఇళ్ల తొలగింపుపై రైల్వే అధికారులు దండోరా వేయించడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడ రైల్వేస్టేషన్‌ను 90 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీలకు లీజుకు ఇచ్చిన భాజపా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి పేదల ఇళ్లు కూల్చడానికి సిద్ధపడుతోందని మండిపడ్డారు. వరద కారణంగా నెల రోజులుగా మానసిక ఆందోళనకు గురైన కుటుంబాలకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిలువ నీడ లేకుండా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూలిస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. పేదల ఇళ్ల పరిరక్షణ పోరాటానికి సీపీఎం అండగా నిలుస్తుందన్నారు. మరో కార్యక్రమంలో సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి సత్యబాబు నేతృత్వంలో బృందం శనివారం ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు సంఘీభావం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న 500కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు సూరిబాబు, నారాయణ, మల్లేశ్వరరావు, శంకర్, రమణ, సత్యబాబు పాల్గొన్నారు.



పాత రాజరాజేశ్వరి పేట వాసులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గత ప్రభుత్వ బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై ప్రతినిధులు

విజయవాడ(గాంధీనగర్): గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో కార్యాలయంలో సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ అలసత్వం కారణంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆరు విడతల కరవు భత్యం బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ ఖాతాల్లో దాచుకున్న డబ్బు నుంచి రుణాలు మంజూరు చేయడం, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్మును చెల్లించడంలో తీవ్ర జాప్యం చేశారని ఆరోపించారు. రూ.20వేల కోట్లకు పైగా ఉద్యోగుల బకాయిలను పెండింగ్‌లో పెట్టిందని వాపోయారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, సీపీఎస్ రద్దుపై ఉద్యమం చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లపై కేసులు పెట్టిందని మండిపడ్డారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నూతన ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించడం హర్షణీయమన్నారు. ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటోందని పేర్కొన్నారు. ఐకాస పిలుపు మేరకు ఒక రోజు వేతనం మొత్తం రూ.120 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేసిన ఉద్యోగులను అభినందించారు. నగర శాఖ అధ్యక్షుడు సి.హెచ్.వి.ఆర్. ప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాసరావు, బి.రాజశేఖర్, వి.వి.ప్రసాద్, బి.మధుసూదనరావు, డి.రాజచౌదరి, ఖాసీం సాహెబ్, ఎం.శ్రీనివాసరావు, కె.ఆర్.ఎస్.గణేష్, పి.శ్రీనివాసరావు, శివశంకర్, వరప్రసాద్, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని శనగపాడుకు చెందిన దారావత్ బాలాజీ (50) శనివారం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. బాలాజీ గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం గేదెలను పొలం నుంచి ఇంటికి తోలుకొస్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడ సిటీ): యువతకు నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్ అన్నారు. ది ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ హెచ్‌ఆర్ కాంక్లేవ్‌ని విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ అధ్యక్షుడు దాసరి రామకృష్ణ మాట్లాడుతూ... ఐటీ అసోసియేషన్ సంస్థ ఎలాంటి సిబ్బంది అవసరమో తెలియజేసేందుకు హెచ్.ఆర్.కాంక్లేవ్ నిర్వహించినట్లు తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్‌కుమార్, హెచ్‌సీఎల్ టెక్ అసోసియేట్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్ ప్రసంగించారు. ఐటీపీఎస్ ఛైర్మన్ ఇంద్రజిత్, అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

వంద పడకలే..!

- నందిగామ ప్రభుత్వ వైద్యశాలలో సేవలు నామమాత్రం
- ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని వినతి



నందిగామలో డీవీఆర్ ప్రాంతీయ ఆసుపత్రి

నందిగామ, న్యూస్‌టుడే

నందిగామలో పేరుకే వంద పడకల ప్రభుత్వ వైద్యశాల ఉంది. ఇక్కడ రోగులకు సాధారణ వైద్య సేవలే అందుతున్నాయి. అత్యవసర వైద్యం అవసరమైతే విజయవాడ వెళ్లాల్సిందే. సకాలంలో వైద్యం అందక రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో స్థానిక వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేశారు. భవన నిర్మాణం, స్థలం కొనుగోలుకు నిధులు విడుదల చేయలేదు. కానీ అప్పటి వైకాపా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ముందు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేశారు.

ఇరుకు స్థలంలో..

డీవీఆర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ మేరకు వైద్యులు, సిబ్బందిని నియమించారు. ఐదు ఎకరాల స్థలం కొనుగోలు, భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం జీవోలో పేర్కొంది. నిధులు మాత్రం విడుదల చేయలేదు. ప్రస్తుతం పాత వైద్యశాలలోనే అరకొర సౌకర్యాల మధ్య సేవలు కొనసాగిస్తున్నారు. మూడు వార్డుల్లో ఇరుకు స్థలంలో మంచాలు వేశారు. అలా వేసినా 80 పడకలే ఏర్పాటు చేయగలిగారు. అన్ని రకాల వైద్య పరికరాలు మంజూరు చేయలేదు. ఉన్నవి అమర్చడానికి వీలుకాని పరిస్థితి. వైద్యులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.



చికిత్స పొందుతున్న రోగులు

కూటమి ప్రభుత్వంపై ఆశ

అత్యవసర వైద్యానికి రోగులు విజయవాడ వెళ్లి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. శస్త్రచికిత్సలు చేయడానికి థియేటర్, పరికరాలు లేక వైద్యులు ఏమీ చేయలేకపోతున్నారు. కేవలం గర్భిణులకు మాత్రమే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. స్కానింగ్ యంత్రం ఉన్నా రేడియాలజిస్ట్ లేరు. గర్భిణులకు గైనకాలజిస్టులు స్కానింగ్ చేస్తున్నారు. మిగిలిన వారు బయటకు వెళ్లాల్సిందే. జాతీయ రహదారి ఉండటం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి విజయవాడ రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే సౌమ్య స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి వంద పడకలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మిస్తేనే సౌకర్యాలు

– సత్యనారాయణ, సూపరింటెండెంట్

వంద పడకల వైద్యశాలకు నూతన భవనం నిర్మిస్తే అన్ని వైద్య సేవలు అందించడానికి వీలవుతుంది. అవసరమైన వైద్య సామగ్రి కూడా కావాలి. ఇక్కడ సౌకర్యాలు లేకే అత్యవసర కేసులను విజయవాడ పంపిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది ఉన్నారు. థియేటర్ లేక శస్త్రచికిత్సలు చేయలేకపోతున్నాం.

వరద బాధితులకు ప్రత్యేక వైద్యం



వైద్య సేవలను పరిశీలిస్తున్న బబిత, సత్యానంద్, స్రవంతిరాయ్, సుహాసిని

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : హాయిగా జీవించాలన్నా, జీవితంలో ముందుకు వెళ్లాలన్నా.. ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ ఎం. బబిత పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో శనివారం వాంబేకాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానంద్, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని తదితరులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మార్గనిర్దేశనంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద ప్రభావంతో నగరంలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వీరికి కార్డియాలజిస్ట్‌తో పాటు గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, ఫిజీషియన్ తదితర స్పెషలిస్ట్ వైద్యసేవలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రూ. 3లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారి పిల్లలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, వరదలు వంటి విపత్తు ప్రభావిత ప్రజలకు న్యాయ సలహా, సహాయం కోసం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనికి జిల్లా, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని వివరించారు. అదేవిధంగా 15100 హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చని ఎం.బబిత వివరించారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని మాట్లాడుతూ.. వరదతో వాంబేకాలనీ తీవ్ర ప్రభావానికి గురైందని, ఇక్కడి ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈసీజీ, ఎకో పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 63 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచామని ఆమె వివరించారు. 305 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ హెచ్.అమరరంగేశ్వరరావు, నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్, అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, డీపీఎంవో నవీన్, డీపీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి కాంగ్రెస్ సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో ఈ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. అక్టోబరు 24న శ్రీకాకుళం, 25న మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, 26న కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, 27న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, 28న ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు, నవంబరు 6న వై.ఎస్.ఆర్.కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, 7న అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

తిరువూరు

● తిరువూరు ● మైలవరం

పోటీతత్వమే ప్రతిభకు గీటురాయి


విజేతలతో కరస్పాండెంట్ మల్లిగార్జునన్

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని పోటీతత్వమే వారిలో ప్రతిభకు గీటురాయిగా మారుతుందని స్థానిక సెయింటు మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ మల్లిగార్జునన్ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా శనివారం ఆ పాఠశాలలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీ పరీక్ష నిర్వహించారు. పి.గౌరీమహేశ్వరి, కె.షర్మిల, ఓ.హరితలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు.

పశువైద్యశాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్.ఎం.హనుమంతరావు రెడ్డిగూడెం మండల పశువైద్యశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాఖపరమైన కార్యక్రమాల పురోభివృద్ధిని పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డా.డి.తులసి తదితరులు పాల్గొన్నారు.

శేషాచల శ్రీనివాసుడికి విశేష పూజలు



పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్ట గజలక్ష్మీ సమేత శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో శనివారం అర్చకులు శ్యామ్‌సుందరాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్‌ను పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు దర్శించుకుని పాలపొంగళ్లతో మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, సభ్యులు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705



? స్థానిక ఆత్కూరు క్రాస్ రోడ్డు సమీపంలో వరి పొలంలో విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. తక్షణమే మరమ్మతులు చేపట్టండి **- పి.వెంకట్రావు, రైతు**

✔ సిబ్బందిని పంపించి స్తంభానికి మరమ్మతులు చేపడుతాం. **- సీహెచ్ రామ్మోహన్‌రావు, విద్యుత్తు శాఖ సహాయక ఇంజినీర్.** - న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

★ స్థానిక పంచాయతీలోని చంద్రబాబునగర్ రింగు వద్ద ప్రధాన రహదారి ఎదుట చాలా రోజులుగా చెత్త తొలగించడంలేదన్న స్థానికులు ఫిర్యాదును కార్యదర్శి రఫీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. శనివారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగింపు చర్యలను చేపట్టారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

★ పట్టణంలోని 2వ వార్డు సచివాలయం పరిధిలో 3వ వార్డులో కాల్వలో మురుగు పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

★ పట్టణంలోని 8వ వార్డు సచివాలయం పరిధిలో 14వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలోని కాల్వలో మురుగు నిండి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి చర్యలు తీసుకున్నారు.

★ పట్టణంలోని 7వ వార్డు సచివాలయం పరిధిలో 13వ వార్డులో మధిర రోడ్డు ఆర్సీఎం చర్చి సమీపంలో పచ్చిక పెరిగి దోమలు బెడద ఎక్కువైందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి తొలగింపు చర్యలు చేపట్టారు.

★ పట్టణంలోని 9వ వార్డు సచివాలయం పరిధిలో 16 వార్డులో కుమ్మరి బజార్‌లో రహదారిపై చెత్త ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో ఊడ్పించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, ఉమ్మడిదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతలనర్వ గ్రామాల్లో కొత్త లైన్ల ఏర్పాటుకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డిస్కం ఏఈ వి.జగదీష్ తెలిపారు.

21న కుదపలో గ్రామ సభ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కుదప గ్రామ సచివాలయం వద్ద ఈనెల 21వ తేదీన గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.సుశీలదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కదుపలో జరిగిన రీ సర్వేల్లో రైతుల భూమి వివరాల్లో అవకతవకలున్నా..సరిహద్దు తేడాలు ఉన్నా సభలో అర్జీలు ఇవ్వొచ్చన్నారు. వాటిని పరిశీలించి సత్వరమే సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామసభకు మండల సర్వేలు, సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు.

ధరాభారం మోయలేకున్నాం

పెరిగిన కూరగాయల ధరల మోతతో బెంబేలు

మైలవరం, న్యూస్‌టుడే


మైలవరం రైతుబజారులో వినియోగదారులు

గత నెల రోజులుగా కూరగాయల ధరల పెరుగుదల వంటింటి ఖర్చులపై పెద్ద భారాన్ని మోపుతున్నాయి. సెంచరీలకు సమీపంలో ఉన్న ధరలు కొన్నైతే, అర్ధ సెంచరీలు కొట్టినవి మరికొన్ని. దీంతో మధ్యతరగతి నెల వారీ ఖర్చులు చాలా తేడాలు వచ్చాయని ఆయా వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. పెరిగిన ధరల తగ్గింపునకు రాయితీపై పలురకాల కూరగాయలను అందించాలని ప్రభుత్వం ఆదేశించినా, పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో నేటికీ బహిరంగ మార్కెట్‌లో ధరలు మోతమోగుతున్నాయి.

బోర్డు ఒకటి.. అమ్మేది మరొకటి

అధిక వర్షాలతో పంటలన్నీ పాడవడంతో దిగుబడులు లేక రేట్లు అమాంతం పెరుగుతున్నాయి. టమాట ధరలు ఒకానొక దశలో రూ.100 కు చేరువవగా, ప్రభుత్వం వెంటనే స్పందించి కిలో రూ.50ల చొప్పున రాయితీపై అందించాలని ఆదేశించింది. అయితే రైతు బజారుల్లో మాత్రం ఒకట్రెండు రోజులకే పరిమితమవడంతో ప్రైవేటు మార్కెట్‌లో ధరల అధికంగా ఉన్నాయి. ఈ భారాన్ని భరించలేక రైతు బజారులకు వెళ్లే వినియోగదారులకు అక్కడి మోసాలను భరించలేకపోతున్నారు. బోర్డులో ఒక ధర, అమ్మేది మరో ధరగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



గడిచిన నెల రోజులుగా ధరలు పెరిగిపోవడం ఇబ్బందిగా ఉంది. బయట ధరలు ఎక్కువగా ఉన్నాయని రైతు బజారుకు వస్తే, బోర్డులో ఉన్న ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. సరైన చర్యలు లేక రాయితీ కూరగాయలు అందుబాటులో లేవు. **- బి.సూర్య, మైలవరం**

అందుబాటులోకి తేవాలి



కూరగాయల ధరలన్నీ అధికంగా ఉంటున్నాయి. చాలా రోజులుగా ఇదే విధంగా ఉండడంతో ప్రజలకు ఖర్చులు అధికమవుతున్నాయి. ధరలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. **- కె.రవికుమార్, రుద్రవరం**

చర్యలు తీసుకుంటే మంచిది



మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. గతంలో ధరలపై పోరాడిన నాయకులు ముందుకు రావాలి. పెరిగిన ధరలతో కొనాలంటే ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వం స్పందించి ధరల తగ్గుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలి. **- వి.వెంకటేశ్వరరావు, జి.కొండూరు**

ఎన్‌సీసీ స్ఫూర్తితో సేవలు అందించండి

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణ స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ క్యాడెట్లకు సూచించారు. ఎన్‌సీసీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్యాడెట్లకు ఆయన ఎ- సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణ, సమయపాలన, లక్ష్యసాధన తదితర అంశాలను ఆచరణలో పెట్టి లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యులు అక్కల గాంధీతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ బ్యాగ్స్ పంపిణీ

కాచవరం మండల పరిషత్తు విద్యార్థులకు విశ్రాంత ఎలక్ట్రికల్ ఇంజినీరు మహమ్మద్ ఖలీల్‌రహిమాన్ శనివారం అందజేసిన స్నాక్స్ బ్యాగులను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రత్నశ్యాంబాబు, హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు ఇర్ఫాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి సీసీ దారులు ప్రారంభిద్దాం


తిరువూరు : వావిలాలలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శంకుస్థాపన చేస్తున్న సిమెంట్ రహదారులను సంక్రాంతి నాటికి ప్రారంభోత్సవం చేసుకుందామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఎ.కొండూరు మండలంలో రేపూడి, గొల్లమందల, కంభంపాడు, కోడూరు, మారేపల్లి, పోలిశెట్టిపాడు, గోపాలపురం, జీళ్లకుంట, వల్లంపట్ల, తిరువూరు మండలం వావిలాల, పెద్దవరం, ఎర్రమాడు, గంపలగూడెం మండలం గుళ్లపూడి, సొబ్బాల, లింగాల గ్రామాల్లో శనివారం జరిగిన పల్లె పండగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా అభివృద్ధి చేయాల్సిన పనుల జాబితాలు సిద్ధం చేస్తే ఆయా శాఖల మంత్రులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సామాజిక పింఛన్లకు అర్హుల జాబితాలతో పాటు ఇప్పటికే తీసుకుంటున్న వారిలో అనర్హుల జాబితాలు కూడా సిద్ధం చేయాలని ఎన్డీయే కూటమి నాయకులకు సూచించారు. ఆయా మండలాల ఎంపీడీవోలు పి.హరిప్రియ, పీవీఎస్.నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ డి.బాబూరావు, ఏపీవో వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో పల్లె పండగ నేడు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం మండలంలోని గోసవీడు, అమ్మిరెడ్డిగూడెం, గంపలగూడెం, వినగడప, కొత్తపల్లి, అనుముల్లంక, కనుమూరులో, తిరువూరు మండలం గానుగపాడు, చింతలపాడు, రోలుపడి, మునుకుళ్ల, అక్కపాలెం, ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, ఎరుకోపాడులో ఆదివారం పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తిరువూరు ఎంపీడీవో పీవీఎస్.నాగేశ్వరరావు, గంపలగూడెం ఈవోపీఆర్డీ డి.బాబూరావు తెలిపారు.

చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం


సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్


ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: సంపద సృష్టించడం..సంక్షేమం..అభివృద్ధి పథకాలు అమలు చేయడం సీఎం చంద్రబాబు వల్లే సాధ్యమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. దాములూరు, చిలుకూరు, కాచవరం, కేతనకొండ తదితర నదీ తీరగ్రామాల్లో శనివారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేసి మాట్లాడారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని పది గ్రామాల్లో రూ.5.11 కోట్లతో 6.16 కిలో మీటర్ల పొడవున 57 రహదారులను సీసీ రోడ్లగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, నియోజకవర్గ బాధ్యుడు అక్కల గాంధీ, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, తెదేపా నాయకులు రాజశేఖర్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని అధీకృత డీలర్లు రైతులకు విక్రయించే ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి ఆదేశించారు. విస్సన్నపేటలోని ఎరువుల దుకాణాల్లో శనివారం ఆమె తనిఖీలు చేశారు. ఎరువుల నిల్వలు, దస్త్రాలు నిర్వహణను పరిశీలించారు. దుకాణాల వద్ద ఎరువులకు సంబంధించిన ధరల పట్టిక కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని దుకాణదారులను హెచ్చరించారు. నాణ్యత పరీక్ష నిమిత్తం దుకాణాల్లో ఎరువులు, పురుగు మందుల నమూనాలను తీసుకున్నారు.

స్వర్గపురి వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం


తోసా సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం(తోసా) ఆధ్వర్యంలో పోతుల చెరువు వద్ద నిర్మించిన స్వర్గపురికి భౌతికకాయం తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు పట్టణానికి చెందిన ఆకుల లలితాంబ జ్ఞాపకార్థం భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు వెంకట సురేష్‌బాబు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం దాతలకు తోసా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మధిర శాఖ కాల్వకు 801 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర శాఖ కాల్వకు శనివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 801 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 232 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు 35, పెదకొమిర 20, మధిర 10, నిదానపురం 20 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


కంభంపాడు: క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కంభంపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.ఆదిశేషు, పీడీ బి.గోపి శనివారం తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఎం.అరవింద్, అండర్-14 బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని పి.వైష్ణవి ఉమ్మడి కృష్ణా జట్లకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. నవంబరులో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు సదరు విద్యార్థులకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పాఠశాలకు చెందిన ఎం.సాయిజ్యోతి, పి.వినయ్‌కుమార్ కూడా తుది జట్టులో ప్రతిభ చూపిన అభినందనలు అందుకున్నట్లు చెప్పారు.

చెస్ పోటీలకు..


తిరువూరు : ప్రశంసా పత్రం అందిస్తున్న అధ్యాపకులు

తిరువూరు: జిల్లాలోని నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల విభాగం జిల్లా స్థాయి చెస్ పోటీల్లో తిరువూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ సమీనా ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పీఎస్ఎన్.రాజు, పీడీ సుకన్య తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా జట్టుకు నుంచి తమ విద్యార్థి ప్రాతినిధ్యం వహిస్తుందని శనివారం వెల్లడించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


కొత్తరెడ్డిగూడెం: ఉయ్యూరు అంజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉమా, నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం రెడ్డిగూడెం మండలంలో పలువురు తెదేపా కుటుంబ సభ్యులను నాయకులతో కలిసి పరామర్శించారు. కొత్త రెడ్డిగూడెంలో ఉయ్యూరు బోసురెడ్డి కుమారుడు అంజిరెడ్డి ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల మరీదు రోశయ్య అకాలమరణం చెందగా వారి కుటుంబీకులను కలిసి సానుభూతి తెలిపారు. అనంతరం రాఘవాపురంలో కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఉయ్యూరు రత్తారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జె.వేణుగోపాలరెడ్డి, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్.చెన్నారెడ్డి, సిహెచ్.చందా, ఎం.పోతురాజు, వి.రామోహన్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరు తెదేపా మండల ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి ఆదాం అల్లుడు దున్నా వెంకటేశ్వరరావు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి మృతుడి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బకాయిలు చెల్లించండి


సీఈకి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం): కాంట్రాక్టు కార్మికులకు సర్వీసు ఇంసెంటివ్‌తో పాటు 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ నాగరాజును కార్మిక సంఘ నాయకులు శనివారం కలిశారు. శాంతియుత నిరసనల్లో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి సీఈకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్మికులకు గ్రేడ్లు మార్చాలన్నారు. యూనియన్‌కు చెందిన షంషేర్‌వలీ, శివశంకర్ తదితరులు ఉన్నారు.

భక్తితో గంధ మహోత్సవాలు

చీమలపాడు(ఎ.కొండూరు): మండలంలోని చీమలపాడు దర్గాలో పీఠాధిపతి మహ్మద్ ఖాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'మహ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా గంధ మహోత్సవాలు' శనివారం రాత్రితో ముగిశాయి. వివిధ ప్రదేశాల్లో దర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని భక్తులకు సందేశమిచ్చారు.

తిరువూరు నుంచి విజయవాడకు కొత్త బస్సు సర్వీసు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు కొత్తగా సూపర్ లగ్జరీ అద్దె బస్సును ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు తిరువూరు డిపో నుంచి ఉదయం 7గంటలకు, మధ్యాహ్నం 12.45కి, సాయంత్రం 6.30 గంటలకు, విజయవాడ డిపో నుంచి ఉదయం 9.45కి మధ్యాహ్నం 3.45కి, రాత్రి 9 గంటలకు బయల్దేరుతుందని డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు దరఖాస్తుల పంపిణీ


గానుగపాడు పాఠశాలలో దరఖాస్తులతో డీపీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై అవగాహన కల్పించినట్లు సంఘం మండల శాఖ అధ్యక్షుడు పీవీ.రావు తెలిపారు. శనివారం 18 పాఠశాలల్లోని 54 మంది ఉపాధ్యాయుల నుంచి డీపీఆర్టీయూ సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫామ్-18 దరఖాస్తు ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. నాయకులు ఎస్.రామారావు, జె.శ్రీకృష్ణ, పి.కృష్ణ, ఎం.శ్రీను, జె.మోహన్‌రావు, వి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని టీఎన్‌టీయూసీ జోన్-3 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్ కోరారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కొండపల్లి ఐడీఏలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును రాజేంద్రప్రసాద్‌కు వేయాలని కోరారు. ఓటు నమోదు ప్రక్రియ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో చేసే అవకాశం మరో పక్షం రోజులు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు ఇందిరానగర్ ప్రాంతంలో అత్తామామలైన మర్రివాసి ధనమ్మ, చెంచుకృష్ణలపై ఈ నెల 13న అల్లుడు గుత్తి సుబ్రహ్మణ్యం, మరికొందరితో కలిసి దాడి చేసిన ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మామ చెంచుకృష్ణ, అల్లుడు సుబ్రహ్మణ్యం కలిసి కొన్నేళ్ల క్రితం రమేష్ అనే వ్యక్తికి రూ.20 లక్షల నగదు అప్పుగా ఇచ్చారు. అప్పు చెల్లించలేకపోయిన అతను గంపలగూడెంలోని తన ఇంటిని వీరిద్దరికీ రాసి ఇచ్చారు. ఆ ఇంటిని చెంచుకృష్ణకు తెలియకుండా సుబ్రహ్మణ్యం అమ్మేశాడు. దీంతో చెంచుకృష్ణ, సుబ్రహ్మణ్యంల మధ్య నగదు విషయమై గొడవలు జరిగాయి. ఈ క్రమంలో కుమార్తె మహాలక్ష్మితోనూ చెంచుకృష్ణ గొడవ పడ్డాడు. మామకి నగదు ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఈ నెల 13వ తేదీ తన బంధువులైన ఉమ్మడి కృష్ణా జిల్లా విస్సన్నపేటకు చెందిన గుత్తి మనోహర్, గుత్తి విజయ్, గుత్తి భాస్కర్, గుత్తి సురేష్, గుత్తి రాజేష్, నలబాయి నరసింహలతో కలిసి సుబ్రహ్మణ్యం గూడూరుకి వచ్చి అత్తమామలు చెంచుకృష్ణ, ధనమ్మ, బావ మరిది చెంచురామయ్యలపై రాడ్లతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. గూడూరు రైల్వే పార్సిల్ కార్యాలయం వద్ద నిందితులున్నారనే సమాచారంతో పోలీసులు సుబ్రహ్మణ్యంతో పాటు విజయ్, భాస్కర్, సురేష్, రాజేష్, నరసింహలను శనివారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు మనోహర్ పరారీలో ఉన్నాడని, అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు సుబ్రహ్మణ్యంరాజు, గోపాల్ యాదవ్, సిబ్బంది చిరంజీవులు, సురేష్, నాగేంద్ర, సతీస్, మధు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

EENADU Classifieds

AUTO

AUTO FINANCE

పాత వాహనాలపై ఫైనాన్స్ సౌకర్యం
2015 పైన మోడల్ గల ట్రాక్టర్లకు అతి తక్కువ వడ్డీ మరియు సులభ పద్ధతి డాక్యుమెంటేషన్‌తో ఫైనాన్స్ సౌకర్యం కలదు. సంప్రదించండి.
సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ విజయవాడ. 8985966475 8500667217 7901677793

పాత వాహనాలపై ఫైనాన్స్ సౌకర్యం
2014 పైన మోడల్స్ గల, అన్ని పాత లారీలు, కార్లు, బస్సులు, మినీ బస్సులపై అతి తక్కువ వడ్డీ మరియు సులభ పద్ధతి డాక్యుమెంటేషన్‌తో ఫైనాన్స్ సౌకర్యం కలదు. సంప్రదించండి.
సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ విజయవాడ. 9440909723 9440909805 9440909722

BUSINESS SERVICES

స్క్రాప్ విక్రయం
"సెంటిని బయోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గండేపల్లి (గ్రామం, కంచికచర్ల మండలం, NTR జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521185 వద్ద) క్రింది స్క్రాప్ వస్తువుల విక్రయం కోసం ఆసక్తి గలవారి నుండి కొటేషన్లను ఆహ్వానిస్తున్నాము.
1. స్టీల్ (ఇనుప స్క్రాప్) - 3000 MT
2. HDPE బ్యాగ్‌లు - 100 MT
3. గోనె సంచులు - 50 MT
4. MS స్క్రాప్ - 50 MT
5. SS స్క్రాప్ - 50 MT
6. CC బాక్స్ - 25 MT
7. పనికిరాని గాజు - 25 MT
8. ఫైబర్ డబ్బాలు (25 Ltrs) - 1500 Nos
స్క్రాప్ అమ్మకం నిబంధనల ప్రకారం వార్షిక రేట్ ప్రకారంగా ఆసక్తి గల పార్టీల నుండి కూడా మేము బిడ్లను ఆహ్వానిస్తున్నాము.
దయచేసి మీ కోట్ / బిడ్‌ని మాకు gmcomi@bio.sentiningroup.com మెయిల్ కు పంపగలరు. ఫోన్: 80966 69203

WANTED DEALERS/AGENTS

AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను.
వివరాలకు ఈ నంబర్లను సంప్రదించండి
Volty IoT Solutions 8367307070 9666841234

BUSINESS OFFER

Godrej Jersey Dairy వారి పాలు, పాలపదార్థాలు డిస్ట్రిబ్యూషన్ చేయుటకు మండల స్థాయిలో పెట్టుబడి ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 98489 91419.

సువర్ణజాతం 30 సంవత్సరాల సీనియర్ మార్కెటింగ్ మేనేజర్స్ (స్త్రీ/పు) కావలెను. పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం & స్పెషల్ ఇన్సెంటివ్స్. ఫోన్: 770 260 4647.

FOR SALE

మెన్ అమ్మబడును ★ విజయవాడ సూర్యారావుపేటలో మంచి రన్నింగ్‌లో ఉన్న మెన్ వస్త్రవ్యాపార షాప్ అమ్మబడును. ✆ 77805 87106.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified CO. Household Goods Shifting Any Time Any Where. ✆ 97043 64389, 92900 87673.

BUILDING CONSTRUCTION

Raghava Constructions. We do Building contracts on Turn Key Basis for VMC/APCRDA Approvals, Vasthu, Plans, Elevations & Structural Designs ✆ 98851 12999

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులను సూచించడమైనది. ప్రకటనదారుల సంస్థలు, వ్యక్తులు లేదా చేసు కుంటున్న వ్యవహారాలతో ఈనాడు యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి డిపాజిట్లు వసూలు చేయరాదు. డబ్బుకు వసూలు చేసిన ప్రకటనకర్తలు బ్లాక్-లిస్టులో ఉంచబడతారు. లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సంజయ్‌గాంధీ కన్స్ట్రక్షన్స్: అతి తక్కువ వడ్డీ ప్రాపర్టీ లోన్స్, బిజినెస్ లోన్స్ చేయబడును. లోన్స్ ప్లాన్స్ & ఎస్టిమేషన్ చేయబడును కలదు. ✆ 90002 17513.

TDR AP & TELANGANA BONDS BUY & SALE KAMESH 92 92 15 15 15

సూర్య కన్స్ట్రక్షన్స్ లోన్స్ అప్రూవల్స్ మెటీరియల్ కాంట్రాక్ట్ మరియు డెవలప్‌మెంట్ చేయబడును సంప్రదించండి. ✆ 94402 42092.

WATER PROOFING

Sri Kanakadurga Water Proofing. Slabs, Tanks, Bathrooms, All Leakage Works with Chemical Salve. Ph: 9666223481.

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works ✆ 94940 02285, 99516 07504.

EDUCATION

TUITIONS

IIT Foundation and Regular Maths tution for 8th, 9th & 10th (CBSE), Inter (+1, +2). Also B.Tech, B.Sc and GRE (Maths) at Gunadala. KKR. 98858 83128.

SPOKEN HINDI

Learn Online / Offline Spoken Hindi / English & French within 30 Days. 100% Guarantee for all Ages. Free Demo. ✆ 89495 42456.

HOME TUITIONS

C.K.R (ఇన్ఫిట్ & హోమ్) అల్ ట్యూషన్స్ Olympiads, ఐఐటీ MPC, BiPC, EAMCET, Neet ట్యూషన్స్, IIT అన్నింటికీ... ✆ 94924 83175, 89853 57002.

ప్రత్యూష (ఇన్ఫిట్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, NEET, IIT, EAMCET, B.Tech, CA-CPT, BITSAT అల్ ట్యూటర్స్ లభించును. ✆ 92900 05677, 74165 35749.

DISTANCE EDUCATION

ఆంధ్ర యూనివర్సిటీ (డిస్టెన్స్ మోడ్) డిగ్రీ, పీజీ అడ్మిషన్స్ కలవు... VJA ✆ 92904 36591.

FINANCIAL SERVICES

హాస్పిటల్ కన్స్ట్రక్షన్స్ కొరకు రూపాయలు లోన్స్ కావలెను. సంప్రదించండి ఫోన్ నెంబర్ 86394 43266.

100 % సెక్యూరిటీ ప్రతి నెల వాయిదాలు... ✆ 93966 37779.

మీ ఇల్లు, బిల్డింగ్, ఫ్యాక్టరీలు మీద తక్కువ వడ్డీకి లోన్స్... ✆83099 11995, 93904 35013.

HOME NEEDS

PEST CONTROL

Priyanka Pest: 25 Yrs. Exp. 5 Yrs. Warranty Smell Less Bayer Chemicals (Pest and Other Insects Control). ✆ 94924 82494, 93932 30136.

Tarun Pest ★25 Yrs. Exp. 5 Yrs. Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest and Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

శివ గ్రౌండ్ పెస్ట్ కంట్రోల్ & వాటర్ ప్రూఫింగ్ ★ 30 సం॥ అనుభవము... ✆ 96188 79965.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీ వైష్ణవి హోమ్‌కేర్ సర్వీసెస్ ... ✆ 99856 48484, 99856 49494

స్వర్ణ శేఖర్ హోమ్ వృద్ధాశ్రమము ... సంప్రదించండి 98483 40496, 73866 20496.

వృద్ధాశ్రమం శ్రీ వేంకటాద్రి వయోవృద్ధుల ఆశ్రమం, వెలగలేరు గ్రామం జి.కొండూరు మండలంలో చేర్చుకొనుటకు సంప్రదించండి. ✆9848691799

శ్రీవత్స హోమ్‌కేర్ & ఓల్డ్ ఏజ్ హోమ్... 24/7 ... ✆ 99481 64393.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
I, VENKATA NAGA RATNAM YEGATELE (old name), w/o Yegatele Pandurangarayakulu R/o 8-84B Maldhar peta Nadigadda, Nandyal, Kurnool, AP have changed my name to VENKATA NAGA RATNA YEGATELE (New name), W/o Yegatele Pandurangarayakulu vide affidavit attested by Bulla Ramesh Babu.

REAL ESTATE

2500 చ॥గజాలు డెవలప్‌మెంట్‌కి
విజయవాడ పటమట
NTR సర్కిల్‌కి దగ్గరగా రామలింగేశ్వరనగర్‌లో
Whatsapp Call Only +91609 06566

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, పెదకాకాని ... ✆ 73823 99667.

AP రాజధానిలో ... ✆ 96035 30555.

గుంటూరు సిటీలో ... ✆ 83999 55545.

కాజ 200, ... ✆ 88851 00666.

గొల్లపూడి, రాయనపాడు ... ✆ 92469 61688.

కంకిపాడు పరిసర ప్రాంతాల్లో ... Contact: 93472 64298.

FLAT FOR SALE

KANURU

Ready to move 3BHK Flat for Sale. 5th Floor, W/F. Opp. VR Siddhartha University. ✆ 99853 45700 / 98496 76558.

3 BHK Flat for Sale @ Vijayalakshmi Towers-1, Pent house Opp. APSRTC Depo, Autonagar, VJA. Ph: 6301055574 (Pavan)

కానూరు ... ✆ 70750 17255.

Ready to Occupy, SR ... ✆ 82977 01800.

కానూరు PVP ... ✆ 98481 46308, 92907 26757.

కానూరు ... ✆ 81218 85556.

PENAMALURU

గృహప్రవేశానికి సిద్ధముగా ... New DLX 2 BHK (1346 S.Ft) ... ✆ 97014 83087.

CURRENCY NAGAR

విజయవాడ, కరెన్సీనగర్ ... ✆ 80083 48560/ 99493 20848.

4 BHK ... ✆ 98481 10102, 98491 64444.

RAMAVARAPPADU

రామవరప్పాడు SLV Villas ప్రక్కన R.R. Infra Right Way Homes అపార్ట్‌మెంట్ 2nd ఫ్లోర్ E/F 1782 S.Ft. నం 3BHK ఫ్లాట్ అమ్మకం. ✆ 97037 29999.

2 BHK, E/F, 1st Floor in Group House 700 S.Ft., Semi Furnished Apartment (34 Sq. Yards) at Ramavarappadu @ 27 Lakhs. Contact: 93905 15052.

TADEPALLI

గృహప్రవేశానికి సిద్ధముగా విజయవాడ - గుంటూరు ... ✆ 99088 45511, 99088 45111.

తాడేపల్లి / AIIMS దగ్గరలో 3BHK ... ✆ 82977 01800.

GENERAL

Brindavan Colony beside Siris Rajus House, Spacious Deluxe 3BHK 2285 Sft., E/F Flat 3rd Floor (Rate 1.8 Cr.) Ready to Occupy. ✆ 94403 04304.

4BHK Ready to Occupy Large Flats for Sale at Vijayacon Square Gurunanak Nagar Colony, Behind Ushodaya. ✆ 94404 96840, 63037 51835.

Vijayawada, Madhuranagar: EF, 2BHK (1120 S.Ft) Flat Sale. 1st Floor, Wooden TV Unit, Wardrobes & Modular Kitchen Etc. ✆ 98198 38431.

Ravuri Vista New 3BHK Appartments for Sale at Side Street of NAC Kalyana Mandapam. ✆ 88850 99038.

For Sale New Appartments Floor Wise 2675 Sq. Feet 4BHK at Old Malaria Street, Side Street of SRR College. ✆ 98482 99038.

3 LUXURY FLATS FOR SALE @ TADEPALLI
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY EACH FLAT 4260 Sq.FEETS
UDS 137 YARDS (Incloud 3 car parkings)
20x15 BED ROOMS 4
10X16 & 10x8 BATH ROOMS 4
20x15 KITCHEN
20x15 DINNING
20x15 DRAWING HALL
20x10 HOME THEATER
63x17 LIVING HALL
Prime Locality Beside SIT Office Pathuru Road, Tadepalli
92464 95788 / 99

VJA, మొగల్రాజపురం VP సిద్ధార్థ ... ✆ 99123 41163, 88976 23332.

... ✆ 96761 22957.

... ✆ 84984 76439.

... ✆ 99590 10777.

VJA, పటమటలంకలో ... ✆ 92962 05727.

... ✆ 93464 82202, 92464 82022.

... ✆ 93946 26067/ 94903 53541.

... ✆ 73306 69565, 79957 91488.

... ✆ 81426 68666.

విజయవాడ లయోలా ... ✆ 94985 98331.

1256 Sft. 2BHK 3rd Flr., West Facing with Car Parking at Penamaluru, Vijayawada for Sale. Direct Parties only. Ph.: 9951904721.

FLAT FOR SALE
విజయవాడ ఆయుష్ హాస్పిటల్ దగ్గర వసంత నివాస్ అపార్ట్‌మెంట్‌లో 2 BHK 3rd ఫ్లోర్ 1175 చ॥అ॥ తూర్పు ఫేసింగ్ లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకము
✆ 94927 11449

Indira Towers in Vijayawada Next to Amrican Hospital 3 BHK Flat 1700 Sft, 4th Floor 100% Vasthu, 4 Balconies Lift Car park. ✆ 8897375017.

Fortune Homeland 3BHK Luxury Flat in Gated Community 1980 Sq.Ft with Car Parking, Trendset Meadows, Madhura Nagar, VJA. ✆ 98481 54222

3BHK 1800 Sq.ft New Luxury Flats at Vijaya Lakshmi Colony Mahanadu Road with Wood Work and all Amenities. ✆ 94405 28023.

2 BHK Furnished Flat for Sale, 1000 S.Ft., E/F, With Car Parking. UDS/ 35 Yards at Ayyappa Nagar, VJA-7 Siva Shakthi Residency. ✆ 78426 32645, 83901 78359.

VJA, Eluru Road, BSNL Near Maruti Nagar, Sri Ramulu Street, Lane BP Bunk, 2 BHK (850 S.Ft.) Flat Sale. 2nd floor, UDS 50 Sq. yards. ✆ 98851 12999.

3BHK (1425 S.Ft.) Flat No. A1, 1st Floor, in Savvy Apartments at 12th Road Center, Bharathi Nagar is for Sale. ✆ 94944 96688.

2BHK -39 Lakhs, 3BHK -58Lakhs ... ✆ 94944 76303, 98480 55344.

FLAT For SALE
2, 3 & 4 BHK Flats For Sale in Gated Community in Prime Area of Vijayawada Ready to Occupy
86391 23768 98481 51310

3 BHK ... (CRDA) Ready to Occupy ... ✆ 76719 22845.

... ✆ 99088 45511, 99088 45111.

... ✆ 90524 13111, 93901 11339.

... Ph. 95004 66006.

... ✆ 95501 95135, 99598 31538.

3 BHK, 1250 Sq.Ft. ... ✆ 95334 30709.

... ✆ 08230, 99088 74037.

... ✆ 99483 64836.

... ✆ 94406 61789.

... ✆ 94403 20398, 93943 24991, 92945 61111.

G+3 బిల్డింగ్ అమ్మకము
అమరావతి వరదలో ఇల్లు కంకిపాడు నుండి ... 5420 sft 3 ఫ్లోర్స్ ...
ధర: కోటి 90 లక్షలు
100% బ్యాంక్ లోన్ సదుపాయం కలదు
906 3456 379 984 9247 554

... ✆ 98496 99877, 98666 21762.

సున్న D.Mart ... ✆ 90005 02222.

... ✆ 93953 01959, 93943 24991, 92945 61111.

... ✆ 76740 82458.

... ✆ 98483 33868.

... ✆ 93929 69028.

... ✆ 98490 99701, 92465 66911.

... ✆ 98480 82879.

... ✆ 92464 95388.

... ✆ 79810 24367, 98498 64864.

... ✆ 90309 55951.

... ✆ 98492 42413.

... ✆ 98850 09848.

... ✆ 90598 46136, 92464 70758.

... ✆ 81214 29876.

... ✆ 92464 12213.

... ✆ 93810 60509.

... ✆ 98480 82879.

విజయవాడ సత్యనారాయణపురంలో ... ✆ 92906 68557, 92460 30956.

2BHK ఫ్లాట్ 1200 S.Ft. ... ✆ 98481 87123.

HOUSE FOR SALE

KANURU

Vijayawada near Gurunanak Colony 550 Sq.Yds Residential Building for Sale (Getting Rent now 1 Lakh PM) 9885118889.

GENERAL

... ✆ 95024 66890.

... ✆ 95024 37499.

... ✆ 81426 66666.

... ✆ 94939 78325, ... 15126 860906.

3rd House from National Highway in 200 Sq.Yds., East Facing House for Sale in Ampapuram Bapulapadu (Mandal) 9491153063.

... ✆ 80746 23884, 83176 37676.

G+3 బిల్డింగ్ అమ్మబడును
విజయవాడ సత్యనారాయణపురం (బ్రాహ్మణ) పంతులు వీధి D. No. 23-24-53 లో 416 చ॥గ॥ G+3 బిల్డింగ్ అమ్మబడును
✆ 98663 97115

... ✆ 94490 57000

... ✆ 92466 33982.

... ✆ 76720 94576.

LAND FOR SALE

గన్నవరం 10 Kmలో ... ✆ 93903 15739.

LAND FOR SALE
గత ప్రభుత్వంలో కల్తీ మద్యం విక్రయాలపై 856 కేసులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించడంపై 930 కేసులు నమోదయినట్లు కొల్లు రవీంద్ర వివరించారు. ఆ ఐదేళ్లలో సుమారు 40 లక్షల మంది కల్తీ మద్యం కారణంగా అనారోగ్యం పాలయ్యారని గుర్తుచేశారు. విశ్రాంత న్యాయమూర్తితో ఓ కమిటీ వేసి మద్యం దర్యాప్తు నిర్వహిస్తాం. కల్లుగీత కార్మికులకు కేటాయించిన 340 దుకాణాలకు త్వరలో దరఖాస్తులు ఆహ్వానిస్తామని మంత్రి చెప్పారు.

21, 22 తేదీల్లో వ్యవసాయ సమస్యలపై జాతీయ సదస్సు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ రంగ సమస్యలపై విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్ హాజరవుతారని వెల్లడించారు. శనివారం వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిందని, ఇంతవరకు దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. గతేడాది ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఇవ్వలేదని తెలిపారు. బుడమేరు, కృష్ణా వరద బాధిత రైతులకు పరిహారం పెంచాలన్నారు. కౌలు రైతులకు రక్షణ కల్పించాలని.. పత్తి, మిర్చి ధరల పతనాన్ని ప్రభుత్వం అరికట్టాలని కోరారు.

వధువు కావలెను

6 Niyogi Brahmin Haritasa Chitta 4P, 44 Years, SWE, 30LPA Hyd. Cont: Prasad: 9440544790 (A)

Reddy Boy 33Y, 5'10", M.Com/ CA (Inter) Doing IT Job (Fin) in Hyd. Have own House, Seeks Beautiful Girl, B.Tech/ Any Degree Working in Software, Govt or Pvt ✆ 9951959941 (A)

Kapur, MNC, VP, USA, VF, 46Y, 5'11", Divorce seeks Bride below 40Y, 5'3" above Late/ Divorce Abroad/ India. Ph: 8374456323 (A)

కాపు "ఓన్లీ సన్" 29, 5'9", B.Tech, MS, SWE, USA, 150K P/A ఇండియాకి వచ్చియున్న వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9393891760 (A)

కాపు నాయుడు/ 44/5'8"/ Slim/ డిగ్రీ/ బిజినెస్/ 5 కోట్ల ఆస్తి గల మొదటి వివాహం వరుడికి తగిన వధువు కావలెను. కుల కట్నం ప్రసక్తిలేదు. డైరెక్ట్ ✆ 9912525919 (A)

SC మాల కట్నప్రసక్తి లేదు 29/5'10" B.Tech (సివిల్) అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ACTO) 1.50L P/M వెల్ సెటిల్ వరుడికి వధువు కావలెను. అర్జెంట్. ✆ 9014591903 (A)

మాదిగ/ B.Tech/ Govt AE/ ఇరిగేషన్ Dept/ 92,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. ✆ 8985557129 (A)

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

Caste No Bar. Gavara, M/38/ Fair/ 5'8"/ Central Govt/ 45 Lacs PA/ Divorced, 9 Yrs Boy with Mom. Ph: 8712133567 (A)

Hindu, Rajput/ 38 Yrs/ 5'7"/ MBA/ Pvt. Job/ 15 Lakhs PA seeks well Educated Bride. Caste Hindu. Contact: 09094012245 (A)

క్షత్రియరాజులు, యూనియన్‌బ్యాంక్ ఉద్యోగం, సొంత ఇల్లు, రెండోపెళ్లి వరుడికి మంచి సాంప్రదాయం కలిగిన వధువు కావలెను. డైరెక్ట్, నో బ్రోకర్స్. ✆ 96520 16569 (B).

రజక/ B.Tech/ C.Govt. JTO/ BSNL/ 92,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9515942275 (A)

★ ★

మాల: MBBS, Md (Pediatrics), 5'9 / 31y/ V.fair, Well Settled, సొంత హాస్పిటల్ కల్గి డాక్టర్‌గా చేస్తున్న వరుని కొరకు (అర్జెంట్)గా సం॥ 8106501199, 9248494810. Q

హిందు- మాల 28 ఎత్తు 5'8" ఆర్కిటెక్చర్ M.Tech. (Planning) పేరుగాంచిన స్వంత కంపెనీ గల అందమైన వరునకు B.Tech./ ఏదేని ప్రొఫెషనల్స్ సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన వధువు కావలెను. కులపట్టింపు లేదు. 7207206339. (C)

★ ★ ★

కమ్మ, 29 సం॥ 6', B.E., MS, MBA (USA), మేనేజర్ $ 300K very rich వరుడుకు తగిన వధువు కావలెను. Ph.: 9989889191. (C)

కమ్మ/ 38Y, 5.8' ఒక కోటి ఆస్తి కలిగి సెకండ్ మ్యారేజ్, ప్రైవేటు లెక్చరర్. జీ. 50,000/- PM. వరుడుకు వధువు కావలెను. (No బ్రోకర్స్) ✆ 9640073737(R).

కమ్మ 28 5'10" BE, MS 400K USA అతి సంపన్న కుటుంబ వరునకు తగిన వధువు కావలెను. ✆ 63034 33873. (I)

రెడ్డి, 28 సం॥ 5'10", MBBS, MD, very rich వరుడుకు తగిన వధువు కావలెను. Ph.: 9908891119. (C)

కాపు, 27 సం॥, 5'10", B.Tech., MBA, CEO, very rich వరుడుకు తగిన వధువు కావలెను. Ph.: 9866633988. (C)

కమ్మ 31, డిగ్రీ, 5 1/2 కోట్ల ఆస్తి, 10 లక్షల ఆదాయం కల్గిన వరునికి కుల, కట్న ప్రసక్తి లేని చదువుకున్న అందమైన వధువు కావలెను. ✆ 94412 75534 (B).

వరుడు కావలెను

బ్రాహ్మణ: 33 Yrs/ 5'2"/ ఇంటర్ ★ 29 Yrs/ 5'4"/ డిగ్రీ ★ 25 Yrs/ 5'2"/ MBA. వధువులకు వరులు కావలెను. రిక్వైర్‌మెంట్ Pvt/ Govt. జాబ్ & పురోహితం అయినా OK ✆ 9392179635 (A)

బ్రాహ్మణ 47/5'4" ఫెయిర్/ 2nd మ్యాచ్ కులపట్టింపులేదు/ MA/ BEd/ Govt. జాబ్/ 70K (PM) సొంత ఇల్లు/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) ✆ 8341101996 (A)

బ్రాహ్మణ 27/5'4" 1st మ్యారేజ్, Q: 7th క్లాస్/ Own టైలరింగ్/ తండ్రి లేట్, పౌరోహిత్యం also OK, 2nd మ్యారేజ్ also OK. వరుడు కావలెను. ✆ 8978808244 (A)

కమ్మ 24, 5'4" B.Tech SWE, MNC 18 Lacs P/A సాంప్రదాయక కుటుంబానికి చెందిన అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9290022700 (A)

రెడ్డి/ కులపట్టింపులేదు/ 47/5'4"/ విడో/ Govt. HM/ సొంత ఇల్లు/ 20 ఎకరాల పొలం, వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8121372653 (A)

ఆస్తి, కుల పట్టింపులేదు/ రెడ్డి/ 24Y/ 5'3"/ B.Tech మంచి స్థిరాస్తి, పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటో, బయోడేటా వాట్సాప్‌లో పంపించండి. ✆ 8142060040 (A)

కాపు/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్/ రైల్వే/ 42,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 8121406576 (A)

SC మాల హిందూ/ B.Tech/ 25Y/ 5'4"/ సాఫ్ట్‌వేర్/ కాగ్నిజెంట్ (Hyd) 60K per Month. చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 9705960270 (A)

మాల 26/5'4" B.Tech IIT PSU సెంట్రల్ Govt ఆఫీసర్ 20 Lacs P/A వధువుకి తగిన వరుడు కావలెను. No Brokers ✆ 9493285326 (A)

SC మాల హిందూ: 24/5'4"/ B.Tech/ SWE విప్రో, Hyd నెలకు 60,000/- జీతం గల ఏకైక వధువు (ఫెయిర్)కు తగిన వరుడు కావలెను. ✆ 8978799956 (A)

కమ్మ 45సం॥/ 5'4"/ SBI Chief Manager/ Legally Diverced/ ఓన్ హౌస్/ నో చిల్డ్రన్, 15 ఎకరాల పొలము గల వధువుకి వరుడు కావలెను. ✆ 90592 42861 (B).

రెడ్డి 51సం॥/ 5'3" రైల్వే Accounts Officer/ Wedo/ నో చిల్డ్రన్/ ఓన్ హౌస్, 19 ఎకరాల పొలము గల వధువుకి వరుడు కావలెను. ✆ 95504 12920 (B).

కులపట్టింపులేదు/ 54 Yrs/ 2వ పెళ్లి/ ఫ్యామిలీ పెన్షన్ 50,000/- PM & Own బిజినెస్ గల చాలా అందమైన వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. ✆ 7702580013 (A)

కమ్మ 27Y, 5'5", B.Tech, 12.7L Job in Hyd ★ 25Y, 5'4", B.Tech 7.5L Banglore ✆ 80196 58575, 73863 38574 (B).

Yadava 27/5'3" B.Tech/ MS/ USA/ 110K ★ 31/5'7" B.Tech/ MS/ 140K/ USA/ Vizag. 9440831748 ★ 25/5'5" B.Tech/ MS/ USA/ 100K ★ 25/5'3" B.Tech/ MS/USA/ Vij ✆ 9440759945 (A)

యాదవ/ ఎర్రశాఖ/ అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4" ఎత్తు/ M.ఫార్మసీ వధువుకి Hyd లో జాబ్ కలిగిన లక్ష రూ॥ PM ఆపై ఆదాయం గల యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్: 9989597799 (A)

కులప్రసక్తి లేదు/ డివోర్స్/ 43/ APIIC కార్పొరేషన్/ 1L PM/ ఓన్ హౌస్, రెంట్స్/ 14 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9989306538 (A)

★ ★ ★

కాపు, 24 సం॥ 5'5" B.Tech., ఇంజనీర్, very rich వధువుకు తగిన వరుడు కావలెను. Ph.: 9989944464. (C)

వివాహ వేదిక

కేవలం కమ్మ వారికి మాత్రమే. దేశ, విదేశ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ & హై రిచ్, 1వ, 2వ, లేటు వధువు, వరుల కోసం సంప్ర: గడ్డిపాటి ప్రభాకరరావు, BE. వాట్సప్: 7893841849 (A)

ఓన్లీ కమ్మాస్ (10 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బిజినెస్ & హైరిచెస్ 1వ, 2వ లేట్ దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9959305599. (A)

గమనిక

పెళ్లిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాలు లేదా రిజిస్ట్రేషన్ కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్య పరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రెడ్డీస్ రెడ్డీస్ (శ్రీ శ్రీరస్తు శుభమస్తు) డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్/ హై రిచెస్. & All ఇండియా & అబ్రాడ్ 1వ, 2వ సంబంధాలు కొరకు సంప్ర: 9059189869 (A)

కాపు పెళ్లిసంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ ★ Srinivas ✆ 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

పద్మశాలి పెళ్లిసంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ ★ Shyam ✆ 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712. (A)

ఫ్రీ రిజిస్ట్రేషన్ కేవలం NRI, PG, Doctors, Software Govt/ గెజిటెడ్/ VIP/ బిజినెస్ ఇండస్ట్రీ 1వ, 2వ లేట్, రిటైర్డ్, క్యాస్ట్ నో బార్. అన్ని కులాల వారికి. ✆ 8712384555 (A)


కేవలం యాదవ/ కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్, www.gokulmarriage.com Hyd: 9440831748, GNT/ VIZ: 9440759945, BGL: 8332926034. (A)

అన్ని కులాలు (15 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్ & హౌరిచెస్, 1వ, 2వ, లేట్, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులాల వారికి ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

దేశానికే తలమానికం.. మన ఆహారశుద్ధి విధానం

వివిధ రూపాల్లో 75% వరకు ప్రోత్సాహకాలు

- పెట్టుబడిలో 45% వరకు మూలధన రాయితీ
- 100% పన్నులు, రిజిస్ట్రేషన్, స్టాంపుడ్యూటీ మినహాయింపు



ఈనాడు - అమరావతి

టమోటా సాస్ తయారు చేసేదైనా, మామిడి గుజ్జు తీసేదైనా.. కారంపొడి కొట్టేదైనా, పచ్చళ్ల ప్యాకింగ్ చేసేదైనా.. పాలు, పండ్లు, కూరగాయలు, ఆహారధాన్యాలు, గుడ్లు, మాంసం ఆధారిత ఉత్పత్తులు.... ఇలా ఆహారశుద్ధి రంగంలో ఏ పరిశ్రమ ఏర్పాటు చేసినా పెద్దమొత్తంలో ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరే రాష్ట్రంలో లేని విధంగా భారీ ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటించింది. నేటి రైతులే రేపటి పారిశ్రామికవేత్తలుగా తయారవ్వాలనే లక్ష్యంతో 'ఆహార శుద్ధి విధానం 2024-29'ను ప్రభుత్వం విడుదల చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు పెట్టే ప్రతి రూ.లక్ష పెట్టుబడికి రూ.75 వేలు వివిధ రూపాల్లో అందించాలని నిర్ణయించింది.

గరిష్ఠంగా రూ.8 కోట్ల వరకు ప్రభుత్వ సాయం

రూ.10 లక్షల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేస్తే.. ప్రభుత్వం రూ.3.50 లక్షలు మూలధన రాయితీగా ఇస్తుంది. అంటే మూలధనంలో 35% చొప్పున గరిష్ఠంగా రూ.8 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 10% అదనపు ప్రోత్సాహకాలూ ఉంటాయి. పరిశ్రమల విస్తరణకు 20% నుంచి గరిష్ఠంగా రూ.5 కోట్లు (మధ్యతరహా), చిన్న పరిశ్రమలకు రూ.కోటి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. రూ.50 కోట్ల నుంచి రూ.100కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే పరిశ్రమలకు గరిష్ఠంగా 15% ప్రోత్సాహకాలు అందిస్తారు. పెట్టుబడి రూ.100 కోట్లు దాటితే ఆ పరిశ్రమ అవసరాల మేరకు ప్రోత్సాహకాలు ఉంటాయి. కేంద్ర పథకాల కింద (రూ.5 కోట్లు, రూ.10 కోట్లు) యూనిట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రం నుంచి 15% అదనపు గ్రాంట్‌గా గరిష్ఠంగా రూ.కోటి వరకు చెల్లిస్తారు.


నైపుణ్యం పెంపొందించడానికీ ఆర్థిక తోడ్పాటు

పరిశ్రమల్లో పనిచేసే వారి నైపుణ్యం పెంచుకునేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. రైతు ఉత్పత్తి సంఘాలకు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి.. ఒక్కో పరిశ్రమలో 10 మంది వరకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున, చిన్న యూనిట్లకైతే 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందిస్తుంది. మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి యజమాని వాటాగా చెల్లించాల్సిన ఈపీఎఫ్‌ను 100% చొప్పున మూడేళ్లకు చెల్లిస్తుంది.

ఆరేళ్ల పాటు విద్యుత్తు రాయితీ

పరిశ్రమలు ఏర్పాటు చేస్తే.. ఎస్జీఎస్టీ (వస్తు సేవల పన్ను)ను ఆరేళ్ల వరకు 100% చొప్పున తిరిగి చెల్లిస్తారు. రిజిస్ట్రేషన్, స్టాంపు రుసుములో వందశాతం మినహాయింపు లభిస్తుంది. నాణ్యత ధ్రువీకరణకు సంబంధించిన సర్టిఫికేషన్‌లకు అయ్యే ఖర్చును 100% రీఎంబర్స్‌మెంట్ చేస్తారు. విద్యుత్తు రాయితీ యూనిట్‌కు రూ.1 చొప్పున ఆరేళ్ల పాటు ఇస్తారు. గరిష్ఠంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అయితే రూ.15లక్షలు, పెద్ద పరిశ్రమలు అయితే రూ.20లక్షల వరకు చెల్లిస్తారు.

ఆహారశుద్ధి రంగానికి వివిధ రాష్ట్రాల్లో అందే ప్రోత్సాహకాల తీరు (శాతంలో)



సొంత భూముల్లో అయితే ఎకరాకు రూ.5 లక్షలు

రైతులు తమ సొంత భూముల్లో ఆహార శుద్ధి పార్కులు ఏర్పాటు చేస్తే షెడ్లు, రహదారులు, ఇతర మౌలిక సౌకర్యాలకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. ప్రత్యేకించి ఆహారశుద్ధి రంగానికి సంబంధించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున పదెకరాల్లో చిన్నసైజ్ పార్కుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. డివిజనల్, జిల్లా స్థాయిలో 10 నుంచి 100 ఎకరాల్లో పార్కుల ఏర్పాటుకు ప్రోత్సాహకాలిస్తారు.

మాజీ ఎంపీ ఎంవీవీ ఇంట్లో ఈడీ సోదాలు

'హయగ్రీవ' ఆర్థిక లావాదేవీలపై ఆరా!




ఈడీ సోదాలు జరిపిన లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ కార్యాలయం

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-మధురవాడ, ఎంవీపీకాలనీ- విశాఖ వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన స్నేహితుడు, ఆడిటర్, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ)ల ఇళ్లు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శనివారం సోదాలు జరిపారు. ఏకకాలంలో ఐదు బృందాలుగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. రుషికొండలోని ఎంవీవీ నివాసం, లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయం, ఇల్లు, జీవీ స్క్వేర్‌లోని జీవీ కార్యాలయం, ఆయన ఇంట్లో సోదాలు జరిగాయి. ఫోర్జరీ సంతకాలతో హయగ్రీవ ప్రాజెక్టును లాక్కొన్నారంటూ చిలుకూరి జగదీశ్వరుడు, ఆయన భార్య రాధారాణి ఈ ఏడాది జూన్ 22న విశాఖలోని ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీసింది. ఎంవీవీ, జీవీ నుంచి జగదీశ్వరుడికి సుమారు రూ.9-12 కోట్లు లావాదేవీలు జరిగినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలోనే ఈడీ దాడులు చేసినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. తనిఖీల సమయంలో మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీలువారి నివాసాల్లోనే ఉన్నారు. తనిఖీల అనంతరం వారి నుంచి ఈడీ అధికారులు స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు.

హయగ్రీవ కేసు ఇదే.. 2008లో చిలుకూరి జగదీశ్వరుడికి చెందిన హయగ్రీవ సంస్థకు ఎండాడలో 12.51 ఎకరాలను ప్రభుత్వం తక్కువ ధరకు కేటాయించింది. ఆడిటర్‌గా రంగప్రవేశం చేసిన జీవీ.. ప్రాజెక్టు అభివృద్ధి కోసం గద్దె బ్రహ్మాజీని పరిచయం చేశారు. తదనుగుణంగా ఒక ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఆ తర్వాత జీవీ చేతుల్లోకి ప్రాజెక్టు వెళ్లిపోయింది. ఆయన ఆ భూమికి జీపీఏ హోల్డర్. '2020లో మా సంతకాలు ఫోర్జరీ చేశారు. అమ్మకపు పత్రాలు తయారు చేసి బలవంతంగా విలువైన ఆస్తిని లాక్కోవడానికి నేరపూరితంగా వ్యవహరించారు. సేల్‌డీడ్‌లను దుర్వినియోగం చేశారు' అంటూ ఈ ఏడాది జూన్‌లో జగదీశ్వరుడు ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంవీవీ, జీవీ, గద్దె బ్రహ్మాజీలపై కేసు నమోదైంది. ఇదే కేసులో ఈ నెల 17వ తేదీన ఆ ముగ్గురికీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

చంద్రబాబు నేతృత్వంలో స్వర్ణాంధ్ర ఆవిష్కృతం కావడం తథ్యం: మంత్రి సవిత

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం కావడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో స్వర్ణాంధ్ర ఆవిష్కృతం కావడం తథ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రాజధాని పనులు తిరిగి ప్రారంభం కావడానికి చర్యలు తీసుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని శనివారం ఓ ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.



వర్షమొక్కటే చాలు.. ఎండ వద్దంటే ఎలా?

ఒక పుష్పం వికసించడానికి వర్షం ఎంత అవసరమో ఎండ కూడా అంతే ముఖ్యం. ఎండ వేడిమిని భరించలేనని పువ్వు అనుకుంటే దానికి మనుగడ ఉంటుందా? అదే విధంగా మనుషులు ఎదగాలనుకుంటే ప్రశంసలతో పాటు విమర్శలకూ సిద్ధంగా ఉండాలి. నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తేనే మిమ్మల్ని తీర్చిదిద్దుకోగలరు.

- హ్యారీ వెన్‌హమ్, పర్సనల్ లైఫ్ కోచ్

ఆప్కో షోరూముల్లో త్వరలో ఆన్‌లైన్ అమ్మకాలు

- 24 నుంచి పైలట్ ప్రాజెక్టుగా విజయవాడలో ప్రారంభం

ఈనాడు, అమరావతి: ఆప్కో షోరూముల్లో త్వరలో ఆన్‌లైన్ అమ్మకాలు చేపట్టనున్నారు. తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద ఈ నెల 24 నాటికి విజయవాడలోని మూడు షోరూముల్లోని వస్త్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని 30 మెగా షోరూములను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100 షోరూములను అందుబాటులోకి తెస్తారు. విక్రయాలకు వీలుగా ఇప్పటికే డీటీడీసీ, బ్లూడార్ట్, ప్రొఫెషనల్ కొరియర్ తదితర ఈ కామర్స్ సంస్థలతో అధికారులు చర్చలు జరిపారు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో..

ప్రసిద్ధిగాంచిన చీరలను ఇక్కడ మన నేతన్నలు తయారు చేస్తున్నారు. ధర్మవరం, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, మదనపల్లె, మాధవరం, వెంకటగిరి, కోడుమూరు, ఎమ్మిగనూరు, పొందూరు తదితర చోట్ల కార్మికులు నేసే నేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఆప్కో గోదాముల్లోని వస్త్రాలను వివిధ ఈ కామర్స్ సంస్థల ద్వారా ఆన్‌లైన్ విక్రయాలు చేస్తున్నారు. ఇదే కాకుండా షోరూముల్లోని వస్త్రాలనూ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచడం ద్వారా విక్రయాలతో పాటు ఆదాయాన్నీ పెంచేందుకు అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100 షోరూముల్లోని నేత వస్త్రాలను విక్రయాలకు వీలుగా ఆన్‌లైన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశించారు.

తక్కువ దూరం ఉంటే ఉచితంగానే అందజేత

షోరూముల్లోని చీరలు, డ్రెస్ మెటీరియల్స్‌ను తొలుత ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. పంచెలు, ధోతీలు ఇతర వస్త్రాలను బంచ్‌గా ప్యాకింగ్ చేసి విక్రయాలు చేయాలని నిర్ణయించారు. వినియోగదారులు ఎంపిక చేసుకున్న ప్రొడక్టులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తారు. దూరానికి అనుగుణంగారవాణా ఛార్జీలు వసూలు చేయనున్నారు. పట్టణ పరిధిలో తక్కువ దూరం ఉంటే ఉచితంగానే ఇళ్ల వద్దకు అందిస్తారు. ఉదాహరణకు విజయవాడ పరిధిలోని వారు అక్కడి మూడు ఆప్కో షోరూముల్లోని వస్త్రాలను కొనుగోలు చేస్తే ఉచితంగానే వారి ఇళ్ల వద్దకు అందిస్తారు. ఆప్కోలో కొనుగోలు చేసే వస్త్రాలపై 20 శాతం రాయితీ కూడా ఉండనుంది.

కొత్త షోరూముల ఏర్పాటు..

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వస్త్ర విక్రయాలకు ప్రసిద్ధి. అలాంటి చోట ఇప్పటి వరకు ఆప్కో షోరూం లేకపోవడంతో అక్కడ కొత్తగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోనూ ఏర్పాటు చేయనున్నారు. త్వరలో ప్రారంభానికి వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. అదే సమయంలో ఇప్పటికే ఉన్న షోరూముల్లో విక్రయాల తీరును కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. కనీస అమ్మకాలు కూడా లేని ఒకటి రెండు చోట్ల మూసివేతకూ ఆలోచిస్తున్నారు. వాటి స్థానంలో వేరే చోట కొత్తవి ఏర్పాటు చేయనున్నారు.


కర్నూలు వైద్యకళాశాలలో ఓపెన్ కేటగిరీ సీటొకటి ఖాళీగా ఉంచండి

హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓపెన్ కేటగిరీకి చెందిన ఎంబీబీఎస్ సీటు ఒకటి మూడో రౌండ్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేయకుండా ఉంచాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం శనివారం ఈ ఉత్తర్వులిచ్చింది. షేక్ సానియా అజ్రా అనే యువతి నీట్ పరీక్షలో 626 మార్కులు సాధించారు. బీసీ-ఈ కేటగిరి కింద వైద్యవిద్యలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జారీ చేసిన సీట్ మ్యాట్రిక్స్ ప్రకారం.. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో బీసీ-ఈ సీట్లు 8 ఉన్నాయని, ఆందులో 7 సీట్లను మాత్రమే భర్తీ చేశారని, మిగిలిన సీటును జనరల్ ఓపెన్ మెరిట్ కేటగిరీకి మళ్లించారంటూ ఆమె శనివారం హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఠాగూర్‌యాదవ్ వాదనలు వినిపిస్తూ.. సీట్ల కేటాయింపు ప్రారంభమయ్యాక సీట్ మ్యాట్రిక్స్ మార్చడానికి వీల్లేదన్నారు. ఓపెన్ కేటగిరీ కింద అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిటిషనర్‌కు సీటు వచ్చిందన్నారు. అయితే మూడో రౌండ్ కౌన్సెలింగ్‌లో.. కర్నూలు కళాశాలలో ఓపెన్ కేటగిరీలో సీటు పొందే అవకాశాన్ని కల్పించాలని కోరారు. మూడో రౌండ్ కౌన్సెలింగ్‌లో కర్నూలు మెడికల్ కళాశాలలో ఓపెన్ కోటా సీటు ఒకటి ఖాళీగా ఉంచాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

జనవరి 5న 'హైందవ శంఖారావం' సభ

వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేంద్ర జైన్ . చిత్రంలో వెంకటేశ్వర్లు, గోకరాజు గంగరాజు

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, కృష్ణలంక: రాష్ట్ర ప్రభుత్వాలు హిందువుల మనోభావాలు, సమస్యలు అర్థం చేసుకోవాలని వచ్చే జనవరి 5న విజయవాడలో 'హైందవ శంఖారావం' పేరుతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్తు (వీహెచ్‌పీ) కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేంద్ర జైన్ తెలిపారు. విజయవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి' వ్యవహారం హిందువుల మనోభావాలు దెబ్బతీసింది. భక్తుల విశ్వాసాలు, మనోభావాలే కాకుండా.. దేవాలయాల వ్యవస్థ పెను ప్రమాదంలో పడింది. అందుకే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నాం. ఆలయాల్లో భక్తులు సమర్పించే ముడుపులు అధికారులు, పాలక మండళ్ల ద్వారా దుర్వినియోగం అవుతున్నాయన్న వార్తలు కలవరానికి గురిచేస్తున్నాయి. తితిదేతో సహా ఇతర దేవాలయాలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించాలి. ఇందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభించబోతున్నాం' అని తెలిపారు.

వైకాపా వేధింపులతో తెదేపా కార్యకర్త ఆత్మహత్య


బుజ్జిరెడ్డి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్తల వేధింపులు తట్టుకోలేక తెదేపా సీనియర్ కార్యకర్త శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరిపాలెంలో చోటుచేసుకుంది. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. కావూరిపాలెం పరిధిలోని బొగ్గులవారిపాలెంకు చెందిన కోట వెంకటేశ్వరరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి(50) 32 ఏళ్లుగా తెదేపాలో చురుగ్గా పని చేసేవారు. ఇటీవల గ్రామంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో సీఎం చంద్రబాబును కించపరిచే పాటలు పెట్టొద్దన్నందుకు స్థానిక వైకాపా కార్యకర్తలు ఆయన్ను వేధించసాగారు. అతని కుటుంబంతో గ్రామస్థులు ఎవరైనా మాట్లాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన బుజ్జిరెడ్డి ఈ నెల ఒకటిన పురుగుమందు తాగారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొంది, వారం కిందటే గ్రామానికి వచ్చారు. అప్పటి నుంచి వైకాపా వాళ్ల వేధింపులు ఇంకా పెరగడంతో శనివారం తెల్లవారుజామున తన ఇంటి ఎదుట పందిరికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. 'నా ఆత్మహత్యకు వైకాపాకు చెందిన కుంచాల పోట్టయ్య, కుంచాల చిన్న, కావూరి ఎర్ర శ్రీనివాసరెడ్డి కారణం. వారిని శిక్షించాలి' అని బుజ్జిరెడ్డి జేబులో లభించిన లేఖలో రాసి ఉంది. పోలీసులు లేఖను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.



ఎవ్వరి సలహాలనూ గుడ్డిగా అనుసరించొద్దు

విజేతల నుంచి సలహాలు తీసుకోవడంలో తప్పు లేదు కానీ, వాటిని గుడ్డిగా అనుసరిస్తేనే సమస్య. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి ప్రయాణమూ ఒకేలా ఉండదు. ఇతరులు తమకెదురైన సవాళ్లను అధిగమించడానికి అమలుపర్చిన వ్యూహాలు మీకు పనిచేయకపోవచ్చు. విజయానికి ఒకే సూత్రం, ఒక్కటే మార్గమంటూ ఉండవు. కాబట్టి ఇతరుల నుంచి స్ఫూర్తి మాత్రమే పొంది మీదైన పంథాలో సాగండి.

– అనుష్కా సోహం బత్వాల్, వ్యాపారవేత్త

మా చెరువు.. మాకు ఇప్పించండి

- కైకలూరు మాజీ ఎమ్మెల్యే దౌర్జన్యంగా తక్కువకు లీజుకు తీసుకున్నారు
- న్యాయం చేయాలని రైతుల ఆందోళన


కైకలూరు పట్టణ పోలీసులకు సమస్యను వివరిస్తున్న రైతులు

కైకలూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో తమ నుంచి తక్కువ లీజుకు బలవంతంగా చెరువును లాక్కుని ప్రశ్నించిన వారిపై కైకలూరు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత వైకాపా ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు దాడులు చేయిస్తున్నారని రైతులు ధ్వజమెత్తారు. కైకలూరు కరకట్ట శివార్లలో 63 మంది రైతులకు చెందిన 114 ఎకరాలను చెరువుగా మార్చి చాలాకాలంగా లీజుకు ఇస్తూ వస్తున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక అప్పటి ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఆయన కుమారుడు చెరువును సాగు చేస్తున్న రైతును బెదిరించి చెరువు ఖాళీ చేయించి స్వాధీనం చేసుకున్నారు. తమకే లీజుకు ఇవ్వాలంటూ బలవంతం చేయడంతో అప్పట్లో కొందరు రైతులు పోలీసులను ఆశ్రయించినా నిష్ఫలమే అయింది. పోలీసులు, అనుచరులతో బెదిరించి తమకే లీజుకు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే వర్గీయులు సంతకాలు చేయించుకున్నారని రైతులు ఆరోపించారు. ఎకరాకు అప్పట్లో రూ.75 వేల లీజు ఇవ్వాల్సింది పోయి రూ.60 వేలే చెల్లించేలా అప్పట్లో పదేళ్ల ఒప్పందం కుదుర్చుకున్నారని వాపోయారు. చెరువు సమీపంలో ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష లీజు ధర నడుస్తున్నదని తెలిపారు. ఆ ధర ఇస్తామని ఇప్పుడు ముందుకొస్తున్న వారిని అడ్డుకుంటున్నారని తెలిపారు. తమ చెరువును ఇప్పించాలని, లేని పక్షంలో మార్కెట్‌ధర ప్రకారం లీజు చెల్లించినా అభ్యంతరం లేదని వివరించారు. ఆందోళనకు కూటమి నాయకులు సంఘీభావం తెలిపారు. పోలీసులు చెరువు వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నాటుతుపాకీతో హల్‌చల్

చెరువు వద్ద రైతులు ఆందోళన చేస్తున్న సమయంలో నాటుతుపాకీతో వేటగాడు పక్షులను వేటాడుతున్నాడని, తమను చూసి పరారయ్యాడని రైతులు తెలిపారు. అక్కడ గన్‌పౌడర్, ఇతర సామగ్రిని వారు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. చెరువుకు సమీపంలోనే ఉన్న ఆటపాక పక్షుల కేంద్రంలోని విదేశీ విహంగాలను మాజీ ఎమ్మెల్యే వేటాడిస్తూ వన్యప్రాణ సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని జనసేన నేత కొల్లి వరప్రసాద్ ఆరోపించారు.

నేడు హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు

- బ్రౌన్ సేవలను వెలుగులోకి తెచ్చిన సాహితీమూర్తి


జానమద్ది హనుమచ్ఛాస్త్రి


కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: జీవితమంతా రచనా వ్యాసంగంలో తరించిన సాహితీమూర్తి జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలను కడపలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. 1925లో అనంతపురం జిల్లా రాయదుర్గంలో సుబ్రహ్మణ్యశాస్త్రి, జానకమ్మలకు జన్మించిన ఆయన.. బీఈడీ పూర్తి చేసి, తెలుగు, ఆంగ్లంలో ఎంఏ పట్టా పొందారు. 1946లో బళ్లారిలో ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అనంతర కాలంలో వేమన పద్యాలకు జన బాహుళ్యం కల్పించిన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సేవలను వెలుగులోకి తీసుకురావడానికి హనుమచ్ఛాస్త్రి తీవ్రంగా కృషి చేశారు. బ్రౌన్ సేవలకు గుర్తుగా కడపలో సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టును నెలకొల్పారు. ట్రస్టు కార్యదర్శిగా అహర్నిశలూ పాటుపడి రూ.10 లక్షల విరాళాలు సేకరించారు. గ్రంథాలయానికి 15 వేల గ్రంథాలను సేకరించి, బ్రౌన్ ద్విశతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కృషికి మెచ్చిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి.. హనుమచ్ఛాస్త్రిని 'బ్రౌన్ శాస్త్రి' అని పిలిచేవారు. ఆయన వివిధ పత్రికల్లో రాసిన 'ఎందరో మహానుభావులు' వ్యాసాలూ ప్రత్యేకమైనవే. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపనలోనూ ప్రధాన పాత్ర పోషించిన హనుమచ్ఛాస్త్రి.. 2014లో కన్నుమూశారు.

జోగి రాజీవ్, ఆజ్మీర రమేష్‌కు హైకోర్టు నోటీసులు

- 'అగ్రి' భూముల కబ్జా కేసులో బెయిలు రద్దుకు పిటిషన్లు వేసిన ఏసీబీ

ఈనాడు, అమరావతి: సీఐడీ జప్తు చేసిన అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్, విజయవాడ గ్రామీణ మండల సర్వేయర్ ఆజ్మీర రమేష్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు మంజూరు చేసిన రెగ్యులర్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏసీబీ అధికారులు సమర్పించిన పిటిషన్లపై శనివారం హైకోర్టు విచారించింది. వారిద్దరికీ నోటీసులు జారీ చేసింది. నోటీసులను నేరుగా నిందితులకు అందజేసేందుకు ఏసీబీ అధికారులకు వెసులుబాటు ఇచ్చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శనివారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. విజయవాడ గ్రామీణ మండలం అంబాపురంలో సీఐడీ జప్తు చేసిన అగ్రిగోల్డ్ భూములను కబ్జా చేసి తప్పుడు పత్రాలు సృష్టించి, ఆ స్థలంలో ప్లాట్లు వేసి విక్రయించారన్న ఆరోపణలతో ఏసీబీ అధికారులు రాజీవ్, ఆజ్మీర రమేష్, మరికొందరిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో రాజీవ్, రమేష్‌లను ఏసీబీ అరెస్టు చేసింది. ఆతర్వాత నిందితులు పిటిషన్లు దాఖలు చేయడంతో విజయవాడ కోర్టు బెయిలు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

స్వర్ణాంధ్ర సాకారమయ్యేలా '20 సూత్రాల' అమలు

- ఆ కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ వెల్లడి


బాధ్యతలు స్వీకరిస్తున్న లంకా దినకర్

ఈనాడు డిజిటల్, అమరావతి: స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఆ కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మన్‌గా శనివారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి, విలేకర్లతో మాట్లాడారు. 'నీతి ఆయోగ్ అభివృద్ధి సూచికలకు అనుగుణంగా రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమం అనుసంధానానికి చర్యలు తీసుకుంటాం. ప్రతి కలెక్టరేట్‌లోనూ ఈ సూత్రాల బోర్డుల్ని పెడతాం. రాష్ట్రాన్ని 2.40 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ గమ్యాన్ని చేరుకునేలా కృషి చేస్తాం. గత అయిదేళ్లలో కేంద్ర ప్రాయోజిత పథకాలు దుర్వినియోగమయ్యాయి. ఇప్పుడు ప్రతి పథకాన్నీ పేదలకు చేరువ చేస్తాం. నేషనల్ గోకుల్ మిషన్, జల్ జీవన్ మిషన్లను మొదటి ప్రాధాన్యంగా తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే అతిసారానికి కారణం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా గుర్లలో భూగర్భ జలాలు కలుషితం కావటంతోనే అతిసారం విజృంభించిందని, ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు 201 అతిసారం కేసులు నమోదు కాగా.. 160 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారని.. 40 మంది స్థానిక వైద్యాలయాల్లో, ఒకరు విశాఖ కేజీహెచ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఎనిమిది మంది మరణించగా.. అందులో ఒకరికి మాత్రమే డయేరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి ఓ బృందం గుర్లకు వెళ్లిందని, మూడు రోజుల్లో నివేదిక వస్తుందని వెల్లడించారు. సూపర్ క్లోరినేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలే ఈ దుస్థితికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయిదేళ్లలో వారు తాగునీటి వ్యవస్థను పక్కన పెట్టేశారని మండిపడ్డారు. ప్రభావిత ప్రాంతానికి నాగావళి నది నుంచి నీటిని సరఫరా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. 15 గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

అతిసారంతో మృతి చెందినా పట్టదా?: జగన్

ఈనాడు, అమరావతి: గుర్ల మండలంలో అతిసారం ప్రబలి 11 మంది చనిపోయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ శనివారం మాజీ సీఎం జగన్ ఎక్స్‌లో విమర్శించారు. 'విజయనగరం, విశాఖల్లో మంచి ఆస్పత్రులు అందుబాటులో ఉన్నా, స్థానిక పాఠశాలల్లో బెంచీలపై బాధితులకు చికిత్స అందించడం దారుణం. ప్రభావిత గ్రామాల్లో తాగునీటి వనరులపై దృష్టి పెట్టాలి' అని డిమాండ్ చేశారు.

EENADU Vol: 51, Iss: 70 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఆదివాసీలపై మోదీ ప్రభుత్వ వివక్ష

- రాంచీ సదస్సులో రాహుల్‌గాంధీ విమర్శలు



రాంచీ: మన దేశ రాజ్యాంగంపై భాజపా దాడి చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను విభాగం తదితర కేంద్ర సంస్థలు అన్నింటినీ ఆ పార్టీ నియంత్రిస్తోందని ధ్వజమెత్తారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం రాంచీలో నిర్వహించిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. భారత రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి దాడి జరుగుతోందని, దానిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ నేతృత్వంలోని సర్కార్ ఆదివాసీలపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. 'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మోదీ ప్రభుత్వం... రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మాత్రం ఆహ్వానించలేదు. ఎందుకంటే ఆమె ఆదివాసీ కావడమే'నని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎంతో ఘనత కలిగిన గిరిజనుల వారసత్వం, చరిత్ర, సంప్రదాయాలు, వైద్య విధానాలను ధ్వంసం చేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గిరిజనుల మూలాల గురించి బోధించడంలో మన విద్యావిధానం విఫలమైందని వ్యాఖ్యానించారు.

ఫార్మా కంపెనీ ఉద్యోగులకు దీపావళి కానుకగా కార్లు!



ఈటీవీ భారత్: హరియాణాకు చెందిన ఓ ఫార్మా కంపెనీ దీపావళి కానుకగా తమ ఉద్యోగులకు కార్లను పంపిణీ చేసింది. పంచకులలో ఉన్న ఈ కంపెనీ యజమాని ఎన్.కె. భాటియా ఉద్యోగులకు టాటా పంచ్, మారుతి గ్రాండ్ విటారా కార్లను పండుగ బహుమతిగా ఇచ్చారు. 'స్టార్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైన 15 మంది కంపెనీ ఉద్యోగులకు అక్టోబరు 14న ఈ కానుకలను అందించారు. ఈ కంపెనీ గతేడాది కూడా అత్యుత్తమ పనితీరు కనబర్చిన 12 మంది ఉద్యోగులకు ఇలాగే కార్లను ఇచ్చింది. ఈ వాహనాలను కంపెనీ పనికి వాడితే కారు ఇంధనం ఖర్చును సంస్థే భరిస్తుంది.

సుప్రీంకోర్టుది.. విపక్షపాత్ర కాదు

- అనుకూలంగా తీర్పు వస్తే పొగడటం.. వ్యతిరేకంగా వస్తే విమర్శించడం మానుకోవాలి
- ఇది ప్రమాదకర ధోరణి
- ఎన్‌సీఏవోఆర్ఏ సదస్సులో సీజేఐ డి.వై.చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు



పణజీ: సుప్రీంకోర్టు ప్రజా న్యాయస్థానమని.. దాన్ని అలానే పరిరక్షించి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రజా కోర్టు అయినంత మాత్రాన పార్లమెంటులో విపక్షాల పాత్రను తాము పోషించనక్కర్లేదని తెలిపారు. దక్షిణ గోవాలో శనివారం జరిగిన సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్ (ఎస్‌సీఏవోఆర్ఏ) సదస్సు తొలి సమావేశంలో సీజేఐ ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాజంలో విభజన భారీస్థాయిలో ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. తీర్పు అనుకూలంగా వస్తే సుప్రీంకోర్టు గొప్ప వ్యవస్థ అని పొగడటం, వ్యతిరేకంగా వస్తే విమర్శలు గుప్పించడం ఓ అలవాటుగా మారిపోయిందని అన్నారు. ఇది ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. న్యాయపరంగా తప్పులు చేస్తే విమర్శలు స్వీకరించడానికి న్యాయమూర్తులు సిద్ధంగా ఉన్నారని, అలా కాకుండా వ్యతిరేకంగా తీర్పులు వచ్చినప్పుడు మాత్రమే తప్పుబడితే కష్టంగా ఉంటుందని అన్నారు. న్యాయస్థానాల్లో జరుగుతున్న విచారణలు ప్రత్యక్ష ప్రసారం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. "లైవ్ స్ట్రీమింగ్‌తో భారతీయుల గృహాల్లోకి, హృదయాల్లోకి సుప్రీంకోర్టు వెళ్లింది. కేవలం గొప్పోళ్ల కేసులను మాత్రమే సుప్రీంకోర్టు విచారిస్తుందన్న ఓ ముద్ర ఉంది. ప్రత్యక్ష ప్రసారాలతో అది పోయింది. పౌరుల చిన్న సమస్యలనూ ఆలకిస్తామని అందరికీ తెలిసింది" అని సీజేఐ తెలిపారు. ఉత్తర గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో అసభ్యపదజాలానికి చోటు లేదని అన్నారు. ముఖ్యంగా మహిళలపై, దుర్బల వర్గాలపై ప్రయోగించే అనుచిత పదాలు వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పేర్కొన్నారు. న్యాయదేవత ప్రతిమకు తాజాగా తాను చేసిన మార్పులపై సీజేఐ మాట్లాడుతూ... చట్టం గుడ్డిది కాదని, అందరినీ సమానంగా చూస్తుందని చెప్పారు.

వాతావరణ మార్పులపై ఆందోళన

సమాజంలో దుర్బల వర్గాలనే వాతావరణ మార్పులు ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆందోళన వ్యక్తంచేశారు. గోవా గవర్నర్ పి.ఎస్. శ్రీధరన్ పిళ్లై రాసిన "ట్రెడిషనల్ ట్రీస్ ఆఫ్ భారత్" పుస్తకావిష్కరణలో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "నిన్న కూడా గోవాలో వర్షం కురిసిందని చెప్పారు. ఈ సమయంలో మత్స్యకారులు సముద్రానికి నైవేద్యంగా కొబ్బరి కాయలు కొడతారు. కానీ ఇప్పుడు అక్టోబరులోనే కాదు.. డిసెంబరులోనూ వర్షాలు కురుస్తున్నాయి" అని చెప్పారు. రైతులు, మత్స్యకారులు లాంటి వర్గాలే వాతావరణ మార్పులతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

8 లక్షల ఏళ్ల కిందటే మానవుల్లో 'కార్బోహైడ్రేట్ జన్యువులు'!

దిల్లీ: మానవుల్లో కార్బోహైడ్రేట్ల జీర్ణానికి సాయపడే జన్యువుల పరిణామక్రమం సుమారు 8లక్షల ఏళ్ల కిందటే మొదలైందని తాజా అధ్యయనం తేల్చింది. మనుషులు వ్యవసాయం మొదలుపెట్టడానికి చాలా కాలం ముందే ఈ పరిణామం జరిగినట్లు తెలిపింది. 68 పురాతన మానవ జన్యుక్రమాలను విశ్లేషించడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు వచ్చారు. ఇందులో.. సైబీరియా నుంచి సేకరించిన 45వేల ఏళ్ల నాటి నమూనా కూడా ఉంది. ఒక జన్యువు తన ప్రతిని తయారుచేసుకొని, స్వీయ సంఖ్యను పెంచుకోవడాన్ని జీన్ డూప్లికేషన్‌గా పిలుస్తారు. పరిణామక్రమానికి ఇది పెద్ద ఊతమిస్తుంది. అమైలేజ్ (ఏఎంవై1) అనే జన్యువు కార్బోహైడ్రేట్లను జీర్ణం చేయడంలో సాయపడుతుంది. వ్యవసాయం పురుడు పోసుకోవడానికి ముందు వేట ద్వారా జీవనం సాగించిన మానవ జాతుల్లో ఈ జన్యువుకు సంబంధించిన 8 ప్రతులు కనిపించినట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. దీన్నిబట్టి ఇది చాలా ఆరంభంలోనే డూప్లికేషన్‌కు లోనైనట్లు తేలింది. దీనివల్ల.. వ్యవసాయం ద్వారా వచ్చిన కార్బోహైడ్రేట్ ఆహారానికి అనుగుణంగా మానవులు సర్దుబాటు చేసుకోవడానికి వీలు కలిగింది. ఆ తర్వాత అనేక జన్యు వేరియంట్లు పుట్టుకురావడానికి ఇది పునాదిగా నిలిచింది. మానవులు కార్బోహైడ్రేట్లు సమర్థంగా జీర్ణం చేసుకునే తీరును ఇది ప్రభావితం చేస్తోంది. అమైలేజ్ జన్యువులు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటే.. శరీరంలో అంత ఎక్కువగా అమైలేజ్ ఉత్పత్తవుతుందని పరిశోధనలో పాల్గొన్న ఒమెర్ గాక్యుమెన్ పేర్కొన్నారు. దీనివల్ల కార్బోహైడ్రేట్లను మెరుగ్గా జీర్ణం చేసుకోవడానికి వీలవుతుందన్నారు. అమైలేజ్ జన్యువుల పరిణామక్రమాన్ని వ్యవసాయం ప్రభావితం చేసిన తీరును కూడా ఈ పరిశోధన వెలుగులోకి తెచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

నిఘా సంస్థలపై పార్లమెంటు పర్యవేక్షణ ఉండాలి: తివారీ

దిల్లీ: నిఘా సంస్థలపై పార్లమెంటరీ పర్యవేక్షణ ఉంచేందుకు సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నేత, చండీగఢ్ ఎంపీ మనీశ్ తివారీ అభిప్రాయపడ్డారు. అమెరికా, కెనడాల నుంచి ఇటీవలి కాలంలో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో దీనిపై చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. '..ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు ప్రైవేటు బిల్లు సమర్పించాను. నిఘా సంస్థలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి జాతీయ నిఘా ట్రైబ్యునల్ ఉండాలి' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

తలకు గాయమైతే.. పొత్తికడుపుపై సర్జరీ గుర్తులు!

కటక్: తలకు గాయమై ఆసుపత్రిలో చేరితే పొత్తికడుపుపై శస్త్రచికిత్స చేసిన గుర్తులు ఉన్నాయని ఓ కేసులో మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పూడ్చిపెట్టిన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వెలికితీశారు. ఒడిశాలోని కటక్‌లో ఈ ఘటన జరిగింది. అక్టోబరు 13న బాబులాదిగల్ అనే వ్యాపారి తన భార్య, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై రాంపూర్‌కు వెళ్తుండగా.. మినీ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబులాదిగల్ తలకు గాయమైంది. కుటుంబసభ్యులు కటక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతణ్ని తీసుకువెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ మూడు రోజుల తర్వాత బాబులాదిగల్ మృతిచెందాడు. అంత్యక్రియల సమయంలో అతడి పొత్తికడుపుపై కత్తిగాట్లను గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసు అధికారి సుశాంత్ సాహు తెలిపారు. బాబులాదిగల్ కుటుంబసభ్యుల ఆరోపణను ఆసుపత్రి మేనేజరు ఖండించారు. ఒడిశా ఆరోగ్య శాఖ మంత్రి ముకేశ్ మహాలింగ్ ఈ వివాదంపై విచారణకు ఆదేశించారు.

యూపీలో ఐదేళ్ల చిన్నారిపై ముగ్గురు మైనర్ల అత్యాచారం

బలియా, బదాయూ: ఐదేళ్ల చిన్నారిపై ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో వెలుగుచూసింది. బలియా జిల్లాలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు మైనర్లు యజమాని కుమార్తెపై ఇంటి మేడమీద అత్యాచారానికి పాల్పడ్డారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనా ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు శనివారం పోలీసులు వెల్లడించారు. నిందితులంతా 16 ఏళ్ల లోపువారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అత్యాచారాన్ని ప్రతిఘటించడంతో ఏడేళ్ల బాలికను కొట్టి చంపాడు

యూపీలోనే మరో దారుణం చోటుచేసుకుంది. బదాయూ జిల్లాలో ఏడేళ్ల బాలికను అపహరించిన 22 ఏళ్ల వ్యక్తి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించి, ఇటుకతో కొట్టి చంపాడు. శుక్రవారం సాయంత్రం బాలిక మార్కెట్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా గాలించారని, ఓ పాడుబడిన ఇంట్లో అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయి మృతదేహాన్ని గుర్తించారని పోలీసులు వెల్లడించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని జానే ఆలాం (22)గా గుర్తించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తనను గుర్తించిన పోలీసులపైకి నిందితుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. అత్యాచారం చేసేందుకు ప్రయత్నించినప్పుడు బాలిక కేకలు వేసిందని.. దీంతో ఆమెను పలుమార్లు గోడకు బాది, ఇటుకతో కొట్టి చంపానని విచారణలో నిందితుడు అంగీకరించాడు.

ఝార్ఖండ్ డీజీపీపై ఈసీ వేటు

రాంచీ: అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఝార్ఖండ్ రాష్ట్ర తాత్కాలిక డీజీపీ అనురాగ్ గుప్తాపై ఎన్నికల సంఘం (ఈసీ) వేటు వేసింది. గత ఎన్నికల సమయంలో ఆరోపణలు వచ్చిన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఆ పదవి నుంచి అనురాగ్‌ను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఈసీ ఆదేశించింది. రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను ఈ నెల 21లోగా అందజేయాలని సూచించింది. వీరిలో ఒకరిని తదుపరి డీజీపీగా నియమించే అవకాశం ఉంది.

రష్యా తరఫున

ఉత్తర కొరియా సైనికులు

- వీడియో ఆధారాన్ని విడుదల చేసిన ఉక్రెయిన్

కీవ్: రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా తన సైనికులను పంపిస్తోందన్న ఆరోపణలకు సాక్ష్యాలుగా ఉక్రెయిన్ ఓ వీడియోను విడుదల చేసింది. రష్యాలోని ఓ గుర్తు తెలియని ప్రాంతంలోని శిబిరం వద్ద వరుసలో నిలుచున్న ఉత్తర కొరియా సైనికులు రష్యా మిలటరీ దుస్తులను, ఆయుధాలను అందుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. శిక్షణ అనంతరం నవంబరు నెలలో వీరు కదన రంగంలోకి దిగే అవకాశం ఉందని ఉక్రెయిన్ అధికారి తెలిపారు. యుద్ధంలో ఉత్తరకొరియా కూడా పాల్గొంటోందన్న విషయాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లడానికి, పశ్చిమ దేశాల నుంచి మరింత ఆయుధ సహాయాన్ని పొందటానికి ఉక్రెయిన్ ఈ వీడియోను వినియోగించుకునే అవకాశం ఉంది. దాదాపు 11వేల మంది ఉత్తర కొరియా సైనికులు తూర్పు రష్యాలో శిక్షణ పొందుతున్నారని ఉక్రెయిన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉక్రెయిన్ ప్రతిపాదనకు ఫ్రాన్స్ మద్దతు

తమపై దండయాత్రకు ముగింపు పలికేట్లు రష్యాను సంప్రదింపుల ద్వారా ఒప్పించాలన్న ఉక్రెయిన్ ప్రతిపాదనకు ఫ్రాన్స్ మద్దతు ప్రకటించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను విజయ ప్రణాళికగా వర్ణిస్తున్నారు. దీనిని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జాన్ నోయెల్ బారో శనివారం సమర్థించారు. ఇతర దేశాల మద్దతునూ కూడగట్టడానికి ఉక్రెయిన్‌కు తోడ్పడతానని తెలిపారు. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఇ) మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్‌లు శుక్రవారం రాత్రి 190 మంది యుద్ధ ఖైదీలను ఇచ్చిపుచ్చుకున్నాయి.

మహారాష్ట్రలో ఎస్పీకి 12 సీట్లు అడిగాం: అఖిలేశ్

ధూలే: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా తమకు 12 సీట్లు కేటాయించాలని విపక్ష 'మహా వికాస్ అఘాడీ' (ఎంవీఏ)ని కోరినట్లు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఇప్పటికే అయిదు స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అఖిలేశ్ శుక్రవారం మాలెగావ్, శనివారం ధూలేలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తునే కాకుండా దేశ భవిష్యత్తునూ నిర్ణయిస్తాయన్నారు.

శివసేన(యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల సీట్ల సర్దుబాటు చర్చలు ముగిశాయి: రౌత్

'మహా వికాస్ అఘాడీ' భాగస్వామ్య పక్షమైన ఎన్సీపీ (ఎస్పీ)తో సీట్ల సర్దుబాటుపై తమ పార్టీ చర్చలు ముగిశాయని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ శనివారం వెల్లడించారు. ఇదిలా ఉండగా సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో జరుగుతున్న సంప్రదింపుల్లో జాప్యంపై రౌత్ శుక్రవారం అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఉద్ధవ్ ఠాక్రేతో రమేశ్ చెన్నితల భేటీ

ముంబయి: మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేతో మహారాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి రమేశ్ చెన్నితల శనివారం ముంబయిలో భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...సీట్ల పంపిణీ వ్యవహారం ఒకట్రెండు రోజుల్లో కొలిక్కి వస్తుందని రమేశ్ చెన్నితల తెలిపారు. ఠాక్రే ఆరోగ్యం, ఎంవీఏ ఆరోగ్యం భేషుగ్గానే ఉన్నాయంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. రెండు పార్టీల నేతల మధ్య విభేదాల్లేవని చెప్పారు.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా తీర్మానానికి ఎల్జీ ఆమోదం

శ్రీనగర్: కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో మంత్రివర్గం చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా ఆమోదముద్ర వేసినట్లు శనివారం అధికారులు వెల్లడించారు. ఒమర్ త్వరలోనే దిల్లీకి వెళ్లి రాష్ట్రహోదా పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర మంత్రులనూ సంప్రదిస్తారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన జమ్మూకశ్మీర్ శాసనసభను నవంబరు 4న సమావేశపరచాల్సిందిగా ఎల్జీని మంత్రివర్గం కోరింది. కాగా, రాష్ట్ర హోదా కోరుతూ మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానంలో 370వ రాజ్యాంగ అధికరణం పునరుద్ధరణ ఊసు లేకపోవడాన్ని పూర్తి లొంగుబాటుగా ప్రతిపక్షాలు విమర్శించాయి.

డాలరుకు గండికొట్టేలా ఆర్థికవ్యవస్థ

- 'స్విఫ్ట్'ను సరిపోలేలా ఉండాలి
- డిజిటల్ కరెన్సీనీ వాడుకుందాం: పుతిన్



మాస్కో: అమెరికా డాలరు ఆధిపత్యానికి గండికొట్టి, పాశ్చాత్య ఆంక్షల నుంచి రక్షణ పొందేందుకు 'స్విఫ్ట్' తరహా అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను తీర్చిదిద్దుకోవడంపై బ్రిక్స్ దేశాల కూటమి దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభిప్రాయపడ్డారు. పెట్టుబడుల ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి దేశాల డిజిటల్ కరెన్సీనీ వాడుకోవాలని ప్రతిపాదించారు. బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సు ఈ నెల 22న రష్యాలోని తతారిస్థాన్‌లో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో సభ్య దేశాల ప్రసార మాధ్యమాల సీనియర్ సంపాదకుల బృందంతో ఆయన తన నివాసంలో మాట్లాడారు.

ఉమ్మడి కరెన్సీకి సమయం రాలేదు

"బ్రిక్స్ 10 దేశాలకు ఉమ్మడి కరెన్సీ తీసుకువచ్చేందుకు సమయం ఇంకా ఆసన్నం కాలేదు. దానిపై నెమ్మదిగా అడుగులు వేస్తాం. లేదంటే ఐరోపా సమాఖ్యకు ఎదురైన సమస్యల కంటే పెద్దవి ఎదురవుతాయి. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పనిచేస్తోంది. సభ్య దేశాల ఆర్థిక రంగాల్లో తేడాల పరంగా కొత్తగా ఒక రిజర్వ్ కరెన్సీని తయారుచేసుకునే అంశంలో అత్యంత జాగ్రత్తగా అడుగులు వేయాలి. కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించుకోవాలి. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నాం. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ సాధనాలను వినియోగించుకోబోతున్నాం. సభ్యదేశాల సెంట్రల్ బ్యాంకుల మధ్య సంబంధాలు ఏర్పడాలి. డాలరు వాడడం సరైనదేనా అనే ఆలోచనలో యావత్ ప్రపంచం ఉంది. అందుకే చెల్లింపుల్లో, రిజర్వుల్లో దాని పరిమాణం తగ్గుతోంది. అమెరికా మిత్రదేశాలూ డాలర్ నిల్వల్ని తగ్గించుకుంటున్నాయి" అని పుతిన్ వివరించారు.

భారతీయ సినిమాలంటే ఎంతో ఆసక్తి

భారతీయ చిత్రసీమపై పుతిన్ ప్రశంసలు కురిపించారు. తమ దేశంలో వీటికి మంచి ఆదరణ ఉందని తెలిపారు. "రష్యాలో 24 గంటలూ భారతీయ చిత్రాలు ప్రసారమయ్యే ప్రత్యేక టీవీ ఛానల్ కూడా ఉంది. మాకు భారతీయ చిత్రాలంటే ఎంతో ఆసక్తి. వాటిని రష్యాలో ప్రదర్శించడానికి మేం సానుకూలంగా ఉన్నాం. దీనికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తాం. ఫార్మా రంగానికి కూడా ఇక్కడ అనుకూలంగా ఉంటుంది. వీటిపై భారత ప్రధాని మోదీతో చర్చిస్తాను. భారత్‌తో పాటు బ్రిక్స్ దేశాల సంస్కృతులు, నటులను చూడడం ఎంతో మనోహరంగా ఉంటుంది. భవిష్యత్తులో బ్రిక్స్ కూటమి దేశాలతో సంగీత ఉత్సవాలు కూడా ఏర్పాటు చేస్తాం" అని వివరించారు.

విద్యార్థి సంఘం ఎన్నికలకు 3-4 నెలల సమయమివ్వండి

- జూడాలతో బెంగాల్ సీఎం మమత



బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సమక్షంలో సీఎం మమతా బెనర్జీతో ఫోన్‌లో మాట్లాడుతున్న జూడాలు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ ఆసుపత్రి హత్యాచార ఘటనలో న్యాయం జరిగేలా చూడాలంటూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను వెంటనే విరమించాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జూడా (జూనియర్ డాక్టర్)లకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండును పరిష్కరించేందుకు 3-4 నెలల సమయం కావాలని తెలిపారు. కోల్‌కతాలో జూడాలు ఆందోళనలు కొనసాగిస్తున్న నిరసన శిబిరాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సందర్శించారు. ఈ సందర్భంగా జూడాలతో మమత ఫోనులో మాట్లాడారు. డిమాండ్లపై చర్చించేందుకు సోమవారం సచివాలయానికి రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి ఎన్.ఎస్. నిగమ్‌ను తక్షణమే తొలగించాలన్న డిమాండును తిరస్కరించారు. శాఖలోని అందరినీ ఒకేసారి తొలగించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఒక్కరాత్రిలో మార్పులు జరగవని, రాజకీయాలకు అతీతంగా విధుల్లో చేరాలని జూడాలకు సూచించారు. తమ డిమాండ్లను మరోసారి నొక్కిచెప్పేందుకు జూడాలు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. సచివాలయంలో చర్చల అనంతరం ఎటువంటి స్పష్టత రాకుంటే మంగళవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టే అవకాశం ఉంది.

రాహుల్‌గాంధీ గెలిచి వెళ్లిపోయారు..

- ప్రియాంకైనా ఇక్కడే ఉంటారన్న గ్యారంటీ ఏంటి?
- వయనాడ్ ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకేరీ ప్రశ్న



సత్యన్ మొకేరీ

వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో లోక్‌సభ ఉపఎన్నికల ప్రచారం జోరందుకుంది. శనివారం ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకేరీ తన ప్రత్యర్థి ప్రియాంకా గాంధీని లక్ష్యంగా చేసుకొని ప్రచారాన్ని ప్రారంభించారు. వయనాడ్ నియోజకవర్గం నుంచి గెలిస్తే ప్రియాంకా గాంధీ ఇక్కడే ఉంటారన్న గ్యారంటీ ఏంటనీ ప్రశ్నల వర్షం కురిపించారు. 'వయనాడ్ విషయంలో రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని చూడండి. గెలిచిన తర్వాత ఆయన వయనాడ్‌ను వదులుకున్నారు. ఎన్నిరోజులు ఆయన ఇక్కడ ఉన్నారు? ఇలా పోటీకి వచ్చి వెళ్లిపోయేవారు ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించలేరు' అని విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు బలంగా ఉండి.. ఫాసిస్టు గ్రూపులు అత్యంత బలహీనంగా ఉన్న వయనాడ్‌లో కాంగ్రెస్ ఎందుకు పోటీచేస్తోందన్న ప్రశ్నకు ఆ పార్టీ నుంచి సమాధానం లేదన్నారు.

ఉప ఎన్నికల అభ్యర్థులూ ఖరారు

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు 8 రాష్ట్రాల పరిధిలోని 24 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలకు అభ్యర్థులను భాజపా నాయకత్వం ప్రకటించింది. వయనాడ్‌లో నవ్య హరిదాస్ పేరును ఖరారు చేసింది. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకా గాంధీ బరిలోకి దిగుతున్న విషయం తెలిసిందే.

విద్య వ్యాపారమైతే నాణ్యత దెబ్బతింటుంది: ధన్‌ఖడ్

జైపుర్: విద్యను వాణిజ్యీకరణం చేస్తే దాని నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు. విద్య ఎప్పటికీ ఆదాయ వనరు కాదని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు త్యాగాలకు, దాతృత్వానికి అది మాధ్యమని అభివర్ణించారు. కానీ, విద్య నేడు లాభాల కోసం విక్రయించే వస్తువుగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని సికర్‌లో ఓ ప్రైవేటు విద్యాసంస్థ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేటి యువత విదేశాల్లో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఈ ఏడాది 13లక్షల మంది ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లారని వెల్లడించారు. ఫలితంగా మన విదేశీ మారక ద్రవ్యానికి ఆరు బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై పారిశ్రామికవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

మీ డ్రోన్ మళ్లీ ఇటొస్తే యుద్ధమే

- ద.కొరియాకు కిమ్ సర్కారు హెచ్చరిక

సియోల్: ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య వైరం నానాటికీ తీవ్రమవుతూనే ఉంది. ఈ క్రమంలో దక్షిణ కొరియాకు చెందిన ఓ డ్రోన్ తమ భూభాగంలో కనిపించిదని శనివారం కిమ్ సర్కారు పేర్కొంది. దీనికి సంబంధించిన ఫొటోను ఆ దేశ అధికారిక మీడియా విడుదల చేసింది.




రాజధాని ప్యాంగ్యాంగ్‌లో జరిపిన సాధారణ సోదాల్లో దక్షిణ కొరియా డ్రోన్‌ను కనుగొన్నట్లు కిమ్ సర్కారు తెలిపింది. మరోసారి తమ గగనతలంపై శత్రుదేశం డ్రోన్లు ఎగిరినా, సరిహద్దు నిబంధనలు ఉల్లంఘించినా యుద్ధ ప్రకటనగా పరిగణిస్తామని, ప్రతీకార దాడులు తీవ్రంగా ఉంటాయని ఉత్తర కొరియా రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇదే నెలలో మూడుసార్లు దక్షిణ కొరియా ఇలాంటి డ్రోన్లతో ప్రచార కరపత్రాలను జార విడిచినట్లు ఆరోపించింది. తమ భూభాగంలో కనిపించిన డ్రోన్ అక్టోబరు నెల ప్రారంభంలో దక్షిణ కొరియా సైనిక కవాతులో ప్రదర్శించిన రకమేనని ఉత్తర కొరియా మిలటరీ, స్టేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్ధారించాయి. స్పందించాల్సిన అవసరంలేని ఏకపక్ష ఆరోపణలుగా ఈ వివాదాన్ని దక్షిణ కొరియా పేర్కొంది.

దూకుడు పెంచిన కిమ్..

కొరియన్ ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు మునుపెన్నడూ లేనంత దారుణస్థితికి చేరుకొంటున్నాయి. ఇటీవలి కాలంలో తన ఆయుధ పరీక్షలను పెంచిన ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్.. ఉక్రెయిన్‌తో తలపడుతున్న రష్యాకు సైనిక సహకారాన్ని విస్తరించాడు. కిమ్ సైనిక దళాలను రష్యాకు పంపినట్లు దక్షిణ కొరియా సైతం ఆరోపిస్తోంది. గత మే నెల చివరివారం నుంచి దక్షిణ కొరియా గగనతలం పైకి కిమ్ ప్రభుత్వం వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపింది. అనంతరం దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివేయాలని నిర్ణయించి, ఇరు దేశాలను కలిపే రోడ్లు, రైలుమార్గాలను బాంబులతో పేల్చివేసింది.

భవిష్యత్తులో అమెరికా కంటే మెరుగ్గా మన రోడ్లు

- ఇంట్లో కూర్చొని డీపీఆర్ రూపొందిస్తున్నారని గడ్కరీ విమర్శ
- వాళ్లకు పద్మ అవార్డులివ్వాలని వ్యంగ్యం



భోపాల్: రానున్న రోజుల్లో దేశంలోని రహదారి మౌలిక సదుపాయాలు అమెరికా కంటే మెరుగ్గా ఉండబోతున్నాయని కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన రహదారి, జల, రైలు మార్గాలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టిపెట్టి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. 'రహదారులు, వంతెనల నిర్మాణాల్లో ఆధునిక విధానాలు, సాంకేతికత' అనే అంశంపై భోపాల్‌లో శనివారం మొదలైన రెండ్రోజుల సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రానున్న రోజుల్లో అమెరికా కంటే దీటైన రహదారి మౌలిక సదుపాయాలను కచ్చితంగా తీసుకురాగలమని చెప్పారు. బెంగళూరు-చెన్నై హైవేకు సంబంధించి హెలికాప్టర్ సర్వే గురించి తన అనుభవాన్ని పంచుకుంటూ.. ఆ రహదారి మార్గంలో మూడు, నాలుగు పెద్ద టవర్లు ఉండటాన్ని గమనించానని, వాటి తొలగింపునకు రూ. 300-400 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెప్పారన్నారు. హైవే నిర్మాణ సమయంలోనే ఆ టవర్లను నివారించవచ్చని, తద్వారా వాటి తొలగింపు ఖర్చు ఆదా అవుతుందని ఓ అధికారికి వివరించానని గడ్కరీ తెలిపారు. ఇంట్లో కూర్చొనే 'సవివర పథక నివేదిక' (డీపీఆర్)లను గూగుల్ సాయంతో రూపొందించేవారు చాలా గొప్పవాళ్లని, వారికి పద్మ పురస్కారాలు ఇవ్వాలని వ్యంగ్యంగా అన్నారు. ప్రాజెక్టును మొదలుపెట్టడానికి ముందు క్షేత్రస్థాయికి వెళ్లి చూస్తే అనేక ఇబ్బందులను పరిష్కరించవచ్చని చెప్పారు. తారు రోడ్లకు ప్రతిసారీ గుంతలు పూడ్చుకునే బదులు 'వైట్ కాంక్రీట్ టాపింగ్' రోడ్ల నిర్మాణాన్ని చేపడితే 25 ఏళ్ల వరకు ఢోకా ఉండదన్నారు.

మణిపుర్‌లో మళ్లీ హింస.. గ్రామంపై మిలిటెంట్ల దాడి

ఇంఫాల్: కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న మణిపుర్‌లో మళ్లీ హింస చెలరేగింది. జిరీబామ్ జిల్లాలోని బోరోబెక్రా గ్రామంపై శనివారం మిలిటెంట్లు దాడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. జిరీబామ్ పట్టణానికి 30 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ గ్రామం చుట్టూ దట్టమైన అడవులు, కొండలు ఉన్నాయి. గతేడాది మే నెల నుంచి మణిపుర్‌లో జాతిపరమైన అల్లర్లు చెలరేగాక బోరోబెక్రా పలుమార్లు దాడులకు గురైంది. తెల్లవారుజామున 5.00 గంటలకు జరిగిన తాజా దాడిలో మిలిటెంట్లు అధునాతన ఆయుధాలతో కాల్పులు జరిపారు. గ్రామంపైకి బాంబులు విసిరారు. సీఆర్పీఎఫ్, పోలీసు సిబ్బంది వెంటనే రంగంలోకి దిగడంతో భారీఎత్తున ఎదురుకాల్పులు కొనసాగాయి. అధికారులు అదనపు భద్రతా సిబ్బందిని బోరోబెక్రాకు తరలించారు. ఈ దాడిలో ఎటువంటి మరణాలు చోటుచేసుకోలేదని, గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మణిపుర్ సంఘర్షణకు శాంతియుత పరిష్కారం కనుగొనే దిశగా దిల్లీలో ఇటీవల మైతీ, కుకీ వర్గాల ఎమ్మెల్యేల నడుమ చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో తాజా దాడి జరగడం గమనార్హం. కాగా, ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఇద్దరు మిలిటెంట్లను పోలీసులు అరెస్టు చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

గోళ్లు... ఎందుకిలా?

నా పాదాల గోళ్లు చాలా మందంగా ఉంటాయి. దీనికితోడు ఊరికే నల్లబడుతుంటాయి. అలాగని లోపల ఇన్ఫెక్షన్, నొప్పి లాంటివేమీ లేవు. అయినా ఎందుకిలా అవుతున్నాయి?

– ఓ సోదరి

సోరియాసిస్, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, అనారోగ్యాల బారినపడ్డా ఇలా జరుగుతుంటాయి. కొందరు పదేపదే నెయిల్‌పాలిష్‌లు వేయడం, తుడవడం చేస్తుంటారు. నాసిరకం రకాలు వాడటం వల్లా ఈ సమస్య తలెత్తుతుంది. పుండు ఏర్పడటం, నొప్పి ప్రారంభంలో ఉండవు కానీ... దీర్ఘకాలంలో కనిపిస్తాయి. గోళ్లు పగలడం, వేలు దగ్గర చర్మం చిట్లడంతో క్రిములు లోపలికి చేరి, నెమ్మదిగా ఇన్ఫెక్షన్‌కి దారితీస్తాయి. నొప్పి, దుర్వాసన వంటివీ మొదలవుతాయి. తడిలో ఎక్కువ సమయం గడిపేవారు, షూ తరచూ వేసుకునే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వయసు పెరుగుదలా కారణమే. సమస్య దూరమవ్వాలంటే గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకుంటూ శుభ్రంగానూ ఉంచుకోవాలి. గోరు చుట్టూ పగుళ్లు, కట్‌లూ ఉంటే మాయిశ్చరైజర్ లేదా యాంటీ సెప్టిక్ క్రీమ్ రాయాలి. నీటిలోకి వెళ్లేప్పుడు రబ్బర్ షూ వాడాలి. నెయిల్ కట్టర్‌ని మీకంటూ ప్రత్యేకంగా ఉంచుకుంటే ఇన్‌ఫెక్షన్ల సమస్యలుండవు. ఇంట్లో ఉన్నా సాక్సులు వేసుకుంటే మంచిది. నాణ్యమైన నెయిల్ పాలిష్‌లు, ఆల్కహాల్ లేని నెయిల్ పాలిష్ రిమూవర్లను వాడండి. వాడినా అత్యవసరం అయితేనే! ఒకసారి వేసుకుంటే తీసేశాక కనీసం వారంపాటైనా మామూలుగా వదిలేయాలి. నెయిల్ ఆర్ట్, ఆర్టిఫిషియల్ నెయిల్స్‌ని పెట్టుకుంటోంటే ఆపేయండి. అలాగే, ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నీరు తీసుకుంటున్నారా అన్నదీ గమనించుకోండి. ఫుట్‌క్రీమ్‌లు వాడండి... వాటిని పాదాల గోళ్లకీ పట్టించాలి. దుర్వాసన వస్తున్నా, గోరు లేచినట్లుగా ఉన్నా...ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయ్యుండొచ్చు. కాబట్టి వైద్యుల సలహాతో క్రీములు వాడాలి. ఈ జాగ్రత్తలతో సమస్య తగ్గుముఖం పడుతుంది.

డియర్... వసుంధర



డా. శైలజ సూరపనేని
సౌందర్య నిపుణులు

బంగారం వెండి



19న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	80,120	79,910	77,300	77,500
ఆర్నమెంట్	73,600	73,200	72,800	72,400
వెండి (కిలో)	97,570	96,020	99,300	94,800
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	79,500	79,400	80,600	79,600
ఆర్నమెంట్	73,620	73,520	74,150	73,230
వెండి (కిలో)	96,500	93,400	95,000	94,000
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	79,130	78,700	------	------
ఆర్నమెంట్	72,800	72,400	7,280	7,240 గ్రా
వెండి (కిలో)	99,000	95,000	107.00	105.00గ్రా

రీల్స్ నుంచి రీల్‌కి

సినిమాల్లో అవకాశం రావాలంటే బోలెడు అదృష్టం కావాలి. ఒక్క ఛాన్స్ కోసం ఆల్బమ్ చేతపట్టుకుని చెప్పులరిగేలా స్టుడియోల చుట్టూ తిరగాలి... ఒకప్పుడు వినిపించే మాటలివి! ఇప్పుడు టాలెంట్ ఉంటే చాలు... అవకాశాలే ముంగిట వాలతాయి. నమ్మబుద్ధి కావడం లేదా? వీళ్లే ఉదాహరణలు. రీల్స్, వీడియోలతో ఫాలోవర్లనే కాదు... డైరెక్టర్ల దృష్టినీ ఆకర్షించేశారు. సినిమా అవకాశాలు పట్టేశారు...



డబ్‌స్మాష్ కలిసొచ్చింది మృణాళిని రవి

'గద్దలకొండ గణేష్'లో బుజ్జమ్మగా తెలుగునాట పేరు తెచ్చుకుంది మృణాళిని రవి. కానీ తన తొలిచిత్రం మాత్రం సూపర్ డీలక్స్. అయితే ఊసుపోక చేసిన వీడియోలు ఈమెకు సినిమా అవకాశాలు తెచ్చాయని తెలుసా? పుట్టింది పుదుచ్చేరి. మధ్యతరగతి అమ్మాయి. బెంగళూరులో ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఐబీఎంలో కొలువూ సాధించింది. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరడానికి ముందు కాస్త సమయం దొరికింది. దీంతో ఏమీతోచక డబ్‌స్మాష్, టిక్‌టాక్ వీడియోలు చేసింది. ఆమె క్యూట్ స్మైల్‌కీ, నటనకీ త్వరగానే ఫాలోవర్లు వచ్చారు. కొన్ని వీడియోలు వైరల్ కూడా అయ్యాయి. ఫేవరెట్ డబ్‌స్మాషర్ అవార్డునీ అందుకుంది. ఇంకేం సినిమా అవకాశాలు వరుసకట్టాయి. కానీ ఇంట్లోవాళ్లు మొదట ఒప్పుకోలేదు. నటనపై తన ఆసక్తిని పదే పదే చెప్పాక సరేనన్నారట. మొదట ఉద్యోగం చేస్తూనే నటించింది. తరవాత రెండింటి సమన్వయం కుదరక ఉద్యోగాన్ని వదిలేసింది. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలు చేస్తూ దూసుకెళుతోంది. తాజాగా 'లవ్‌గురు' చిత్రంలో విజయ్ ఆంటోనీ జోడీగా మెరిసింది. ఇన్‌స్టాలో తనని 20 లక్షలమంది అనుసరిస్తున్నారు.



లాక్‌డౌన్ వ్యాపకం... సాక్షి వైద్య

కరోనా సమయంలో ఎక్కువమంది వ్యాపకం ఫోనే అయ్యింది. తోచక ఇన్‌ఫ్లుయెన్సర్లు అయినవారూ బోలెడుమంది. అలాంటివారిలో సాక్షి ఒకరు. ఈమెది మహారాష్ట్రలోని థానే. ఫిజియోథెరపీలో పీజీ చేసింది. తనకి చిన్నప్పట్నుంచీ మోడల్ కావాలని కోరిక. ఎలాగూ సమయం దొరికింది కదా అని ఇన్‌స్టాలో రీల్స్ ప్రారంభించింది. వాటికి స్పందన బాగా రావడమే కాదు... సంస్థల నుంచి మోడలింగ్ అవకాశాలూ వచ్చాయి. టీవీ యాడ్‌ల్లోనూ నటించింది. అక్కడ్నుంచీ మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలొచ్చాయి. తొలి సినిమా అవకాశం హీరో అఖిల్ 'ఏజెంట్' రూపంలో వచ్చింది. నిజానికి నటి కావాలన్న కోరిక తనకెప్పుడూ లేదు. కానీ వచ్చిన అవకాశాన్ని అందుకుని ప్రశంసలు తెచ్చుకుంది. దీంతో సినిమాలు వరుసకట్టాయి. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో నటిస్తోంది. సాక్షిని ఇన్‌స్టాలో దాదాపు 9 లక్షలమంది అనుసరిస్తున్నారు.



డ్యాన్స్‌తో ఫిదా చేసింది ఇమాన్వి

ప్రభాస్ కొత్త సినిమా అనగానే అభిమానుల్లో ఆసక్తి మామూలేగా! పైగా పాన్ ఇండియా స్టార్‌గా దూసుకుపోతున్నారు. హీరోయిన్ ఎవరా అని ఎదురుచూస్తోంటే 'ఇమాన్వి' అన్న పేరు బయటికొచ్చింది. ఇంకేం గూగుల్‌లో వెతికారు. అప్పటిదాకా వేరే ఇండస్ట్రీ హీరోయిన్ అనుకున్నారంతా. కానీ కొత్తమ్మాయి. అయితేనేం... ఆమెకున్న పాపులారిటీని చూసి మాత్రం షాకయ్యారు. ఇమాన్ ఇస్మాయిల్... ఇమాన్వి అసలు పేరు. పుట్టింది దిల్లీ కానీ పెరిగిందంతా లాస్‌ఏంజెలెస్. ఎంబీఏ పూర్తిచేసింది. చిన్నప్పటి నుంచీ డ్యాన్స్ అంటే ఇష్టం. అమ్మ... రేఖ, మాధురి దీక్షిత్ వంటి స్టార్ల నృత్యాల వీడియోలను చూపించి మరీ ప్రోత్సహించేదట. అలా ప్రేమను పెంచుకుంది. క్లాసికల్, వెస్ట్రన్ వేటితోనైనా మరిపించగలదు ఇమాన్వి. ఆ వీడియోలను యూట్యూబ్, ఇన్‌స్టాలో పంచుకునేది. 'రమ్తా జోగీ', 'టమ్ టమ్' పాటలు వైరల్ అయ్యాయి. కొరియోగ్రాఫర్ కూడా. తనకు యూట్యూబ్‌లో 18లక్షలు, ఇన్‌స్టాలో 9లక్షలకుపైగా ఫాలోవర్లున్నారు. దీంతో సంస్థలనూ ఆకర్షించింది. వాటికి మోడల్‌గా పనిచేసింది. 'బీయింగ్ సా-రా' అనే షార్ట్‌ఫిల్మ్‌తోనూ మెప్పించింది. తన డ్యాన్స్ వీడియోలకు లక్షల్లో వ్యూస్ ఉంటాయి. అలా సినిమా అవకాశాన్నీ అందుకుంది ఇమాన్వి.

> వీళ్లేకాదు... 'బేబి' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య మొదట మెరిసిందీ యూట్యూబ్‌లోనే! తన హాస్యంతో సెలెబ్రిటీలనే ఆకర్షించింది నిహారిక ఎన్ఎం. అంతేనా సినిమా ప్రమోషన్ల కోసం స్టార్లతోనూ పనిచేసిన తను తాజాగా 'గీతా ఆర్ట్స్'లో సినిమా అవకాశం దక్కించుకుంది. కృష్ణ వ్రింద విహారితో తెలుగునాట అడుగుపెట్టిన షర్లీ సేతియా తొలుత తన గాత్రంతోనే సోషల్‌మీడియాను ఆకట్టుకుంది.

ఆమె నిర్ణయాన్ని గౌరవించారు!

వైరల్



అత్తతో ఇషు

ఇషు యోగా శిక్షకురాలు, ప్రపంచ రికార్డు సాధకురాలు. కవల పిల్లలకు తల్లి. అయితే ఇప్పుడెందుకు ఈమె వార్తల్లోకెక్కారంటే... 'తన భర్త మరణానంతరం అత్తామామలతో కలిసి ఉండటం' అనే నిర్ణయంపై వివరణ ఇస్తూ ఇన్‌స్టాలో ఆమె పోస్టు చేసిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

ఇన్‌స్టాలో పోస్టు చేసిన వీడియోలో ఇషు, తన పిల్లలు, అత్తామామలతో గడిపే రోజువారీ జీవితం ఉంది. అందులో తన భావోద్వేగ ప్రయాణాన్ని, తానెందుకు అత్తామామలతో కలిసి ఉండాలనుకుంటున్నాను అనేదానికి కారణాలను వీడియో రూపంలో పంచుకుంది. తన ఇద్దరు పిల్లలతో అత్తామామలు ఆప్యాయంగా కలిసి ఆడటం, సమయాన్ని వెచ్చించడంతోపాటు పిల్లలు వాళ్ల నానమ్మ, తాతయ్యలతో సంతోషంగా గడపడం, అలాగే ఆ పెద్దవాళ్లు పిల్లలనెలా సంరక్షిస్తున్నారు, తనతో ప్రేమగా, గౌరవంగా ఎలా ఉంటున్నారు... వంటివన్నీ ఆ వీడియోలో ఉన్నాయి. ఎలాంటి మాటలూ లేకుండా అత్తామామలతో తనకు, పిల్లలకు ఉన్న అనుబంధాన్ని వీడియోద్వారా వివరించిన విధానానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అంతేకాదు, 'నా భర్త మరణం గురించి తెలిసినప్పుడు వెంటనే చాలామంది నన్ను ఇప్పుడెక్కడ ఉంటావని ప్రశ్నించారు. దానికి సమాధానంగా 'అత్తామామలతో' అని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయారు. భర్త ఉన్నంతవరకే అత్తవారిల్లు అనుకుంటారు. అతని మరణానంతరం అక్కడ మనకి చోటు లేదు అంటారు. నా విషయంలో ఇది నిజం కాదు' అంటూ ఇషు తన అభిప్రాయాన్ని వివరించిన ఈ వీడియోను 8,38,000 మంది వీక్షించారు.



ఆమె అభిప్రాయాన్ని గౌరవిస్తూ అభినందనలతో ముంచెత్తారు. పెద్దవాళ్లతో కలిసి ఉంటే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారి ఎదుగుదల మెరుగ్గా ఉంటుందంటూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

శరీరం మాట వింటున్నారా?

చాలాసార్లు మనసు మాట విన్నట్టుగా, మనం శరీరం మాట వినం కదా! అందుకే, లేనిపోని అనారోగ్యాలు... పుట్టినరోజు, పెళ్లిరోజుల్లాంటి వేడుకలప్పుడు చికెన్, మటన్, తింటుంటారు చాలామంది. ఇక కేకులు, చిప్స్, చాక్లెట్ల వంటివి ఇష్టపడని అమ్మాయిలు ఉండరేమో! అంతేనా, సందర్భంతో పనిలేకుండా ఎప్పుడంటే అప్పుడు వాటిని తినే అలవాటూ ఇప్పుడు పెరిగిపోయింది. ఇదే ఇప్పుడు చాలామందిలో అలర్జీలకు దారితీస్తుంది. ఈ పదార్థాలలో ఉండే 'హిస్టామిన్' అనే రసాయనం... ఆకలి మందగించడం, తల తిరగడం, మూడ్ స్వింగ్స్... లాంటి వాటికి కారణమవుతోంది. అంతేకాదు, హిస్టామిన్ పాళ్లు అధికంగా ఉన్న ఆహారం తినడం వల్ల దోమలు ఎక్కువగా కుట్టడం, నిద్రలేమి, భావోద్వేగాల్లో మార్పులూ వస్తాయట. నెలసరిలో అధిక రక్తస్రావానికీ, పిల్లల్లో పొత్తికడుపు నొప్పి, విపరీతమైన జలుబు, దగ్గులకూ ఇది కారణమవుతుందట. ఒక్కోసారి హృద్రోగాలు వచ్చే ముప్పు ఉంటుందట. శుద్ధి చేసిన మాంసం, చాకొలెట్స్, నూనెలో వేయించిన పదార్థాల వల్లే కాదు, ఆల్కహాల్, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న చీజ్, వంకాయ, కొన్ని రకాల పుల్లని పండ్లు, డ్రైఫ్రూట్స్, పప్పులు.... లాంటివీ అలర్జీ కలిగించవచ్చు. అందుకే, ఏయే ఆహారపదార్థాలు తింటే పడడం లేదో గమనించుకోవాలి. శరీరం ఇచ్చే సూచనలను అర్థం చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.



ఎలా తినాలంటే...

- కేకులు, బిస్కెట్లు లాంటి బేకింగ్ పదార్థాల తయారీలో తాజా గుడ్లను మాత్రమే వాడాలి. సాధ్యమైనంత వరకూ బేకింగ్ పౌడర్, నిల్వ కారకాలు ఉండే పదార్థాలను వాడకూడదు. రెడీమేడ్ ప్యాకెట్లు బదులుగా తాజావి వాడడం మంచిది. ప్యాకింగ్ చేసిన బంగాళదుంప చిప్స్‌లాంటివి తినొద్దు.
- దీర్ఘకాలంపాటు పులియబెట్టే పదార్థాలైన చీజ్, సోయాసాస్... వంటివాటిల్లో హిస్టామిన్ శాతం ఎక్కువ. కాబట్టి, వాటికి వీలైనంత దూరంగా ఉండాలి. అలాగే మాంసాన్ని గ్రిల్ చేయడం కన్నా ఉడికించుకుని తింటే మేలు.
- అవకాడో, డ్రైఫ్రూట్స్... లాంటివి పడనప్పుడు మిల్లెట్స్, బియ్యం, క్వినోవా, సాల్మన్ చేప లాంటివి తినొచ్చని సూచిస్తున్నారు పోషకాహార నిపుణులు.

సీటింగ్ సూట్‌కేస్‌లొచ్చేశాయ్!

చిన్నారులతో దూరప్రయాణాలు చేయాలంటే జాగ్రత్తలెన్నో తీసుకోవాలి. పసిపిల్లల్ని ఎత్తుకుని లగేజ్‌తో నడవడం ఎవరికైనా కష్టమే. ఈ పరిస్థితి మీకూ ఎదురైందా? అయితే, ఇకమీదట ఆ చింత అక్కర్లేదు. మీకు భారం లేకుండా, పిల్లలకు అసౌకర్యం కలిగించకుండా సీటింగ్స్‌తో సూట్‌కేస్‌లు వచ్చాయిప్పుడు. ఇవి మనతో ఉంటే చాలు. బుజ్జాయిలతోనూ పర్యటక ప్రాంతాలు సరదాగా చుట్టేయొచ్చు.



దూరాభారం లేకుండా...

ట్రావెల్ సూట్‌కేస్‌కు రెండోవైపు చిన్న కుర్చీని అటాచ్ చేసుకునే ఏర్పాటు ఉంటుంది. 18 నెలల వయసు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు సరిపోయే ఈ కుర్చీకి ముందువైపు మాత్రమే ఫోల్డింగ్ రాడ్స్ ఉంటాయి. దీన్ని ఫిట్ చేసిన తర్వాత సూట్‌కేస్‌ను లాక్కెళ్లొచ్చు. అదే సమయంలో దీనికి అటాచ్డ్‌గా ఉన్న ట్రావెల్ ఛెయిర్ చిన్నారులకు సౌకర్యంగానూ ఉంటుంది. దీంతోపాటు సూట్‌కేస్ హ్యాండిల్‌వైపు చక్రాలతో ఉన్న రెండు రాడ్స్ పిల్లల బరువును బ్యాలెన్స్ చేస్తాయి. అలాగే పసిపిల్లల కోసం ప్రత్యేకంగా బెల్ట్ అటాచ్డ్‌తో కాటన్ బేబీ క్యారియర్‌తోనూ సూట్‌కేస్‌లు లభ్యమవుతున్నాయి.



అవసరానికి తగ్గట్లుగా...

రెండేళ్లలోపు చిన్నారులుంటే మన ప్రయాణంలో ఈ సూట్‌కేస్ తప్పనిసరిగా ఉండాలి. లోపలివైపు అటాచ్డ్ స్ట్రోలర్ ఉండే ఈ సూట్‌కేస్‌ను పిల్లలను నిద్రపుచ్చాలనుకున్నప్పుడు ఓపెన్ చేస్తే చాలు. చిన్నారులు స్ట్రోలర్‌లో సౌకర్యంగా నిద్రపోతున్న సమయంలోనూ సూట్‌కేస్‌ను లాక్కెళ్లొచ్చు. మరింకెందుకాలస్యం. మీ బుజ్జాయిల కోసం మీరూ ఈ సీటింగ్ సూట్‌కేస్‌లను వెతికేస్తారు కదూ..!





కిడ్స్ కార్నర్



ఆకలి బాధల్ని దాటి... ఆంత్రప్రెన్యూర్‌గా మారి!



'కష్టాలను చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంటే... తగ్గిపోవు. స్థైర్యం తెచ్చుకుని పరిష్కారాలను ప్రయత్నించాలి' అంటారు అర్చనా మానె. సీరియల్ ఆంత్రప్రెన్యూర్‌గా తన వ్యాపార సంస్థలను లాభాల బాటలో నడిపించడమే కాదు, ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్‌గా వేల మంది మహిళలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారు. ఈ కృషే... తాజాగా 'ఫోర్డ్ ఫౌండేషన్- మార్పుకోసం ప్రయత్నించిన మహిళా నాయకురాళ్లు'లో ఒకరిగా ఆమెను నిలిపింది.

అర్చనది మహారాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లాలోని అన్సుర్దా గ్రామం. నిరుపేద కుటుంబం. రోజుకి రెండు పూటలైనా కడుపు నిండని దైన్యం. కట్టుకునేందుకు సరైన దుస్తులు కూడాలేని దుస్థితి. ఆ ఇంటి బిడ్డలకు చదువు అందని ద్రాక్షగానే ఉండేది. కానీ, చిన్నారి అర్చన మాత్రం బడికెళ్లాలని పట్టుబట్టారు. కాదంటున్నారని కుటుంబ సభ్యులకు తెలియకుండా బడికెళ్లి పేరు నమోదు చేయించుకున్నారు. స్నేహితుల దగ్గర నుంచి తెచ్చుకున్న అరువు పుస్తకాలనే ఒంటపట్టించుకున్నారు. టీచర్లూ సాయం చేయడంతో ఎలాగోలా పదో తరగతి పూర్తి చేశారు. ఎదిగొచ్చిన ఆడపిల్ల బాధ్యత పూర్తిచేయాలని... ఆమెకు ఓ రిక్షా కార్మికుడితో పెళ్లి చేశారు. అత్తింట్లో అడుగు పెట్టినా పరిస్థితులు మారలేదు. చాలీచాలని సంపాదనతోనే జీవితాన్ని నెట్టుకొచ్చేవారా దంపతులు. ఓసారైతే జబ్బుపడిన కొడుక్కి వైద్యం చేయించడానికి కనీసం 150 రూపాయలు కూడా లేక ఎన్ని ఇళ్ల మెట్లు ఎక్కి దిగారో! ఖర్చులూ, వాటితో పాటే అప్పులూ పెరిగిపోవడం అర్చనను కలచివేశాయి. ఈ పరిస్థితికి ముగింపు పలకాలని ధైర్యాన్ని కూడగట్టుకున్నారు. తన తలరాతను తానే మార్చుకుంటానంటూ ముందడుగు వేశారు. ఓ పాత కుట్టుమిషన్ కొనుక్కొని బట్టలు కుట్టడం ఆరంభించారు. ఆ సంపాదన క్రమంగా అప్పుల్నీ తీర్చగలిగేలా చేసింది. దీంతో తిరిగి చదువుపై దృష్టిపెట్టి డిగ్రీ పూర్తి చేశారు.

కరవుని ఎదుర్కొని...

క్రమంగా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడంతో... స్వయం ఉపాధి దిశగా తోటి మహిళలనూ ప్రోత్సహిస్తూ కమ్యూనిటీ లీడర్‌గా ఎదిగారు అర్చన. మరో పక్క దుస్తుల వ్యాపారమూ ప్రారంభించారు. అయితే, అప్పుడే మహారాష్ట్రలో కరవు విజృంభించింది. నాలుగేళ్లపాటు ఎన్నో ఇబ్బందులకు గురి చేసింది. ఆ సమయంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆహార భద్రత సాధించేందుకు స్థానికులకు శిక్షణ ఇవ్వాలనుకున్నాయి. అప్పటికే అందరి తలలో నాలుకలా మెలిగే అర్చనను ఇందుకు ఎంపిక చేసుకున్నారు. అవన్నీ తాను నేర్చుకోవడమే కాదు... గ్రామస్థులకు అర్థమయ్యేలా వివరించారామె. తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పుధాన్యాలను సాగు చేసి చూపించారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ ఫలితం ఇచ్చాయి. దాంతో పంటల్ని మార్కెటింగ్ చేసేందుకు 2011లో 13 మంది మహిళలతో కలిసి 'మంజరి సఖి విమెన్ లెడ్ ఫార్మింగ్ గ్రూప్'ని ఏర్పాటు చేసుకున్నారు. నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్... వంటివాటితో ఆమె తోటివారూ ఆర్థికంగా బలోపేతమయ్యేలా చేశారు. అర్చన సాధించిన విజయం మరెంతోమందికి స్ఫూర్తినిచ్చింది. ఒకరికొకరు తోడుగా నిలబడతామని బృందాలుగా వచ్చే స్త్రీలకు ఆమె శిక్షణ ఇవ్వడం ఆరంభించారు. ఇలా మహారాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70వేలమంది జీవితాలను అర్చన ప్రభావితం చేశారు. మరోవైపు దుస్తులు, నగల దుకాణాలతో మరి కొన్ని వ్యాపారాలూ చేస్తున్నారు. ఈ కృషికి గుర్తింపుగానే జాతీయస్థాయి అవార్డులెన్నో ఆమెను వరించాయి. మహిళాసాధికారతకు కృషి చేసిన శక్తిమంతమైన స్త్రీలలో ఒకరిగా ఫోర్డ్ ఫౌండేషన్ ఎంపిక చేసింది.



ఈనాడు బిజినెస్ వారాంతం

పాలసీదార్లకు పెద్ద ఊరట!

- టర్మ్ పాలసీ ప్రీమియంపై జీఎస్‌టీ మినహాయింపు
- పెద్దల ఆరోగ్య బీమా పాలసీలపైనా
- రూ.5 లక్షల లోపు పాలసీలకూ
- సమర్థించిన మంత్రుల బృందం
- తుది నిర్ణయం జీఎస్‌టీ మండలి సమావేశంలో



దిల్లీ: ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ని మినహాయించాలని కోరుతున్న పాలసీదారుల ఆశలు నెరవేరేలా కనిపిస్తున్నాయి. రాబోయే జీఎస్‌టీ మండలి సమావేశంలో దీనిపై ఒక తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. శనివారం జరిగిన మంత్రుల బృందం(జీఓఎం) సమావేశంలో దీని గురించి చర్చించినట్లు, ఈ పాలసీలపై జీఎస్‌టీని తొలగించేందుకు నిర్ణయించినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక ఉన్నతాధికారి తెలిపారు. టర్మ్ పాలసీలకూ, పెద్దలు తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్‌టీని రద్దు చేయడం ద్వారా సామాన్య ప్రజలకు మేలు చేకూర్చాలనే అంశాన్ని జీఓఎంలోని మెజార్టీ సభ్యులు సమర్థించినట్లు వెల్లడించారు.

- సాధారణ వ్యక్తులు తీసుకునే రూ.5 లక్షల లోపు ఆరోగ్య బీమా పాలసీలపైనా జీఎస్‌టీని మినహాయించాలని నిర్ణయించారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమా పాలసీలకు ప్రస్తుత 18 శాతం జీఎస్‌టీని కొనసాగించాలని నిర్ణయించింది.

ఇతర ప్రతిపాదనలు..

- రూ.10,000 ధర లోపు సైకిళ్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలి.
- నోటు పుస్తకాలపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తీసుకురావాలి.
- 20 లీటర్లకు మించి ఉన్న ప్యాకేజ్డ్ తాగు నీటిపై ప్రస్తుతం 18 శాతం జీఎస్‌టీ ఉండగా, దీన్ని 5 శాతానికి తగ్గించాలి.
- రూ.15,000 మించి ధర ఉన్న షూస్, రూ.25,000 కన్నా అధిక ధర ఉన్న చేతి గడియారాలపై పన్నును 18 శాతం నుంచి 28 శాతానికి చేర్చాలి.

రూ.22,000 కోట్ల అదనపు రాబడి

జీఎస్‌టీ హేతుబద్ధీకరణ వల్ల కేంద్రం, రాష్ట్రాలకు రూ.22,000 కోట్ల అదనపు రాబడి అందుతుందని, బీమా ప్రీమియంపై జీఎస్‌టీని తగ్గించిన నష్టాన్ని ఇది భర్తీ చేస్తుందని సంబంధిత అధికారి వెల్లడించారు. ఈ ప్రతిపాదనలన్నీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించే జీఎస్‌టీ మండలి ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడే ఇవి అమల్లోకి వస్తాయి.

ప్రజలపై భారం తగ్గించేందుకే..

'సామాన్య ప్రజలపై పన్ను భారం తగ్గించాలని జీఓఎం నిర్ణయించింది. ముఖ్యంగా పెద్దలపై ఆర్థిక భారం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. అందుకే, టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్‌టీ రద్దు చేయాలని ప్రతిపాదించాం. దీనిపై సమగ్ర నివేదికను జీఎస్‌టీ మండలికి సమర్పిస్తాం' అని జీఓఎం జీవిత, ఆరోగ్య బీమా కన్వీనర్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి వెల్లడించారు. బీమా ప్రీమియంపై జీఎస్‌టీ హేతుబద్ధీకరణకు సంబంధించి 13 మంది మంత్రులతో జీఓఎంను కేంద్రం గత నెలలో ఏర్పాటు చేసింది.

5 శాతానికి తగ్గించాలి



మంత్రుల బృందంలో సభ్యులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రూ.5 లక్షలకు మించి ఉన్న ఆరోగ్య బీమా పాలసీలపైన జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని సూచించారు. అందరికీ బీమా లక్ష్యం నెరవేరేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. దీనివల్ల రాష్ట్రాలు పెద్ద స్థాయిలో ఆదాయం కోల్పోయినా, విస్తృతమైన ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

భారత్‌లోకి ఈఎల్ అండ్ ఎన్ లండన్ అడుగు

రిలయన్స్ బ్రాండ్స్‌తో కలిసి తొలి స్టోర్ ప్రారంభం



దిల్లీ: అంతర్జాతీయంగా పేరొందిన లైఫ్‌స్టైల్ అండ్ కేఫ్ బ్రాండ్ ఈఎల్ అండ్ ఎన్ లండన్ మన దేశంలోకి అడుగుపెట్టింది. రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్ (ఆర్‌బీఎల్)తో కలిసి తొలి విక్రయ కేంద్రాన్ని ముంబయిలోని జియో వరల్డ్ ప్లాజాలో ప్రారంభించింది. 'కుటుంబాలకు అందులోనూ మరీ ముఖ్యంగా కాఫీ ప్రేమికులకు సరైన గమ్యస్థానంగా మా స్టోర్లు ఉంటాయి. అందమైన సెట్టింగ్‌తో మరచిపోలేని డైనింగ్ అనుభూతిని అందించగలం. ముంబయి కేఫ్‌లో ఈఎల్ అండ్ ఎన్ సిగ్నేచర్ మెనూ ఉంటుంది. ఇందులో అంతర్జాతీయ రుచులకు తోడు ప్రత్యేకమైన స్థానిక రుచులను కూడా అందిస్తామ'ని ఈఎల్ అండ్ ఎన్ లండన్ వ్యవస్థాపకులు అలెగ్జాండర్ మిల్లర్ తెలిపారు. 'ఎఫ్ అండ్ బీ (ఆహారం, పానీయాలు) పోర్ట్‌ఫోలియోలో రిలయన్స్ బ్రాండ్స్ మాతృ సంస్థ రిలయన్స్ రిటైల్ బలోపేతం అవుతోంది. ఇటాలియన్ ఫైన్ డైనింగ్ కాన్సెప్ట్ అయిన అర్మానీ కేఫ్‌ను కూడా ముంబయి జియో వరల్డ్ ప్లాజాలో పరిచయం చేస్తున్నాం. అలాగే యూకేకు చెందిన ఆహార, ఆర్గానిక్ కాఫీ చైన్ ప్రెట్ ఎ మ్యాంగర్ 18 స్టోర్లను రిలయన్స్ రిటైల్ నిర్వహిస్తోంద'ని రిలయన్స్ బ్రాండ్స్ ప్రతినిధి వెల్లడించారు.

24% తగ్గిన ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం

ముంబయి: 2024-25 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ రూ.223 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.294 కోట్లతో పోలిస్తే ఇది 24% తక్కువ. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆర్జించిన రూ.372 కోట్లతో పోలిస్తే మరీ తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు 0.25 శాతం తగ్గి 2.88 శాతానికి చేరాయి. రుణాల వృద్ధి 15 శాతం ఉన్నా, నికర వడ్డీ ఆదాయం 9 శాతం మాత్రమే పెరిగి రూ.1,615 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 5.54 శాతం నుంచి 5.04 శాతానికి తగ్గింది. తాజా మొండి బకాయిలు రెట్టింపై రూ.1,026 కోట్లకు చేరాయి. ఇందులో 70 శాతం క్రెడిట్ కార్డ్ విభాగం నుంచే ఉన్నాయి.

కోడి గుడ్డు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	510
గోదావరి	510
విశాఖపట్నం	505
చిత్తూరు	538

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.17,826 కోట్లు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై- సెప్టెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.17,825.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 6% ఎక్కువ. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.15,976.11 కోట్ల నుంచి 16,820.97 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 10 శాతం పెరిగి రూ.30,010 కోట్లకు చేరింది. రుణాల్లో 7 శాతం వృద్ధి కనిపించింది. డిపాజిట్లు 15 శాతం పెరిగాయి. మార్జిన్లు 3.46 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి.

- వచ్చే నాలుగేళ్లలో బ్యాంక్ పరిమాణాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, అందుకు అనుగుణంగానే ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని బ్యాంక్ సీఎఫ్ఓ ఎస్.వైద్యనాథన్ వెల్లడించారు.
- సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మరో 241 శాఖలు తెరవడం ద్వారా మొత్తం శాఖలు 9,092కు చేరాయి.
- స్థూల నిరర్థక ఆస్తులు స్థిరంగా 1.36% వద్ద ఉన్నాయి. బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 19.8 శాతంగా ఉంది.
- 2024 సెప్టెంబరు 30 నాటికి 9,000 మంది ఉద్యోగులను కొత్తగా చేర్చుకోవడం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,06,758కు చేరింది.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓకు బోర్డు ఆమోదం

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.12,500 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,500 కోట్ల నిధుల్ని సమీకరించనుంది. ఐపీఓ ధర, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది. ప్రతిపాదిత ఐపీఓ తర్వాత కూడా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థగానే కొనసాగనుంది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.64 శాతం వాటా ఉంది. జూన్ త్రైమాసికం ఆఖరుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర విలువ సుమారు రూ.13,300 కోట్లుగా ఉంది.

టెక్ మహీంద్రా లాభం రూ.1,250 కోట్లు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టెక్ మహీంద్రా నికర లాభం ఏకీకృత పద్ధతిలో రూ.1,250 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.493.90 కోట్లతో పోలిస్తే లాభం రెండు రెట్లకు పైగా పెరగడం గమనార్హం. ఆస్తుల విక్రయం ద్వారా ఆదాయం సమకూరడం లాభంలో వృద్ధికి దోహదం చేసింది. ఆదాయం రూ.12,863.90 కోట్ల నుంచి 3.49 శాతం పెరిగి రూ.13,313.20 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే జులై- సెప్టెంబరులో కంపెనీ లాభం 46.81 శాతం, ఆదాయం 2.36 శాతం చొప్పున పెరిగాయి. ఖాళీ స్థలం, భవనాలు, ఫర్నిచర్ కలిపి ఒక స్థిరాస్తి విక్రయం ద్వారా రూ.450.20 కోట్ల మేర ఇతర ఆదాయం వచ్చినట్లు కంపెనీ తెలిపింది. 'ఐటీ సేవల విభాగం స్తబ్దుగా ఉన్నప్పటికీ.. మేం వ్యూహాత్మకంగా చేపడుతున్న ప్రయత్నాల వల్ల మెరుగైన పనితీరును కొనసాగించగలిగాం. క్లయింట్లతో మా సంబంధాలను బలోపేతం చేసుకోవడం పైనా దృష్టి పెట్టాం. ప్రాజెక్టు ఫార్టియస్ అండతో వరుసగా మూడో త్రైమాసికంలోనూ మార్జిన్లను పెంచుకున్నామ'ని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి తెలిపారు. 15 శాతం నిర్వహణ మార్జిన్లను సాధించేందుకు మూడేళ్ల ప్రణాళిక కింద ప్రాజెక్టు ఫార్టియస్‌ను ఏప్రిల్‌లో జోషి ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. సమీక్షిస్తున్న త్రైమాసికంలో నికరంగా 603 మిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లను దక్కించుకుంది.

- తాజా ఉత్తీర్ణుల నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు పెట్టుబడులను కొనసాగిస్తున్నట్లు జోషి తెలిపారు. జులై- సెప్టెంబరులో టెక్ మహీంద్రా 6,653 ఉద్యోగులను చేర్చుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,54,273కు చేరింది.

వేదాంతా రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులు

దిల్లీ: జింక్, చమురు-గ్యాస్ వంటి వివిధ వ్యాపార విభాగాలపై రాజస్థాన్‌లో రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టబోతున్నట్లు వేదాంతా వెల్లడించింది. వేదాంతా గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్ రూ.30,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మరో అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ రోజుకు 3 లక్షల బ్యారెళ్ల సామర్థ్యాన్ని చేరుకునేందుకు రూ.35,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. వేదాంతా గ్రూప్ మరో సంస్థ సెరెంటికా రెన్యువబుల్స్ రూ.50,000 కోట్ల పెట్టుబడితో 10,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంతో ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతోంది.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకంలో 1.25 లక్షల అవకాశాలు

దిల్లీ: పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కింద ఇప్పటి వరకు 1.25 లక్షల మంది అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పథకం కోసం తీసుకొచ్చిన పోర్టల్‌ను అభ్యర్థుల నమోదు కోసం అక్టోబరు 12 సాయంత్రం 5 గంటల నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు అగ్రగామి 250 కంపెనీలు ఈ పథకంలో నమోదు చేసుకున్నాయి. ఈ పథకం కింద 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ ఆఫర్లు అందించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఈ పథకంలో ఇంటర్న్‌షిప్‌లు డిసెంబరు 2 నుంచి ప్రారంభమవుతాయి.

50% పెరిగిన యూకో బ్యాంకు లాభం

రూ.4.73 లక్షల కోట్లకు చేరిన వ్యాపారం

ఈనాడు, హైదరాబాద్: యూకో బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసింది. త్రైమాసిక నికరలాభం 50% అధికంగా రూ.603 కోట్లకు చేరడం విశేషం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికరలాభం రూ.402 కోట్లు మాత్రమే. ఆపరేటింగ్ లాభం 45.82 శాతం వృద్ధితో రూ.1,432 కోట్లుగా ఉంది. రెండో త్రైమాసికం చివరి నాటికి బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.4.73 లక్షల కోట్లకు చేరుకుంది. డిపాజిట్లు 10.57 శాతం, రుణాలు 18 శాతం పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.18 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు (ఎన్ఎన్‌పీఏ) 0.73 శాతానికి తగ్గినట్లు యూకో బ్యాంకు వెల్లడించింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 95.92 శాతం ఉన్నట్లు పేర్కొంది. బ్యాంకుకు దేశ వ్యాప్తంగా 3,247 శాఖలు ఉన్నాయి. ఇందులో దాదాపు 2,000 శాఖలు గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి.

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.3,344 కోట్లు



దిల్లీ: జులై- సెప్టెంబరు త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండలోన్ పద్ధతిలో స్వల్పంగా 5 శాతం పెరిగి రూ.3,344 కోట్లకు చేరింది. కిందటేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.3,191 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.13,507 కోట్ల నుంచి రూ.15,900 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.6,297 కోట్ల నుంచి పెరిగి రూ.7,020 కోట్లకు చేరింది. అయితే నికర వడ్డీ మార్జిన్ 5.22 శాతం నుంచి 4.91 శాతానికి తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు 1.72 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గగా.. నికర నిరర్థక ఆస్తులు 0.37 శాతం నుంచి 0.43 శాతానికి పెరిగాయి. ఏకీకృత ప్రాతిపదికన కోటక్ మహీంద్రా నికర లాభం రూ.4,461 కోట్ల నుంచి 13 శాతం పెరిగి రూ.5,044 కోట్లకు చేరింది.

పబ్లిక్ ఇష్యూకు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ సంస్థ

దిల్లీ: షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన మౌలిక ఇంజినీరింగ్, నిర్మాణ కంపెనీ అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఏఐఎల్) రూ.5,430 కోట్ల పబ్లిక్ ఇష్యూను ప్రకటించింది. ఈ ఐపీఓ అక్టోబరు 25న మొదలై 29న ముగుస్తుంది. 24న యాంకర్ ఇన్వెస్టర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరలోనే ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించనుంది. ఈ ఇష్యూలో రూ.1,250 కోట్ల తాజా షేర్ల జారీ, రూ.4,180 కోట్ల వరకు ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) ఉంటుంది. మార్చిలో దాఖలు చేసిన పత్రాల ప్రకారం రూ.7,000 కోట్ల ఐపీఓకు రావాల్సి ఉన్నా.. ఐపీఓకు ముందు నిధుల సమీకరణ కారణంగా పబ్లిక్ ఇష్యూ పరిమాణాన్ని తగ్గించింది.

సెబీకి దరఖాస్తు చేసిన ఎస్ఎమ్‌పీపీ: రూ.4,000 కోట్ల నిధులను సమీకరించేందు కోసం రక్షణ రంగ సామగ్రి తయారీ కంపెనీ ఎస్ఎమ్‌పీపీ లిమిటెడ్ సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఇందులో రూ.580 కోట్లు తాజా షేర్ల జారీ ద్వారా; రూ.3420 కోట్లు ఓఎఫ్ఎస్ ద్వారా సమీకరించనుంది.

18 శాతం పెరిగిన రాన్సమ్‌వేర్ దాడులు

లక్ష్యిత దేశాల్లో రెండో స్థానంలో భారత్

అంతర్జాతీయంగా రాన్సమ్‌వేర్ దాడులు 18 శాతం మేరకు పెరిగాయి. ఇందులో భారత్ రెండో స్థానంలో ఉండటం గమనార్హం. దేశంలో ముఖ్యంగా తయారీ, టెలీకమ్యూనికేషన్, టెక్నాలజీ రంగంలోని సంస్థలపై అధికంగా ఈ దాడులు జరుగుతున్నాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్, జపాన్‌లకు ఇవి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్య కాలంలో రాన్సమ్‌వేర్ దాడులపై జీస్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడయ్యింది. సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్‌ను పంపడం ద్వారా సంస్థలు తమ నెట్‌వర్క్, ఫైల్స్‌ను వినియోగించకుండా చేసి, భారీ మొత్తాన్ని డిమాండ్ చేస్తుంటారు. దీన్నే రాన్సమ్‌వేర్‌గా పేర్కొంటారు. ఫిషింగ్, రిమోట్ డెస్క్‌టాప్ ప్రోటోకాల్ (ఆర్‌డీపీ)ల ద్వారా ఈ మాల్‌వేర్ దాడులకు పాల్పడుతుంటారు. డార్క్ ఏంజెల్స్ రాన్సమ్‌వేర్ గ్రూపులు ఏడాది కాలంలో దాదాపు రూ.630 కోట్ల (75 మిలియన్ డాలర్ల) మేరకు వసూలు చేశాయని నివేదిక పేర్కొంది. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతల వినియోగం పెరగడంతో సైబర్ నేరగాళ్లకు భారత్ ప్రధాన లక్ష్యంగా మారిందని వెల్లడించింది. దాడులు పెరిగినప్పటికీ డబ్బులు ఇచ్చినవి చాలా తక్కువే ఉన్నాయని పేర్కొంది. 29 శాతం సైబర్‌దాడులు తయారీ రంగంపై ఉండగా, ఆరోగ్య సంరక్షణ సంస్థలపై 8.89 శాతం, ఆర్థిక సేవల సంస్థలపై 8.89 శాతం దాడులు జరిగాయి. ఫార్మా, టెక్నాలజీ సంస్థలపైనా అధికంగా రాన్సమ్‌వేర్ దాడులకు పాల్పడుతున్నారు.

ఏసీల పరిశ్రమలో 20-25% వృద్ధి

2024-25 ఆర్థిక సంవత్సరంపై ఇక్రా అంచనా



దిల్లీ: దేశీయ రూమ్ ఎయిర్ కండీషనర్ (ఆర్ఏసీ) పరిశ్రమ ఊహించిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సాధించే అవకాశం ఉందని ఇక్రా అధ్యయన నివేదిక వెల్లడించింది. 2024-25లో 1.2-1.25 కోట్ల రూమ్ ఏసీలు విక్రయమయ్యే అవకాశం ఉందని గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 20-25 శాతం అధికమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 10-12 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉందని ఇక్రా తెలిపింది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఒక్కో కుటుంబంలో బహుళ ఆర్ఏసీ యూనిట్లకు గిరాకీ పెరుగుతుండటం, పట్టణీకరణ, చేతిలో నగదు పెరగడం, వినియోగదారు ఫైనాన్సింగ్ ఆప్షన్లు అనుకూలంగా ఉండటంతో వచ్చే కొన్నేళ్లలో రూమ్ ఏసీల పరిశ్రమ వృద్ధి పథంలో కొనసాగుతుందని ఇక్రా నివేదికలో వివరించింది.

ల్యాప్‌టాప్ దిగుమతులపై పరిమితి?

- గట్టిగా పరిశీలిస్తున్న ప్రభుత్వం
- అదే జరిగితే దేశీయ తయారీకి ఊతం



దిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, వ్యక్తిగత కంప్యూటర్ల దిగుమతిపై 2025 జనవరి తర్వాత పరిమితి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశంతో నేరుగా సంబంధమున్న ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ ఈ విషయాన్ని పేర్కొంది. దిగుమతులపై పరిమితి పెడితే, యాపిల్ వంటి అగ్రగామి కంపెనీలు భారత్‌లో సత్వరం తయారీ పెంచుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభావం ఎంత?

ఒక వేళ కంప్యూటర్ల దిగుమతులపై ప్రభుత్వం పరిమితి పెడితే, 10 బిలియన్ డాలర్ల (సుమారు 84,000 కోట్ల) మేరకు ఈ పరిశ్రమపై ప్రభావం పడుతుందని అంచనా. ఇప్పటివరకు దిగుమతులపై భారీగా ఆధారపడిన ఐటీ హార్డ్‌వేర్ మార్కెట్ ధోరణి మారిపోవచ్చు. దిగుమతులపై ఆంక్షలు విధించాలన్న ప్రతిపాదన ఇంతకుముందే వచ్చినా, అమెరికా కంపెనీల నుంచి బలమైన ఒత్తిడి రావడంతో వెనకడుగు పడింది. దేశీయంగా తయారీ ప్రారంభించేందుకు కంపెనీలకు తగిన సమయం ఇచ్చినట్లు ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వ్యక్తులు తెలిపారు.

- దేశీయ ఐటీ హార్డ్‌వేర్ విపణి : 20 బి. డాలర్లు
- ఇందులో దేశీయ తయారీ: 5 బిలియన్ డాలర్లు

త్వరలోనే చర్చలు!

ల్యాప్‌టాప్‌ల దిగుమతులను పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన వ్యవస్థకు ఈ ఏడాదితో గడువు తీరనుంది. వచ్చే ఏడాది చేసుకునే దిగుమతులకు మళ్లీ అనుమతులు తీసుకోవాలని కంపెనీలను కేంద్రం కోరనుంది. 'కొత్త దిగుమతి అధీకృత వ్యవస్థ' కింద కంపెనీలు తమ దిగుమతులకు ముందస్తు అనుమతులు పొందాల్సి రావొచ్చని చెబుతున్నారు. త్వరలో ఈ విషయమై అన్ని వర్గాలతో చర్చలు మొదలయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం కంపెనీలు ఆటోమేటెడ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే, ఎన్ని పరికరాలనైనా దిగుమతి చేసుకునే వీలుంది. హెచ్‌పీ, డెల్, యాపిల్, లెనోవో, శాంసంగ్ ఆధిపత్యం ఉన్న ఈ పరిశ్రమలో మూడింట రెండొంతుల దేశీయ గిరాకీ దిగుమతుల ద్వారానే తీరుతోంది. ఇందులోనూ ఎక్కువ పరికరాలు చైనా నుంచే వస్తున్నాయి.

ఎవరికి ప్రయోజనం..

దిగుమతులపై పరిమితులు పెడితే మాత్రం, దేశీయంగా ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల తయారీ కోసం అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న డిక్సన్ టెక్నాలజీస్ వంటి కంపెనీలకు ప్రయోజనం కలుగుతుంది. దేశీయ గిరాకీలో 15 శాతానికి సేవలందించాలని డిక్సన్ లక్ష్యంగా పెట్టుకుంది. మరో పక్క, దేశీయ తయారీని పెంచడం కోసం ఐటీ హార్డ్‌వేర్‌కు ప్రకటించిన పీఎల్ఐ పథకం కింద ఏసర్, డెల్, హెచ్‌పీ, లెనోవో వంటి అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ తయారీ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

ఏం చేస్తారంటే..

'కంపల్సరీ రిజిస్ట్రేషన్ ఆర్డర్ కింద కనీస నాణ్యతా ప్రమాణాలుండే ల్యాప్‌ట్యాప్‌లు, నోట్‌బుక్‌లు, ట్యాబ్లెట్ పీసీలకు మాత్రమే అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. తద్వారా నాణ్యత లేని పరికరాలు దేశంలోకి రాకుండా చూడొచ్చు. టారిఫ్ విధించాలంటే, అంతర్జాతీయ ఒప్పందాలు అందుకు ఒప్పుకోకపోవచ్చు. కాబట్టి దిగుమతులపై పరిమితులకు తక్కువ అవకాశాలే తమ వద్ద ఉండొచ్చని ఒక అధికారి తెలిపారు.

ఉద్యోగాల సృష్టికి ఎగుమతులే కీలకం

యూఎస్ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్

దిల్లీ: దేశం 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.415 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా మారే తరుణంలో ఎగుమతులు ప్రధాన ఉద్యోగ సృష్టికర్తగా మారబోతున్నాయని యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) అధ్యక్షుడు, సీఈఓ ముకేశ్ ఆఘి వెల్లడించారు. యూఎస్ఐఎస్‌పీఎఫ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'భారత్, అమెరికాలు తమ ఆర్థిక వ్యవహారాలను బలోపేతం చేసుకోవడం కొనసాగించాలని, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.41.50 లక్షల కోట్ల)కు పెంచుకోవాల'ని సూచించారు. యువతలో సామాజిక అశాంతి లేకుండా చూసేందుకు ఉద్యోగాల కల్పన ప్రాముఖ్యతను ప్రస్తావించారు. నెలకు సుమారు 12 లక్షల ఉద్యోగాలను సృష్టించడం ఒక సవాలుగా మారుతోందన్నారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ 4 నుంచి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుతున్నందున, అతి పెద్ద ఉద్యోగ సృష్టికర్తల్లో ఎగుమతులు కీలకంగా మారనున్నాయని వివరించారు. 50 లక్షల మంది భారతీయ అమెరికన్లు ప్రస్తుతం యూఎస్‌లో నివసిస్తున్నారని, అక్కడి జనాభాలో వీరు 1.5 శాతం ఉన్నారని తెలిపారు. దేశ జీడీపీకి వారు 6 శాతం వాటా అందిస్తున్నారని పేర్కొన్నారు.



- 2023-24లో భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 118.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9.82 లక్షల కోట్లు)గా నమోదైంది. దీన్ని 500 బి.డాలర్లకు చేర్చాల్సిన అవసరం ఉందని యూఎస్ఐఎస్‌పీఎఫ్ సీఈఓ తెలిపారు. 2021-22, 2022-23లో భారత్‌తో అమెరికానే అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచిందని వెల్లడించారు. 2023-24లో మాత్రం చైనా 118.4 బి.డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో అతి పెద్ద భాగస్వామిగా మారింది.

డీలిస్టింగ్ ప్రక్రియ వ్యవహారంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌పై దర్యాప్తు!

దిల్లీ: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్ ప్రక్రియకు సంబంధించి, ఆ కంపెనీ సమర్పించిన వివరాలను సెబీ పునఃపరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తు ప్రారంభించిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ వెల్లడించింది. ప్రతిపాదిత డీలిస్టింగ్ ప్రక్రియపై మరిన్ని వివరాల కోసం ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అధికారులకు సమన్లను సెబీ జారీ చేసిందని ఆ వర్గాలు తెలిపాయి. రిజర్వ్ బుక్ బిల్డింగ్‌లో మినహాయింపు పొందే విషయంలో కంపెనీ సరైన సమాచారం ఇచ్చిందా? షేర్ల విలువ మదింపులో సరైన విధానాన్నే అవలంబించిందా? అనే అంశాలను సెబీ పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దర్యాప్తు ప్రక్రియ డీలిస్టింగ్ ప్రక్రియపై ప్రభావం చూపించకపోవచ్చు. మైనార్టీ వాటాదార్ల నుంచి అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఈ డీలిస్టింగ్ ప్రతిపాదనకు ఇప్పటికే నేషనల్ కంపెనీస్ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), మెజార్టీ వాటాదార్ల అనుమతి లభించడమే ఇందుకు కారణం. ఈ ప్రక్రియలో ఏమైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు సెబీ గుర్తిస్తే కంపెనీ, సంబంధిత అధికారులపై జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

దాల్మియా భారత్ లాభంలో 60% క్షీణత

దిల్లీ: సిమెంటు తయారీ కంపెనీ దాల్మియా భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.49 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే సమయంలోని లాభం రూ.123 కోట్లతో పోలిస్తే ఇది 60.16% తక్కువ. కంపెనీ మొత్తం ఆదాయం 2.28% తగ్గి రూ.3,160 కోట్లకు పరిమితమైంది. విక్రయ పరిమాణం 14.1% పెరిగి 6.7 మిలియన్ టన్నులకు చేరుకోవడం గమనార్హం. మొత్తం వ్యయాలు కాస్త పెరిగి రూ.3087 కోట్లకు చేరాయి

ద్విచక్ర వాహనాలు @ కోటి విక్రయాలు

- ఏప్రిల్-సెప్టెంబరులో రికార్డు
- ఆరేళ్ల తర్వాత తిరిగి ఆ స్థాయికి



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం(ఏప్రిల్-సెప్టెంబరు)లో భారత ద్విచక్ర వాహన పరిశ్రమ రాణించింది. మోటార్‌సైకిళ్లు, స్కూటర్లు, మోపెడ్లు కలిసి టోకున కోటికి పైగా(1,01,64,980 యూనిట్లు) అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే సమయంలో విక్రయమైన 87,39,406 వాహనాలతో పోలిస్తే ఇవి 16% అధికం. అంతే కాదు 2023-24 ఏడాది మొత్తం మీద అమ్ముడుపోయిన 1,79,74,365లో 64 శాతానికి, 2018-19లోని రికార్డు విక్రయాలైన 2.1 కోట్లలో 48 శాతానికి ఇవి సమానం కావడం విశేషం. కాగా, చివరిసారిగా భారత ద్విచక్ర వాహన పరిశ్రమ కోటి టోకు విక్రయాలను 2018-19 ప్రథమార్ధం(1,15,68,498)లో సాధించింది. అంటే ఆరేళ్ల అనంతరం ఈ రికార్డు నమోదు చేసింది. మూడు విభాగాలు రెండంకెల వృద్ధిని చేరడంతో ఇది సాధ్యమైంది. మోటార్‌సైకిళ్లు 16.31%, స్కూటర్లు 22%, మోపెడ్లు 16.55% చొప్పున అధికంగా విక్రయమయ్యాయి.

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు తగ్గిన మొండి బకాయిలు

దిల్లీ: జులై- సెప్టెంబరు త్రైమాసికంలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ నికర లాభం 26 శాతం పెరిగి రూ.240 కోట్లకు చేరింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.189 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.2,674 కోట్ల నుంచి రూ.3,098 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం కూడా రూ.2,406 కోట్ల నుంచి పెరిగి రూ.2,739 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు 6.23 శాతం నుంచి 4.21 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు 1.88 శాతం నుంచి 1.46 శాతానికి తగ్గాయి.

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

భూ అయస్కాంత ధ్రువాల్లో దిక్సూచీ పనితీరు శూన్యం

అయస్కాంతత్వం

పదార్థంలోని ప్రతి పరమాణువు ఒక అయస్కాంతమే. దాని ఆర్బిటాల్, స్పిన్ చలనాల వల్ల పరమాణువుకు రెండు రకాల అయస్కాంత ద్విధ్రువ భ్రామకాలు ఏర్పడతాయి. అన్ని పరమాణువుల అయస్కాంత భ్రామకాల సదిశల ఫలితం ఆ పదార్థం అయస్కాంతమా? కాదా? అనేది నిర్ణయిస్తుంది.

అయస్కాంత పదార్థాలు

అయస్కాంతత్వం పరంగా పదార్థాలు ముఖ్యంగా మూడు రకాలు. అవి:

1. డయా అయస్కాంత పదార్థాలు
2. పారా అయస్కాంత పదార్థాలు
3. ఫెర్రో అయస్కాంత పదార్థాలు

డయా అయస్కాంతత్వం


ఈ తరహా పదార్థాలను బాహ్య అయస్కాంత క్షేత్రంలో ఉంచితే అవి బలమైన క్షేత్ర ప్రదేశం నుంచి బలహీన ప్రదేశం వైపు కదులుతాయి.

✦ డయా అయస్కాంత పదార్థంలోని అన్ని పరమాణువుల ఫలిత అయస్కాంత ద్విధ్రువ భ్రామకం సున్నా.


✦ బాహ్య అయస్కాంత క్షేత్రంలో ఉన్నప్పుడు వీటిలోని పరమాణు అయస్కాంతాలు క్షేత్రానికి వ్యతిరేక దిశలో అయస్కాంతీకరణం చెందుతాయి. కాబట్టి బాహ్య క్షేత్రాన్ని డయా అయస్కాంత పదార్థాలు వికర్షిస్తాయి.

డయా అయస్కాంత పదార్థాలకు ఉదాహరణలు: బిస్మత్, రాగి, సీసం (లెడ్), సిలికాన్, నీరు, నైట్రోజన్, బంగారం, పాదరసం, వజ్రం మొదలైనవి.

✦ డయా అయస్కాంతాలకు సాపేక్ష ప్రవేశ్యశీలత (μ_r) విలువ ఒకటి కంటే చాలా తక్కువ. కాబట్టి అయస్కాంత బలరేఖలు ప్రసరించే ప్రదేశంలో డయా అయస్కాంత పదార్థాన్ని ఉంచితే అవి దాని ద్వారా ప్రయాణించేందుకు ఇష్టపడవు.




గాలిలో బలరేఖలు



డయా అయస్కాంతంలో బలరేఖలు

✦ ద్రవరూప డయా అయస్కాంతాన్ని U ఆకార గొట్టంలో తీసుకొని గొట్టం ఒక భుజానికి అయస్కాంత క్షేత్రాన్ని ప్రయోగిస్తే ద్రవం వికర్షణ వల్ల రెండో గొట్టంలోకి ప్రయాణిస్తుంది.



$B_{బాహ్య} = 0$ $B_{బాహ్య} \neq 0$

✦ డయా అయస్కాంతంతో చేసిన కడ్డీని ఏకరీతి అయస్కాంత క్షేత్రంలో వేలాడదీస్తే అది క్షేత్ర దిశకు లంబదిశలో నిశ్చల స్థితికి వస్తుంది.

✦ డయా అయస్కాంత పదార్థాల ధర్మాలు ఉష్ణోగ్రతపై ఆధారపడవు.

✦ డయా అయస్కాంతాలను MRI స్కానింగ్‌లో, మాగ్నెటిక్ లెవిటేషన్‌లో మెటీరియల్ సైన్స్ రిసెర్చ్‌లో ఉపయోగిస్తారు.

✦ డయా అయస్కాంతాలకు ససెప్టబిలిటీ (χ) రుణాత్మకం.

$$\chi = \frac{M}{H} = \frac{\text{అయస్కాంతీకరణ}}{\text{అయస్కాంత తీవ్రత}}$$

$$\therefore \frac{M}{H} = -1 \Rightarrow \vec{H} = -\vec{M}.$$

అంటే డయా అయస్కాంతం బాహ్యక్షేత్రానికి వ్యతిరేకంగా అయస్కాంతీకరణం చెందుతుంది.

✦ స్ప్రింగ్‌లా చుట్టిన రాగి తీగను నిలువుగా ఉంచి దానిలో DC విద్యుత్తును ప్రసారం చేస్తే అది దండాయస్కాంతం (విద్యుదయస్కాంతం)గా ప్రవర్తిస్తుంది. దీని ఉత్తర ధ్రువం (అపసరణం చెందే అయస్కాంత క్షేత్రం) వద్ద ఒక చిన్న కప్పను వదిలితే అది కిందపడకుండా అక్కడే గాలిలో తేలుతుంది. దీన్నే మాగ్నటిక్ లెవిటేషన్ అంటారు. కప్పలోని ప్రతి పరమాణువు డయా అయస్కాంతత్వం వల్ల బలహీన క్షేత్రం వైపు వెళ్లే ప్రయత్నంలో పైకి కదులుతుంది. అయస్కాంత వికర్షణ బలం, దాని బరువుకు సమానం అయినప్పుడు అది గాల్లో తేలుతుంది.

బలమైన సోలినాయిడ్‌ని నిర్మించగలిగితే వ్యక్తిని కూడా లెవిటేట్ చేయవచ్చు.

పారా అయస్కాంతత్వం

పారా అయస్కాంత పదార్థంలోని ఎలక్ట్రాన్ల స్పిన్, ఆర్బిటాల్ అయస్కాంత ద్విధ్రువ భ్రామకాలు సదిశీయంగా కలిసి కొంత శాశ్వత ద్విధ్రువ భ్రామకాన్ని ఏర్పరుస్తాయి.


